

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 273

SUNDAY Special | ఆదివారం 16-6-2024



30 లక్షలకు నీట్ ప్రశ్నాపత్రం!

నీట్ అక్రమాలకు సంబంధించి బిహార్ పోలీసులు ఇప్పటివరకు 14 మందిని అరెస్టు చేశారు. రూ.30 లక్షలు ఇచ్చి నీట్ ప్రశ్న పత్రం కొన్నట్లు పలువురు అభ్యర్థులు అంగీకరించారని పోలీసులు చెప్పారు. - 6లో



నాన్న ఇచ్చిన రెక్కలు

దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ పాసింగ్ ఔట్ పరేడ్‌లో పాల్గొన్న మహిళా ఫ్లయింగ్ ఆఫీసర్ల విజయగాథలు - 11లో

నేడు ఫాదర్స్ డే

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | BANGALORE | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఛత్తీస్‌గఢ్‌లో భీకర ఎన్‌కౌంటర్

8 మంది మావోయిస్టులు మృతి

- ఒక ఎస్టీఎఫ్ జవాను కూడా.. ఇద్దరు జవాన్లకు గాయాలు.. హెలికాప్టర్‌లో రాయ్‌పూర్‌కు తరలింపు
- ఘటనాస్థలం నుంచి పెద్ద సంఖ్యలో ఆయుధాలు స్వాధీనం
- బస్తర్ డివిజన్‌లో ఈ ఏడాది ఇప్పటివరకు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 131 మంది మావోయిస్టులు మృతి

6లో



విస్తారంగా వానలు..!



రాష్ట్రంలో వర్షాలకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. నైరుతి రుతుపవనాలు ఉత్తర కోస్తాంధ్ర వ్యాప్తంగా మరింతగా విస్తరించనున్నాయి. దీంతో రానున్న మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. అలాగే అక్కడక్కడ పిడుగులు పడతాయని, ఈదురు గాలులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

- వివరాలు 13లో

న్యూస్‌రీల్

ఆక్వా చెరువు బోరు నుంచి గ్యాస్



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలంలో ఓ ఆక్వా చెరువు వద్ద ఉన్న బోరు బావి నుంచి నీటితో కలిసి 15 అడుగుల మేర గ్యాస్ పైకి ఎగజిమ్మింది. మంటలు వ్యాపించకపోవడంతో ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది బోరు బావిని ఇసుకతో పూడ్చివేసి గ్యాస్ పైకి రాకుండా చేశారు.

వివరాలు 5లో ▸

ముంబై-విజయవాడ విమాన సర్వీస్ ప్రారంభం



దేశ ఆర్థిక రాజధాని ముంబై నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎయిరిండియా విమాన సర్వీస్ శనివారం ప్రారంభమైంది. ముంబై నుంచి 148 మంది ప్రయాణికులతో ఎయిర్‌బస్ ఎ320 విమానం శనివారం సాయంత్రం విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంది.

వివరాలు 5లో ▸

రమేశ్, చంద్రశేఖర్‌లకు సాహిత్య అవార్డులు


రమేశ్ కార్తీక్


చంద్రశేఖర్

తెలంగాణకు చెందిన బంజారా రచయిత రమేశ్ కార్తీక్ నాయక్‌ను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. అలాగే 'మాయలోకం' తెలుగు నవల రాసిన ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన చంద్రశేఖర్ ఆజాద్‌కు బాల సాహిత్య పురస్కారం లభించింది.

వివరాలు 3లో ▸

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venkobb CHICKEN | సూచించిన నేటి గుడ్లు & చికెన్ తిరుపతి జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹ 72	ఫారం దగ్గర లైవ్ బర్డ్	152	డ్రెస్డ్ స్కిన్‌తో	252
	రిటైల్ లైవ్ బర్డ్	174	స్కిన్‌లెస్	287

ఇంతిజార్



ఉన్న ఫొటోలన్నీ తీయించి ఇది పెట్టుకున్నార్సార్!

ఆగని టీడీపీ దాడులు.. పెరిగిన విధ్వంసం

తీరు మారలేదు!

- మాజీ మంత్రి పేర్ని నాని ఇంటివైపు దూసుకెళ్లేందుకు టీడీపీ శ్రేణుల యత్నం
- రాళ్ల దాడి చేయడంతో పోలీసులకు గాయాలు
- పుంగనూరులో దళిత, బీసీ నేతలపై దాడి.. హత్యాయత్నం
- విజయవాడలో వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లు, దుకాణాల కూల్చివేత

10లో



పల్నాడు జిల్లా గొట్టిపాళ్లలో టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇల్లు

■ టీడీపీ నేతల దాడులు, దౌర్జన్యాలు, ఇళ్లు, శిలాఫలకాల ధ్వంసం వంటి దుశ్చర్యలు ఆగటం లేదు. మచిలీపట్నంలో విజయోత్సవ ర్యాలీ ముసుగులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. మాజీ మంత్రి పేర్ని నాని ఇంటి వైపు రాళ్లు విసరగా.. పోలీసులకూ రాళ్ల దెబ్బలు తగిలాయి. కర్నూలు జిల్లా దిగువచింతలకొండలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమశేఖర్‌పై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో దళిత నేత, ఇద్దరు బీసీ నాయకులపై టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారు. బీసీ నేత వెంకటరెడ్డి యాదవ్‌పై ఇనుప రాడ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతపురం జిల్లా మురడిలో పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త రవీంద్రనాథ్‌రెడ్డిపై దాడికి తెగబడ్డారు. ఇంట్లోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేశారు. విజయవాడలో వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లు, దుకాణాల కూల్చివేశారు. మాజీ డిప్యూటీ మేయర్, మరో నాయకుడి కార్ల అద్దాలను ధ్వంసం చేశారు. టీడీపీ నేతల ప్రోద్బలంతో విజయవాడ నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణల పేరిట వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లను కూల్చివేశారు. పల్నాడు జిల్లా గొట్టిపాళ్లలో వైఎస్సార్‌సీపీ నేతల గృహాల్లోని సామగ్రిని దహనం చేశారు.

చినబాబు బ్యాచ్ చిత్రహింసలు


- మోకాళ్లపై మోకరిల్లి లోకేశ్ ఫ్లెక్సీ ఎదుట క్షమాపణ చెప్పాలని బెదిరించారు
- సీజేఐ, హైకోర్టు సీజే, మానవ హక్కుల కమిషన్‌కు బాధితుడు పాలేటి రాజ్‌కుమార్ ఫిర్యాదు

2లో

త్వరలోనే నామినేటెడ్

పదవుల భర్తీ

- కార్యకర్తలు సాధికారత సాధిస్తేనే పార్టీ బలోపేతం
- కింద స్థాయి నుంచి ఎవరు ఎక్కడ పనిచేశారో తెలుసుకుంటున్నా
- కష్టపడి పనిచేసినవారికి పదవులు ఇస్తా
- ఎమ్మెల్యేలు.. కార్యకర్తలను విస్మరించొద్దు
- టీడీపీ ప్రధాన కార్యాలయంలో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: త్వరలోనే నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తెలుగుదేశం పార్టీలో కింది స్థాయి నుంచి ఎవరు, ఎక్కడ ఏం పని చేశారో తెలుసుకుంటున్నానన్నారు. నాయకులు, కార్యకర్తలు సాధికారత సాధిస్తేనే పార్టీ పునాదులు బలంగా ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో వారికి ఎలా చేయాలి, ఏం చేయాలనే విషయంపై ఆలోచిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇస్తానన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు శనివారం తొలిసారి గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. అక్కడ పలువురు నాయకులు, కార్యకర్తలతో ఫొటోలు దిగారు. అనంతరం టెలీకాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. తాను ఇకపై తరచూ పార్టీ కేంద్ర కార్యాలయానికి, జిల్లాలకు వెళ్లినప్పుడు జిల్లా పార్టీ కార్యాలయాలకు వెళతానని తెలిపారు. గతంలోనే కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేసి సాయం అందించామని, ఇక ముందు కూడా ఇలాగే ఆదుకుంటానన్నారు. అధికారం వచ్చిందని కక్షసాధింపు చర్యలకు పాల్పడటం, విర్రవీగడం చేయొద్దన్నారు. ఎమ్మెల్యేలు.. నాయకులు, కార్యకర్తలను విస్మరించవద్దని సూచించారు. ప్రజలు తప్పుపట్టేలా ఎటువంటి పనులు చేయొద్దని హెచ్చరించారు. కూటమి విజయం వెనుక నాయకులు, కార్యకర్తల కష్టం..

మిగతా 3వ పేజీలో ▶

త్వరగా మార్చేద్దాం

ముఖ్యమైన పోస్టులన్నింట్లో మనోళ్లే ఉండాలి

- గత సీఎంతో అంటకాగినోళ్లని పంపించేద్దాం.. ఎవరెవరు ఏం చేశారో వివరాలన్నీ సేకరించండి
- మన కోసం పని చేసిన వారిని గుర్తించండి.. మన వాళ్లు రిటైర్ అయినా సరే ఇంకో రకంగా తెచ్చుకుందాం
- అప్పుడే మనం అనుకున్నది అనుకున్నట్లు చేయగలం
- సీఎస్, డీజీపీతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

3లో



- ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలపై విస్తృత చర్చ
- అనుకూలంగా ఉండే వారి జాబితా తయారు చేయాలని ఆదేశం

నా మనసుకు దగ్గరైన శాఖలివి



- తనకు కేటాయించిన శాఖలపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రకటన
- సమస్యలను కళ్లారా చూశా.. వాటి పరిష్కారానికి కృషి చేస్తా
- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెడతా

3లో

ట్రైనీ ఐఏఎస్ కూతురుకు ఎస్పీ హోదాలో తండ్రి సెల్యూట్



సాక్షి, హైదరాబాద్: కుమార్తె విజయం.. ఆ కన్నతండ్రికి గర్వకారణమైంది. ఎంసీహెచ్‌ఆర్‌డీలో శిక్షణ పొందుతున్న 2023 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ఐఏఎస్ ప్రొబేషనర్లు ఎంసీహెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శశాంక్ గోయెల్ సూచనల మేరకు ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం రాష్ట్ర పోలీస్ అకాడమీని సందర్శించారు. ఈ సందర్భంగా వికారాబాద్‌కు చెందిన ప్రొబేషనర్ ఐఏఎస్ అధికారి ఎన్. ఉమాభారతికి ఆమె తండ్రి, ఎస్పీ హోదాలో ఉన్న పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛంతో ఆహ్వానించి గర్వంగా సెల్యూట్ చేయడం హృదయాలను హత్తుకొంది. కాగా, పోలీస్ అకాడమీ జాయింట్ డైరెక్టర్ డి.మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్లు ఎస్.వెంకటేశ్వర్లు, సి.నర్మద ఇతర సీనియర్ అధికారులను ఏడుగురు ఐఏఎస్ ప్రొబేషనర్లు కలిశారు. అనంతరం సచివాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. ఆ తర్వాత రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై భూ రికార్డులు తదితర వివరాలను తెలుసుకున్నారు.

తెలంగాణ

బరాజ్‌లు కట్టిన సబ్ కాంట్రాక్టర్లు ఎవరు?

వివరాలివ్వాలని నిర్మాణ సంస్థలను కోరిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను కాంట్రాక్టులు దక్కించుకున్న నిర్మాణ సంస్థలే నిర్మించాయా? లేక కాంట్రాక్టు నిబంధనలను విరుద్ధంగా సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాయా? అనే అంశంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఆరా తీస్తోంది. మూడు బరాజ్‌ల నిర్మాణ పనుల్లో కనీసం 15 మంది సబ్ కాంట్రాక్టర్లు పాల్గొన్నట్టు కమిషన్‌కు కొందరు ఆధారాలు సమర్పించినట్టు సమాచారం. గత ప్రభుత్వంలో ముఖ్యమైన పదవిలో ఉన్న ఓ నేత దగ్గరి బంధువుకి సంబంధించిన ఓ కంపెనీ సైతం బరాజ్‌ల పనులను సబ్ కాంట్రాక్టుగా తీసుకుని నిర్వహించినట్టు తెలిసింది. దీంతో సబ్ కాంట్రాక్టర్ల వివరాలను సమర్పించాలని బ్యారేజీల నిర్మాణ సంస్థలను కమిషన్ ఆదేశించింది. సబ్ కాంట్రాక్టర్ల వివరాలను నిర్మాణ సంస్థలు సమర్పించకుంటే.. గత పదేళ్ల ఫైనాన్షియల్ స్టేట్మెంట్లను సమర్పించాలని నిర్మాణ సంస్థలను కమిషన్ ఆదేశించనుంది. నిర్మాణ సంస్థలు అనుమానిత సబ్ కాంట్రాక్టర్లకు డబ్బులను చెల్లించినట్టు ఈ ఫైనాన్షియల్ స్టేట్మెంట్లలో ఉండే అవకాశముంది. ఫైనాన్షియల్ స్టేట్మెంట్లను సైతం నిర్మాణ సంస్థలు సమర్పించని పక్షంలో కేంద్ర పరిశ్రమల శాఖ నుంచి ఆ వివరాలను తెప్పించుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది.

మేడిగడ్డ నిర్ణయం కేసీఆర్‌దే..

తుమ్మిడిహెట్టికి బదులు మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మించాలనే నిర్ణయం నాటి సీఎం కేసీఆర్‌దేనని జస్టిస్ చంద్రఘోష్‌కి రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ తెలిపింది. గోదావరిపై నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులపై అధ్యయనం కోసం రిటైర్డ్ సీఈలు బి.అనంతరాములు, వెంకటరామారావు, ఎస్.చంద్రమౌళి, రిటైర్డ్ ఎస్ఈలు జి.దామోదర్ రెడ్డి, ఎం.శ్యామ్‌ప్రసాద్ రెడ్డితో 2015లో నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిటీని శనివారం జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో విచారించింది. శ్యామ్‌ప్రసాద్ రెడ్డి మినహా మిగిలిన ఇంజనీర్లు కమిషన్ ముందు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేశారు. మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ తాము నివేదిక సమర్పించగా.. దానిని నాటి సీఎం కేసీఆర్, ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు తిరస్కరించారని, వాటిపై సంతకాలు సైతం చేయలేదని వివరించారు. కేసీఆర్ సూచనల మేరకే మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మించినట్టు తెలిపారు. బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ నిర్వహిస్తున్న విచారణ తుది అంకానికి చేరింది. బరాజ్‌ల నిర్మాణంతో సంబంధం ఉన్న ఈఎన్‌సీ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి వరకు అధికారులందరినీ ఆయన పిలిపించి ప్రశ్నించారు.



ప్రళయమొచ్చినా..

ఈ ఐదూ బతికేస్తాయట!

ఏదైనా అత్యంత భయానక ప్రకృతి విపత్తు వస్తేనో, ఏదైనా పెద్ద ఆస్టరాయిడ్ ఢీకొంటేనో.. భూమ్మీది జీవరాశిలో చాలా వరకు నామరూపాలు లేకుండా పోవడం ఖాయం. కానీ ఓ ఐదు రకాల జీవులు మాత్రం బతికి ఉండగలుగుతాయట. వాటికి ఉన్న ప్రత్యేక లక్షణాలు, కఠిన పరిస్థితులను తట్టుకోగల సామర్థ్యమే దీనికి కారణమని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అవేమిటో తెలుసుకుందామా..

టాప్‌లో టార్డిగ్రేడ్‌లు..

జీవులన్నింటిలో అత్యంత కఠిన పరిస్థితులను తట్టుకుని బతకగలిగే అతి చిన్న జీవులు టార్డిగ్రేడ్లు. నీటిలో జీవిస్తుండటం, ఎలుగుబంటిని పోలి ఉండటంతో వీటిని వాటర్ బేర్‌లు అని కూడా పిలుస్తారు. 150 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలను, మైనస్ 70 డిగ్రీల వరకు తీవ్ర చలిని ఇవి తట్టుకోగలవు. ఆక్సిజన్, ఆహారం, నీళ్ల లేని పరిస్థితుల్లోనూ వారాలకు వారాలు బతికేస్తాయి. అందుకే ప్రళయమొచ్చినా బతికే జీవుల్లో టార్డిగ్రేడ్లు టాప్‌లో ఉన్నాయి.

బొద్దింకలూ బతికేస్తాయి..

మనను నానా చికాకు పెట్టే బొద్దింకలను అంత ఈజీగా తీసుకోవద్దు. ఎందుకంటే ఎన్నో విపత్కర పరిస్థితులను తట్టుకునే శక్తి వాటి సొంతం. డైనోసార్లతో కలిసి జీవించిన బొద్దింకలు.. భూమిని ఆస్టరాయిడ్ ఢీకొన్నప్పుడు డైనోసార్లు అంతమైపోయినా బతకగలిగాయి. మట్టిలో, రాళ్లలో, మరెక్కడైనా దూరిపోయి దాక్కోవడం, ఏది దొరికితే దాన్ని తిని బతికేయడం, చాలా వరకు విషపదార్థాలను, రేడియేషన్‌ను కూడా తట్టుకోగలగడం వీటి స్పెషాలిటీ. అందుకే ఎంత తీవ్ర విపత్తు వచ్చినా బొద్దింకలు బతికే అవకాశాలు ఎక్కువట.



రాబందులను తక్కువగా చూడొద్దు ▶



భూమ్మీద ప్రకృతి విపత్తు వచ్చే స్థాయిని బట్టి కొన్ని రకాల జంతువులకు లాభమూ జరుగుతుంది. అలాంటి వాటిలో రాబందులు ఒకటి. ఆస్టరాయిడ్ భూమిని ఢీకొనడం వంటివి జరిగితే.. గాల్లో అంతెత్తున, చాలా దూరం ప్రయాణించి తప్పించుకోగలవు. విపత్తుల మరణించే జంతువుల మాంసాన్ని తింటూ బతికేయగలవు. కుళ్లిన మాంసంలో పెరిగే బ్యాక్టీరియాను, ఇతర సూక్ష్మజీవులను కూడా డైజెస్ట్ చేయగల యాసిడ్లు రాబందుల జీర్ణాశయంలో ఉత్పత్తి అవుతాయి.

◀ షార్క్‌లకు విపత్తులంటే లెక్కే లేదు..

భూమ్మీది పురాతన జీవుల్లో షార్క్ చేపల జాతి కూడా ఒకటి. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం.. భూమ్మీద చెట్లు ఏర్పడకముందే సముద్రాల్లో షార్క్‌ల జాతి ఉద్భవించి జీవిస్తున్నాయి. తర్వాత జరిగిన ప్రకృతి ఉత్పాతాల్లో డైనోసార్లు సహా ఎన్నో జీవజాతులు అంతరించినా షార్క్‌లు మాత్రం బతికేస్తూనే ఉన్నాయి. సముద్రాల్లో అత్యంత లోతున, ఎలాంటి వెలుగు ప్రసరించని చోట, తీవ్ర పీడనాన్ని తట్టుకుని బతకగలగడం షార్క్‌ల స్పెషాలిటీ. ఇప్పుడు మరో విపత్తు వచ్చినా అవి తట్టుకుని బతికేయగలవు మరి.





ఎంపరర్ పెంగ్విన్లకూ చాన్స్ ఎక్కువే..

అంటార్కిటికా ఖండంలో ఉండే అత్యంత శీతల పరిస్థితులను, గంటకు 200 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులను తట్టుకుని జీవిస్తున్న జంతువులు ఎంపరర్ పెంగ్విన్‌లు. వాటి శరీరంలో గణనీయంగా కొవ్వు ఉంటుంది. కొన్నివారాల పాటు ఆహారం లేకున్నా బతికేయగలవు. పైగా అవి ఉన్న ప్రాంతాల్లో విపత్తులు ఏర్పడే అవకాశాలూ తక్కువని, నిక్షేపంగా ఉంటాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

క్లుప్తంగా...

స్పందన బదులు ప్రజా ఫిర్యాదులు, పరిష్కారం

ప్రణాళికా శాఖ ఆదేశాలు జారీ

సాక్షి, అమరావతి: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే 'స్పందన' పేరును ప్రభుత్వం తొలగించింది. దీనికి బదులుగా 'ప్రజా ఫిర్యాదులు, పరిష్కారం'గా పేరు మార్చింది. దీనిపై ప్రణాళికా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇకపై ప్రజా సమస్యలు ఫిర్యాదులు, పరిష్కారం పేరుతో వినతులను స్వీకరించనున్నట్లు ఆదేశాల్లో పేర్కొంది. దీనికి సంబంధించి తక్షణమే కలెక్టరేట్లలో స్పందన పేరును తొలగించడంతో పాటు 'ప్రజా ఫిర్యాదులు, పరిష్కారం' పేరుతో ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది.

రేపు పోలవరానికి సీఎం చంద్రబాబు

క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టు పనుల పరిశీలన

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టు పనులను పరిశీలించనున్నారు. ఆ తర్వాత పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో అతుల్‌జైన్, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, పోలవరం సీఈ నరసింహమూర్తి తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. పరిశీలన, సమీక్షలో వెల్లడైన అంశాల ఆధారంగా ప్రాజెక్టు పనులపై దిశానిర్దేశం చేయనున్నారు.

తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల: వరుస సెలవుల కారణంగా తిరుమలలో శనివారం రద్దీ పెరిగింది. అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు, కళ్యాణ వేదిక వరకు క్యూలైన్ కిటకిటలాడుతోంది. గత గురువారం నుంచి భక్తుల తాకిడి తగ్గక పోగా.. సోమవారం కూడా సెలవు కావడంతో రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి సేవకుల సహకారంతో క్యూల్లో భక్తులకు అన్నప్రసాదం, తాగునీటిని టీటీడీ నిరంతరాయంగా పంపిణీ చేస్తోంది. భక్తులకు అసౌకర్యం కలగకుండా జేఈఓ వీరబ్రహ్మం నేతృత్వంలో సీనియర్ అధికారులు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం

దేశవ్యాప్తంగా డిజిటల్ క్రాపింగ్

ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి అమలుకు సన్నాహాలు

- గతేడాది పైలెట్ ప్రాజెక్టుగా 10 రాష్ట్రాల్లో అమలు
- ఈ ఏడాది నుంచి అన్ని రాష్ట్రాల్లో..
- ఏపీలో అమలవుతున్న ఈ-క్రాపింగ్ మోడల్‌లో అమలు
- ఇటీవలే ఏపీ విధానాన్ని పరిశీలించిన కేంద్ర బృందం
- ఇక్కడ ఈ-క్రాపింగ్ అమలుతీరు బాగుందంటూ కితాబు
- దీనిని దేశవ్యాప్తంగా అమలుచేస్తామని వెల్లడి



ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం జూపూడి ఆర్బీకే పరిధిలో ఈ-క్రాప్ నమోదుకు పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం సభ్యులు

సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్ క్రాపింగ్ (ఈ-క్రాప్).. నిజంగా ఓ వినూత్న ప్రయోగం. వాస్తవ సాగుదారులకు ఓ రక్షణ కవచం. వ్యవసాయ రంగంలో వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విప్లవాత్మక మార్పు దేశంలో మరెక్కడా అమలుకాని నూతన సాంకేతిక విధానం. దేశానికి ఆదర్శంగా నిలిచిన ఈ-క్రాప్ ద్వారా ఏ సర్వే నెంబర్ పరిధిలో ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగవుతుందో? వాస్తవ సాగుదారులెవరో? గుర్తించడమే కాదు.. సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పంట రుణాలతో సహా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు అందించే సాంకేతిక సౌలభ్యం దీనిద్వారా సాధ్యం. ఏపీ స్ఫూర్తితో గతేడాది పైలెట్ ప్రాజెక్టుగా 12 రాష్ట్రాల్లో అమలుచేసిన కేంద్రం ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) పేరిట దేశవ్యాప్తంగా అమలుకు సన్నాహాలు చేస్తోంది. ఇటీవలే కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సాంకేతిక బృందం ఏపీలో ఈ-క్రాప్ అమలుతీరును పరిశీలించింది. ఇందులోని ఫీచర్స్‌ను డీసీఎస్‌లో అనుసంధానించేందుకు, అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లుచేస్తోంది.

గతంలో పొంతనలేకుండా పంట అంచనాలు..

వ్యవసాయ సీజన్ (ఫసల్)లో శిస్తు వసూలు కోసం పూర్వం నీటి వనరుల (కాలువలు, బోర్లు, చెరువుల) కింద సీజన్ ప్రారంభం కాగానే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి పంటల సాగు వివరాలను అడంగల్‌లో నమోదు చేసేవారు. కాలువల కింద సాగయ్యే పంటల విస్తీర్ణాన్ని బట్టి ఎకరాకు ఖరీఫ్‌లో రూ.200, రబీలో రూ.150 చొప్పున నీటితీరువా వసూలుచేసేవారు. పని ఒత్తిడి కారణంగా క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే రైతులు చెప్పిన సాగు వివరాలనే అడంగల్‌తో పాటు 1-బీలో నమోదు చేసి గణాంక శాఖాధికారులకు అందజేసేవారు. పన్ను భారం తగ్గించుకునేందుకు కొన్నిచోట్ల వివరాల నమోదు తప్పులతడకగా ఉండేది. సాగు చేసేదొకరైతే.. అడంగల్‌లో ఒక పేరు, పాస్‌బుక్‌లో మరొక పేరు ఉండేది. ఏ గ్రామంలో ఏ రైతు ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగుచేసేవారో ఖచ్చితమైన సమాచారం దొరకని పరిస్థితి ఉండేది.

నేడు పక్కాగా పంట వివరాలు..

కానీ, వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 2019 రబీ సీజన్ నుంచి ఈ-పంట నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) సౌజన్యంతో ప్రత్యేకంగా డిజైన్ చేసిన యాప్‌లో వెబ్‌ల్యాండ్, సీసీఆర్సీ (పంటసాగు హక్కు పత్రం) డేటా ఆధారంగా జాయింట్ అజమాయిషీ కింద వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ సహాయకులు పంట వివరాలు నమోదు చేస్తున్నారు. తొలుత సీజన్ వారీగా ఏ సర్వే నెంబర్‌లో ఏయే రకాల పంటలు ఏయే వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేస్తున్నారో రైతులు సమీప ఆర్బీకే సిబ్బందికి తెలియజేసేవారు. సీజన్ ప్రారంభమైన 15-30 రోజుల్లోపు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, జియో కోఆర్డినేట్స్, జియో ఫెన్సింగ్‌తో సహా పంట ఫొటోలను అప్‌లోడ్ చేస్తారు. ప్రపంచంలో మరెక్కడాలేని విధంగా రైతుల వేలిముద్రలు(ఈకేవైసీ-మీ పంట తెలుసుకోండి) తీసుకుని, రైతు మొబైల్ నెంబర్‌కు డిజిటల్ రశీదును పంపిస్తారు. వీఏఏ, వీహెచ్ఏ, వీఆర్ఏ ధృవీకరణ పూర్తికాగానే మండల వ్యవసాయాధికారి నుంచి జిల్లా కలెక్టర్ వరకు ర్యాండమ్‌గా పరిశీలించి, చివరగా రైతులకు భౌతిక రశీదు అందిస్తున్నారు. ఈ రశీదులోనే ఉచిత పంటల బీమా పథకం వర్తించేందుకు వీలుగా నోటిఫై చేసిన పంటలకు (స్టార్) గుర్తుతో తెలియజేయడమే కాకుండా మీ పంటకు బీమా కవరేజ్ ఉందని, మీ తరఫున ప్రభుత్వమే పూర్తిగా ప్రీమియం చెల్లిస్తుందని పేర్కొనేవారు. ఈ విధానం అమల్లోకి వచ్చాక వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశుగ్రాసం పంటల సాగు వివరాలు పక్కాగా నమోదవుతున్నాయి. ఐదేళ్లలో 8.24 కోట్ల ఎకరాల్లో పంటల వివరాలను నమోదుచేశారు.

డీసీఎస్ యాప్‌లో ఈ-క్రాప్ ఫీచర్స్

ఏపీలో జాయింట్ అజమాయిషీ కింద నమోదు చేయడమే కాదు.. సోషల్ ఆడిట్ నిర్వహించడం, వాటిని గ్రామస్థాయిలో ఆర్బీకేల్లో ప్రదర్శించడం, రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి నిర్ణీత గడువులోగా పరిష్కరించడం, వారి వేలిముద్రలు సేకరించి డిజిటల్, ఫిజికల్ ఎక్నాలెడ్జ్‌మెంట్స్ ఇవ్వడం వంటి ఫీచర్స్ ఈ డీసీఎస్ సర్వే యాప్‌లో లేవు. పైగా గతేడాది నుంచి ఏపీలో జియోఫెన్సింగ్, జియో కోఆర్డినేట్స్‌తో సహా ఈ క్రాపింగ్ చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి దేశవ్యాప్తంగా అమలుచేయాలన్న సంకల్పంతో ఇటీవల న్యూఢిల్లీ నుంచి అగ్రిస్టాక్ విభాగం నుంచి విష్ణువర్ధన్, ధృవ్‌గౌతమ్ వంటి సాంకేతిక నిపుణులతో కూడిన బృందం ఏపీలో పర్యటించి ఇక్కడ అమలవుతున్న ఈ-క్రాప్ అమలుతీరును పరిశీలించింది. డీసీఎస్ కంటే మెరుగైన ఫీచర్స్‌తో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న విధానాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఫీచర్లను కూడా డీసీఎస్ సర్వే యాప్‌తో అనుసంధానిస్తున్నట్లు వాళ్లు స్వయంగా ప్రకటించారు. డీసీఎస్‌లో నమోదైన వాస్తవ సాగు సమాచారం ఆధారంగా వచ్చే సీజన్ నుంచి రైతు సంక్షేమ ఫలాలు అందించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది.

ఈ-క్రాప్ ప్రామాణికంగానే సంక్షేమ ఫలాలు..

ఇక సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీతో పాటు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలను ఈ-క్రాప్ ప్రామాణికంగానే అందేలా కృషిచేశారు. వైఎస్సార్ రైతుభరోసా, వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారం, వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీతో పాటు ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి అదే సీజన్ ముగిసేలోగానే పరిహారం అందించారు. ఉదా..

- ఈ ఐదేళ్లలో 75.82 లక్షల మందికి రూ.1,373 కోట్ల సబ్సిడీతో కూడిన 45.16 లక్షల టన్నుల విత్తనాలు..
- 15 లక్షల మందికి రూ.14 కోట్ల విలువైన 1.36 లక్షల లీటర్ల పురుగు మందులు..
- 176.36 లక్షల టన్నుల ఎరువులు పంపిణీ చేశారు.
- అలాగే, 5.13 కోట్ల మందికి రూ.8.37 లక్షల కోట్ల పంట రుణాలు అందించారు.
- వైఎస్సార్ రైతుభరోసా కింద ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున 53.58 లక్షల మందికి రూ.34,288 కోట్ల పెట్టుబడి సాయం..
- 54.58 లక్షల మందికి రూ.7,802.05 కోట్ల పంటల బీమా పరిహారం..
- 30.85 లక్షల మందికి రూ.3,411 కోట్ల పెట్టుబడి రాయితీ..
- 84.67 లక్షల మందికి రూ.2,051 కోట్ల సున్నా వడ్డీ రాయితీలను అందజేశారు.

గడిచిన ఐదేళ్లలో ఈ-క్రాప్ నమోదు ఇలా..

సీజన్	రైతులు (లక్షల్లో)	సాగు విస్తీర్ణం (లక్షల ఎకరాలు)
రబీ 2019-20	33.46	76.64
ఖరీఫ్-2020	51.05	132.58
రబీ 2020-21	34.66	83.77
ఖరీఫ్ 2021	43.51	112.26
రబీ 2021-22	34.25	77.41
ఖరీఫ్ 2022	49.66	110.23
రబీ 2022-23	32.24	79.35
ఖరీఫ్ 2023	48.50	106.77
రబీ 2023-24	29.50	45.16

ఏపీ మోడల్‌లోనే దేశవ్యాప్తంగా అమలు..

ఇదిలా ఉంటే.. ఏపీలో అమలవుతున్న ఈ-క్రాప్‌ను పలు రాష్ట్రాలతో పాటు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖతో సహా నీతి ఆయోగ్, ప్రపంచ బ్యాంకు, ఫుడ్ అండ్ అగ్రికల్చర్, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) వంటి సంస్థలతో పాటు పలు విదేశీ ప్రతినిధి బృందాలు సైతం అధ్యయనం చేశాయి. ఏపీ స్ఫూర్తితో జాతీయ స్థాయిలో రియల్ టైమ్ క్రాపింగ్ నమోదు చేపట్టాలని కేంద్ర వ్యవసాయ శాఖ సంకల్పించింది. 2022లోనే కేంద్ర బృందం ఏపీలో అమలవుతున్న ఈ-క్రాప్‌పై లోతైన అధ్యయనం చేసి గతేడాది 12 రాష్ట్రాల్లో ఎంపిక చేసిన ప్రాంతాల్లో డిజిటల్ క్రాపింగ్ సర్వేకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుత ఖరీఫ్ నుంచి దేశవ్యాప్తంగా డీసీఎస్ అమలుకు ముందుకొచ్చింది. ఇందుకోసం విధి విధానాల రూపకల్పనకు స్టీరింగ్ కమిటీలతో పాటు రాష్ట్రాల వారీగా ఇంప్లిమెంటింగ్ కమిటీలు ఏర్పాటుచేసింది. పైలెట్ ప్రాజెక్టులో ఎంపిక చేసిన కొన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ శాఖ, మరికొన్ని రాష్ట్రాల్లో రెవెన్యూ శాఖలు అడంగల్ డేటా ఆధారంగా డిజిటల్ క్రాపింగ్ చేశారు. ఎమ్నెక్స్ ఇంటర్నేషనల్ ద్వారా డిజైన్ చేసిన యాప్ ద్వారా ఖరీఫ్-2023లో జియో ఫెన్సింగ్ రిఫరెన్స్‌తో డీసీఎస్ చేపట్టారు. కానీ, ఏపీలో పూర్తిగా ఎన్ఐసీ సౌజన్యంతో డెవలప్ చేసిన యాప్‌లో నమోదు చేస్తున్నారు.



గవర్నర్‌తో సీఎస్ భేటీ

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్‌ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్‌గుప్తా శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలోని గవర్నర్ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

– సాక్షి, అమరావతి

సామాజిక మోసంపైనే చంద్రబాబు మొదటి సంతకం

- ఉప ముఖ్యమంత్రి పదవుల్లో బీసీ, దళిత, మైనార్టీలకు అన్యాయం
- 2014లో ఇద్దరికి ఉప ముఖ్యమంత్రి పదవులు
- ఇప్పుడు ఒక్కరితోనే సరిపెట్టారు
- వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేష్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సీఎం చంద్రబాబు మరోసారి సామాజిక మోసానికి తెరతీస్తూ తన మొదటి సంతకం చేశారని వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేష్ పేర్కొన్నారు. కేవలం ఒకరికి మాత్రమే ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారని, ఈ విషయంలో బీసీ, దళిత, మైనార్టీలకు అన్యాయం చేశారని చెప్పారు. ఈ మేరకు పోతిన మహేష్ శనివారం విజయవాడలోని తన కార్యాలయం నుంచి ఒక వీడియో సందేశం విడుదల చేశారు. 'చంద్రబాబు తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సామాజిక న్యాయానికి తూట్లు పొడిచారు. 2014లో చంద్రబాబు ఇద్దరికి ఉప ముఖ్యమంత్రులుగా అవకాశం కల్పించారు. వారిలో ఒకరు కాపు, మరొకరు బీసీ సామాజికవర్గం వారు ఉన్నారు. వైఎస్ జగన్ 2019లో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ చంద్రబాబుకు మిన్నగా కాపు, బీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉప ముఖ్యమంత్రులుగా అవకాశం కల్పించారు. తద్వారా ఆయా సామాజికవర్గాల ఆత్మగౌరవాన్ని వైఎస్ జగన్ మరింత పెంచారు. వైఎస్ జగన్‌ను పదేపదే విమర్శించిన చంద్రబాబు... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సామాజిక న్యాయానికి మించి అట్టడుగు వర్గాలకు పదవులు కేటాయించాల్సింది పోయి ఉన్న పదవులను తగ్గించారు. ఇది చంద్రబాబు నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తోంది. దీనిపై చంద్రబాబు ఆయా వర్గాలకు సమాధానం చెప్పాలి. చంద్రబాబు గత పాలన అంతా దళితులు, బీసీలు, మైనారిటీలను అణగదొక్కడమే కనిపిస్తుంది. వైఎస్ జగన్ అమలు చేసిన సామాజిక న్యాయాన్ని ఇప్పటికైనా బీసీ, దళిత, మైనార్టీ, కాపు సామాజికవర్గాలు గ్రహించాలి. ఆయన ఆయా వర్గాలకు కేటాయించిన సీట్లను సైతం గుర్తించాలి.' అని పోతిన అన్నారు.

చినబాబు బ్యాచ్ చిత్రహింసలు!

- మోకాళ్లపై మోకరిల్లి లోకేశ్ ఫ్లెక్సీ ఎదుట క్షమాపణ చెప్పాలని బెదిరించారు
- సీజేఐ, హైకోర్టు సీజే, మానవ హక్కుల కమిషన్‌కు బాధితుడు పాలేటి రాజ్‌కుమార్ ఫిర్యాదు
- నన్ను కిడ్నాప్ చేసి రాత్రంతా చిత్రహింసలకు గురి చేశారు
- ఆ దృశ్యాలను చిత్రీకరించి సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేశారు
- స్కూల్‌లో చదివే నా పిల్లలు అవమాన భారంతో ఇంటికొస్తున్నారు
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు వెనక్కు తీసుకోకుంటే చంపుతామని బెదిరిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై విచ్చలవిడిగా దాడులు
- మానవ హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాలని విన్నపం

సాక్షి, అమరావతి: మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేశ్ అనుచరులు ఈ నెల 9వ తేదీన తనను కిడ్నాప్ చేసి రాత్రంతా చిత్ర హింసలకు గురి చేసినట్లు పెదవడ్లపూడికి చెందిన బాధితుడు పాలేటి రాజ్‌కుమార్ సుప్రీం కోర్టు, హైకోర్టు, జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశాడు. లోకేశ్ ఫ్లెక్సీ ఎదుట మోకాళ్లపై కూర్చోబెట్టి బెదిరించి క్షమాపణ చెప్పించి చిత్రీకరించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి తన కుటుంబాన్ని మానసిక క్షోభకు గురి చేస్తున్నట్లు పేర్కొన్నాడు. వీటి ప్రభావంతో పాఠశాలలో చదువుతున్న తన పిల్లలు అవమానభారంతో ఇంటికొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. టీడీపీ నేతలు పదే పదే బెదిరింపులకు దిగుతున్నారని, తక్షణమే జోక్యం చేసుకుని అరికట్టకుంటే తన కుటుంబానికి ఆత్మహత్యే శరణ్యమని విన్నవించుకున్నాడు. ఈ మేరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జాతీయ మానవ హక్కుల సంఘానికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదుపై చట్టప్రకారం పోలీసులతో విచారణ జరిపి వ్యక్తిగత, భావ ప్రకటన స్వేచ్ఛ, మానవ హక్కులను పరిరక్షించాలని కోరాడు. ఫిర్యాదులో ముఖ్యాంశాలు ఇవీ..



- మంగళగిరి నియోజకవర్గంలో 2019–24 మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను మా కుటుంబంతో కలిసి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశా. ఎన్నికల ఫలితాలు వెల్లడైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలపై దాడులకు పాల్పడుతూ చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఆస్తులను ధ్వంసం చేస్తూ భయోత్పాతం సృష్టిస్తున్నారు. నారా లోకేశ్ అండదండలతో మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు పేట్రేగిపోతున్నారు.
- ఈ నెల 9వతేదీన సాయంత్రం 4.30 గంటల సమయంలో నారా లోకేష్‌కు సన్నిహితుడైన జవ్వాడి కిరణ్‌చంద్ అనుచరులు నరేంద్ర, షేక్ బాజీ, జానీ తదితరులు నేను మా అత్త ఇంట్లో ఉన్న సమయంలో మారణాయుధాలతో దాడి చేశారు. ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఏపీ 39 జీబీ 3333 వాహనంలో నన్ను కిడ్నాప్ చేసి గుర్తు తెలియని ప్రాంతానికి తరలించి రాత్రంతా చిత్రహింసలకు గురిచేశారు. నా చొక్కా విప్పించి నారా లోకేశ్ ఫ్లెక్సీ ఎదుట మోకాళ్లపై మోకరిల్లి ముకుళిత హస్తాలతో క్షమాపణ చెప్పాలని బెదిరించి వీడియో చిత్రీకరించారు. ఈనెల 10వతేదీ తెల్లవారు జాము 4 గంటలకు బోయపాలెం వద్ద జాతీయ రహదారిపై వదిలేసి వైఎస్సార్ సీపీకి మద్దతు పలికితే ఎవరికైనా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు.
- నాపై దాడి చేసిన వారిపై అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు (ఎఫ్ఐఆర్ నెంబరు 78/2024) చేశా. ఫిర్యాదు వాపసు తీసుకోవాలంటూ టీడీపీ మద్దతుదారులు పదే పదే ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసులు నా ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.
- మానవ హక్కులను కాలరాయడంపై తక్షణమే జోక్యం చేసుకుని టీడీపీ నేతలు, కార్యకర్తల నుంచి నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించాలి. నా ఫిర్యాదుపై చట్టప్రకారం విచారణకు ఆదేశించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నా.

BE ALERT

మీ డేటా జరభద్రం!

ఆన్‌లైన్‌లో పొంచి ఉంటున్న హ్యాకర్లు

నెటిజన్‌ల నిర్లక్ష్యమే ఆ కేటుగాళ్లకు వరం

అవగాహన రాహిత్యమే అసలు ప్రమాదం

నిపుణులు సూచిస్తున్న జాగ్రత్తలివిగో..

సాక్షి, హైదరాబాద్

హ్యాకర్‌గా మారిన యూపీకి చెందిన 20 ఏళ్ల విద్యార్థి జతిన్‌కుమార్ ఏకంగా పోలీసు వెబ్‌సైట్లు హ్యాక్ చేయడం ద్వారా ఆ విభాగానికే సవాల్ విసిరి ఎట్టకేలకు అరెస్టయ్యాడు. ఇలా ఇతనొక్కడే కాదు... ఆన్‌లైన్‌లో చాలామంది కేటుగాళ్లు అదును కోసం వేచి చూస్తున్నారు. కంప్యూటర్లకు తోడుగా ట్యాబ్‌లు, స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరిగిన తర్వాత సైబర్ అటాక్స్ గణనీయంగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలోనే ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత డేటాను భద్రంగా ఉంచుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ఇలాంటి కొన్నింటిని సైబర్‌క్రైమ్ నిపుణులు సూచిస్తున్నారు.

జియో లొకేషన్‌ను ట్యాగ్ చేయొద్దు

సోషల్ మీడియా ప్రపంచంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్స్, పోస్టింగ్స్ మామూలైపోయాయి. లైక్‌ల కోసం వ్యక్తిగత విషయాలను నెట్‌లో పడేస్తున్నారు. ఇది అనేక సందర్భాల్లో దుర్వినియోగం అవుతోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాల్లో ఎక్కువగా పోస్టు చేసినప్పుడు జియో లొకేషన్‌ను ట్యాగ్ చేయకుండా ఉండాలి. వివిధ సర్వేల పేరుతో ఆన్‌లైన్‌లో వచ్చే ఫామ్స్ అనాలోచితంగా నింపొద్దు. ప్రధానంగా ఫోన్ నెంబర్లు, పూర్తి పేర్లు రాయకూడదు.

ఆ 'పాస్‌వర్డ్‌లు' వద్దే వద్దు

ఇటీవల అంతర్జాతీయంగా జరిగిన అనేక సర్వేలు పాస్‌వర్డ్స్ విషయంలో వినియోగదారుల వీక్‌నెస్ బయటపెట్టింది. ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది '1234తో తమ పేరు/ఇంటి పేరు', 'పాస్‌వర్డ్ అనే పదం'తదితరాలు పెట్టుకుంటున్నారని, పిన్‌ల విషయంలో '1234', '1111', '0000' వంటివే ఎక్కువగా వాడుతున్నారని గుర్తించింది. దీనికి భిన్నంగా ఊహించడం కష్టంగా ఉండే, డ్యూయల్ అథెంటికేషన్ తదితరాలను ఎంపిక చేసుకోవాలి. పాస్‌వర్డ్‌లో కచ్చితంగా క్యాపిటల్, సంఖ్య, గుర్తు (హ్యాష్‌ట్యాగ్, స్టార్, ఎట్ వంటివి) ఉండేలా చూసుకోవాలి.

'ఎక్స్‌టెన్షన్'లను తొలగించండి

కంప్యూటర్, ల్యాప్‌టాప్‌ల్లో మీరు ఉపయోగించిన... తరచూ వినియోగించే యాప్‌లు, బ్రౌజర్లకు ఎక్స్‌టెన్షన్లను అనేక మంది అలానే ఉంచుకుంటారు. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం అవుతుంది. ఈ నేపథ్యంలో కచ్చితంగా ప్రతి ఒక్కరూ ఆయా ఎక్స్‌టెన్షన్స్‌ను తొలగించాలి. అధీకృత మినహా ప్రతి యాప్‌ను అనుమానించాల్సిందే. అనేక యాప్స్ వినియోగదారు డేటాను సేకరించి, విక్రయించడం ద్వారా డబ్బు సంపాదిస్తాయి. ఏదైనా ఫైల్ డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు అధికారిక యాప్ స్టోర్స్ మాత్రమే వినియోగించాలి.

'చరిత్ర'ను తుడిచేయాల్సిందే

ఇటీవల కాలంలో ప్రతి ఒక్కరూ చిన్న చిన్న అనుమానాలు నివృత్తి చేసుకోవడం నుంచి వ్యక్తిగత విషయాల కోసమూ వివిధ సెర్చ్ ఇంజన్లను ఆశ్రయిస్తున్నారు. అయితే 95% మందికి సెర్చ్ హిస్టరీని డిలీట్ చేయాలన్న విషయం తెలియట్లేదు. ఇలా చేయకపోతే కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత డేటా ఇతరుల చేతికి చేరుతుంది. కొన్ని సెర్చ్ ఇంజన్లలో ఈ డిలీట్ ఆప్షన్ ఉండదు. అందుకే కచ్చితంగా సురక్షితమైన సెర్చ్ ఇంజన్, వెబ్‌సైట్లను మాత్రమే వినియోగించాలి.



అధీకృత అప్‌డేట్స్ చేసుకోవాల్సిందే

ఫోన్ల నుంచి కంప్యూటర్ల వరకు వాడే యాప్స్ నిత్యావసర వస్తువులుగా మారిపోయాయి. వీటిలో బగ్ లేదా లోపాలను గుర్తించడానికి తయారీదారులు నిత్యం పరిశోధన, అభివృద్ధి చేస్తూనే ఉంటారు. ఇలాంటివి గుర్తిస్తే 'ప్యాచ్' చేయడానికి సాఫ్ట్‌వేర్స్ అప్‌డేట్స్ విడుదల చేస్తుంటారు. ఇలా అధీకృత సంస్థ నుంచి వచ్చే అప్‌డేట్స్‌ను కచ్చితంగా వినియోగించుకోవాలి. అలా చేయకపోతే డేటాను యాక్సెస్ చేయడానికి సైబర్ నేరగాళ్లకు అవకాశం ఇచ్చినట్లే అవుతుంది.

లాగిన్ వివరాలు వేరుగా ఉండాలి

థర్డ్ పార్టీ యాప్‌ల వినియోగం వీలున్నంత వరకు తగ్గించాలి. అంటే... వేర్వేరు యాప్‌లను లాగిన్ చేయడానికి ఒకే ఖాతాను ఉపయోగించకూడదు. ఇన్‌స్టాగామ్, ఎక్స్ ఖాతాలను లాగిన్ చేసేందుకు చాలా మంది ఫేస్‌బుక్ ఖాతాను వినియోగిస్తారు. అలాగే అనేక అంశాల్లో గూగుల్ వివరాలు పెడుతూ ఉంటారు. ఇలా చేయడం వల్ల ఒక్క పాస్‌వర్డ్ సంగ్రహించే హ్యాకర్లు మిగిలిన అన్నింటినీ హ్యాక్ చేసే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే వీటి లాగిన్స్ అన్నీ వేర్వేరుగా ఉండేలా చూసుకోవాలి.

'పబ్లిక్'ని వాడుకోవడం ఇబ్బందికరమే

ఆన్‌లైన్‌లో బ్రౌజ్ చేసేప్పుడు వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్‌లను (వీపీఎన్) వినియోగించడం మంచిది. అత్యవసర సమయాల్లో పబ్లిక్ వైఫై వంటివి వినియోగించాల్సి వస్తే జాగ్రత్తగా వాడాలి. వ్యక్తిగత సమాచారం ఇతరులకు చేరకుండా చూసుకోవాల్సిందే. ఇలాంటి సురక్షితం కాని నెట్‌వర్క్‌లు వాడుతున్నప్పుడు బ్యాంకు లావాదేవీలు వంటి ఆర్థిక కార్యకలాపాలు చేయొద్దు. అలాగే ఓటీపీలు, పాస్‌వర్డ్స్, పిన్ నంబర్లు తదితరాలు ఎంటర్ చేయొద్దు.

క్లుప్తంగా...

నిత్యావసరాల పంపిణీ నిలిపివేయండి

సరుకుల తూకంలో తేడాలు ఉన్నాయి: మంత్రి నాదెండ్ల మనోహర్



ధాన్యం గోడౌన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి అర్బన్: పేదలకు ప్రభుత్వం సరఫరా చేసే నిత్యావసర సరుకుల తూకంలో తేడాలు కనిపించాయి.. వెంటనే పంపిణీ నిలిపివేయాలని ఉన్నతాధికారులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులోని గోడౌన్, పినపాడులోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ప్రజలకు పంపిణీ చేసే పంచదార, కందిపప్పు ప్యాకెట్‌లను తూకం వేయించారు. అయితే 500 గ్రాముల ప్యాకెట్‌ను తూకం వేయిస్తే 450 గ్రాములు మాత్రమే ఉంది. దీంతో ఆయన ఎందుకు ఇలా తేడా ఉందని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు సరఫరా చేసిన వాటినే తాము పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వెంటనే సరకుల సరఫరాను నిలిపివేసి ఆడిట్ నిర్వహించాలని ఉన్నతాధికారులను ఫోన్‌లో ఆదేశించారు. వారంలో సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇలాంటి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. పౌరసరఫరాల శాఖలో రూ.వేల కోట్ల అవినీతి జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. దీనిని పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు.

పరిశ్రమల హబ్‌గా ఏపీని తీర్చిదిద్దుతా

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి మంత్రి టీజీ భరత్ వెల్లడి



కర్నూలు(టౌన్): పరిశ్రమల హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. దేశంలోనే పరిశ్రమల స్థాపనలో గుజరాత్ రోల్ మోడల్‌గా ఉందని, అ దిశగా రాష్ట్రంలోనూ చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం కర్నూలులో మంత్రి మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం పీపీఏలను రద్దు చేయడం వల్ల పారిశ్రామిక ప్రగతి నిర్వీర్యమైందని, ఆఫ్రికా వంటి దేశాల్లోనూ పీపీఏలు అమల్లో ఉన్నాయన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ ధ్యేయమని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధితో పాటు కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్‌ను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. 2014 నుంచి 2024 వరకు పారిశ్రామికవేత్తలతో కుదుర్చుకున్న ఎంఓయూలను పూర్తి స్థాయిలో సమీక్షిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పరిశ్రమల అనుమతుల విషయంలో సింగిల్ విండో వ్యవస్థ ఎక్కడా అమలుకు నోచుకోలేదని, అయితే తమ ప్రభుత్వం 21 రోజుల వ్యవధిలో సింగిల్ విండో ద్వారా క్లియరెన్స్‌కు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ట్రాఫిక్ సమస్య అధిగమించడం, ప్రత్యామ్నాయ రోడ్లతో పాటు కర్నూలులో రింగ్ రోడ్డుకు చర్యలు తీసుకుంటామని, కర్నూలు నగరాన్ని రియల్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

మహిళలు, సామాన్యుల భద్రతకు ప్రాధాన్యం

హోం మంత్రి వంగలపూడి అనిత



అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో హోం మంత్రి వంగలపూడి అనిత

సఖినేటిపల్లి: రాష్ట్రంలోని మహిళలు, సామాన్య ప్రజలు, వారి ఆస్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనృసింహ స్వామి వారికి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా.. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం మంత్రి వనిత మీడియాతో మాట్లాడారు. 'అంతర్వేది లక్ష్మీనృసింహుని దర్శించుకుని ఎన్నికల ప్రచారం మొదలుపెట్టా. గెలుపు అనంతరం స్వామివారి ఆశీస్సులు తీసుకోవడానికి.. అలాగే హోం మంత్రిగా రాష్ట్ర రక్షణ విషయంలో దైవానుగ్రహం కోసం వచ్చా. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌లకు తగిన శక్తి ఇవ్వాల్సిందిగా స్వామివారిని కోరుకున్నా. రాష్ట్రంలో గత ఐదేళ్లలో గంజాయి, డ్రగ్స్, ఆడపిల్లలపై అఘాయిత్యాలు, మిస్సింగ్‌లు ఎక్కువగా జరిగాయి. ఇవన్నీ అధిగమించేందుకు పోలీస్‌శాఖతో సమీక్ష నిర్వహించి.. పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తాం' అని చెప్పారు. కార్యక్రమంలో మలికిపురం ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నామినేటెడ్ పదవుల భర్తీ

▶ మొదటి పేజీ తరువాయి



కార్యకర్తలతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

కృషి ఎంతో ఉన్నాయన్నారు. కూటమి 93 శాతం స్ట్రైక్ రేట్‌తో 57 శాతం ఓట్ షేర్‌ను సాధించిందని తెలిపారు. ప్రజలు ఇచ్చిన మెజారిటీని కాపాడుకోవాలన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని చంద్రబాబు తెలిపారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ఫైల్‌పై సంతకం చేసి 16,347 ఉద్యోగాల భర్తీకి ఆదేశాలు ఇచ్చామని గుర్తు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం, పెన్షన్ రూ.4 వేలకు పెంపుపై మూడో సంతకం, స్కిల్ గణనపై నాలుగో సంతకం, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై ఐదో సంతకం చేశానని తెలిపారు. యువతలో నైపుణ్యం ఏ మేరకు ఉందో గణన చేసి అవసరమైన అవకాశాలు కల్పిస్తామన్నారు. నైపుణ్య గణనతో జీవన ప్రమాణాలను మార్చడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. 2014-2019 మధ్య ఎక్కడెక్కడ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామో, వాటన్నింటినీ వంద రోజుల్లోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు మార్చేలా పథకాలు అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ప్రజాపాలనకు శ్రీకారం చుట్టామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకెళ్తామని చెప్పారు.

వినతుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థ

ప్రజల సమస్యలు, వినతుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. నిర్దిష్ట సమయంలో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయానికి రాకపోకలు కొనసాగించేందుకు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తామని చెప్పారు. పోలవరం సందర్శనతోనే తన క్షేత్ర స్థాయి పర్యటనలు ప్రారంభమవుతాయన్నారు. విధ్వంస పాలనకు గుర్తుగా ప్రజా వేదిక శిథిలాలను అలాగే ఉంచుతామని, తొలగించేది లేదని వెల్లడించారు.

ఏఈవోల సమస్యలను పరిష్కరిస్తాం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



మంత్రి అచ్చెన్నాయుడును కలిసి అభినందిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నేతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వ్యవసాయ విస్తరణ అధికారుల(ఏఈవో) సమస్యలను పరిష్కరించేందుకు త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేస్తానని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా నియమితులైన అచ్చెన్నాయుడుని విజయవాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఏఈవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణు మాధవరావు ఆధ్వర్యంలో సంఘ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏఈవోలు పనిచేయాలని సూచించారు. ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ రాష్ట్ర నాయకులు సుభానీ, సురేష్, పీటర్, ప్రసాద్‌బాబు, సుదర్శన్ ఉన్నారు.

అత్యుత్తమ రాజధానిగా అమరావతి

- పక్కా ప్రణాళికతో రెండున్నరేళ్లలో పూర్తిస్థాయిలో నిర్మిస్తాం
- రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని అద్భుతంగా అభివృద్ధి చేసి, ఐదు అత్యుత్తమ రాజధానుల సరసన నిలిపేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాలెంలోని నారాయణ మెడికల్ కళాశాల ఆవరణలోని తన స్వగృహంలో మంత్రి శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 2015 జనవరిలో అమరావతి రాజధాని నిర్మాణానికి కేవలం 58 రోజుల్లో 34 వేల ఎకరాల భూములను రైతులు అందజేశారని, ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతోనే తమ భూములను రాజధాని ఏర్పాటుకు కేటాయించారని మంత్రి గుర్తుచేశారు. వివిధ దశల్లోనే నిలిచిపోయిన భవనాలను పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. సుమారు రెండున్నరేళ్లలోనే అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు కృషిచేస్తామన్నారు. సీఎం చంద్రబాబు మరోసారి రాజధానిని అభివృద్ధి చేసే బాధ్యతను తనపై ఉంచారని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టేందుకు రాజధాని అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్దపీట..

ఇక 2014 నుంచి 2019 వరకు తమ పాలనలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి రాష్ట్రంలోని 114 మున్సిపాల్టీల్లో పెద్దఎత్తున పార్కులు, రోడ్లు, డ్రైనేజీలు, డివైడర్లు, పాఠశాలల్లో మౌలిక వసతులు మొదలైన అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి నారాయణ చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన క్షణాల్లోనే ప్లాన్ అప్రూవల్ ఇచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. ఎటువంటి చార్జీలు కూడా ప్రజల నుంచి వసూలుచేయలేదన్నారు. గత ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం మోపిందని, చెత్త పన్నుతో ప్రజలు బాగా ఇబ్బందులుపడ్డారని మంత్రి చెప్పారు. అధికారులతో సమీక్షించి దీనిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. త్వరలో టిడ్కో ఇళ్ల పూర్తిపై దృష్టిసారిస్తామని.. అలాగే, అధికారులతో సమావేశమై మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు, పెండింగ్ అంశాలపై చర్చిస్తామన్నారు.

త్వరగా మార్చేద్దాం

- సీఎస్, డీజీపీతో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో కీలక స్థానాల్లో తమకు అనుకూలమైన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టి సారించారు. వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, ఐజీలు, డీఐజీలు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు ఇలా అందరినీ త్వరిత గతిన బదిలీలు చేసే దిశగా కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రతో సమావేశమయ్యారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌కు సన్నితంగా వ్యవహరించిన అధికారులందరినీ గుర్తించాలని, అలాంటి అధికారులు తమకు అవసరం లేదని.. ఎవరెవరు ఏం చేశారో వివరాలు సేకరించాలని సూచించినట్లు తెలిసింది. ఇదే సమయంలో మన కోసం (టీడీపీ) పని చేసిన వారిని గుర్తించాలని, అలాంటి వారు రిటైర్ అయినప్పటికీ మరో రకంగా తెచ్చుకుందామని అన్నట్లు సమాచారం. రాజధాని అమరావతిని త్వరతగతిన అభివృద్ధి చేయడం తమ ప్రథమ లక్ష్యం అని, ఇందుకోసం ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పినట్లు తెలిసింది. ఇందులో భాగంగా గతంలో టీడీపీ ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలను తిరిగి అమలు చేసే విషయమై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో తమ ప్రభుత్వం ఉన్నప్పుడు పని చేసిన ముఖ్య అధికారులను పిలిపిస్తే, తానే స్వయంగా మాట్లాడుతానని చంద్రబాబు చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే గతంలో తాను సీఎంగా ఉండగా తన కార్యాలయంలో పనిచేసిన ఉత్తరప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రాజమౌళిని మళ్లీ రాష్ట్రానికి తీసుకువస్తున్నారు. ఇలాంటి మరికొందరు అధికారులతోపాటు రాష్ట్రంలోనే వివిధ శాఖల్లో ఉన్న తమకు అనుకూలమైన వారిని పిలిపించుకుని మాట్లాడి.. వారికి ఏ పోస్టింగులు ఇవ్వాలనే దానిపై సూచనలు ఇచ్చినట్లు తెలిసింది.

వాళ్లను పంపించేద్దాం

టీడీపీకి సహకరించని అధికారులను గుర్తించి, వారిని బదిలీ చేయించే విషయంపై కూడా చంద్రబాబు సీఎస్, డీజీపీతో చర్చించినట్లు సమాచారం. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పని చేశారని ఇప్పటికే కొంత మందిని గుర్తించామని, రాష్ట్ర వ్యాప్తంగా ఇలా ముఖ్య అధికారులందరినీ త్వరగా గుర్తిస్తే.. వారిని బదిలీ చేయడం లేక సెంట్రల్ సరీ్వసులకు వెళ్లి పోండని చెప్పడం.. లేక ఇక్కడే ఉంటే అప్రాధాన్యత పోస్టులకు పరిమితం చేద్దామని వివరించినట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎవరెవరు ఎలా పని చేశారో తనకు తెలుసని, అయినప్పటికీ అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని వీలైనంత త్వరగా జాబితా తయారు చేయాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. కీలక పోస్టింగ్‌ల తర్వాతే అనుకున్నది అనుకున్నట్లు చేయడానికి ఉపక్రమిద్దామని సీఎం అన్నట్లు తెలిసింది.

ఏడాదిలోగా ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు

- నెలాఖరులోగా స్టూడెంట్ కిట్ల పంపిణీ పూర్తిచేయాలి
- ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్ ఇవ్వాలి
- మంత్రి నారా లోకేశ్ ఆదేశం



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో ఏడాదిలోగా పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం ఉండవల్లి నివాసంలో విద్యా శాఖ, ఉన్నత విద్యా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం రుచిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూళ్లలో పారిశుధ్యం నిర్వహణకు సంబంధించి ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు స్కూళ్లకు మారిన విద్యార్థుల సంఖ్య, అందుకు కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ఎన్ని పాఠశాలలు మూతపడ్డాయి, కారణాలేమిటో తెలియజేయాలన్నారు. బైజూస్ కంటెంట్, ఐఎఫ్‌పీ వినియోగం మీద సమగ్ర నోట్ ఇవ్వాలన్నారు. సీబీఎస్ఈ పాఠశాలలపై సమగ్ర వివరాలివ్వాలని చెప్పారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయనున్న 82 వేల మంది విద్యార్థులకు ఇచ్చే శిక్షణపై సమగ్ర నోట్ ఇవ్వాలని చెప్పారు. ఈ నెలాఖరులోగా స్టూడెంట్ కిట్ల పంపిణీ పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వచ్చే నెల 15 నాటికి పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాక్ ప్యాక్ (బ్యాగ్) అందించాలని ఆదేశించారు. ఇకపై ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా జరుగుతాయని తెలిపారు.

విద్యా దీవెన, వసతి దీవెన బకాయిల వివరాలివ్వండి

విద్యా దీవెన, వసతి దీవెన పథకాల కింద ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిల వివరాలు ఇవ్వాలని మంత్రి లోకేశ్ ఉన్నత విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. 2018-19 నుంచి ఇప్పటి దాకా ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాల వివరాలు, ఈఏపీసెట్‌లో ఇంటర్ మార్కుల వెయిటేజీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజులు ఎంత ఉండాలో వివరాలు సమర్పించాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల సంఖ్య తగ్గడంపైనా నివేదిక ఇవ్వాలన్నారు. వివాదాస్పద వీసీలు, యూనివర్సిటీల్లో అవినీతి ఆరోపణలపైనా సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామల రావు, కమిషనర్ పోలా భాస్కర్, ఆర్జేయూకేటీ రిజిస్ట్రార్ ఎస్ఎస్‌వీ గోపాలరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

త్వరలో నూతన ఐటీ పాలసీ

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించే విధంగా త్వరలో నూతన ఐటీ పాలసీని విడుదల చేయనున్నట్లు మంత్రి లోకేశ్ ప్రకటించారు. శనివారం ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖలపై మంత్రి ఉండవల్లిలోని నివాసంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలను రప్పించడానికి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు, ఇప్పటికే ఉన్న కంపెనీలకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాల బకాయిల వివరాలను సాధ్యమైనంత త్వరగా ఇవ్వాలన్నారు. విశాఖను ఐటీ హబ్‌గా, తిరుపతిని ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని, ఈ రంగాల్లో పేరుగాంచిన కంపెనీలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించాలని అధికారులను కోరారు.

రమేశ్, చంద్రశేఖర్‌లకు సాహిత్య అకాడమీ అవార్డులు


సాక్షి, న్యూఢిల్లీ/ నిజామాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్రానికి చెందిన బంజారా రచయిత రమేశ్ కార్తీక్ నాయక్‌ను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 'మాయాలోకం' తెలుగు నవల రాసిన ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన రచయిత పి.చంద్రశేఖర్ ఆజాద్ బాల సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం వివేక్‌నగర్ తండాకు చెందిన ఆయన.. 2021లో తెలుగులో రాసిన 'ఢావ్లో' గోర్ బంజారా కథలకుగాను అకాడమీ యువ పురస్కారానికి ఎంపికయ్యారు. రమేశ్ కార్తీక్ వయసు 26 ఏళ్లు. పదో తరగతిలోనే కవిత్వం రాయడం మొదలుపెట్టిన రమేశ్.. గిరిజనుల జీవితాలు, మనస్తత్వాలు, కష్టసుఖాలు అంశాలుగా కవిత్వం, కథలు రాయడం ప్రారంభించాడు. 'బల్దేర్ బండి' పేరిట మొదటి కవిత సంపుటి రాశాడు. చంద్రశేఖర్ ఆజాద్‌కు బాలసాహిత్య పురస్కారానికి ఎంపికైన రచయిత పమిడిముక్కల చంద్రశేఖర్ 1955లో గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో జన్మించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఆయన అనేక కథలు, నవలల పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. ఆయన నవలలు పలు పత్రికల్లో సీరియళ్లుగా ప్రచురితమయ్యాయి.

మొత్తంగా 47 మందికి అవార్డులు

కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన జరిగిన ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశంలో 23 మంది రచయితలను ప్రతిష్టాత్మకమైన సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి, 24 మంది రచయితలను బాల సాహిత్య పురస్కారానికి ఎంపిక చేశారు. సంస్కృతం మినహా మిగిలిన అన్ని భాషలకు సంబంధించిన అవార్డులను ప్రకటించారు.

కరవు రహిత రాష్ట్రంగా మారుస్తాం

జలవనరులశాఖ మంత్రి ఎస్. రామానాయుడు



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయడంతోపాటు గోదావరి-కృష్ణా-పెన్నా నదులను అనుసంధానం చేసి కరవు రహిత రాష్ట్రంగా మార్చాలన్న సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. విజయవాడలోని జలవనరుల శాఖ క్యాంపు కార్యాలయాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ 2014-19 మధ్య ఐదేళ్లలో రూ.7లక్షల కోట్ల బడ్జెట్ ఉండగా, అందులో రూ.80వేల కోట్లను సాగునీటి ప్రాజెక్టుల పనుల కోసం అప్పటి సీఎం చంద్రబాబు ఖర్చు చేశారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కలిపి రూ.12లక్షల కోట్ల బడ్జెట్ ఉంటే.. కేవలం రూ.30వేల కోట్లను మాత్రమే సాగునీటి ప్రాజెక్టుల కోసం అప్పటి సీఎం జగన్ ఖర్చు చేశారని చెప్పారు. అందులోనూ 40శాతం అక్రమాలకు పాల్పడి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల పనుల కోసం 2014-19 మధ్య చంద్రబాబు రూ.12వేల కోట్లు వ్యయం చేస్తే.. గత ఐదేళ్లలో వైఎస్ జగన్ కేవలం రూ.2,500 కోట్లే ఖర్చు చేశారన్నారు. అవులపల్లి రిజర్వాయర్ పనుల్లో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలకు పాల్పడ్డారని, ఎన్జీటీ ఆ ప్రాజెక్టుపై రూ.వంద కోట్ల జరిమానా విధించిందని చెప్పారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు కోసం గత ఐదేళ్లలో ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదన్నారు. గోదావరి డెల్టాలో క్రాప్ హాలిడే ప్రకటించే దుస్థితికి సాగునీటి ప్రాజెక్టులను వైఎస్ జగన్ దిగజార్చారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టులో 2019నాటికి పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ను తొలగించి విధ్వంసం సృష్టించారని ఆరోపించారు. తాను జలవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక సాగునీటి ప్రాజెక్టుల పనులపై సమీక్షించి సీఎం చంద్రబాబు మార్గనిర్దేశం ప్రకారం వాటిని పూర్తిచేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామని మంత్రి రామానాయుడు చెప్పారు.

నా మనసుకు దగ్గరైన శాఖలివి

తనకు కేటాయించిన శాఖలపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రకటన



సాక్షి, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గంలో తాను నిర్వర్తించబోయే శాఖలు తన మనసుకు, జనసేన మూల సిద్ధాంతాలకు చాలా దగ్గరగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అన్నారు. శనివారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'నాకు కేటాయించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతికత శాఖలు ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేవే. ఈ శాఖలు ప్రభుత్వాన్ని ప్రజలకు దగ్గరకు చేర్చేవిగా నేను భావిస్తున్నా. 2008 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న నాకు క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా ప్రతి ప్రాంతానికి సంబంధించిన సమస్యలపైన బలమైన అవగాహన ఉంది. సమస్యలను కళ్లారా చూశా. కాలుష్యమయమైన జలవనరులను.. తప్పని పరిస్థితుల్లో తాగునీరుగా వాడుకుంటున్న పల్లెవాసులను గమనించా. ప్రజలకు మేలైన ఫలాలను అందించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా. ఉపాధి హామీ పథకం నిధులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. జల్‌జీవన్ మిషన్ ద్వారా పల్లెలకు రక్షిత తాగు నీరు అందించి ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తా. ప్రజల ఆరోగ్యాలను హరించివేయకుండా పరిశ్రమలు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేలా చేయూతనిస్తా. భూ తాపాన్ని తగ్గించడానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషికి బాసటగా రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తాం. అటవీ సంపద అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతా. అడవుల వినాశనానికి పాల్పడినా, అందుకు ప్రయత్నించిన వారు ఎంతటి వారైనా సరే కటకటాల వెనక్కి పంపిస్తా. తీర ప్రాంతాల్లో మడ అడవుల పరిరక్షణపై ప్రత్యేకంగా దృష్టి పెడతాం' అని పవన్ చెప్పారు. కాగా, జనసేన పార్టీ నుంచి మంత్రివర్గంలో చేరిన నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్‌లకు కేటాయించిన పౌరసరఫరాలు, పర్యాటకం, సినిమాటోగ్రఫీ శాఖలపై పవన్ సంతృప్తి వ్యక్తం చేశారు.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి



కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని త్వరలోనే అమలు చేస్తామని రాష్ట్ర రవాణా, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంత్రిగా నియమితులయ్యాక తొలిసారి కడప విచ్చేసిన ఆయనకు టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ, కర్ణాటకలో ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం అమలవుతోందన్నారు. ఈ నేపథ్యంలో దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేసి పొరపాట్లకు తావు లేకుండా రాష్ట్రంలో ప్రవేశపెడతామని చెప్పారు.

ఫర్నిచర్‌కు విలువ కడితే చెల్లిస్తాం

ఎంత చెల్లించాలో చెప్తే.. అంతా చెల్లిస్తామని అధికారులకు చెప్పాం


- వారి సమాధానం కోసం ఎదురుచూస్తున్నాం
- ఇంతలోనే టీడీపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ వ్యక్తిత్వ హననమే లక్ష్యంగా కూటమి పార్టీలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ధ్వజమెత్తారు. అధికారం చేపట్టాక వారి ప్రవర్తన, వ్యవహరిస్తున్న తీరు రోజురోజుకు దిగజారుతోందని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్ జగన్‌పై వ్యక్తిత్వహననానికి పాల్పడటాన్ని టీడీపీ ఒక అలవాటుగా మార్చుకుందని నిప్పులు చెరిగారు. నిస్సిగ్గుగా, నీతిమాలిన రాజకీయం చేస్తూ టీడీపీ తప్పుడు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో పరిపాలనకు అవసరమైన సౌకర్యాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సీఎం హోదాలో ఎవరున్నా, వారి క్యాంపు కార్యాలయాల్లో తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయడం సర్వసాధారణమని తెలిపారు. ఇందులో భాగంగానే వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో గత ప్రభుత్వం సౌకర్యాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం మారాక ఏయే వస్తువులను క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేశారో ఆ జాబితాను ఇప్పటికే అధికారులకు సమర్పించామన్నారు. 'ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఏర్పాటు చేసిన ఫర్నీచర్‌కు విలువకట్టి, ఎంత తిరిగి చెల్లించాలో చెప్తే, అంతా చెల్లిస్తామని ప్రభుత్వాధికారులకు చెప్పాం. దీనికి సంబంధించిన ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ప్రభుత్వ సమాధానం కోసం ఎదురుచూస్తున్నాం. ఇంతలోనే టీడీపీ మంత్రులు, ఆ పార్టీ సోషల్ మీడియా వైఎస్ జగన్‌ని లక్ష్యంగా దుష్ప్రచారం చేస్తున్నారు. అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన మంత్రులు కూడా ఈ ప్రచారంలో భాగస్వాములు కావడం దురదృష్టకరం. ఇలాంటి చర్యలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. టీడీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలతో వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీయలేరు' అని లేళ్ల అప్పిరెడ్డి తన ప్రకటనలో పేర్కొన్నారు.

10కోట్ల కొత్త ఇళ్లకు డిమాండ్

- వచ్చే పదేళ్లలో కొత్తగా రూ.75 లక్షల కోట్ల సంపద పెరుగుతుందని అంచనా
- ప్రపంచంలోనే ఇండియాలో అత్యధికంగా డిమాండ్



సాక్షి, అమరావతి: ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారతదేశంలో సొంతింటి నిర్మాణానికి భారీ డిమాండ్ ఏర్పడనుందని రియల్ ఎస్టేట్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. వచ్చే పదేళ్లలో దేశవ్యాప్తంగా 10 కోట్లకు పైగా సొంత ఇంటి నిర్మాణాలకు డిమాండ్ ఏర్పడుతుందని అంచనా. దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతుండడం.. ఆ మేరకు కుటుంబ ఆదాయాలు భారీగా పెరగనుండడంతో సొంతింటి కల డిమాండ్ నెరవేరనుందని పేర్కొంటున్నాయి. వచ్చే 10 ఏళ్లలో 7 కోట్ల మంది ఆదాయం సొంతింటిని నిర్మించుకునే స్థాయికి చేరుకుంటుందని, మరో 3 కోట్ల మంది ప్రస్తుతం వారు నివాసముంటున్న అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్స్ నుంచి అప్‌గ్రేడ్ అవుతారని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సంస్థ నైట్ ఫ్రాంక్ అంచనా వేసింది. వచ్చే పదేళ్ల కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థలో అదనంగా రూ.75 లక్షల కోట్ల సంపద సమకూరుతుందని, దీనికి అనుగుణంగా సొంతింటికి భారీ డిమాండ్ పెరుగుతుందని పేర్కొంది.

మరో దశాబ్దం పాటు డిమాండ్

కొంతకాలంగా స్తబ్ధుగా ఉన్న దక్షిణాసియా రియల్ ఎస్టేట్ మార్కెట్ కోవిడ్ సంక్షోభం తర్వాత పురోగమన దిశగా అడుగులు వేస్తోంది. గడచిన 15 ఏళ్లలో లేనంతగా 2023 సంవత్సరంలో 6,00,000 సొంతింటి నిర్మాణాలు జరిగాయని పేర్కొంది. రియల్ ఎస్టేట్ మార్కెట్ ఎప్పుడూ 15 సంవత్సరాలు వృద్ధిబాటలో మరో 15 ఏళ్లు సద్దుబాటు ధోరణిలో కొనసాగుతుందని, గడిచిన నాలుగేళ్ల నుంచి మార్కెట్ రికవరీ బాటలో ప్రయాణిస్తుండడంతో మరో 11 ఏళ్లపాటు రియల్ ఎస్టేట్ మార్కెట్ బాగుంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గడిచిన ఏడాది ఎన్ఎస్ఈ నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ 40 శాతం పెరగడం, ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ డీఎల్ఎఫ్ షేరు 43 శాతం పెరగడం దీనికి నిదర్శనమంటున్నాయి. ఇప్పటికే వడ్డీ రేట్లు గరిష్ట స్థాయికి చేరుకున్నాయని, రానున్న కాలంలో వడ్డీరేట్లు తగ్గే అవకాశం ఉండడంతో సొంతింటి అమ్మకాలు పెరుగుతాయంటున్నారు.



నా మాట విని నన్ను పంపినవాని యందు విశ్వాసముంచువాడు నిత్య జీవము గలవాడు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం,
తిథి: శు.దశమి రా.2.47 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** హస్త ఉ.10.10 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.6.58 నుండి 8.43 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.48 నుండి 5.41 వరకు, **అమృతఘడియలు:** తె.5.31 నుండి 7.16 వరకు(తెల్లవారితే సోమవారం).

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

నరేంద్ర మోదీ (ప్రధాని) రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఇటలీ నుంచి వచ్చినప్పట్నుంచీ కాస్త అలసటగా అనిపిస్తోంది. అతిథిగా వెళ్లిన నాకే ఇలా అనిపిస్తుంటే, జి–7 సభ్య దేశాలకు గొప్ప ఆతిథ్యం ఇచ్చిన జార్జియా మెలోనీని ఏమనుకోవాలి?!

ఇటలీ తొలి మహిళా ప్రధాని మెలోనీ. చలాకీగా, నవ్వుతూ ఉంటారు. గత డిసెంబరులో క్లైమేట్ సదస్సుకు దుబాయ్ వెళ్లినప్పుడు ఆమె నాతో కలిసి సెల్ఫీ తీసుకుని ఆ సెల్ఫీకి మెలోడి (మెలోని + మోడీ) అని హ్యాష్‌ట్యాగ్ ఇచ్చి 'గుడ్ ఫ్రెండ్స్' అనే క్యాప్షన్‌తో ఆ ఫొటోను ట్విట్టర్‌లో పోస్ట్ చేయడం నాకొక మరపురాని అనుభూతి. ఈసారి కూడా అలాగే సెల్ఫీ తీసుకుని 'హాయ్ ఫ్రెండ్స్'... ఫ్రమ్ 'మెలోడీ' అనే హ్యాష్‌ట్యాగ్‌తో వీడియోను ట్వీట్ చేశారు.

ప్రధానిగా మొన్న మూడోసారి ప్రమాణ స్వీకారం చేశాక నేను తొలిసారి వెళ్లి వచ్చిన దేశం ఇటలీనే! తిరిగి జూలైలో ఖజక్‌స్తాన్, సెప్టెంబర్‌లో థాయ్‌లాండ్, అక్టోబర్‌లో రష్యా, నవంబర్‌లో బ్రెజిల్ పర్యటనలు ఉన్నాయి.



ఐరాస సదస్సు కోసం న్యూయార్క్ వెళ్లవలసి రావచ్చు. ఇంకా ఈ ఏడాదిలోనే జపాన్, ఆఫ్రికా ప్రయాణాలు కూడా ఉన్నాయి.

నిజానికి ప్రయాణాలు అలసటను ఇవ్వవు. ప్రయాణం చేసి వచ్చాక, ఇక రోజంతా ఇక్కడ ఈ ఇష్టం లేని సంకీర్ణ బంధాలతో పెనవేసుకుని ప్రయాణించాలన్న భావనే నా అలసటకు కారణం అనుకుంటాను.

బంధాలు అవసరమే. ఒకరి మీద ఒకరు ఆధారపడి ఉన్నప్పుడే బంధాలు నిలుస్తాయి. కానీ బంధం నిలుపుకోవడం కోసమే ఒకరిపై ఆధారపడవలసి రావటం అన్నది మాత్రం నిస్సహాయమైన పరిస్థితి. ఈ పరిస్థితి నాకు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న పన్నెండున్నరేళ్లలో ఎదురవలేదు. ఇప్పుడు ప్రధానిగా మూడోసారి కొనసాగేందుకు ఎదురవుతుందనీ అనుకోలేదు.

నడిచేందుకు, నిలుచునేందుకు, కూర్చునేందుకు, కూర్చుని లేచేందుకు రెండు కాళ్లూ నేలను తాకాలి. రెండిట్లో ఒక కాలు నేలనంటక పోయినా చేతుల కిందకు కర్రలు వస్తాయి. అలా నాకిప్పుడు ఏపీ, బిహార్ అటొకటి, ఇటొకటిగా రెండు చేతికర్రలయ్యాయి. దేశాన్ని నడిపేది బీజేపీ అయినా, ఇకపై బీజేపీని నడిపించేది మాత్రం టీడీపీ, జేడీ(యు)లేనా అనే ఆలోచన నాకు అలసటను తెప్పిస్తున్నట్లుంది !!

మన మీద ఆధారపడిన వాళ్లు మనకు భారంగా అనిపించటం సహజమే. మనం ఆధారపడిన వాళ్లు కూడా మనకు భారంగా అనిపించటం అనే అసహజం మాత్రం ఒక్క రాజకీయాల్లో కావచ్చు !

ప్రజాతీర్పు కొన్నిసార్లు భలే చిత్రంగా ఉంటుంది. ఎవర్ని ఎవరి మీద ఆధారపడేలా చేస్తుందో తెలియని విధంగా ఉంటుంది.

కేంద్రంలో మెజారిటీకి తక్కువ పడిన సీట్లు 32. యూపీలో బీజేపీకి మునుపటి కన్నా తగ్గిన సీట్లు 29. అక్కడ తగ్గకుండా ఉంటే ఇక్కడ బీజేపీ ఇప్పుడు ఆధారం కోసం ఏపీ వైపో, బిహార్ వైపో చూడవలసి వచ్చేదే కాదు.

"యూపీలో ఎందుకిలా జరిగింది అమిత్ జీ?" అన్నాను. ఆయన పక్కనే జె.పి. నడ్డా ఉన్నారు. ఆ పక్కనే రాజ్‌నాథ్ సింగ్ ఉన్నారు.

"అయోధ్య ఏమంత ప్రభావం చూపినట్లు లేదు మోదీజీ..." అన్నారు అమిత్.

"మీరేమంటారు నడ్డాజీ?" అన్నాను.

"యూపీలో సీట్లు మనం పోగొట్టుకోవలసినవి కాదు మోదీజీ. యోగి బాగానే కష్టపడ్డారు. అయినా సీట్లు తగ్గాయి..." అన్నారు నడ్డా.

"యోగి కష్టపడినా సీట్లు తగ్గాయంటే, యోగి కంటే ఎక్కువగా ఇంకెవరైనా కష్టపడి ఉంటారా..." అన్నారు రాజ్‌నాథ్ సింగ్!


నవ్వాన్నేను.

"మనకెందుకు సీట్లు తగ్గాయి అనే ప్రశ్నకు... వాళ్లకెందుకు సీట్లు పెరిగాయన్న దాంట్లో సమాధానం ఉందంటున్నారా రాజ్‌నాథ్‌జీ..." అన్నాను.

ఆ మాటకు అంతా నవ్వారు.

నా అలసట కాస్త తగ్గినట్లనిపించింది.

రెడ్‌బుక్ రాజ్యాంగం చెల్లదు!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



ఇండోనేషియాలో లక్షలాదిమందిని ఊచకోత కోసిన సుహార్తో పాలన ఆదర్శంగా కనిపిస్తున్నదా? కాంబోడియాలో నెత్తుటేరులు పారించిన పోల్‌పాట్ మీకు రోల్‌మోడల్‌గా కనిపిస్తున్నాడా? చిలీ ప్రజల ప్రాథమిక హక్కులను తొక్కిపారేసిన ఆగస్టో పినోచెట్ ఉక్కుపాదం మీద మోజుపుట్టిందా? మరెందుకు మీ చేతిలోని ఆ రెడ్ బుక్? ఆ పుస్తకానికి హోర్డింగులెందుకూ... హారతులెందుకు?

ఏముందా రెడ్‌బుక్‌లో? మీ విధానాలను బలంగా విరోధించే మీ రాజకీయ ప్రత్యర్థుల పేర్లు, మీ విమర్శకుల పేర్లు, మీ అభీష్టానికి అనుగుణంగా వ్యవహరించని అధికారుల పేర్లు... అంతేగా! ఎన్నికలకు ముందు లోకేశ్‌బాబు జారీ చేసిన హెచ్చరికల తాత్పర్యం ఇదే కదా! ఒక ప్రమాణపూర్వక ప్రతీకార పాత్తానికి వీరపూజలు చేయడం ప్రజాస్వామ్యంలో చెల్లుబాటవుతుందా? ఇటువంటి చర్యల వలన రాజ్యాంగబద్ధ పరిపాలనకు ప్రమాదం దాపురించదా? రాజ్యాంగబద్ధమైన పరిపాలన విఫలమైతే ఏం చేయాలనే విరుగుడు మంత్రం కూడా మన రాజ్యాంగంలో ఉన్న సంగతి తమకు తెలియనిదా?

బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏలో షరీకైన దగ్గర్నుంచీ తెలుగుదేశం శ్రేణులు చెలరేగిపోతున్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. ఎన్డీఏ విధేయ ఎన్నికల సంఘం ఆసరాతో పాలనా యంత్రాంగంపై పట్టు బిగించిన ఆ పార్టీ శ్రేణులు యథేచ్ఛగా ప్రవర్తించిన తీరు కూడా తేటతెల్లమైంది. ఆంధ్రప్రదేశ్ పోలింగ్‌కు ముందు మూడు దశల ఎన్నికలు దేశవ్యాప్తంగా జరిగాయి. అప్పటికే ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర వంటి అతి పెద్ద రాష్ట్రాల ప్రజానాడి కూటమి పెద్దలకు అర్థమైపోయింది. రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి బలమైన బీజేపీ స్థావరాల్లో దాదాపుగా పోలింగ్ ఘట్టం పూర్తయింది. అయినా కనాకష్టంగానే ఎన్డీఏ హాఫ్ మార్క్‌ను దాటగలుగుతున్నదని నేతలకు రూఢీ అయింది.

ఫలితాలు కూడా వారి అంచనాలకు తగినట్టుగానే వచ్చాయి. మూడు దశల్లోని 285 స్థానాల్లో ఎన్డీఏ 150 మార్క్‌ను దాటలేదు. మిగిలిన నాలుగు దశలు ఎన్డీఏ దశను మార్చాలి. మిగిలిన దశలు అంతగా అనుకూల ప్రాంతాలు కానప్పటికీ కూటమి గట్టెక్కగలిగింది. కానీ మాయమైపోయిన 20 లక్షల ఈవీఎమ్‌ల గురించి స్పష్టమైన సమాధానం ఇప్పటివరకూ రాలేదు. 140 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు ఎక్కువ సంఖ్యలో ఎందుకున్నాయనే సందేహాన్ని తీర్చే నాథుడు కనిపించడం లేదు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కూటమి ఇచ్చిన జాబితా ప్రకారం ఎన్నికల సంఘం అధికారుల బదిలీలు ఎందుకు చేసిందో అర్థం కాలేదు.

అధికార యంత్రాంగాన్ని కూటమి గుప్పెట్లోకి తీసుకోవడానికీ, తమ కంచుకోటల్లో సైతం వైసీపీ అభ్యర్థులు ఓడిపోవడానికీ మధ్యన గల సంబంధం ఏమిటో తేలవలసి ఉన్నది. ఈ అంశంపై లోతైన అధ్యయనం జరగాలి. ఈలోగా రెడ్‌బుక్ స్ఫూర్తితో రాష్ట్రంలో మొదలైన బీభత్స పాలన ఫలితంగా అటువంటి అధ్యయనాలు ఇంకా టేకాఫ్ కాలేదు. కానీ ఆలస్యమైనా అవి జరుగుతాయి. నిజానిజాలను నిగ్గుతేలుస్తాయి. భవిష్యత్తు రాజకీయాలకు పాఠాలను అందజేస్తాయి.

ఫలితాలను ప్రకటించి పది రోజులు దాటింది. అయినా రెడ్‌బుక్ బీభత్స పాలన తగ్గుముఖం పట్టలేదు. ఇళ్లపైనా, కార్యాలయాలపైనా దాడులు జరిగినా, ప్రత్యర్థులను చితక్కొట్టినా, అర్ధనగ్నంగా మార్చి కాళ్లు పట్టించుకుంటున్నా పోలీసులు ఫిర్యాదులు స్వీకరించడం లేదు. ఇకముందు కూడా రెడ్‌బుక్ రాజ్యాంగమే అమలు కానుందా అనే అనుమానాలకు సాక్షాత్తూ ఉన్నతస్థాయిలోని వారే ఊతమిస్తున్నారు. 1970వ దశకం నాటి బెంగాల్ రాజకీయ పరిణామాలను నేటి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు గుర్తుకు తెస్తున్నాయి.

1972లో జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు బూటకపు ఎన్నికల పేరుతో ప్రచారంలోకి వచ్చాయి. పోలీసుల సహకారంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఇష్టారాజ్యంగా బూత్‌లను ఆక్రమించి రిగ్గింగ్ చేసుకున్నారు. కౌంటింగ్ ప్రక్రియలోనూ అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. ఓటమెరుగని జ్యోతిబసు సైతం ఓడిపోయినట్టు ప్రకటించారు. కేవలం 14 మంది మాత్రమే సీపీఎం నుంచి గెలిచినట్టు లెక్క తేల్చారు. దీంతో ఐదేళ్లపాటు ఆ పార్టీ అసెంబ్లీని బహిష్కరించింది. ఈ ఐదేళ్లలో సిద్ధార్థ శంకర్‌రే ప్రభుత్వం ప్రతిపక్షాల అణచివేతకు తెగబడని దాష్టీకం లేదు. ఇప్పటి మాదిరిగా రెడ్‌బుక్‌ను పూజించలేదు కానీ

మాయమైపోయిన 20 లక్షల ఈవీఎమ్‌ల గురించి స్పష్టమైన సమాధానం ఇప్పటివరకూ రాలేదు. 140 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు ఎక్కువ సంఖ్యలో ఎందుకున్నాయనే సందేహాన్ని తీర్చే నాథుడు కనిపించడం లేదు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కూటమి ఇచ్చిన జాబితా ప్రకారం ఎన్నికల సంఘం అధికారుల బదిలీలు ఎందుకు చేసిందో అర్థం కాలేదు.
అధికార యంత్రాంగాన్ని కూటమి గుప్పెట్లోకి తీసుకోవడానికీ, తమ కంచుకోటల్లో సైతం వైసీపీ అభ్యర్థులు ఓడిపోవడానికి మధ్యన గల సంబంధం ఏమిటో తేలవలసి ఉన్నది. ఈ అంశంపై లోతైన అధ్యయనం జరగాలి. ఈలోగా రెడ్‌బుక్ స్ఫూర్తితో రాష్ట్రంలో మొదలైన బీభత్స పాలన ఫలితంగా అటువంటి అధ్యయనాలు ఇంకా టేకాఫ్ కాలేదు. కానీ ఆలస్యమైనా అవి జరుగుతాయి. నిజానిజాలను నిగ్గుతేలుస్తాయి. భవిష్యత్తు రాజకీయాలకు పాఠాలను అందజేస్తాయి. ఫలితాలను ప్రకటించి పది రోజులు దాటింది. అయినా రెడ్‌బుక్ బీభత్సపాలన తగ్గుముఖం పట్టలేదు. ఇళ్లపైనా, కార్యాలయాలపైనా దాడులు జరిగినా, ప్రత్యర్థులను చితక్కొట్టినా, అర్ధనగ్నంగా మార్చి కాళ్లు పట్టించుకుంటున్నా పోలీసులు ఫిర్యాదులు స్వీకరించడం లేదు. ఇకముందు కూడా రెడ్‌బుక్ రాజ్యాంగమే అమలు కానుందా అనే అనుమానాలకు సాక్షాత్తూ ఉన్నతస్థాయిలోని వారే ఊతమిస్తున్నారు.

ఇదే తరహా బీభత్స పాలనను ఐదేళ్లు కొనసాగించారు. పాలక పార్టీ ఫలితాన్ని అనుభవించింది. 1977లో దారుణంగా ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ బెంగాల్‌లో ఇప్పటి దాకా కోలుకోనేలేదు.

హింసాకాండతో, భయోత్పాతాలు సృష్టించడం ద్వారా ప్రత్యర్థులను కట్టడి చేయవచ్చనుకునే పాలకులు ఇటువంటి అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవడం అవసరం. కానీ అటువంటి లక్షణాలైతే ఈ పది రోజుల్లో కనిపించలేదు. దేశంలోనే సీనియర్ రాజకీయవేత్తల్లో ఒకరైన చంద్రబాబుకు సుదీర్ఘమైన రాజకీయ, పాలనా అనుభవం ఉన్నది. కానీ, గడచిన రెండు మూడు రోజులుగా ఆయన అధికార యంత్రాంగంపై చేస్తున్న వ్యాఖ్యలు, చేపడుతున్న చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారుల మీద, ఉద్యోగుల మీద ఆయన రాజకీయ ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌లో నేరస్థుల ఫోటోలు పెట్టినట్టుగా శనివారం నాటి 'ఈనాడు' పత్రికలో ఓ పదిహేనుమంది డీఎస్పీల ఫోటోలను వేశారు. వారి వ్యక్తిత్వాన్ని హననం చేసే విధమైన రాతలు రాశారు. ఉద్యోగుల పనితీరును మదింపు చేయవలసింది ఎవరు? 'ఈనాడు'కు ఈ బాధ్యతను ఎవరు అప్పగించారు? ఇలా ప్రతిరోజూ 'ఈనాడు'లో ఓ జాబితా రావడం, దానిపై చర్యలకు పూనుకోవడం జరుగుతుందనుకోవాలా? ఈ విధంగా రాజ్యాంగ, రాజ్యాంగేతర వ్యవస్థలు హద్దులు మీరి వ్యవహారాలు నడిపితే పరిపాలన గాడి తప్పదా? ఆదిలోనే గాడి తప్పుతున్న సూచనలు కనిపించడం శుభసంకేతమైతే కాదు.

ఎన్డీఏ కూటమికి పెద్దన్నగా ఉన్న బీజేపీకి గానీ, దాని మాతృసంస్థ ఆరెస్సెస్‌కు గానీ భారత రాజ్యాంగం పట్ల అంతగా విశ్వాసం లేదన్న అభిప్రాయం ఉన్నది. ముఖ్యంగా రాజ్యాంగ పీఠికలోని 'సెక్యులర్', 'సోషలిస్టు' పదాలను తొలగించాలన్న తహతహ వారిలో ఉండవచ్చు. మూడింట రెండొంతుల మెజారిటీ కోసం బీజేపీ వెంపర్లాడింది కూడా రాజ్యాంగ సవరణ కోసమేననే వాదన కూడా ఉన్నది. బీజేపీ భావజాలానికి చంద్రబాబు సహజ మిత్రుడని భావించవలసి ఉంటుంది. ఎందుకంటే ఎన్టీఆర్ మరణం తర్వాత టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడు సార్లూ చంద్రబాబు కాషాయ పార్టీ సహకారంతోనే నెగ్గుకొచ్చారు. బీజేపీ 'మ్యాజిక్' తోడవకుండా ఎన్నికల్లో గెలిచిన రికార్డు ఆయనకు లేదు.

వైఎస్ జగన్ ప్రభుత్వం కోనసీమ జిల్లాకు రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్ బాబాసాహెబ్ అంబేడ్కర్ పేరును పెట్టినప్పుడు కొన్ని శక్తులు పెద్ద ఎత్తున అల్లర్లకు పాల్పడ్డాయి. ఈ శక్తులకు తోడ్పాటును అందించిన రాజకీయ రూపాలేమిటనేది స్థానిక ప్రజలందరికీ తెలిసిన విషయమే. రాజ్యాంగ రచయిత మీద వీరికి ఉన్న వ్యతిరేకత రాజ్యాంగం మీద ఏమేరకున్నదో తెలియవలసి ఉన్నది. బీజేపీ కోరుకుంటున్నట్టుగా పీఠికలోని సెక్యులర్, సోషలిజం అనే రెండు పదాలను తొలగించినా కూడా మొత్తం రాజ్యాంగ స్వభావంలోంచి వాటి స్ఫూర్తిని తొలగించడం సాధ్యం కాదు. ఎటువంటి వివక్ష లేని స్వేచ్ఛ, సమానత్వాలకు, సమాన అవకాశాలకు రాజ్యాంగం పూచీపడుతున్నది. సమాన అవకాశాలను వినియోగించుకోగలిగే స్థాయికి వెనుకబడిన శ్రేణులను ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేయాలని కూడా ప్రభుత్వాలను రాజ్యాంగం ఆదేశిస్తున్నది.

ఈ శతాబ్దంలోని ఆధిపత్య రాజకీయ వ్యవస్థలకూ, మన రాజ్యాంగం స్ఫూర్తికీ మధ్యన సైద్ధాంతిక విభేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పుడున్న ఆధిపత్య రాజకీయపక్షాల్లో ఎక్కువ భాగం 'ట్రికిల్ డౌన్' ఆర్థిక విధానాలను అవలంబిస్తున్నవే. ఈ విధానాలను ఔదలదాల్చడంలో ఛాంపియన్ నెంబర్‌వన్ బీజేపీ, ఛాంపియన్ నెంబర్ టూ టీడీపీ. అందుకే ఇవి రెండూ సహజ మిత్రపక్షాలు. పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలు, మెగా రిచ్ వ్యక్తుల అనుకూల విధానాలను ట్రికిల్ డౌన్ ఎకనామిక్స్ ప్రోత్సహిస్తుంది. వీరు ఖర్చు చేయడం ద్వారా అంటే పెట్టుబడులు పెట్టడం ద్వారా అంతో ఇంతో బతుకుతెరువు అడుగు వర్గాలకు కూడా లభిస్తుంది. ఆ విధంగా ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది.

సంపన్నులు పెట్టుబడులు పెట్టడం కోసం సహజ వనరులను వారి పరం చేయాలి. వారికి శ్రమ శక్తి చౌకగా లభించాలి. వ్యవసాయ రంగం లాభసాటిగా ఉంటే అది సాధ్యం కాదు. విద్య, వైద్య రంగాల్లో కూడా ప్రైవేట్ పెట్టుబడులకే పెద్దపీట వేయాలి. విద్య ప్రభుత్వ బాధ్యత కాదని స్వయంగా చంద్రబాబు చేసిన ప్రకటనలే మన ముందున్నాయి. ప్రైవేట్ విద్యావ్యవస్థలో నాణ్యమైన చదువు సంపన్న శ్రేణికి మాత్రమే లభిస్తుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ రకమైన ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచే పార్టీలు పేదలకోసం కొన్ని సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేస్తాయి. కానీ, అవి సాధికారతకు బాటలు వేసే చర్యలు మాత్రం కాదు.

రాజ్యాంగ లక్ష్యాలను అందుకోవడానికి ఎంపవర్‌మెంట్ ఎకనామిక్స్ అవసరమవుతాయి. వ్యక్తులను సాధికార శక్తులుగా మలచడంతో పాటు వారిలో ఆత్మగౌరవాన్ని ఉద్దీపింపజేయడానికి ఈ విధానాలు అవసరం. అయితే సమాజంలోని ఆధిపత్య వర్గాలు ఈ విధానాలను వ్యతిరేకిస్తాయి. వీటిని ప్రబోధించే రాజకీయ శక్తులను నిరోధిస్తాయి. ఏపీలో జరిగిన ఎన్నికలను ఈ నేపథ్యంలోంచి కూడా పరిశీలించాలి. ఈ విధానాల ఘర్షణను ప్రజలకు వివరించి చెప్పడం అంత సులభసాధ్యమేమీ కాదు. అనేక సామాజిక – సాంస్కృతిక సంక్లిష్టతల కారణంగా నిట్టనిలువునా వర్గ విభజన చేయడం కూడా కష్టమైన పని.

నెలకు రెండు లక్షలు సంపాదించేవాడూ, నెలకు పదివేలు సంపాదించేవాడూ కూడా మన దగ్గర మధ్యతరగతిగానే చలామణీ కావడానికి ఇష్టపడతారు. పదివేలవాడు పేదవాడిగా ఒప్పుకోడు. పేదరికం అంటే కూటికి లేకపోవడమనే అభిప్రాయం నుంచి మనం ఇంకా బయటపడలేదు. నాణ్యమైన విద్య దొరక్కపోవడం పేదరికం, సమాన అవకాశాలు లభించకపోవడం పేదరికం, హస్తిమశకాంతరం పెరిగిన ఆర్థిక వ్యత్యాసాల్లో అడుగుభాగాన నిలవడం పేదరికం, కోరుకున్న జీవన గమనాన్ని సాధించుకోలేకపోవడం పేదరికమనే స్పృహ మనకింకా రాలేదు.

వెనుకబడిన వర్గాలుగా గుర్తింపు పొందిన వారిలోని క్రీమీ లేయర్ కూడా తన సాటి సామాజిక శక్తులతో జతకూడటానికి బదులు సవర్ణ హిందూ సమాజంతో స్నేహం చేయడాన్నే గౌరవంగా భావించుకుంటారు. గ్రామాల్లో పదిహేనెకరాలున్న ఆసామి కూడా జీవన ప్రమాణాల రీత్యా పేదవాడికిందే లెక్క. కానీ, తన సామాజిక స్థానం దృష్ట్యా తనను తాను పెత్తందారుగా భావించుకునే విచిత్ర పరిస్థితి ఉన్నది. ఈ సంక్లిష్టతలను ఆధిపత్య వర్గాలు తమ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నాయి.

కానీ పరిపాలనా ప్రాథమ్యాల వల్ల అనుభవ పూర్వకంగా మిత్రుడెవరో శత్రువెవరో జనం తెలుసుకుంటారు. అన్ని కులాలు, మతాల్లోని ప్రజలంతా తాము పోగొట్టుకున్నదేమిటో గ్రహిస్తారు. ఈ గ్రహింపే సాధికారతను కోరుకునే ప్రజలందరినీ ఏకం చేస్తుంది. సిద్ధాంతరీత్యా, విధానాల రీత్యా చంద్రబాబు ప్రభుత్వం ప్రజా సాధికారతకు వ్యతిరేకం. కనుక సాధికారతా శక్తులు బలపడకుండా అది బలప్రయోగానికి దిగుతూనే ఉంటుంది. రెడ్‌బుక్‌తో బెదిరిస్తూనే ఉంటుంది. కానీ అణచివేతలు, భయోత్పాతాలు అంతిమ విజయాలు సాధించిన దాఖలాలు లేవు. రెడ్‌బుక్ రాజ్యాంగం చెల్లదు.

vardhelli1959@gmail.com



Elon Musk
@elonmusk
Subscribe
We should eliminate electronic voting machines. The risk of being hacked by humans or AI, while small, is still too high.

Robert F. Kennedy Jr @RobertKen... · 13h
Puerto Rico's primary elections just experienced hundreds of voting irregularities related to electronic voting machines, according to the Associated Press.

19:28 · 15 Jun 24 · 20.7M Views

ఈవీఎమ్‌లను నిషేధించాలి!
– ఎలాన్ మస్క్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పూర్తిగా నిషేధించాలని వ్యాపార దిగ్గజం ఎలాన్ మస్క్ సైతం అభిప్రాయపడ్డారు. సామాజిక వేదిక 'ఎక్స్'లో ఆ మాట ఆయన నిర్ద్వంద్వంగా తేల్చేశారు. "ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తొలగించాలి. ఎందుకంటే, మనుషులతోనో, కృత్రిమమేధ (ఏఐ) సాయంతోనో యంత్రాలను హ్యాక్ చేసే ప్రమాదం చిన్నదే అయినా, చాలా ఎక్కువ ఉంది" అని ఆయన పేర్కొన్నారు. యునైటెడ్ స్టేట్స్‌లో చేరనప్పటికీ దాని ప్రాదేశిక ప్రాంతంగా గుర్తింపు పొందిన కరేబియన్ ద్వీపం ప్యూర్టో రికోలో ఇటీవలి ప్రైమరీ ఎన్నికలు రచ్చ రేపాయి. అక్కడ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు అండగా వందలకొద్దీ అవకతవకలు జరిగినట్టు తాజా కథనం. ఈ నేపథ్యంలో మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్ష పదవికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాబర్ట్ ఎఫ్ కెనడీ జూనియర్ (హత్యకు గురైన అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ సోదరుడి కుమారుడు) "తాము వేసిన ప్రతి ఓటూ లెక్కలోకి వస్తోందనీ, ఎన్నికలు హ్యాకింగ్‌కు గురి కాలేదనీ నిర్ధారించుకొనే హక్కు ప్రతి అమెరికా పౌరుడికీ ఉంది" అని పేర్కొన్నారు. దాన్ని మస్క్ పూర్తిగా సమర్థించారు. కెనడీ జూనియర్ ట్వీట్‌ను ప్రస్తావిస్తూ, ఈవీఎమ్‌ల నిషేధానికి పిలుపునిచ్చారు. మన దేశంలోనూ ఈవీఎంల అదృశ్యం సహా అనేక మాటలు వినిపిస్తున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు గమనార్హం.

సమాజానికి ఎదురీదిన తొలి వైద్యురాలు



డా॥ నాగసూరి వేణుగోపాల్

ఆధునిక భారతదేశంలో పాశ్చాత్య వైద్య శాస్త్రపు పట్టా పొంది, ప్రాక్టీస్ చేసి, విజయం సాధించిన తొలి భారతీయ మహిళ కాదంబినీ బోస్ గంగూలీ. వీరు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సమావేశాల్లో మాట్లాడిన తొలి మహిళ కూడా! అమెరికన్ చరిత్రకారుడు డేవిడ్ కోఫ్ ప్రకారం... కాదంబినీ గంగూలీ చాలా ఆధునికంగా ఆలోచించిన, తొలి తరం బ్రహ్మ సమాజపు భారతీయ మహిళ.

భారతదేశానికి సంబంధించి మహిళల తొలి సంస్థ 'భాగల్పూర్ మహిళా సమితి'ని ప్రారంభించినవారిలో ఒకరైన బ్రజా కిషోర్ బసుకు కాదంబిని 1861 జూలై 18న జన్మించారు. తండ్రి ప్రోత్సాహంతో కాదంబిని ఢాకాలోని బ్రహ్మో ఈడెన్ ఫీమేల్ స్కూల్, అటు తర్వాత కలకత్తాలోని హిందూ మహిళా విద్యాలయలో చదువుకున్నారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో 1879లో విద్యార్థినులకు ప్రవేశం కల్పించగా, మరుసటి సంవత్సరం కలకత్తా విశ్వవిద్యాలయంలో మహిళా విద్యార్థులకు డిగ్రీ చదువుకు అవకాశం లభించింది. అలా భారతదేశంలో పట్టభద్రులైన తొలి ఇద్దరు మహిళల్లో ఒకరు కాదంబినీ గంగూలీ కాగా, మరొకరు చంద్రముఖీ బసు.


డిగ్రీ చదువు పూర్తి అయ్యాక 1883 జూన్ నెలలో ద్వారకానాథ్ గంగూలీతో కాదంబిని వివాహమైంది. ద్వారకానాథ్ మనదేశంలో మహిళల కోసం తొలి పత్రిక 'అబలా బంధోబ్'ను నిర్వహించిన అభ్యుదయవాది. బహుభార్యాత్వానికి, అంధ విశ్వాసాలకు, పరదా పద్ధతికి, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి. ద్వారకానాథ్ గంగూలీ తొలి భార్యను కోల్పోయిన తర్వాత, కాదంబినిని వివాహమాడారు. వారిద్దరి మధ్య 20 ఏళ్ల వయసు తేడా ఉంది. ద్వారకానాథ్ పోరాడిన తర్వాత కానీ కాదంబినికి కలకత్తా మెడికల్ కళాశాలలో ప్రవేశం లభించలేదు. దాంతో కాదంబినీ గంగూలీ భారతీయ విశ్వ విద్యాలయపు వైద్యవిద్యలో ప్రవేశించిన తొలి మహిళ అయ్యారు.

విద్యాలయాల్లో మహిళల ప్రవేశం గురించి చాలామంది వ్యతిరేకిస్తూ కూడా పోరాడారు. అలాంటి వారిలో ఆ విశ్వవిద్యాలయపు ప్రొఫెసర్ ఆర్‌సీ చంద్ర కూడా ఉన్నారు. కనుకనే కాదంబినీ గంగూలిని ప్రాక్టికల్ ఎగ్జామ్‌లో ఫెయిల్ చేయగా బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్ పట్టా లభించలేదు. వివక్ష ఆ స్థాయిలో ఉండేది. నెలకు 20 రూపాయల చొప్పున ఉపకార వేతనం కాదంబినీ గంగూలికి జారీ చేసి, 1883 నుంచి ఒకేసారి పెద్ద మొత్తం ఇచ్చారు. దాంతో భర్త ప్రోత్సాహంతో 1892లో ఇంగ్లాండ్ వెళ్లి ఎడిన్‌బరో నుంచి ఎల్ఆర్‌సీ (లైసెన్షియేట్ ఆఫ్ రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజిషియన్స్), గ్లాస్కో నుంచి ఎల్ఆర్‌సీ ఎస్ (లైసెన్షియేట్ ఆఫ్ ది రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్), ఇంకా డబ్లిన్ నుంచి జీఎఫ్‌పీఎస్ పట్టాలు పొందారు. భారతదేశం తిరిగి వచ్చిన తర్వాత కలకత్తాలోని లేడీ డఫ్రిన్ హాస్పిటల్‌లో నెలకు 300 రూపాయల జీతంతో ప్రసూతి శాస్త్రం, గైనకాలజీ విభాగాలలో సేవలందించారు.

డాక్టర్ వృత్తిలో బిజీగా ఉన్నా పిల్లలను శ్రద్ధగా పెంచారు. ఆమె కుమార్తె జ్యోతిర్మయి స్వాతంత్ర్య సమరయోధురాలు కాగా, కుమారుడు ప్రభాత్ చంద్ర జర్నలిస్టుగా తండ్రి నడిపిన 'అబలా బంధోబ్' పత్రికలో గొప్పగా రాణించారు. ఆమె సవతి కూతురు మనవడే ప్రఖ్యాత చలనచిత్ర దర్శకుడు సత్యజిత్ రే!

ఆగ్నేయాసియాలోనే యూరోపియన్ వైద్యశాస్త్రాన్ని అభ్యసించి, పట్టా పొంది, ప్రాక్టీస్ చేసిన తొలి మహిళ కాదంబినీ గంగూలీ. ఇంగ్లండ్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత కాదంబిని మహిళల హక్కులకు సంబంధించి విశేషంగా పోరాడారు కనుకనే ఆనాటి సమాజం నుంచి చాలా తీవ్రమైన విమర్శలు ఎదుర్కొన్నారు. 'బంగభాషి' అనే పత్రిక 'కులట' అంటూ ఆమెను పరోక్షంగా విమర్శించే దాకా వెళ్ళింది. అయితే భర్త ద్వారకానాథ్ పోరాడి ఆ పత్రికా సంపాదకుడు మహేష్ పాల్‌ను కోర్టుకీడ్చి ఆరు నెలల పాటు జైలు శిక్ష అనుభవించేలా విజయం సాధించారు.

వైజ్ఞానిక వేగుచుక్కలు



కాదంబినీ బోస్ గంగూలీ

అరవై రెండేళ్ల వయసులో 1923 అక్టోబర్ 3వ తేదీన కన్నుమూసిన కాదంబినీ గంగూలీ నేటికీ భారతీయ మహిళా లోకానికే కాదు, అందరికీ ప్రాతఃస్మరణీయులు. కనుకనే ఇటీవల అంటే 2020లో 'స్టార్ జల్సా'లో వచ్చిన 'ప్రోతోమా కాదంబిని' అనే బెంగాలీ టెలివిజన్ సీరియల్; జీ బంగ్లాలో 'కాదంబిని' అనే బెంగాలీ సిరీస్ చాలా ప్రజాదరణ పొందాయి.

వ్యాసకర్త ఆకాశవాణి విశ్రాంత అధికారి
9440732392

భూ సంరక్షణే మార్గం

నేడు ఎడారీకరణ, భూమి క్షీణత, కరవులు అత్యంత ప్రధానమైన పర్యావరణ సవాళ్లు అని చెప్పవచ్చు. ప్రపంచవ్యాప్తంగా మొత్తం భూభాగంలో 40 శాతం వరకు ఇప్పటికే క్షీణించినట్లు సర్వేలు చెబుతున్నాయి. ఒక ప్రాంతంలోని ఎడారీకరణ, కరవు బలవంతపు వలసలకు దారితీస్తాయి. వీటి వలన ప్రతి సంవత్సరం పది లక్షల ప్రజలు స్థాన భ్రంశం చెందే ప్రమాదం ఉందని నిపుణుల హెచ్చరిక. భూమి మానవుని సామాజిక, ఆర్థిక కార్యకలాపాలకు అత్యంత ఆధారభూతమైనది. ప్రస్తుతం అభివృద్ధి పేరుతో జరుగుతున్న మానవ కార్యకలాపాలు సహజ వనరుల విధ్వంసానికి కారణమవుతున్నాయి. తద్వారా జరిగే పర్యావరణ మార్పుల వల్ల భూమి ఎడారిగా రూపాంతరం చెంది కరవుకు దారి తీస్తోంది. దీని పట్ల ప్రజలకు అవగాహన కలిగించి, వారి వైఖరిలో మార్పు తీసుకురావడానికి 1995వ సంవత్సరం ఐక్యరాజ్యసమితి ఎడారీకరణ, కరవుపై పోరాట దినోత్సవానికి శ్రీకారం చుట్టింది. ఈ సంవత్సరం 'యునైట్ ఫర్ లాండ్, అవర్ లెగసీ, అవర్ ఫ్యూచర్' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఎడారీకరణ, భూ క్షీణతలకు గల కారణాలను పరిశీలిస్తే... మానవ జనిత కారణాలైన జనాభా విస్ఫోటం, అశాస్త్రీయ వ్యవసాయ కార్యక్రమాలు, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, గనుల తవ్వకం, అటవీ నిర్మూలన వంటివాటితో నేలపై ఒత్తిడి పెరుగుతోంది. అదేవిధంగా ప్రకృతి విపత్తులైన కరవులు, వరదలతో నేల నిస్సారంగా మారి ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇది అంతిమంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, పర్యావరణ సమస్యలకు దారి తీస్తోంది.

ఈ నేపథ్యంలో సమర్థమైన భూ నిర్వహణకు మెరుగైన ప్రణాళికలు రూపొందించి అమలు పరచాలి. వ్యవసాయ భూమి గట్లపై చెట్లను నాటి నేల కోతను అరికట్టాలి. విరివిగా ఖాళీ భూముల్లో మొక్కలు నాటి వాతావరణ మార్పులను అరికట్టాలి. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా పర్యావరణ హిత చర్యలు చేపట్టి భూ క్షీణతకు అడ్డుకట్ట వేయాలి. రసాయన ఎరువుల స్థానంలో జీవ ఎరువులను వినియోగించాలి. పంటల మార్పిడి విధానాలను పాటించాలి. ఉపగ్రహ సేవల ద్వారా శాస్త్రీయ భూమి నిర్వహణ చర్యలు చేపట్టాలి. నిరుపయోగమైన భూములనే పరిశ్రమలకు కేటాయించాలి. అప్పుడే భూమి మానవాళికి రక్షణగా నిలుస్తుంది.

– సంపతి రమేష్ మహరాజ్, జన విజ్ఞాన వేదిక తెలంగాణ కార్యదర్శి

(రేపు 'ప్రపంచ ఎడారీకరణ, కరవులపై పోరాట దినోత్సవం')

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

సెప్టెంబర్ 21 నుంచి తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు



కృష్ణలంక (విజయవాడతూర్పు): ప్రముఖ సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని సెప్టెంబరు 21వ తేదీ నుంచి రెండు రోజుల పాటు తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జాతీయస్థాయి తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు, ప్రైవేట్ పాటల వీడియోలు, రీల్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.కె.ఎస్.ఎస్.ప్రసాద్, డీవీ రాజు తెలిపారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రసాద్ మాట్లాడుతూ షార్ట్ ఫిల్మ్ పోటీల్లో మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు, ప్రైవేట్ పాటల వీడియోల పోటీల్లో మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలు, రీల్స్ పోటీల్లో మొదటి బహుమతి రూ.3వేలు, రెండో బహుమతి రూ.2వేలు, మూడో బహుమతి రూ.1000 గా నిర్ణయించారన్నారు. రీల్సుకు రూ.200, షార్ట్ ఫిల్మ్, ప్రైవేట్ పాటల వీడియోలకు రూ.500 ఎంట్రీ ఫీజు ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్ 10వ తేదీ లోగా షార్ట్ ఫిల్మ్, ప్రైవేట్ పాటల వీడియో, రీల్స్ పంపాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థిని మృతి

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలోని శ్రీ చైతన్య కళాశాల రామన్ భవన్-5లో ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం గొంచిరెడ్డిపల్లికి చెందిన బెలోదు జాహ్నవి (18) గూడవల్లిలోని శ్రీ చైతన్య కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రోజు మాదిరిగానే శనివారం ఉదయం స్నానం చేసేందుకు బాత్‌రూంకు వెళ్లింది. ఎంతసేపటికీ రాకపోవడంతో తోటి విద్యార్థులు అనుమానంతో పరిశీలించగా జాహ్నవి బాత్‌రూంలో మృతి చెంది ఉంది. సహచర విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి సమాచారమివ్వగా వారు జాహ్నవి తండ్రి మల్లికార్జున్‌కు విషయం తెలియపరిచారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనారోగ్య కారణాలతో జాహ్నవి మృతి చెంది ఉంటుందని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. గుంటూరులో ఉంటున్న జాహ్నవి మేనమామ ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

కువైట్ మృతులకు రూ.5 లక్షల పరిహారం

సాక్షి, అమరావతి/ గోపాలపట్నం (విశాఖ పశ్చిమ) : కువైట్ అగ్ని ప్రమాదంలో మరణించిన ముగ్గురి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించినట్లు ఏపీ ఎన్ఆర్టీఎస్ ప్రకటించింది. శనివారం ఉదయం విశాఖకు ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో ఉదయం ఏడు గంటలకు చేరిన మృతదేహాలను అంబులెన్స్‌ల ద్వారా వారి స్వస్థలాలకు పంపినట్లు తెలిపింది. కువైట్ ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం జింకిభద్రకు చెందిన తామాడ లోకనాథం (31), తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లికి చెందిన సత్యనారాయణ, అన్నవరప్పాడుకు చెందిన మీసాల ఈశ్వరుడు చనిపోయిన సంగతి తెలిసిందే. మృతదేహాలను వారి బంధువులకు అప్పగించడంతోపాటు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన అయిదు లక్షల పరిహారానికి సంబంధించిన చెక్కులను వారికి అప్పగించినట్లు ఏపీఎన్ఆర్టీఎస్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

నేడు శ్రీభోగ శ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్ర కలశాభిషేకం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలోని శ్రీ భోగ శ్రీనివాసమూర్తికి ఆదివారం ప్రత్యేక సహస్ర కలశాభిషేకం జరగనుంది. 18 ఏళ్లుగా టీటీడీ ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఉదయం ఆరు గంటల నుంచి 8.30 గంటల నడుమ బంగారు వాకిలి చెంత భోగ శ్రీనివాసమూర్తికి అర్చక స్వాములు ఏకాంతంగా సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు. శ్రీవారి ఆలయంలోని ఆర్జిత సేవలన్నీ యథావిధిగా కొనసాగుతాయి.

ముంబై-విజయవాడ విమాన సర్వీస్ ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మచిలీపట్నం, విజయవాడ ఎంపీలు వల్లభనేని, కేశినేని, ఏపీడీ

విమానాశ్రయం(గన్నవరం): దేశ ఆర్థిక రాజధాని ముంబై నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)కు ఎయిరిండియా విమాన సర్వీస్ శనివారం ప్రారంభమైంది. ముంబై నుంచి 148 మంది ప్రయాణికులతో ఎయిర్‌బస్ ఎ320 విమానం సాయంత్రం 5.45 గంటలకు విజయవాడ చేరుకుంది. ఈ విమానానికి ఎయిర్‌పోర్ట్ అగ్నిమాపక దళం వాటర్ కానన్‌తో ఘన స్వాగతం పలికింది. తొలుత విజయవాడ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్‌లో ఎయిరిండియా సంస్థ ముంబై విమాన సర్వీస్ ప్రారంభోత్సవ వేడుక నిర్వహించగా.. ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ.. ముంబై-విజయవాడ మధ్య విమాన సర్వీస్‌లు నడిపేందుకు ఎయిరిండియా ముందుకురావడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో కోల్‌కతా, వారణాసి, సింగపూర్, థాయ్‌లాండ్, శ్రీలంకకు విమాన సర్వీస్‌లు నడపాలని కేంద్రాన్ని కోరతామన్నారు. ఢిల్లీకి మరో రెండు సర్వీస్‌లు నడపాలని ఇండిగో, విస్తారా సంస్థలను కోరినట్లు తెలిపారు. అనంతరం విజయవాడ నుంచి విమానం 131 మంది ప్రయాణికులతో రాత్రి 7.10 గంటలకు ముంబైకి బయలుదేరివెళ్లింది.

సీఐఎస్ఎఫ్‌కు గన్నవరం ఎయిర్‌పోర్టు భద్రత బాధ్యత

జూలై 2వ తేదీ నుంచి అమలు



భద్రత విధుల్లో ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బంది

విమానాశ్రయం(గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం) కట్టుదిట్టమైన కేంద్ర బలగాల భద్రత వలయంలోకి వెళ్లనుంది. ఇప్పటివరకు రాష్ట్ర పోలీస్ శాఖలోని స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) ఈ ఎయిర్‌పోర్టు భద్రత బాధ్యతను చూస్తోంది. జూలై రెండో తేదీ నుంచి ఎయిర్‌పోర్టు భద్రత బాధ్యతను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)కు అప్పగించనున్నారు. ఈ మేరకు విమానాశ్రయం డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఎయిర్‌పోర్టుకు 2017, మే మూడో తేదీన అంతర్జాతీయ విమానాశ్రయంగా గుర్తింపు లభించింది. అప్పట్లోనే ఎయిర్‌పోర్టు భద్రత బాధ్యతను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించేందుకు ప్రయత్నించారు. సరైన వసతి సదుపాయాలు లేవనే కారణంతో సీఐఎస్ఎఫ్ అధికారులు ఇక్కడికి వచ్చేందుకు నిరాకరించారు. అయితే, ఎయిర్‌పోర్టులో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ, భద్రత ప్రమాణాల దృష్ట్యా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని సీఐఎస్ఎఫ్‌తో జరిపిన సంప్రదింపులు సఫలీకృతమయ్యాయి. దీంతో ఎయిర్‌పోర్టు భద్రతను జూలై రెండో తేదీ నుంచి సీఐఎస్ఎఫ్‌కు అప్పగిస్తూ విమానాశ్రయం డైరెక్టర్ ఎల్.లక్ష్మీకాంతరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సీఐఎస్ఎఫ్ దళానికి వసతి కోసం ప్రస్తుతం ఉన్న బ్యారక్‌లను, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా పాత క్వార్టర్స్‌ను కేటాయించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇకపై ఎయిర్‌పోర్టు భద్రత పూర్తిగా సీఐఎస్ఎఫ్ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ వి.శ్రీనివాస్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వదించగా, ఆలయ ఈవో కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



శ్రీవారి ఆలయం వద్ద కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి

తిరుమల: తిరుమల శ్రీవారిని కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి, తెలంగాణ, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి, జస్టిస్ నాగార్జున శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో సినీ నటులు ప్రగ్యా జైస్వాల్, మంచు లక్ష్మి, సుమన్, సాయిధర్మతేజ్, తెలంగాణ మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, భూమా అఖిలప్రియ, గణబాబు ఉన్నారు.



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి



మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జున

ఆక్వా చెరువు బోరు నుంచి గ్యాస్

- నీటితో కలిసి 15 అడుగుల మేర ఎగసిన గ్యాస్
- మంటలు వ్యాపించకపోవడంతో తప్పిన ముప్పు
- బోరు పూడ్చి వేసిన ఫైర్ సిబ్బంది
- బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఘటన



బోరు నుంచి నీటితో కలిసి ఎగసిపడుతున్న గ్యాస్

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలంలో ఓ ఆక్వా చెరువు వద్ద బోరు బావి నుంచి నీటితో కలిసి 15 అడుగుల మేర గ్యాస్ పైకి ఎగజిమ్మింది. అయితే, మంటలు వ్యాపించకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు... రాజోలు మండలంలోని చింతలపల్లి-అరవపాలెం రోడ్డులో కె.విజయేంద్రవర్మ అనే వ్యక్తికి చెందిన ఆక్వా చెరువు వద్ద ఉన్న బోరు బావి నుంచి శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆకస్మికంగా నీరు ఎగసిపడింది. విద్యుత్ మోటారు, ఆయిల్ ఇంజన్ వంటివి ఏమీ లేకుండానే బోరు బావి నుంచి నీరు 15 అడుగుల మేర ఎగసిపడుతుండటంతో సమీపంలోని కూలీలు వెళ్లి చూశారు. అయితే, గ్యాస్ వాసన రావడంతో భయాందోళనలకు గురైన కూలీలు వెంటనే రాజోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అధికారి సీహెచ్ అనిల్‌కుమార్, సిబ్బంది గ్యాస్ లీక్ అవుతున్న బోరు బావి వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బోరు బావి లోపల తీవ్రమైన ఒత్తిడి పెరిగి, నీటితో కలసి గ్యాస్ ఉధృతంగా పైకి వస్తోందని గుర్తించారు. నీటిలో సుమారు ఆరు శాతం గ్యాస్ ఉందని నిర్ధారించారు. బోరు బావిని ఇసుకతో పూడ్చివేసి గ్యాస్ పైకి రాకుండా చేశారు. కొత్తగా బోర్లు వేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఉప్పు నీటి కోసం 200 మీటర్ల మేర భూమి లోపలకు బోర్లు వేయడం వల్ల గ్యాస్ పైకి వస్తుందని అనిల్‌కుమార్ చెప్పారు. కొన్నిసార్లు గ్యాస్ శాతం ఎక్కువగా ఉండడంతో మంటలు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు.

'ఎస్ఈఏఈటీ'లో అడ్మిషన్లు ప్రారంభం



బెంగళూరు: కర్ణాటకలోని బెంగళూరులో సౌత్ ఈస్ట్ ఏషియన్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ (ఎస్ఈఏఈటీ)లో పలు కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. కులం, మతం తదితర వివరాలతో సంబంధం లేకుండా స్వల్ప ఖర్చులతో ఆయా కోర్సులను తాము అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ట్రస్ట్ తెలిపింది. విద్యారంగంలో 24 ఏళ్ల అనుభవం, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, సురక్షితమైన క్యాంపస్, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యా బోధన, క్యాంపస్ నియామకాలను తాము చేపడతామని తెలిపింది. అత్యాధునిక ల్యాబ్‌లు, ఉత్తమ ప్రాజెక్ట్ అవార్డులు, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, క్రైస్ట్ యూనివర్సిటీ వంటి ప్రఖ్యాత సంస్థలతో ఎంవోయూలు తాము కుదుర్చుకున్నట్లు వివరించింది. ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ, ఐఎస్ఈ, ఈసీఈ, ఏఐఅండ్ ఎంఎల్, ఏఐఅండ్‌డీఎస్, ఎంఈ, ఏజీ, సీవీ, ఐవోటీ అండ్ సీఎస్‌బీటీ కోర్సులను తాము అందించనున్నట్లు తెలిపింది. ఎంటెక్‌లో సీఎస్ఈ/వీఎల్ఎస్ఐ, బీబీఏ, ఎంబీఏ, బీకాం/ఎంకాం, బీహెచ్ఎం, బీటీటీఎం, ఎంటీటీఎం, బీఎస్‌డబ్ల్యూ, ఎంఎస్‌డబ్ల్యూ, బీసీఏ, ఎంసీఏ, బీఎస్సీ, ఎంఎస్సీ, సైన్స్/ కామర్స్/ ఆర్ట్స్, ఐటీఐ, స్టేట్ అండ్ ఐసీఎస్ఈ సిలబస్‌లో ప్రాథమిక, మాధ్యమిక విద్యను తాము అందజేయనున్నట్లు వెల్లడించింది. వివరాలను www.seacet.edu.in లో పొందుపరిచినట్లు పేర్కొంది. అడ్మిషన్ల వివరాలకు admissions@esaedu.ac.in/principal. seacet@gmail.comకు మెయిల్ చేయవచ్చని లేదా 08029730681/7353945999 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపింది.

సింహాద్రి ఎన్టీపీసీలో 4వ యూనిట్ షట్‌డౌన్

పరవాడ (పెందుర్తి): అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌ను వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అధికారులు షట్ డౌన్ చేశారు. ఫలితంగా 500 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. నాలుగో యూనిట్‌లో వార్షిక మరమ్మతుల నిర్వహణ కోసం యూనిట్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. యూనిట్‌లో 45 రోజుల పాటు వార్షిక మరమ్మతులు పూర్తి చేసిన అనంతరం విద్యుదుత్పత్తిని పునరుద్ధరిస్తారు. ప్రస్తుతం సంస్థలో 1, 2, 3 యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని ఎన్టీపీసీ అధికారులు తెలిపారు.

పురావస్తుకు పూర్వ వైభవం



కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్ (ఆర్కియాలజికల్ మ్యూజియం)

- ఆంధ్ర సాహిత్య పరిషత్‌కు కొత్త రూపు
- అంతర్జాతీయ మ్యూజియం ఏర్పాటు దిశగా అడుగులు
- ఫలించిన ఏడాదిన్నర ప్రయత్నం
- రూ.10 కోట్ల మంజూరుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- రాష్ట్రం రూ.2 కోట్లు ఇస్తే సరికొత్త భవనం నిర్మాణం
- ఫలించిన తాజా మాజీ ఎంపీ గీత కృషి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వందల సంఖ్యలో తాళపత్ర గ్రంథాలు, కళాఖండాలు, చరిత్రకు సాక్ష్యంగా నిలిచే శాసనాలు కనుమరుగైపోతాయనే చింత లేదిక. తెల్లదొరల ఏలుబడిలో నూరేళ్ల క్రితం కాకినాడలో కొలువుదీరిన ఆంధ్ర సాహిత్య పరిషత్ (ఆర్కియలాజికల్ మ్యూజియం) దశ తిరగనుంది. నూరేళ్ల క్రితం ఏర్పాటైన ఈ పరిషత్‌కు పూర్వ వైభవం కోసం హేమాహేమీలు ప్రయత్నించినా ప్రభుత్వాలు చిల్లిగవ్వ విదల్చలేదు. అటువంటిది ఈ ప్రతిష్టాత్మక సంస్థ ప్రగతి కోసం కాకినాడ తాజా మాజీ ఎంపీ వంగా గీత రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో కేంద్ర స్థాయిలో ఏడాదిన్నరగా చేసిన కృషి సత్ఫలితాన్నిచ్చింది. ఈ సాహిత్య పరిషత్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో మ్యూజియం నిర్మాణానికి మార్గం సుగమమైంది. దీనికోసం రూ.10 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. ఈ స్థాయి నిధుల కోసం రెండు మూడు దశాబ్దాలుగా ఉద్దండులైన నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలితమివ్వలేదు. కొంతలో కొంత తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యం ఈ పరిషత్‌కు కలిసొచ్చింది. ఈ పరిషత్‌లోని తాళపత్ర గ్రంథాలు, చారిత్రక ఆనవాళ్లను భవిష్యత్ తరాలకు భద్రంగా అందించేందుకు వీలుగా టీటీడీ తన భుజస్కంధాలపై వేసుకుని కెమికలైజేషన్, డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసింది. ఇంతవరకూ బాగానే జరిగినా ఇక్కడున్న తాళపత్ర గ్రంథాలు, చారిత్రక ఆధారాలు, కళాఖండాల స్థాయికి తగినట్టు భవనం లేకపోవడం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని సాహితీప్రియులకు, యువతకు కొంత వెలితిగానే మిగిలింది.

మాజీ ఎంపీ గీత చొరవతో..

పరిషత్‌లో దీనావస్థను కాకినాడ ఎంపీగా గుర్తించిన గీత చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లడంతో దీని పునర్వైభవానికి అడుగులు పడ్డాయి. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ప్రజాప్రతినిధులందరూ ఆ హడావిడిలో మునిగిపోయారు. అదే సమయంలో కేంద్రం మ్యాచింగ్ గ్రాంట్ రూ.10 కోట్లు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.2 కోట్లు మంజూరు చేస్తే కేంద్రం ఆ నిధులు విడుదల చేయనుంది. ప్రస్తుతం ఈ ప్రక్రియ నడుస్తోంది.

మూడంతస్తులుగా..

ఈ నిధులు వస్తే కాకినాడలో ఇప్పుడున్న ఆంధ్ర సాహిత్య పరిషత్ భవనాన్ని మొత్తం తొలగిస్తారు. దీని స్థానంలో అత్యంత ఆధునిక హంగులతో మూడు అంతస్తుల్లో ఇంటర్నేషనల్ మ్యూజియం నిర్మించాలని ప్రతిపాదించారు. మొదటి అంతస్తులో వందలాది తాళపత్ర గ్రంథాలు, అపురూపమైన అద్దంకి, యుద్ధమల్లుని బెజవాడ శాసనాలను భద్రపరిచి ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. రెండో అంతస్తులో అపురూప కళాఖండాలు, ఉమ్మడి ఉభయ గోదారి జిల్లాల్లో జరిగిన తవ్వకాల్లో బయటపడిన పురాతన విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. సాహితీ సభలు, సమావేశాలు, సదస్సులు నిర్వహించుకునేందుకు వీలుగా మూడో అంతస్తు నిర్మించే దిశగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. కళల కాణాచిగా, చారిత్రక నగరంగా పేరొందిన రాజమహేంద్రవరానికి దీటుగా కాకినాడ స్మార్ట్ సిటీలో ఒక మ్యూజియం ఏర్పాటు చేయాలన్నది సాహితీప్రియుల చిరకాల ఆకాంక్ష. ఆ స్థాయి మ్యూజియానికి ఆంధ్ర సాహితీ పరిషత్తుకు నిర్మించే నూతన భవనం సరైనదిగా నగర ప్రముఖులు భావిస్తున్నారు.

ఘన చరిత్ర

నేడు కాకినాడగా పిలిచే నాటి కో కెనడాలో ఆంధ్ర సాహితీ పరిషత్తు నూరేళ్ల క్రితం కొలువుదీరింది. 1911 మే 12న నాటి చెన్న పట్టణం(నేటి చెన్నై)లో తెలుగు భాషా పరిరక్షణ కోసం పీఠికాపురాధీశ్వరుడైన కళాప్రపూర్ణ సూర్యారావు బహదూర్, ఆంధ్ర తొలి ఉప కలెక్టర్ జయంతి రామయ్య పంతులు ఆధ్వర్యాన ఈ పరిషత్తుకు అంకురార్పణ జరిగింది. 1913 ఆగస్టు 8న కంపెనీ చట్టం ద్వారా రిజిస్టర్ అయి 1919లో కాకినాడ నగరంలో దీనిని స్థాపించారు. వెలకట్టలేని వందలాది తాళపత్ర గ్రంథాలు, చరిత్రకు సాక్షిగా నిలిచే అనేక శాసనాలు ఇందులో నిక్షిప్తమై ఉన్నాయి. 1946లో ప్రభల సుందర రామయ్య, వెంకట సుబ్బమ్మ దంపతులు దానం చేసిన భవనంలోనే నేటికీ ఈ పరిషత్తు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. 1973 జూన్‌లో నాటి పరిషత్తు అధ్యక్షుడు దంటు భాస్కరరావు చొరవతో రాష్ట్ర ప్రభుత్వ పురావస్తు శాఖ ఆధీనంలోకి ఈ సంస్థ వెళ్లింది. 2011లో శతజయంత్యుత్సవాలు కూడా నిర్వహించారు. ఇంతటి ప్రతిష్టాత్మక సంస్థను అంతర్జాతీయ స్థాయి మ్యూజియం ఏర్పాటు ద్వారా రాష్ట్రంలోనే ప్రముఖ పరిశోధనా సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అపురూప శాసనాలు, విగ్రహాలు

పండరంగని అద్దంకి శాసనం, యుద్ధమల్లుని బెజవాడ శాసనం సహా 88 శాసనాలు ఆంధ్ర సాహిత్య పరిషత్తులో ఉన్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగిన తవ్వకాల్లో బయటపడిన పురాతన హైందవ, బౌద్ధ, జైన విగ్రహాలు, చారిత్రక కళాఖండాలు, 5 వేలకు పైబడిన తాళపత్ర గ్రంథాలు, సుమారు 500 రాత ప్రతులు, 1880 నుంచి ముద్రితమైన ఆంధ్ర, కన్నడ, ఆంగ్ల సంస్కృత గ్రంథాలు 10 వేలు పైనే ఇక్కడ నిక్షిప్తమై ఉన్నాయి. సాహిత్య, చరిత్ర పత్రికలు, ఆంధ్ర హిస్టారికల్ జర్నల్, భారతి తదితర పాత ప్రతులు ఇక్కడ లభ్యమవుతాయి. సూర్యరాయ బహదూర్, మునగాల రాజా, పోలవరం జమీందారుల సహాయంతో చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, వేదం వేంకట రాయశాస్త్రి, వేటూరి ప్రభాకర శాస్త్రి, కళాప్రపూర్ణ డి.శేషగిరి పంతులు తోడ్పాటుతో ప్రథమాంధ్ర డిప్యూటీ కలెక్టర్ మధురకవి జయంతి రామయ్య పంతులు సంకల్పంతో ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఎంతో ఖ్యాతి కెక్కింది. 200 ఏళ్ల తెలుగు చరిత్ర పునర్నిర్మాణానికి మూలమైన సుమారు 800 శాసనాల ప్రకటన ద్వారా తెలుగు సాంస్కృతిక చరిత్రలో తలమానికంగా నిలుస్తోంది. ఇటీవలనే కొట్టాం, కుమ్మరిలోవ, జనార్దనగిరి (నామాగిరి నరేంద్ర పట్టణం), ములగపూడి, ఎ.కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో జరిపిన తవ్వకాలలో చరిత్ర విస్మరించిన బౌద్ధ, జైన, హైందవ నాగరికతలను వెలుగులోకి తేవడంలో ఈ పరిషత్తు తోడ్పాటు ఎంతో ఉంది. ఇంతటి గొప్ప సంస్థకు అంతర్జాతీయ ప్రమాణాలతో మ్యూజియం ఏర్పాటు చేసి, నేటి తరం పరిశోధకులు, సాహితీ ప్రియులు సద్వినియోగం చేసుకునేలా.. తెలుగు చరిత్ర, సాహిత్య సాంస్కృతిక పునరుజ్జీవనానికి తోడ్పడేలా.. ఈ ఘన వారసత్వాన్ని భావితారాలకు అందించేలా మ్యూజియం నిర్మాణం జరగాలని సాహితీప్రియులు, చారిత్రక పరిశోధకులు ఆకాంక్షిస్తున్నారు.

హత్య కేసులో నా భర్తను అన్యాయంగా ఇరికించారు

- ఎఫ్ఐఆర్‌లో లేకున్నా రిమాండ్ రిపోర్టులో చేర్చారు
- రాజకీయంగా ఎదుగుతున్న దళితుల అణచివేతకు కుట్ర
- తెనాలి 39వ వార్డు కౌన్సిలర్ ఝాన్సీవాణి



మాట్లాడుతున్న 39వ వార్డు కౌన్సిలర్ ఝాన్సీవాణి

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి పట్టణం ఒకటో వార్డు కౌన్సిలర్ గెద్దేటి సురేంద్రను మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో జరిగిన హత్య కేసులో అన్యాయంగా ఇరికించారని ఆయన భార్య, తెనాలి 39వ వార్డు కౌన్సిలర్ ఝాన్సీవాణి ఆరోపించారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం కౌన్సిలర్లతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరిగిన ఈ నెల నాలుగో తేదీన మంగళగిరి నియోజకవర్గం తుమ్మపూడిలో జరిగిన ఘర్షణలకు తన భర్త సురేంద్రకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ రోజు జరిగిన గొడవల్లో చనిపోయిన వ్యక్తికి సంబంధించి పోలీసులు నమోదు చేసిన హత్య కేసు ఎఫ్ఐఆర్‌లో తన భర్త పేరు లేదన్నారు. చనిపోయిన వ్యక్తి తల్లి ఇచ్చిన ఫిర్యాదులోనూ చెప్పనే లేదని తెలిపారు. తర్వాత రెండు రోజులకు తయారు చేసిన రిమాండ్ రిపోర్టులో తన భర్త పేరును చేర్చారని ఆరోపించారు. రాజకీయంగా ఎదుగుతూ వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటున్నామన్న కక్షతో దళితులమైన తమను అణచివేసేందుకు ఈ కేసులో ఇరికించారని చెప్పారు. పార్టీ పట్టణ అధికార ప్రతినిధి అక్కిదాసు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పొరుగు నియోజకవర్గంలో జరిగిన ఘర్షణలు, ఒక యువకుడి మరణానికి సంబంధించిన కేసులో కౌన్సిలర్ సురేంద్రను నిందితుడిగా చేర్చడం అన్యాయమన్నారు. పూర్తిస్థాయిలో విచారించి వాస్తవాలను తెలుసుకుని సురేంద్ర పేరును తొలగించాలని డిమాండ్ చేశారు. వీరితో పాటు మున్సిపల్ వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి తదితర పార్టీ నేతలున్నారు. మద్దాళి శేషాచలం, తాడిబోయిన రమేష్, వీరిశెట్టి భాస్కర్, మల్లపూడి రాజేశ్వరరావు, షేక్ దుబాయ్‌బాబు, సయ్యద్ గౌస్, కఠారి హరీష్, యాతాటి అనిల్, పెచ్చింగ్ సుభాని, బచ్చనబోయిన శ్రీనివాసరావు, ఆవుల కోటయ్య, కుర్రా శ్రీను, అన్సారీ తదితరులున్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో అరుదైన గుండె ఆపరేషన్

రోగి ప్రాణాలు కాపాడిన వైద్యులు



ఆపరేషన్ చేయించుకున్న ఆనంద్‌తో డాక్టర్ కిరణ్‌కుమార్, పక్కన కార్డియాలజిస్టులు, ఆస్పత్రి అధికారులు

గుంటూరు మెడికల్: గుండె జబ్బుతో బాధపడుతున్న రోగికి గుంటూరు జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. ఈ వివరాలను శనివారం ఆయన మీడియాకు వెల్లడించారు. 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి గుండె జబ్బుతో బాధపడుతూ గతనెల 22న జీజీహెచ్‌కు వచ్చాడు. అతన్ని పరీక్షించిన కార్డియాలజిస్టులు.. రోగి గుండెకు షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చే ఇంట్రా కార్డియాక్ డిఫిబ్రిలేటర్ అనే పరికరాన్ని గుండె లోపల అమర్చాలని నిర్ణయించారు. కానీ ఈ పరికరానికి సుమారు రూ.4 లక్షల ఖర్చు అవుతుంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మొత్తం చికిత్సకు సుమారు రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య పరికరం కొనుగోలుకు అవసరమైన అనుమతులున్నాయి. దీంతో ఆరోగ్యశ్రీ సీఈవో, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్, కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి రోగి ఆరోగ్య పరిస్థితి గురించి తెలియజేసి తక్షణమే పరికరాన్ని కొనుగోలు చేయాలని కోరాం. అధికారులంతా సకాలంలో స్పందించి వైద్య పరికరం కొనుగోలుకు అనుమతులిచ్చారు. దీంతో గత బుధవారం సదరు వైద్య పరికరాన్ని ఆనంద్ గుండెలో అమర్చాం' అని చెప్పారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన గుండె జబ్బుల వైద్య విభాగాధిపతి డాక్టర్ నాతాని శ్రీ కాంత్, కార్డియాలజిస్టులు డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ శివశంకర్‌తో పాటు వైద్య బృందానికి డాక్టర్ కిరణ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

30 లక్షలకు నీట్ ప్రశ్నాపత్రం!



బిహార్‌లో అభ్యర్థులకు విక్రయించిన బ్రోకర్లు

- రహస్య స్థావరానికి తరలించి ప్రశ్నాపత్రం అప్పగింత
- పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి
- నిందితుల్లో ప్రభుత్వ జూనియర్ ఇంజనీర్
- ఇప్పటిదాకా 14 మంది అరెస్టు
- మరో 9 మందికి నోటీసులు

పట్నా: దేశవ్యాప్తంగా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష–అండర్ గ్రాడ్యుయేట్(నీట్–యూజీ)లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రశ్నపత్రం లీక్ అయ్యిందని, పరీక్షలో రిగ్గింగ్ జరిగిందని కొందరు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ కోర్టులను సైతం ఆశ్రయించారు. నీట్–యూజీని రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని చాలామంది డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు గ్రేసు మార్కుల వ్యవహారం తీవ్ర దుమారం సృష్టించింది. బిహార్‌లో నీట్ అక్రమాలపై జరుగుతున్న దర్యాప్తులో సంచలనాత్మక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నీట్ అక్రమాలకు సంబంధించి బిహార్ పోలీసులు ఇప్పటివరకు 14 మందిని అరెస్టు చేశారు. వీరిలో ప్రభుత్వ జూనియర్ ఇంజనీర్ కూడా ఉండడం గమనార్హం. రూ.30 లక్షలు ఇచ్చి నీట్ ప్రశ్నపత్రం కొనుగోలు చేశామని ప్రాథమిక విచారణలో పలువురు అభ్యర్థులు అంగీకరించినట్లు పోలీసులు చెబుతున్నారు.

పకడ్బందీగా స్కెచ్

బిహార్‌లో పేపర్ లీక్ చేసి, అభ్యర్థులకు విక్రయించి సొమ్ము చేసుకున్న వ్యక్తులు తెలివిగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. లీకేజీ వ్యవహారం బయటకు పొక్కకుండా పకడ్బందీగా వ్యవహరించారు. తమకు డబ్బులు ముట్టజెప్పిన అభ్యర్థులను తొలుత సురక్షిత స్థావరాలకు తరలించారు. వారికి అక్కడే ప్రశ్నపత్రం అప్పగించారు. జవాబులు సైతం చెప్పేశారు. తర్వాత నేరుగా పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లారు. మధ్యలో ఎవరినీ కలవనివ్వలేదు. ఇదంతా ప్రాథమిక దర్యాప్తులో బయటపడింది. నీట్ పేపర్ లీకేజీపై బిహార్ పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం (ఈఓయూ) దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇప్పటికే పలువురు అభ్యర్థులను, అనుమానితులను ప్రశ్నించింది. శనివారం మరో 9 మంది అభ్యర్థులకు నోటీసులు జారీ చేసింది. సోమవారం తమ ఎదుట విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. వీరంతా బిహార్‌లో వేర్వేరు జిల్లాలకు చెందినవారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నుంచి అభ్యర్థుల వివరాలు తెలుసుకొని, నోటీసులు ఇచ్చామని ఈఓయూ డీఐజీ మనవ్‌జీత్ సింగ్ ధిల్లాన్ చెప్పారు.

కన్సల్టెన్సీలు, కోచింగ్ సెంటర్ల ముసుగులో..

నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయంటూ ఫిర్యాదులు రాగానే బిహార్ పోలీసులు వేగంగా స్పందించారు. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశారు. అనుమానిత అభ్యర్థులు, పేపర్ లీక్ చేసిన బ్రోకర్లను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో అభ్యర్థులు నోరు విప్పారు. బ్రోకర్లకు రూ.30 లక్షలకుపైగా ఇచ్చి నీట్ ప్రశ్నాపత్రం కొనుగోలు చేశామని ఒప్పుకున్నారు. బిహార్ ప్రభుత్వ జూనియర్ ఇంజనీర్ సికిందర్ కుమార్ యాదవేందు(56)ను పోలీసులు అరెస్టు చేసి, ప్రశ్నించారు. పేపర్ లీక్ ముఠాతో తాను చేతులు కలిపినట్లు అంగీకరించాడు. కొందరు అభ్యర్థుల కుటుంబ సభ్యులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపానని చెప్పాడు. ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సంస్థను నడిపిస్తున్న నితీశ్, అమిత్ ఆనంద్ అనే వ్యక్తులను తన ఆఫీసులో కలిశానని, వారు మే 4వ తేదీన నీట్ ప్రశ్నాపత్రం తీసుకొచ్చారని వెల్లడించారు. పట్నాలోని రామకృష్ణానగర్‌లో అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేశామని, బేరసారాలు అక్కడే జరిగాయని పేర్కొన్నాడు. నితీశ్, అమిత్ ఆనంద్ అరెస్టయ్యారు. అభ్యర్థుల నుంచి రూ.30 లక్షల నుంచి రూ.32 లక్షల దాకా వసూలు చేశామని పోలీసుల విచారణలో వెల్లడించారు. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్ష కుంభకోణంలో నితీశ్ కుమార్ ఇప్పటికే ఒకసారి జైలుకు వెళ్లొచ్చాడు. పేపర్ లీకేజీలో ఆరితేరాడు. లీకేజీ ముఠా సభ్యులు ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు, కోచింగ్ సెంటర్ల ముసుగులో అభ్యర్థులను సంప్రదించి, ప్రశ్నాపత్రాలు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిజానికి ఇలాంటి కన్సల్టెన్సీలు, కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వ నుంచి ఎలాంటి గుర్తింపు ఉండదు. ఇదిలా ఉండగా, బిహార్‌లో బయటపడిన నీట్ అక్రమాలపై కేంద్ర విద్యా శాఖ గానీ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ గానీ ఇంతవరకు స్పందించలేదు.

మరో 'మెలోడీ' క్షణం



బరి(ఇటలీ): జీ7 సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఆత్మీయ భేటీని ఇటలీ మహిళా ప్రధాని జార్జియా మెలోనీ సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకున్నారు. మూడు సెకన్ల సెల్ఫీ వీడియోను తీసి 'ఎక్స్'లో షేర్‌చేశారు. మెలోనీ, మోదీ పేర్లను కలిపి మెలోడీ అనే కొత్త పదాన్ని సృష్టించి దానికి హ్యాష్‌ట్యాగ్‌ను తగిలించి గతంలోనే ఆమె విస్తృత ట్రెండింగ్ చేసిన విషయం తెల్సిందే. అదే పంథాలో మరోసారి కొత్త వీడియోను తీసి అందరితో పంచుకున్నారు. శుక్రవారం జీ7 శిఖరాగ్ర సదస్సు జరిగిన ఇటలీలోని అపూలియాలో ఉన్న రిసార్ట్ ఇందుకు వేదికైంది. మోదీని మెలోనీ సాదరంగా ఆహ్వానించినపుడు నమస్కారంతో ఇరువురూ పలకరించుకున్న విషయం తెల్సిందే. తర్వాత ద్వైపాక్షిక చర్చలు జరిపాక ఆయనతో కలిసి మెలానీ 'హలో ఫ్రమ్ ది మెలోడీ టీమ్' అంటూ ఒక సెల్ఫీ వీడియోను తీసుకున్నారు. ఈ వీడియోను శనివారం ఆమె 'ఎక్స్'లో షేర్‌చేయడంతో అది తెగ వైరల్ అయింది. 'భారత్–ఇటలీ స్నేహబంధం శాశ్వతంగా కొనసాగాలి' అని ఆ వీడియోను మోదీ మళ్లీ షేర్ చేశారు. గతేడాది డిసెంబర్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్ వేదికగా జరిగిన 'కాప్28' సదస్సు సందర్భంగా మెలోనీ, మోదీ తీసుకున్న సెల్ఫీ ఆనాడూ తెగ వైరల్ అయిన విషయం విదితమే.

ఇందిరాగాంధీ.. భారతమాత: సురేశ్ గోపీ



త్రిసూర్: ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ తరఫున కేరళ నుంచి గెలిచిన ఏకైక ఎంపీ, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలపై ప్రశంసలు కురిపిస్తూ చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. కాంగ్రెస్‌కు చెందిన మాజీ ప్రధాని ఇందిరను ఆయన భారత మాత(మదర్ ఆఫ్ ఇండియా)గాను, కేరళ దివంగత సీఎం కె.కరుణాకరన్‌ను సాహసోపేతుడైన పాలకుడిగానూ అభివర్ణించారు. త్రిసూర్ జిల్లా పుంకున్నమ్‌లో ఉన్న కరుణాకరన్ సమాధి 'మురళి మందిరం'ను సురేశ్ గోపీ ఇటీవల సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తన గురువుకు నివాళులర్పించేందుకే ఇక్కడికి వచ్చానని, దీనిని రాజకీయం చేయొద్దంటూ కోరారు.

దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా మళ్లీ రామఫోసా



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఏఎన్‌సీ)కు చెందిన సిరిల్ రామఫోసా(71) మళ్లీ ఎన్నికయ్యారు. ఇటీవలి ఎన్నికల్లో దాదాపు 30 ఏళ్ల తర్వాత ఏఎన్‌సీ పార్లమెంట్‌లో మెజారిటీ కోల్పోయింది. దీంతో, డెమోక్రాటిక్ అలయెన్స్, ఇతర చిన్న పార్టీలతో కలిసి ఏఎన్‌సీ సారథ్యంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైంది. శుక్రవారం పార్లమెంట్‌లో జరిగిన ఎన్నికలో రామఫోసాకు 283 ఓట్లు పడగా, ప్రత్యర్థి మలేమాకు 44 ఓట్లే దక్కాయి. రామఫోసా బుధవారం అధ్యక్షునిగా ప్రమాణం చేయనున్నారు.

18న పీఎం కిసాన్ నిధుల విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా అందజేసే పీఎం కిసాన్ పథకం నిధులు ఈ నెల 18న విడుదల కానున్నాయి. ప్రధాని మోదీ తన సొంత నియోజకవర్గం వారణాసిలో జరిగే కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో నిధులను విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా 9.26 కోట్ల రైతుల ఖాతాల్లోకి నేరుగా రూ.20 వేల కోట్లు జమ కానున్నాయి. వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ శనివారం ఈ విషయం వెల్లడించారు.

బెంగాల్‌లో హింసపై బీజేపీ కమిటీ

సాక్షి, న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలపై దర్యాప్తు చేసేందుకు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నలుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో ఎంపీలు బిప్లబ్ కుమార్ దేబ్ కన్వీనర్‌గా, రవిశంకర్ ప్రసాద్, బ్రిజ్ లాల్, కవితా పటీదార్ సభ్యులుగా ఉన్నారు. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉత్తరాఖండ్‌లో బస్సు ప్రమాదం
14 మంది మృతి.. 12 మందికి గాయాలు

రుద్రప్రయాగ్: ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ జాతీయ రహదారిపై జరిగిన బస్సు ప్రమాదంలో 14 మంది చనిపోయారు. ఢిల్లీకి చెందిన సుమారు 26 మంది ఉత్తరాఖండ్‌లోని చోప్తాలో పంచ్‌కేదార్ ఆలయాల దర్శనానికి వెళ్తున్నారు. వీరి టెంపో ట్రావెలర్ వాహనం అదుపుతప్పి 500 మీటర్ల లోతులో ఉన్న అలకానంద నది ఒడ్డున పడిపోయింది. ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోగా 12 మంది గాయాలపాలయ్యారని గఢ్వాల్ ఐజీ కేఎస్ నగ్‌న్యాల్ చెప్పారు.

లోక్‌సభ స్పీకర్ పదవికి విపక్షాల పోటీ?

న్యూఢిల్లీ: 18వ లోక్‌సభలో స్పీకర్ పదవిపై ప్రతిపక్షాలు కూడా దృష్టిపెట్టాయి. డిప్యూటీ స్పీకర్ పదవి తమకు అప్పగించకపోతే స్పీకర్ పదవికి పోటీ పడతామని సంకేతాలిస్తున్నాయి. లోక్‌సభ సమావేశాలు ఈ నెల 18న ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26న స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. 17వ లోక్‌సభలో బీజేపీ ఎంపీ ఓంబిర్లా స్పీకర్‌గా వ్యవహరించారు. డిప్యూటీ స్పీకర్‌గా ఎవరినీ నియమించలేదు. ఈసారి డిప్యూటీ స్పీకర్ పోస్టును తమకు కేటాయించాలని విపక్ష ఇండియా కూటమి కోరుతోంది. అందుకు ప్రభుత్వం అంగీకరించకపోతే ఏకంగా స్పీకర్ పదవికి పోటీ పడాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.


కేజ్రీవాల్ వీడియోను తొలగించండి
సామాజిక మాధ్యమ వేదికలకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో దిగువ కోర్టులో విచారణ సమయంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ చేసిన ప్రసంగం వీడియోను తొలగించాలని సామాజిక మాధ్యమ వేదికలను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. శనివారం జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ, జస్టిస్ అమిత్ శర్మల ధర్మాసనం ఈ మేరకు సునీతా కేజ్రీవాల్ సహా ఆరుగురితోపాటు, సామాజిక మాధ్యమ వేదికలు ఎక్స్, మెటా, ఇన్‌స్టా, యూట్యూబ్‌లకు నోటీసులు పంపింది. 'ఢిల్లీ హైకోర్టు వీడియో కాన్ఫరెన్సింగ్ రూల్స్–2021లోని రూల్ 3(6)కు విరుద్ధంగా కోర్టు కార్యకలాపాలను రికార్డు చేసినట్లు ప్రాథమికంగా గుర్తించాం. ఆ వీడియోను ప్రజలకు అందుబాటులో ఉంచడాన్ని అనుమతించబోం'అని ధర్మాసనం తన 6 పేజీల ఉత్తర్వులో పేర్కొంది.

యూపీలో మహిళా చోరులు!

లక్నో: ముసుగులు ధరించిన మహిళలు ఆయుధాలు చేతబూని భారీ దొంగతనానికి పూనుకున్నారు. తాళం వేసి ఉన్న ఓ ఇంట్లోకి దర్జాగా ప్రవేశించి కేవలం 50 నిమిషాల్లో ఉన్నదంతా ఊడ్చేసి గోతాముల్లో నింపుకుని వెళ్లిపోయారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన ఈ ఘటన సీసీటీవీలో రికార్డయింది. ఈ నెల ఏడో తేదీన తెల్లవారుజామున 3 గంటలకు ఆషియానా పోలీస్‌స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ సందీప్ గులాటి ఇంట్లో ఈ మహిళా దొంగలు చొరబడ్డారు. ఒకరిద్దరు ఆయుధాలతో బయట కాపలాగా ఉండిపోగా మిగతా వారు ఇంట్లో సీలింగ్ ఫ్యాన్లు సహా ప్రతి వస్తువు తీసుకుని ఐదు బస్తాల నిండా దర్జాగా నింపుకుని నెమ్మదిగా వెళ్లారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

ఎన్డీఏ సర్కారు త్వరలోనే కూలుతుంది: ఖర్గే



బెంగళూరు: కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం పొరపాటున మూడోసారి అధికారంలోకి వచ్చిందని, త్వరలోనే కుప్పకూలుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఎన్డీఏ ప్రభుత్వం పొరపాటున అధికారంలోకి వచ్చింది. ప్రజల తీర్పు మోదీకి అనుకూలంగా లేదు. ఈయనది మైనారిటీ ప్రభుత్వం. ఈ ప్రభుత్వం అతి త్వరలో కుప్పకూలుతుంది'అని పేర్కొన్నారు.

'దేశ క్షేమం కోసం ఈ ప్రభుత్వం కొనసాగాలనే కోరుకుంటున్నాం. దేశాన్ని బలోపేతం చేసేందుకు కలిసి పనిచేస్తాం. కానీ, మన ప్రధానికి సవ్యంగా కొనసాగే ఏ పనికైనా అవాంతరం కల్పించడం అలవాటు. అయినప్పటికీ దేశం కోసం మేం సహకారం అందిస్తూనే ఉంటాం'అని ఖర్గే అన్నారు.

భాగస్వామ్య పక్షాలను ఏకతాటిపై ఉంచడంలో బీజేపీ ఇబ్బందులను ఎదుర్కొంటోందంటూ వస్తున్న వార్తలపై కాంగ్రెస్ చీఫ్ పైవిధంగా వ్యాఖ్యానించారు.

ఖర్గే వ్యాఖ్యలపై ఎన్డీఏ పక్షాలైన జేడీయూ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎ), హిందుస్తానీ అవామ్ మోర్చా(హెచ్ఏఎం) తీవ్రంగా స్పందించాయి. గతంలో కాంగ్రెస్ సారథ్యంలో పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల ప్రభుత్వాలు ఎలా కొనసాగాయో చరిత్ర చెబుతోందని ఖర్గేను ఎద్దేవా చేశాయి. కాంగ్రెస్ సారథ్యంలో ఏర్పడిన మైనారిటీ ప్రభుత్వం పీవీ నరసింహారావు రాజకీయ చతురతతో రెండేళ్లలోనే మెజారిటీ ప్రభుత్వంగా మారిందని జేడీయూ తెలిపింది. ఇటీవలి ఎన్నికల్లో ఇండియా కూటమి పక్షాలు పొరపాటున కొంత బలం పుంజుకున్నాయని, ప్రతిపక్ష పోషించాలని రిపబ్లికన్ పార్టీ, హెచ్ఏఎంలు ఖర్గేకు సలహా ఇచ్చాయి.

చైనా అండతోనే ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం

- ఉమ్మడి ప్రకటన విడుదల చేసిన జీ7 దేశాల అధినేతలు
- యుద్ధానికి మద్దతివ్వడం మానుకోవాలని చైనాకు హితవు

రోమ్: 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఉక్రెయిన్–రష్యా యుద్ధం ఇంకా కొనసాగుతోంది. ఉక్రెయిన్‌పై రెండేళ్లకుపైగా దాడులు కొనసాగించే శక్తి రష్యాకు ఎలా వచ్చింది? అమెరికాతోపాటు పశ్చిమ దేశాలు డ్రాగన్ దేశం చైనా వైపు వేలెత్తి చూపిస్తున్నాయి. చైనా అండదండలతోనే ఉక్రెయిన్‌పై రష్యా సైన్యం క్షిపణులు, డ్రోన్లతో భీకర దాడులు చేస్తోందని, సాధారణ ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటోందని జీ7 దేశాలు ఆరోపించాయి. ఇటలీలో సమావేశమైన జీ7 దేశాల అధినేతలు తాజాగా ఈ మేరకు ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. చైనా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చైనా అండ చూసుకొని రష్యా రెచ్చిపోతోందని ఆరోపించారు. రష్యా యుద్ధ యంత్రానికి చైనానే ఇంధనంగా మారిందని జీ7 దేశాలు మండిపడ్డారు. రష్యాకు మిస్సైళ్లు డ్రోన్లు చైనా నుంచే వస్తున్నాయని ఆక్షేపించారు. జీ7 దేశాలు సాధారణంగా రష్యాను తమ శత్రుదేశంగా పరిగణిస్తుంటాయి. ఈ జాబితాలో ఇప్పుడు చైనా కూడా చేరినట్లు కనిపిస్తోంది. మారణాయుధాలు తయారు చేసుకొనే పరిజ్ఞానాన్ని రష్యాకు డ్రాగన్ అందిస్తోందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విమర్శించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం మొదలైన తర్వాత రష్యాకు చైనా నేరుగా ఆయుధాలు ఇవ్వకపోయినా ఆయుధాల తయారీకి అవసరమైన విడిభాగాలు, ముడి సరుకులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సరఫరా చేస్తోందని ఆక్షేపించారు.

చైనాలో మానవ హక్కుల ఉల్లంఘన

ఉక్రెయిన్‌లో మారణహోమం సృష్టించేలా రష్యాకు సహకరిస్తున్న దేశాలపై, సంస్థలపై కఠిన చర్యలు తీసుకోకతప్పదని జీ7 దేశాల అధినేతలు తేల్చిచెప్పారు. ఉక్రెయిన్‌పై చట్టవిరుద్ధమైన యుద్ధానికి మద్దతివ్వడం మానుకోవాలని హితవు పలికాయి. ఉక్రెయిన్‌పై దాడుల తర్వాత రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో తమకు అవసరమైన సరుకులను చైనా నుంచి రష్యా దిగుమతి చేసుకుంటోంది. అలాగే రష్యా నుంచి చైనా చౌకగా చమురు కొనుగోలు చేస్తోంది. ఇరుదేశాలు పరస్పరం సహరించుకుంటున్నాయి. టిబెట్, షిన్‌జియాంగ్‌తోపాటు హాంకాంగ్‌లో చైనా దూకుడు చర్యలను జీ7 సభ్యదేశాలు తప్పుపట్టాయి. చైనా మానవ హక్కుల ఉల్లంఘన కొనసాగుతోందని ఆరోపించాయి. మరోవైపు డ్రాగన్ దేశం అనుసరిస్తున్న వ్యాపార విధానాలను అమెరికాతోపాటు యూరోపియన్ యూనియన్(ఈయూ) దేశాలు తప్పుపడుతున్నాయి. ఎలక్ట్రికల్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తులు, సోలార్ ప్యానెళ్ల తయారీకి చైనా ప్రభుత్వం భారీగా రాయితీలిస్తోంది. దీంతో ఇవి చౌక ధరలకే అందుబాటులో ఉంటూ విదేశీ మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. ఫలితంగా ఆయా దేశాల్లో వీటిని తయారు చేసే కంపెనీలు గిరాకీ లేక మూతపడుతున్నాయి. ఫలితంగా ఉద్యోగాల్లో కోతపడుతోంది. చైనా దిగుమతులతో పశ్చిమ దేశాలు పోటీపడలేకపోతున్నాయి. చైనా ఎత్తుగడలను తిప్పికొట్టడానికి చైనా ఉత్పత్తులపై అమెరికాతోపాటు ఈయూ దేశాలు భారీగా పన్నులు విధిస్తున్నాయి.

సార్వత్రిక పోరులో గెలుపు ఆరంభం మాత్రమే
అసెంబ్లీ ఎన్నికల్లోనూ మాదే విజయం: ఉద్ధవ్ ఠాక్రే

ముంబై: ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో తమ కూటమి మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) గెలుపు ఆరంభం మాత్రమేనని శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. ఎంవీఏ విజయయాత్ర రాష్ట్రంలో మరికొద్ది నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 48 సీట్లకుగాను ఎంవీఏ పార్టీలు 30 సీట్లను గెల్చుకోవడం తెల్సిందే. ఉద్ధవ్ శనివారం ఎన్సీపీ (ఎస్పీ)చీఫ్ శరద్ పవార్, కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చవాన్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. బీజేపీ అజేయమనే అపోహ ఎంత బూటకమైనదో లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు రుజువు చేశారని ఉద్ధవ్ అన్నారు. ఎన్డీఏ సర్కారుగా మారిన మోదీ సర్కారు ఎంతకాలం కొనసాగుతుందో చూడాలని వ్యాఖ్యానించారు.

కర్ణాటకలో పెరిగిన పెట్రో ధరలు

బెంగళూరు: కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను శనివారం పెంచింది. రాష్ట్ర పరిధిలోని పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను అధికంచేసింది. దీంతో పెట్రో ధరలు కాస్తంత పైకి ఎగిశాయి. ఈ ధరల పెంపు నిర్ణయం జూన్ 15వ తేదీ నుంచే అమల్లోకి వచ్చిందని రాష్ట్ర ఆర్థిక శాఖ శనివారం ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. పెట్రోల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను 25.92% నుంచి 29.84 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను 14.34% నుంచి 18.44 శాతానికి పెంచింది. ఈ తాజా పెంపుతో కర్ణాటక రాష్ట్రంలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ.3, డీజిల్ ధర లీటర్‌కు రూ.3.5 మేర పెరిగింది. తాజా పెంపుతో కర్ణాటక రాష్ట్ర ఖజానాకు ఏటా దాదాపు రూ.2,800 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని తెలుస్తోంది.

త్వరలో వందేభారత్ స్లీపర్ రైళ్ల ట్రయల్స్

న్యూఢిల్లీ: త్వరలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్లీపర్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. వచ్చే ఆగస్టు 15వ తేదీ నాటికి వీటి ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్ల కంటే ఇవి మెరుగ్గా ఉంటాయని భావిస్తున్నారు. ఇవి త్వరలో ట్రయల్ రన్ పూర్తి చేసుకుని పట్టాలెక్కే అవకాశాలున్నాయని రైల్వే వర్గాలు అంటున్నాయి. వీటితోపాటుగా, తక్కువ దూరంలో ఉండే నగరాల మధ్య ప్రయాణాల కోసం వందే మెట్రో లేదా వందే భారత్ మెట్రోగా పిలిచే ఈ రైళ్ల ట్రయల్ రన్ త్వరలోనే మొదలవనుందని చెబుతున్నారు.

• థాయిలాండ్‌లో అద్భుతం
కవల గున్న ఏనుగులు



- ఆడ, మగ గున్నలకు జన్మనిచ్చిన గజరాణి
- ఇది అత్యంత అరుదైన విషయమని ప్రకటించిన వెటర్నరీ వైద్యులు

అయూథలా: గజరాజును అత్యంత పవిత్రంగా భావించే థాయిలాండ్‌లో ఒక అద్భుతం జరిగింది. అరుదుగా సంభవించే కవలల జననానికి వేదికై ంది. కవలలకు ఏనుగు జన్మనివ్వడం అరుదైన విషయమయితే అందులోనూ 36 ఏళ్ల ఒక ఏనుగు ఒక ఆడ, ఒక మగ గున్నలకు ఒకేసారి జన్మనివ్వడం అత్యంత అరుదైన సందర్భమని వెటర్నరీ వైద్యులు ప్రకటించారు. థాయిలాండ్‌లోని అయూథలా ప్రావిన్స్‌లోని అయూథలా ఏనుగుల ప్యాలెస్‌లో ఇటీవల జరిగిన ఈ ఘటన వివరాలను అక్కడి సిబ్బంది వెల్లడించారు. 36 ఏళ్ల ఛామ్‌చూరీ శుక్రవారం ఒక మగ గున్నకు జన్మనిచ్చింది. ప్రసవం సాఫీగా జరిగిందనుకుని సంతోషపడి ఆ గున్నను నిలబెట్టే ప్రయత్నం చేస్తుండగా ఛామ్‌చూరీ మళ్లీ నొప్పులు పడటం అక్కడి మావటి, సిబ్బందిని ఆశ్చర్యంలో పడేసింది. అతి కష్టమ్మీద ఆడ గున్న బయటకురావడం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అప్పటికే మగ గున్నకు జన్మనిచ్చి బాగా నీరసించిపోయిన ఏనుగు వెంటనే మరో ఏనుగుకు జన్మనివ్వడంతో డీలాపడి కింద పడబోయింది. అప్పటికి ఆడ గున్నను కింద నుంచి తీయలేదు. ''పెద్ద ఏనుగు మీద పడితే ఏమైనా ఉందా?. అందుకే వెంటనే ప్రాణాలకు తెగించి వెంటనే తల్లిఏనుగు కిందకు దూరి గున్న ఏనుగును బయటకు లాగేశా. కానీ అంతలోనే ఏనుగు పడిపోవడంతో నా కాలు విరిగింది. పసికూనను కాపాడాను అన్న ఆనందంలో నాకు కాలు విరిగిన బాధ కూడా తెలీలేదు. ఆస్పత్రికి వెళ్లాకే నొప్పి తెలిసింది' అని 31 ఏళ్ల మావటి చరిన్ సోమ్‌వాంగ్ నవ్వుతూ చెప్పారు. ''నేనూ ఇదే ఏనుగుల ప్యాలెస్, రాయల్ ప్రాంగణంలో పుట్టి పెరిగా. కవలల జననాన్ని చూడాలని ఎప్పటి నుంచో అనుకున్నా. ఇంతకాలానికి ఇలా కుదిరింది. ఏనుగుల్లో కవలల జననం కేవలం ఒక్క శాతం మాత్రమే. ఇక ఆడ,మగ ఒకేసారి జననం అత్యంత అరుదైన విషయం'' అని అక్కడి వెటర్నరీ మహిళా డాక్టర్ లార్ద్‌థోంగ్‌టేర్ మీపాన్ చెప్పారు. డాక్టర్ మీపాన్‌కు కూడా కవల పిల్లలున్నారు. కవల గున్నల జననం వార్త తెలిశాక స్థానికులు తండోపతండాలుగా ఏనుగుల పార్క్‌కు క్యూ కట్టారు. 60 కేజీల మగ, 55 కేజీల ఆడ గున్నలతో ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు.

రష్యా ప్రతిపాదన.. ఓ ఎత్తుగడ

ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణ ప్రకటనపై మెలోనీ



బోర్గో ఎగ్నాజియా(ఇటలీ): సరిగ్గా జీ7 శిఖరాగ్ర భేటీ మొదలైన రోజే షరతులు ఒప్పుకుంటే ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణ తక్షణం అమలుచేస్తానని రష్యా అధ్యక్షుడు పుతిన్ చేసిన ప్రకటనను ప్రచార ఎత్తుగడగా అని ఇటలీ మహిళా ప్రధాని జార్జియా మెలోనీ అభివర్ణించారు. ఇటలీ సారథ్యంలో ఈ ఏడాది జీ7 భేటీ జరిగాక శనివారం విలేకరుల సమావేశంలో మెలోనీ మాట్లాడారు. ''కుదిరితే జపాన్, లేదంటే అమెరికా, బ్రిటన్, కెనడాలు సంయుక్తంగా ఉక్రెయిన్‌కు 50 బిలియన్ డాలర్లమేర రుణాలు ఈ ఏడాది చివరికల్లా అందిస్తాయి. యూరప్‌లో స్తంభింపజేసిన రష్యా ఆస్తులను వాడుకుని తద్వారా ఈ రుణాలను చెల్లిస్తాయి. యురోపియన్ యూనియన్ సభ్య దేశాలకు ఈ రుణాలతో ఎలాంటి సంబంధం లేదు. అమెరికా, బ్రిటన్ వంటి జీ7 దేశాలే ఈ రుణ అంశాలను చూసుకుంటాయి' అని స్పష్టంచేశారు. గాజా స్ట్రిప్‌పై భీకర దాడులతో వేలాది మంది అమాయక పాలస్తీనియన్ల మరణాలకు కారణమైన ఇజ్రాయెల్‌ను జీ7 దేశాలు ఎందుకు శిఖరాగ్ర సదస్సులో తీవ్రంగా మందలించలేదు? అని మీడియా ప్రశ్నించింది. '' అసలు ఈ యుద్ధాన్ని మొదలుపెట్టింది ఎవరు అనేది మీరొకసారి గుర్తుచేసుకోండి. హమాస్ మిలిటెంట్లు మెరుపుదాడి చేసి 1,200 మందిని పొట్టనపెట్టుకున్నారు. హమాస్ పన్నిన ఉచ్చులో ఇజ్రాయెల్ పడింది' అని మెలోనీ వ్యాఖ్యానించారు. '' అక్రమ వలసలకు వ్యతిరేకంగా జీ7 కూటమి స్పందించడాన్ని స్వాగతిస్తున్నాం. ఆఫ్రికా దేశాలకు నిధుల మంజూరు, పెట్టుబడులు పెంచడం ద్వారా ఆయా దేశాల నుంచి ఐరోపాకు వలసలను తగ్గించవచ్చు' అని చెప్పారు. ఐరోపా దేశాలకు వలస వస్తున్న ఆఫ్రికా పేదలకు ఇటలీ ముఖద్వారంగా ఉన్న విషయం విదితమే.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- 8 మంది మావోయిస్టులు, ఒక ఎస్టీఎఫ్ జవాను మృతి
- మరో ఇద్దరు జవాన్లకు గాయాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో 8 మంది మావోయిస్టులు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్టీఎఫ్) జవాను నితీశ్ ఎక్కా మృతిచెందినట్లు అధికారులు వెల్లడించారు. లేఖారామ్ నేతమ్, కైలాశ్ నేతమ్ అనే మరో ఇద్దరు జవాన్లు గాయపడినట్లు తెలిపారు. ఘటనా స్థలంలో పెద్ద సంఖ్యలో ఆయుధాలు, బ్యారెల్ గ్రనేడ్ లాంచర్‌తోపాటు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అబూజ్‌మడ్ అడవిలో ఈ నెల 12న ప్రారంభమైన ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా శనివారం ఉదయం భద్రతా సిబ్బంది గాలింపు కొనసాగిస్తుండగా, మావోయిస్టులు తారసపడ్డారని, ఇరువర్గాల మధ్య చాలాసేపు కాల్పులు కొనసాగాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులతోపాటు ఐటీబీపీ, బీఎస్ఎఫ్ సిబ్బంది సైతం ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారని వివరించారు. మావోయిస్టుల వైపునుంచి కాల్పులు ఆగిపోయిన తర్వాత వెళ్లి పరిశీలించగా 8 మృతదేహాలు కనిపించాయని స్పష్టం చేశారు. గాయపడిన ఇద్దరు జవాన్లను చికిత్స కోసం హెలికాప్టర్‌లో రాయ్‌పూర్‌కు తరలించారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవలి కాలంలో భద్రతా సిబ్బంది దూకుడుగా వ్యవహరిస్తున్నారు. మావోయిస్టులపై ఉక్కుపాదం మోపుతున్నారు. కాంకేర్, కొండగావ్, నారాయణపూర్, బస్తర్, బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిల్లాలో కూడిన బస్తర్ డివిజన్‌లో ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 131 మంది మావోయిస్టులు మరణించారు. ఏప్రిల్ 16న కాంకేర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏకంగా 29 మంది మావోయిస్టులు మృతిచెందిన సంగతి తెలిసిందే. నక్సలైట్లను పూర్తిగా ఏరివేయడమే తమ లక్ష్యమని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ప్రకటించారు.

ప్రజల ముందుకు కేట్ మిడిల్టన్



లండన్: క్యాన్సర్‌తో బాధపడుతూ బాహ్య ప్రపంచానికి దూరంగా గడుపుతున్న బ్రిటన్ యువరాణి, యువరాజు విలియం భార్య కేట్ మిడిల్టన్ చాలా నెలల తర్వాత ప్రజల ముందుకు వచ్చారు. బ్రిటన్ రాజు ఛార్లెస్–3 జన్మదినోత్సవాల్లో భాగంగా లండన్‌లో శనివారం అధికారికంగా సైనిక పరేడ్ నిర్వహించారు. 'ట్రూపింగ్ ది కలర్' పేరిట జరిగే ఈ కార్యక్రమానికి బ్రిటన్ రాజకుటుంబ సభ్యులంతా హాజరయ్యారు. ప్రఖ్యాత బకింగ్‌హామ్ ప్యాలెస్ బాల్కనీలో భర్త విలియం, పిల్లలతో పాటు నిల్చున్న కేట్‌ను చూసేందుకు జనం ఆసక్తిచూపించారు. గత ఏడాది డిసెంబర్ తర్వాత కేట్ బయటకు రావడం ఇదే తొలిసారి. క్యాన్సర్ సోకి చికిత్స చేయించుకుంటున్నట్లు ఈ ఏడాది మార్చి నెలలో కేట్ ప్రకటించాక ఆమె ఆరోగ్యపరిస్థితిపై ఆందోళన వ్యక్తమైన విషయం తెల్సిందే. ఆమె కోమాలోకి వెళ్లారని, రాచరిక విధులు నిర్వర్తించలేరని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో 42 ఏళ్ల కేట్ ఎట్టకేలకు ప్రజల ముందుకు రావడంతో బ్రిటన్ రాజకుటుంబ అనుకూల వర్గాల్లో ఆనందం వెల్లివిరిసింది. చికిత్స నుంచి మెల్లిగా కోలుకుంటున్నానని, శనివారం జరిగే జన్మదిన వేడుకలకు హాజరవుతానని కేట్ శుక్రవారమే ప్రకటించారు.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
ఆదివారం : 16 : జూన్ : 2024

• మహిళా గళం



వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను, ఆవిష్కరణలు, అనుభవాలను వెలుగులోకి తెచ్చే విధంగా వీవీడ్ వాయిస్ పేరిట ఫిక్కీ ఎఫ్ఎల్ఓ నేతృత్వంలో పాడ్ కాస్ట్ సిరీస్‌ను సిద్ధం చేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఆ విభాగం చైర్‌పర్సన్, అతిథులు దివ్య అభిషేక్, పలోమారావు, ఫరాఖాన్ తదితరులు ఈ సీరిస్‌ను ఆవిష్కరించారు. – సాక్షి, చెన్నై

న్యూస్‌రీల్

ఇద్దరికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు

సాక్షి, చెన్నై: కేంద్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ పురస్కారాల జాబితాలో తమిళనాడుకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. తమిళ విభాగంలో యువ, బాల పురస్కారాలను తమిళనాడుకు చెందిన రచయితలను సొంతం చేసుకున్నారు. ఏటా ఉత్తమ రచనలను ఎంపిక చేసి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను ప్రకటిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. 2024 సంవత్సరానికి గాను అవార్డుల జాబితాలో తమిళ విభాగంలో రాష్ట్రానికి చెందిన లోకేష్ రఘురామన్, యుమా వాసుకీలకు అవార్డులు దక్కాయి. లోకేష్ రఘురామన్ రచించిన విష్ణు వందార్ కథా సంపుటికి సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. యుమా వాసుకీ రచించిన తన్వియిన్ పెరందనాల్ పుస్తకానికి బాల పురస్కారం అవార్డు దక్కింది. యువ, బాల పురస్కారాలను దక్కించుకున్న ఈ ఇద్దరికి తమిళనాడులోని రచయితలు, సాహితీవేత్తలతో పాటు సీఎం ఎంకే స్టాలిన్ తదితరులు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

నేను 'కాలం' చేశాను!

• కలకలం రేపిన డీఎంకే ఎమ్మెల్యే ట్వీట్



ఎమ్మెల్యే సౌందర పాండియన్

సాక్షి, చెన్నై: మంత్రిపై అసంతృప్తిని వెల్లగక్కేందుకు ఏకంగా డీఎంకే ఎమ్మెల్యే ఒకరు తాను కాలం చేసినట్లు, తన నియోజకవర్గం ఖాళీగా ఉన్నట్టు ప్రకటించుకోవాలని ట్వీట్ చేసి వార్తలలోకి ఎక్కారు. మంత్రి కేఎన్ నెహ్రూ తిరుచ్చి జిల్లాలో పర్యటించారు. పలు చోట్ల ఆయన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు చోట్ల జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు. లాల్గుడి పర్యటన సమయంలో డీఎంకే ఎమ్మెల్యే సౌందరరాజన్ మంత్రిని కలవలేదు. ఇది కాస్త చర్చకు దారి తీసింది. ఈ విషయం రాజకీయంగా చర్చకు దారి తీయడంతో లాల్గుడి డీఎంకే ఎమ్మెల్యే సౌందర పాండియన్ స్పందించారు. మంత్రిపై తన అసంతృప్తిని వెల్లగక్కే విధంగా ట్వీట్ చేశారు. ఇందులో తాను కాలం చెందానని, తన నియోజకవర్గం ఖాళీగా ఉన్నట్టు ప్రకటించుకోవాలని సూచించారు. ఇది మరింత చర్చకు దారి తీసింది. ఒక ఎమ్మెల్యే అది కూడా అధికార పార్టీకి చెందిన వ్యక్తి స్వయంగా తాను మరణించినట్లు ట్వీట్ చేయడం తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వివాదం నేపథ్యంలో కాసేపటికి ఆ ట్వీట్‌ను ఆయన తొలగించడం గమనార్హం.

విల్లుపురంలో ఏసీబీ దాడులు

• విస్తృతంగా సోదాలు

సాక్షి, చెన్నై: విల్లుపురంలో శనివారం నాలుగు చోట్ల ఏసీబీ అధికారులు సోదాలలో నిమగ్నమయ్యారు. సామాజిక భద్రతా విభాగంలో నిధులను మింగేశారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆ విభాగం అధికారుల నివాసాలలో ఈ తనిఖీలు పొద్దుపోయే వరకు నిర్వహించారు. విల్లుపురంలోని సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని సామాజిక భద్రతా విభాగానికి కేటాయించిన నిధులను 2015–2017 మధ్య కాలంలో అధికారులు దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు ఇటీవల వెల్లువెత్తాయి. రైతులకు అందించాల్సిన నిధులను, పేద యువతులకు తాళికి బంగారం, వివాహ ఖర్చు మొత్తం మింగేశారని వచ్చిన ఆరోపణలతో ఏసీబీ రంగంలోకి దిగింది. ఆ విభాగంలో పనిచేస్తూ వచ్చిన తహసీల్దార్ సుందరాజన్, డేటా ఆపరేటర్ దేవి, బ్రోకర్ మురుగన్‌తో పాటు మరొకర్ని టార్గెట్ చేశారు. వీరిపై కేసులు నమోదయ్యాయి. ఈ పరిస్థితులలో శనివారం విల్లుపురంలోని సుందరరాజన్, దేవి, మురుగన్‌తో పాటు మరొకరి నివాసంలో నాలుగు బృందాలుగా ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. ఇందులో లెక్కలోకి రాని నగదు, నగలతో పాటు పలు దస్తావేజులు బయట పడినట్లు సమాచారం.

17 నుంచి ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయ బ్రహ్మోత్సవాలు

తిరువొత్తియూరు: రాష్ట్రంలో ఉన్న వైష్ణవ క్షేత్రాలలో ట్రిప్లికేన్‌లో ఉన్న పార్థసారథి ఆలయం చాలా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఏటా అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాలు 17 నుంచి 26 వరకు జరగనున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆయా రోజుల్లో ఉదయం, సాయంత్రం కల్పవృక్ష వాహనం, శేషవాహనం, సింహ వాహనం, సూర్యప్రభ, చంద్ర ప్రభ తదితర వాహనాలపై స్వామి విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారు. దక్షిణ మాడ వీధి, తులసింగ పెరుమాళ్ కోవిల్ వీధి, సింగరాచారి వీధి, తేరడి వీధి, కోనేరు చుట్టూ స్వామి ఊరేగింపు జరుగతుంది. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలు 19న గరుడ సేవ ఉత్సవం, 23న ఉదయం రథోత్సవం వైభవంగా జరగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. 25న ఉదయం 6.15 గంటలకు పల్లకి సేవ, తీర్థవారి, 26న రాత్రి 9.30 గంటలకు వెట్టివేర్ ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం 27 నుంచి 29 వరకు పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

విక్రవాండి ఉప ఎన్నిక బహిష్కరణ

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రతిష్టాత్మకమైన విక్రవాండి ఉపఎన్నికను ఆ పార్టీ బహిష్కరించింది. అధికార డీఎంకే ఈ ఎన్నికలలో అధికార దుర్వినియోగం, అరాచకాలకు పాల్పడే అవకాశాలు అధికంగా ఉండడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి పళణిస్వామి ప్రకటించారు. ఇదే సమయంలో ఓటమి భయంతోనే ఎన్నికలను అన్నాడీఎంకే బహిష్కరించిందనే చర్చ రాష్ట్రంలో జోరందుకుంది. ఇక బీజేపీ కూటమి నుంచి పీఎంకే అభ్యర్థిగా ఎస్ అన్బుమణి పోటీకి దిగడం గమనార్హం.

- అన్నాడీఎంకే అనూహ్య నిర్ణయం
- డీఎంకే పాలకులపై పళణిస్వామి తీవ్ర ఆరోపణలు
- పీఎంకే అభ్యర్థిగా సీ అన్బుమణి ప్రకటన



పార్టీ వర్గాలతో సమావేశమైన పళణి స్వామి

సాక్షి, చెన్నై: డీఎంకే ఎమ్మెల్యే పుగలేంది మరణించడంతో విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ స్థానం ఖాళీగా అయిన విషయం తెలిసిందే. ఈ స్థానానికి జూలై 10న ఉప ఎన్నికల జరగనుంది. శుక్రవారం నుంచి నామినేషన్ల పర్వం మొదలైంది. ఈ ఎన్నికల ద్వారా సిట్టింగ్ సీటును మళ్లీ కైవసం చేసుకునేందుకు డీఎంకే సిద్ధమైంది. తమ అభ్యర్థిగా అన్నియూరు శివాను ప్రకటించారు. ఈయన గెలుపు బాధ్యతలను మంత్రులు పొన్ముడి, సెంజి మస్తాన్, మాజీ ఎంపీ, పార్టీ జిల్లా కార్యదర్శి గౌతం శిఖామణి తదితరులు తమ భుజాన వేసుకుని ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఈ ఎన్నికలలో తాము సైతం పోటీ చేస్తున్నామని నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్ ప్రకటించారు. ఆ పార్టీ అభ్యర్థిగా స్థానికురాలైన డాక్టర్ అభినయ పోటీ చేస్తున్నారు. ఈ పరిస్థితులలో ఉప ఎన్నికలలో అన్నాడీఎంకే, బీజేపీ కూటమిలోని పీఎంకే నిర్ణయం ఎటో అన్న చర్చ తీవ్రమైంది. చివరికి పీఎంకే అభ్యర్థిగా సీ అన్బుమణి పోటీ చేస్తారని ఆ పార్టీ వ్యవస్థాపకుడు రాందాసు శనివారం ప్రకటించారు. పీఎంకే సైతం అభ్యర్థిని ప్రకటించడంతో అన్నాడీఎంకే నిర్ణయంపై సర్వత్రా ఎదురు చూపులు పెరిగాయి.

సుదీర్ఘంగా చర్చించి..

ఉప ఎన్నికలలో పోటీపై శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ముఖ్య నేతలతో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి సమావేశమయ్యారు. పార్టీ సీనియర్లు కేపీ మునుస్వామి, తంగమణి, ఎస్పీ వేలుమణి, జయకుమార్, దిండుగల్ శ్రీనివాసన్, నత్తం విశ్వనాథన్, పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎన్నికలలో పోటీ, అభ్యర్థిని ఎంపిక గురించి ఈ సమావేశంలో చర్చ జరిగినట్టు సంకేతాలు తొలుత వెలువడ్డాయి. అయితే సమావేశానంతరం పళణి స్వామి ఓ కీలక ప్రకటన చేశారు. ఉప ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. ఇందుకు కొన్ని కారణాలను తెలియజేశారు. డీఎంకే అధికారంలో ఉన్నప్పుడల్లా జరిగే ఉప ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన సందర్భాలు లేవని వివరించారు. ఇందుకు ఉదాహరణగా 2009లో జరిగిన ఇలయాన్ కుడి, కంబం, తిరుమంగలం, తొండాముత్తూరు, బర్గూర్, శ్రీవైకుంఠం ఉప ఎన్నికలను, ఇటీవల జరిగిన ఈరోడ్ ఉప ఎన్నికలను గుర్తు చేశారు. ఈ ఎన్నికలలో డీఎంకే ఆరాచకాలు సృష్టించిందని, అధికార దుర్వినియోగం, ధన బలంతో గెలిచారని ఆరోపించారు. ప్రజలు ప్రజాస్వామ్యం కల్పించిన హక్కును స్వతంత్రంగా ఉపయోగించ లేని పరిస్థితులు విక్రవాండిలో సైతం కొనసాగేందుకు అవకాశాలు అధికంగానే ఉన్నాయని, అందుకే తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలే ఇక తమ లక్ష్యమని, ఆ దిశగా ముందుకెళ్లనున్నామని వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని మీడియాతో మాట్లాడుతూ సీనియర్ నేతలు ప్రకటించారు.



రాందాసుతో పీఎంకే అభ్యర్థి అన్బుమణి

కేడర్‌ను రక్షించుకునేందుకే..

అన్నాడీఎంకే ఉప ఎన్నిక బహిష్కరించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. గతంలో ఎంజీఆర్, జయలలిత హయాంలో సైతం అనేక ఉప ఎన్నికలను బహిష్కరించినా, ప్రస్తుతం పళణి స్వామి ఈ నిర్ణయం తీసుకోవడం కొత్త చర్చకు దారి తీసింది. వరుసగా ఎదురు అవుతున్న ఓటముల నేపథ్యంలో మరో పరాజయం పార్టీ కేడర్‌లో నిరుత్సాహాన్ని నింపకుండా పళణి ముందు జాగ్రత్తగా తీసుకున్నట్లు విమర్శలు వ్యక్తమయ్యాయి. అన్నాడీఎంకే ఎన్నికల బహిష్కరణ బీజేపీ కూటమిలోని పీఎంకే అభ్యర్థికి సీ అన్బుమణికి అనుకూల వాతావరణం సృష్టించే అవకాశాలు ఉన్నాయని కొందరు విశ్లేషకులు పేర్కొంటున్నారు. అదేసమయంలో ఓటమి భయంతోనే ఈ నిర్ణయం తీసుకుని ఉంటారని మరికొందరు పేర్కొంటున్నారు. విల్లుపురంలో సీవీ షణ్ముగం వంటి నేతలు అన్నాడీఎంకేకు చెందిన వారు ఉండగా, ఈ ఎన్నికలు బహిష్కరించడానికి కేవలం ఓటమి భయమే కారణమని వ్యాఖ్యానించారు. గతంలో ఒంటరిగా పోటీ చేసిన సమయంలో పీఎంకే అభ్యర్థి సీ అన్బుమణి 40 వేలకు పైచిలుకుల ఓట్లను వ్యక్తిగతంగా సాధించారని, ఆ బలంతో పాటు కూటమి బలం తోడైన పక్షంలో అన్నాడీఎంకే మూడో స్థానానికి పడిపోవడం ఖాయమని, అందుకే వ్యూహాత్మకంగా ఎన్నికలను బహిష్కరించినట్టు పేర్కొనడం గమనార్హం. అన్నాడీఎంకే ఎన్నికల బహిష్కరణ నేపథ్యంలో బీజేపీ నేత కరు నాగరాజన్ మీడియాతో మాట్లాడుతూ తమ కూటమిలోని పీఎంకే అభ్యర్థి అన్బుమణి గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేయడం గమనార్హం.

పీఎం మోదీ పర్యటన ఖరారు

సాక్షి, చెన్నై: ప్రధాని నరేంద్ర మోదీ చెన్నై పర్యటనకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 20న పలు రైల్వే పథకాలకు శంకుస్థాపనలతో పాటు రెండు వందే భారత్ రైళ్లకు ప్రధాని నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించనున్నారు. వివరాలు.. వరుసగా మూడోసారి ప్రధాని పగ్గాలు చేపట్టినానంతరం నరేంద్ర మోదీ ఈనెల 20వ తేదీన తొలిసారి చెన్నైకు రాబోతున్నారు. ఇక్కడ ఆయన పర్యటన కోసం భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధానంగా రైల్వే యంత్రాంగానికి సంబంధించిన పలు పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయబోతున్నారు. చెన్నై ఎంజీఆర్ సెంట్రల్ రైల్వే స్టేషన్ ఆవరణలో పీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 20న ఇదే వేదిక నుంచి ఎగ్మూర్ – నాగర్ కోయిల్, మదురై – బెంగళూరు మధ్య వందే భారత్ రైళ్లకు ప్రధాని జెండా ఊపనున్నారు. తిరునల్వేలి జిల్లా మణియాచ్చి నుంచి నాగర్ కోవిల్ వరకు 102 కి.మీ దూరం డబుల్ ట్రాక్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో ప్రస్తుతం ఆరల్వాయిల్ మొళి – నాగర్ కోయిల్, మేళ పాలయం – తిరునల్వేలి మధ్య పనులు ముగిశాయి. నాగర్ కోయిల్ – కన్యాకుమారి మధ్య కూడా పనులు ముగియడంతో ఈ మార్గాలలో రైలు సేవలకు శ్రీకారం చుట్టబోతున్నారు. చెన్నై బేసిన్ బ్రిడ్జి సమీపంలో వందే భారత్ రైళ్లకు మరమ్మతులు, పర్యవేక్షణ కోసం నిర్మించనున్న రైల్వే లోకో ఏర్పాటుకు శంకుస్థాపన చేయబోతున్నారు. అలాగే ఇక్కడి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ద్వారా చేపట్టనున్న మూడు పథకాలకు శంకు స్థాపన చేయనున్నారు. మరికొన్ని సౌర శక్తి విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభించబోతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆర్ఎన్ రవి, సీఎం స్టాలిన్, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తదితరులు పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

రూ.100 కోట్ల స్థలం కబ్జా

- మాజీ మంత్రి విజయ భాస్కర్ కేసు సీబీసీఐడీకి అప్పగింత



ఎంఆర్ విజయ భాస్కర్

సాక్షి, చెన్నై : కరూర్‌లో రూ. 100 కోట్ల స్థలాన్ని కబ్జా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అన్నాడీఎంకే సీనియర్ నేత, రవాణాశాఖ మాజీ మంత్రి ఎంఆర్ విజయ భాస్కర్ కేసును సీబీసీఐడీకి అప్పగిస్తూ డీజీపీ శంకర్ జివ్వాల్ శనివారం ఆదేశించారు. వివరాలు.. కరూర్ జిల్లా వాంగల్ కుప్పిచ్చి పాళయంకు చెందిన ప్రకాష్ పారిశ్రామిక వేత్త. ఈయన కరూర్ నగర పోలీసు కార్యాలయంతోపాటుగా ఎస్పీ కార్యాలయంలో కొద్ది రోజుల క్రితం ఓ ఫిర్యాదు చేశాడు. తనకు మాజీ మంత్రి విజయ భాస్కర్‌కు మధ్య గత కొన్నేళ్లుగా నగదు లావాదేవీలకు సంబంధించిన వ్యవహారాలను జరుగుతూ వచ్చినట్టు వివరించారు. తనకు తోరనకల్ పట్టిలోని రూ. 100 కోట్లు విలువ చేసే 22ఎకరాల స్థలంపై ఎంఆర్ విజయ భాస్కర్ కన్ను పడిందని ఆరోపించారు. ఆ స్థలాన్ని తనకు రాసి ఇవ్వాలని పదే పదే ఒత్తిడి తెచ్చారని, దీంతో తాను ఆ స్థలాన్ని తన కుమార్తె శోభన పేరిట సెటిల్ మెంట్ రాసి ఇచ్చినట్లు వివరించారు. అయితే, తన కుమార్తె శోభన ఆ స్థలాన్ని విజయ భాస్కర్ బినామీలకు రాసి ఇచ్చినట్టుగా నకిలీ పత్రాలను ప్రస్తుతం సృష్టించి ఉన్నారని, ఇందుకు సంబంధించిన దస్తావేజులను రూపొందించి రిజిస్ట్రేషన్ కూడా చేయించికుని ఉన్నారని పేర్కొన్నారు. ఈ సమాచారంతో ఆ నకిలీ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేయాలని సబ్ రిజిస్ట్రార్‌ను ఆశ్రయించినా ఫలితం శూన్యమని, తన స్థలాన్ని బలవంతంగా కబ్జా చేసిన విజయ భాస్కర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కేసును తొలుత కరూర్ నగర సెంట్రల్ క్రైం బ్రాంచ్ విచారణ చేపట్టింది. అయితే ఈ కేసును సీబీసీఐడీకి అప్పగిస్తూ డీజీపీ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసు సీబీసీఐడీకి అప్పగించబోతున్న సమాచారంతో ఎంఆర్ విజయ భాస్కర్ ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించడం గమనార్హం. శనివారం కరూర్ కోర్టులో బెయిల్ పిటిషన్ విచారణకు వచ్చింది. వాదనల అనంతరం తదుపరి విచారణను ఈనెల 19వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు.

చెన్నైకు ఖర్గే

సాక్షి,చెన్నై: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం చెన్నైకు వచ్చారు. బెంగళూరు నుంచి విమానంలో వచ్చిన ఆయనకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుంతొగైతో పాటు పలువురు నేతలు ఆహ్వానం పలికారు. రోడ్డు మార్గంలో ఆయన థౌజండ్ లైట్స్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. కాసేపటి తర్వాత మళ్లీ చెన్నై నుంచి విమానంలో బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించేందుకు ఆయన వచ్చి వెళ్లినట్లు తెలిసింది.

కులాంతర ప్రేమ వివాహం చిచ్చు

- నెల్లై సీపీఎం కార్యాలయంపై దాడి
- 13 మంది అరెస్టు
- దాడిని ఖండించిన పళణి స్వామి



ధ్వంసమైన వస్తువులు, యువతి బంధువుల వీరంగం

సాక్షి, చెన్నై : తిరునల్వేలి(నెల్లై)జిల్లా సీపీఎం కార్యాలయంపై దాడి జరిగింది. తమను ఆశ్రయించిన ప్రేమ జంటకు కులాంతర వివాహాన్ని సీపీఎం నేతలు జరిపించారన్న ఆగ్రహంతో యువతి బంధువులు ఈ వీరంగం సృష్టించారు. ఈ కేసులతో 13 మందిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. తిరునల్వేలికి చెందిన ఉదయ ద్రాక్షాయిణి, మదన్‌కుమార్ గత ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ ఇద్దరిది వేర్వేరు కులాలు. తమ పెళ్లికి పెద్దలు అంగీకరించరని భావించిన ఈ జంట తమకు రక్షణ కల్పించాలని, వివాహం చేయించాలని సీపీఎం నేతలను ఆశ్రయించారు. రెడ్డియార్ పట్టిలోని పార్టీ కార్యాలయానికి వచ్చి ఈ జంట ఆశ్రయం పొందారు. వీరికి గురువారం అదే కార్యాలయంలో సీపీఎం వర్గాలు వివాహం జరిపించాయి. అక్కడే ఈ జంట ఆశ్రయం పొందుతూ వచ్చారు. ఈ పరిస్థితులలో తమ కుమార్తెకు సీపీఎం వర్గాలు కులాంతర వివాహం చేయించారన్న సమాచారంతో ద్రాక్షాయిణి కుటుంబ సభ్యులు ఆగ్రహంతో ఊగిపోయారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలోకి చొరబడ్డారు. అక్కడున్న వస్తువులన్నీ ధ్వంసం చేశారు. వీరంగం సృష్టించి అక్కడి నుంచి ఉడాయించారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలలో నమోదు అయ్యాయి. రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ దాడిలో కీలక పాత్ర పోషించిన ద్రాక్షయిణి తల్లిదండ్రులు మురుగవేల్, సరస్వతితో పాటు 13 మందిపై కేసు నమోదు చేశారు. శనివారం ఉదయాన్నే వీరందర్ని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, పోలీసులు ఆ యువతి కుటుంబంతో కుమ్మక్కై వ్యవహరిస్తున్నారని సీపీఎం నాయకుడు కనకరాజ్ ఆరోపించారు. కులాంతర వివాహం చేసుకున్న వారిలో ఒకరు వెనుకబడిన సామాజిక వర్గానికి చెందిన వారని, అతడిని హతమార్చడమే లక్ష్యంగా ఆ కుటుంబం ఇక్కడకు వచ్చిందని పేర్కొన్నారు. ఆ కుటుంబంతో కొందరు పోలీసులు సంప్రదింపులలో ఉంటూ సమాచారాలు ఇచ్చినట్టు, దాడులు చేయించినట్టుగా తెలుస్తున్నదని ఆరోపించారు. వెనుకబడిన సామాజికవర్గానికి చెందిన వారిపై దాడి జరిగిందని, హత్యాయత్నం చేశారని, ఈ పరిణామాల నేపథ్యంలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసును పెట్టడంలో పోలీసులు వెనక్కు తగ్గుతున్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. ఇక ఈ దాడిని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణిస్వామి తీవ్రంగా ఖండించారు. కులాంతర వివాహం చేశారనే కారణంతో సీపీఎం కార్యాలయాన్ని ధ్వంసం చేసే విధంగా ముందుకెళ్లడం ఖండించ దగ్గ విషయంగా పేర్కొన్నారు. ఈ మేరకు దాడి జరగడం బట్టి చూస్తే, రాష్ట్రంలో డీఎంకే పాలనలో శాంతి భద్రతలు ఏ మేరకు క్షీణించాయో ప్రజలే అర్థం చేసుకోవాలని సూచించారు.

ముప్పెరుం విళాతో 'విజయోత్సవం'

- కోవైలో డీఎంకే కూటమి సంబరాలు
- ఇక, అన్నింటా విజయాలేనని ధీమా



సీఎం స్టాలిన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి ఉదయనిధి

సాక్షి, చెన్నై: ముప్పెరుం విళాతో లోక్‌సభ ఎన్నికల విజయోత్సవాన్ని కోయంబత్తూరు వేదికగా శనివారం డీఎంకే కూటమి జరుపుకుంది. డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ నేతృత్వంలో జరిగిన ఈ విళాలో కూటమి నేతలందరూ హాజరై ఆనందాన్ని పంచుకున్నారు. లోక్‌సభ ఎన్నికలలో డీఎంకే కూటమి పుదుచ్చేరితో పాటు తమిళనాడులో 40కు 40 స్థానాలు కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ పాత్ర కీలకం. దీంతో ఎన్నికలలో విజయం, స్టాలిన్‌కు అభినందన సభ, డీఎంకే దివంగత నేత కరుణానిధి శత జయంతి ఉత్సవాల ముగింపు వేడుకగా ముప్పెరుం విళాకు చర్యలు తీసుకున్నారు. రెండు దశాబ్దాల అనంతరం కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గం తమ గుప్పెట్లోకి రావడంతో ముప్పెరుం విళాకు వేదికగా ఆ నగరాన్ని ఎంపిక చేశారు. కోయంబత్తూరులోని కొడీస్సియ వేదికగా ముప్పెరం విళా బహిరంగ సభతో విజయోత్సవం కోలాహలంగా జరుపుకున్నారు. డీఎంకే కూటమిలోని కాంగ్రెస్ నేత సెల్వ పెరుంతొగై, వీసీకే నేత తిరుమావళవన్, సీపీఐ నేత ముత్తరసన్, సీపీఎం నేత బాలకృష్ణన్, కొంగునాడు మక్కల్‌దేశియ మక్కల్‌కట్చి నేత ఈశ్వరన్, మనిదనేయ మక్కల్ కట్చి నేత జవహరుల్లా, ద్రవిడ కళగం నేత వీరమణి, ఎండీఎంకే నాయకుడు దురై వైగో తో పాటు ఇతర మిత్ర పక్ష నేతలు పెద్దఎత్తున ఈ వేడుకకు హాజరయ్యారు. ఇందులో ప్రసంగించిన నేతలందరూ స్టాలిన్ ఘనతను గుర్తు చేస్తూ ప్రశంసలతో ముంచెత్తారు. ఉత్తరాది నుంచి పలు మార్లు పలువురు వచ్చి ఇక్కడ పాగాకు ప్రయత్నాలు చేసినా వారి పప్పులు ఉడక లేదని ఎద్దేవా చేశారు. కూటమిని అనుసరించి వెళ్లడంలో, వ్యూహాలకు పదును పెట్టడంలో స్టాలిన్ దీట్టా అని, అందుకే క్లీన్‌స్వీప్ చేశామని, ఇక తమిళనాడులో జరిగే ప్రతి ఎన్నికలలోనూ గెలుపు తథ్యమన్న ధీమాను వ్యక్తం చేశారు. అదే సమయంలో కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావాల్సిన అవశ్యం ఉందని, ప్రస్తుతం అధికారం దూరంగా నిలబడ్డా, రానున్న రోజులలో ఇండియా కూటమి అధికారంలోకి తీసుకు రావడంలో కీలక పాత్రను పోషించి తీరుతామన్న వ్యాఖ్యల తూటాలను నేతలు పేల్చారు. ఈ వేడుకకు డీఎంకే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లాల కార్యదర్శులు అందరూ తరలి వచ్చారు. పండుగ తరహాలో ఈ వేడుకను జరుపుకుని రానున్న 2026 ఎన్నికలలో గెలుపు తమదే అన్న ధీమాను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లోక్‌సభకు ఎన్నికైన కూటమి ఎంపీలు టి.ఆర్.బాలు, కనిమొళి, రాజా, దయానిధిమారన్, తమిళచ్చి తంగపాండియన్, తిరుమావళవన్, విజయవసంత్, జ్యోతిమణి తదితర 40 మందిని డీఎంకే యువజన ప్రధాన కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కూటమి అభ్యర్థుల గెలుపులో కీలక పాత్ర పోషించిన మంత్రులు, కూటమి నేతలను కూడా ఆయన సన్మానించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉదయనిధి స్టాలిన్‌ను డీఎంకే మంత్రులు సత్కరించారు. చివరగా ఇండియా కూటమిలోని రాష్ట్ర నేతలు స్టాలిన్‌ను ఘనంగా సన్మానించారు. ముందుగా చెన్నై నుంచి కోయంబత్తూరుకు చేరుకున్న స్టాలిన్‌కు డీఎంకే వర్గాలు బ్రహ్మరథం పట్టాయి.



స్టాలిన్‌ను సత్కరిస్తున్న మంత్రులు

మీరే నా నమ్మకం: స్టాలిన్

ఈ ఎన్నికలలో గెలుపు సాధారణ విజయం కాదని, కూటమిలోని ప్రతి పార్టీ కేడర్ శ్రమకు లభించిన ఫలితమని స్టాలిన్ తన ప్రసంగంలో వ్యాఖ్యానించారు. కొత్త చరిత్రను సృష్టించే విధంగా తీర్పు ఇచ్చిన తమిళ ప్రజలకు లభించిన గెలుపుగా అభివర్ణించారు. 40కి 40 గెలుస్తామన్న ధీమా తనకు ఇక్కడున్న ప్రతి కార్యకర్తల, నాయకుడి మీద తాను ఉంచిన నమ్మకమే ప్రధాన కారణమని అన్నారు. ఈ గెలుపుతో జాతీయ స్థాయిలో బీజేపీ ఒంటరిగా అధికారాన్ని చేజిక్కించుకోలేని పరిస్థితిని తీసుకువచ్చామని పేర్కొన్నారు. ద్రవిడ మోడల్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజలకు చేస్తున్న సంక్షేమం, గత ఐదు ఎన్నికలలో సమష్టిగా కూటమి నేతలందరూ కొనసాగుతుండడానికి నిదర్శనంగా ఈ విజయాన్ని ఆయన అభివర్ణించారు. ఇండియా కూటమి ఏకం కాకుండా పలు మార్గాలలో కేంద్రంలోని బీజేపీ బెదిరింపులు ఇచ్చినా, కూటమి చిన్నాభిన్నం చేయడానికి ప్రయత్నాలు చేసినా బెదరకుండా ముందుకు సాగి బీజేపీకి ముచ్చెమటలు పట్టించామన్నారు. మోదీ ఈ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారని, రెండు మిత్ర పక్ష పార్టీల పుణ్యాన ప్రస్తుతం అధికారంలో కొనసాగుతున్నారని ఎద్దేవా చేశారు. వెయిట్ అండ్ సీ ముందు ముందు ఏం జరుగుతుందో మీరే చూడబోతున్నారని వ్యాఖ్యానించారు.

కార్పొరేషన్‌గా మారనున్న ఊటీ



ఊటీ ఏరియల్ వ్యూ

కొరుక్కుపేట: క్వీన్ ఆఫ్ ది హిల్స్‌గా పేరొందిన ఊటీని త్వరలో కార్పొరేషన్‌గా తీర్చిదిద్దనున్నారు. ప్రస్తుతం తమిళనాడులో 25 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో చెన్నై, మధురై, కోయంబత్తూర్, సేలం, తిరుచ్చి, తిరునల్వేలి, తిరుపూర్, ఈరోడ్ , వెల్లూరు ప్రధాన నగరాలు. ఇది కాకుండా తిరువనంతపురం, దిండిగల్, తంజావూరు, హోసూర్, నాగర్‌కోయిల్, ఆవడి, కడలూరు, కాంచీపురం, కరూర్, శివకాశి, తాంబరం, కుంభకోణం, కారైకుడి, నామక్కల్, పుదుకోట్టై, తిరువణ్ణామలై నగరాలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో క్వీన్ ఆఫ్ ది హిల్స్‌గా పేరొందిన ఊటీ సిటీ కార్పొరేషన్‌గా మారనుంది. నీలగిరి కొండలలో ఉన్న ఈ నగరం చాలా చల్లగా ఉంటుంది. ప్రజలు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. క్రీ.శ.1818లో అప్పటి కోయంబత్తూరు జిల్లా అధికారి జాన్సెల్ లీవన్ ఈ స్థలాన్ని గుర్తించి తన కార్యాలయంగా ఏర్పాటు చేసుకున్నాడు. ఊటీ నగరం సముద్ర మట్టానికి 7,347 అడుగుల ఎత్తులో ఉంది. తరువాత అది వృత్తాకార నగరంగా అభివృద్ధి చెందింది. ఊటీ మునిసిపాలిటీ 2014 నాటికి జనాభా లెక్కల ప్రకారం 88,430కు చేరింది. ఇప్పుడు అంతకంటే ఎక్కువే ఉన్నారు. అందుకే దీన్ని కార్పొరేషన్‌గా మార్చేందుకు తమిళనాడు ప్రభుత్వం యత్నిస్తోంది. ఒక నగరాన్ని కార్పొరేషన్‌గా ప్రకటించాలంటే దాని జనాభా కనీసం 3 లక్షలు ఉండాలి. ఊటీ మున్సిపాలిటీతో పాటు నీలగిరిలోని కేతి మున్సిపాలిటీ మరికొన్ని ప్రాంతాలు ఈ జాబితాలో ఉన్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

19న నేచురల్లీ చెన్నై ఫెస్టివల్


మాట్లాడుతున్న నీనారెడ్డి

కొరుక్కుపేట: పర్యావరణే పరిరక్షణ లక్ష్యంగా గ్రీన్ గాడెసెస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన చెన్నై నగరంలో నేచురల్లీ చెన్నై పేరిట గ్రీన్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకురాలు నీనా రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో నీనారెడ్డితో పాటు గ్రీన్ గాడెసెస్ స్థాపకులు ప్రీతి త్యాగరాజన్, జయశ్రీ వివేక్, మంజు, అంజు అగర్వాల్ తదితరులు పాల్గొని మాట్లాడారు. నేచురల్లీ చెన్నై 5వ ఎడిషన్ షాపింగ్ ఫెస్టివల్‌ను ఈ నెల 19న ఉదయం 10.00 నుంచి రాత్రి 8.00 గంటల వరకు సవేరా హోటల్‌లో జరుగుతుందన్నారు. ఈ పండుగ సహజమైన, పర్యావరణ అనుకూలమైన, సేంద్రీయ, సంపూర్ణమైన, చేతితో తయారు చేసిన సంప్రదాయ ఉత్పత్తుల ప్రదర్శనగా ఉంచుతున్నట్లు తెలిపారు. సందర్శకుల కోసం సేంద్రియ సౌందర్య సాధనాలు, ఫ్యాషన్ నగలు, ఆహారం, చర్మ సంరక్షణ, దుస్తులు, బ్యాగ్‌లు, హస్తకళలు, ఉపకరణాలు సహా విభిన్న శ్రేణి ఉత్పత్తులను కొలువు తీర్చనున్నారని చెప్పారు. అన్వేషించడానికి అవకాశం ఉంటుంది. పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన వారికి గ్రీన్ అవార్డును ప్రదానం చేస్తున్నామని తెలిపారు. నేచురల్లీ గ్రీన్ అనే థీమ్‌తో ఫ్యాషన్ షో కూడా ఉంటుందని వెల్లడించారు.

విద్యుదాఘాతంతో యువతి మృతి

- ల్యాప్‌టాప్‌కు చార్జింగ్ పెడుతుండగా ప్రమాదం

అన్నానగర్: విరుదునగర్ జిల్లా రాజపాళ్యం సమీపంలోని చొక్కనాథన్ పుత్తూరు కృష్ణన్ కోవిల్ వీధికి చెందిన వ్యక్తి శక్తికుమార్ కుమార్తె సెంథిమయిల్ (22). ఆమె భర్త రాజారాం. వీరికి 3 సంవత్సరాల క్రితం వివాహమైంది. ప్రస్తుతం రాజారాం సౌదీఅరేబియాలో ఉద్యోగం చేస్తున్నాడు. సెంథిమయిల్ తన తల్లిదండ్రుల ఇంట్లో ఉంటోంది. శుక్రవారం సాయంత్రం తన ల్యాప్‌టాప్‌ను చార్జింగ్ పెట్టి వాడినట్లు తెలుస్తుంది. ఆ సమయంలో ఒక్కసారిగా ఆమెపై విద్యుత్ షాక్ కొట్టడంతో చేయి కాలిపోయి స్పృహతప్పి పడిపోయింది. ఆమె కేకలు విని అక్కడికి వచ్చిన శక్తికుమార్ వెంటనే సెంథిమయిల్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా విషాదం నింపింది. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుత్తణి అభివృద్ధికి ప్రత్యేక కృషి


తిరుత్తణిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ జగద్రక్షగన్

తిరుత్తణి: తిరుత్తణి అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం అందుబాటులో ఉంటానని ఎంపీ జగద్రక్షగన్ తెలిపారు. అరక్కోణం లోక్‌సభ స్థానంకు డీఎంకే నుంచి పోటీ చేసి 4వ సారి గెలుపొందారు. ఈ క్రమంలో తిరుత్తణి పట్టణంలో శుక్రవారం ఓటర్లను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపేందుకు వచ్చారు. డీఎంకే జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే చంద్రన్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ముందుగా మపోసీ రోడ్డు, మార్కెట్ వద్ద గాంధీ విగ్రహానికి పూల మాళ వేసి నివాళులర్పించి కార్యకర్తలతో కలిసి పట్టణ ప్రదాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ జగద్రక్షగన్ మాట్లాడుతూ... అరక్కోణం లోకసభ నుంచి 4 సార్లు గెలిపించడంతో తిరుత్తణి నియోజకవర్గం ప్రజలు ముందు వరసలో ఉన్నారని, ప్రతిసారి తనకోసం కష్టపడి, ఎన్నికల్లో పనిచేసి విజయానికి పాటుపడుతున్నట్లు పేర్కొన్నారు. తిరుత్తణి పట్టణంలో అభివృద్ధి పనులకు అధిక నిధులు కేటాయించి మెరుగైన సదుపాయాల కోసం పాటు పడుతానని తెలిపారు. మాజీ జిల్లా కార్యదర్శి భూపతి, పట్టణ కార్యదర్శి వినోత్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు అశోక్‌కుమార్, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మేళతాళాలతో ఊరేగింపుగా..


మేళతాళాలతో చిన్నారులను పాఠశాలకు తీసుకెళ్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

పళ్లిపట్టు: మేళతాళలతో ఊరేగింపుగా వెళ్లి 22 మంది చిన్నారులను ప్రభుత్వ బడిలో కొండాపురం గ్రామస్తులు చేర్పించడం ఆకట్టుకుంది. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట మండలంలోని అమ్మనేరి పంచాయతీలోని కొండాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొదటి తరగతిలో చిన్నారులు చేర్పించే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందుకోసం ఉపాధ్యాయులు, గ్రామస్తులు సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి కొత్తగా బడిలో ఒకటవ తరగతి చేరిన 22 మంది బాల, బాలికలకు ప్రభుత్వ పుస్తకాలతో పాటు, క్రీడా వస్తువులు, సహా 11 రకాల వస్తువులతో ఊరేగింపు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు గిరిజ, వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ సర్పంచ్ గోవిందరెడ్డి పాల్గొని చిన్నారుల ఊరేగింపులో పాల్గొన్నారు. చివరగా బడికి చేరుకుని విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో సదుపాయాలు ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు పేర్కొన్నారు.

జమాబందీలో 18 మందికి సత్వర న్యాయం


అర్హులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న జమాబందీ అధికారి సెల్వమది

పళ్లిపట్టు: ఆర్కేపేటలో జమాబందీ ముగింపోత్సవంలో 18 మంది అర్హులకు అధికారులు సర్టిపికెట్లు పంపిణీ చేశారు. ఆర్కేపేట తహసీల్దారు కార్యాలయంలో జూన్ 7న జమాబందీ (రెవెన్యూ రికార్డుల పరిశీలన) శిబిరం ప్రారంభమైంది. జమాబందీ అధికారి సెల్వమది ఆధ్వర్యంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరణ నిర్వహించారు. తాలూకా వ్యాప్తంగా మూడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల గ్రామాల పరిధిలోని ప్రజలు శిబిరాల్లో పాల్గొని ఉచిత ఇంటి పట్టాలు, పట్టా మార్పిడి, చిట్టా, పింఛన్లు, ప్రత్యేక ప్రతిభావంతులకు గుర్తింపు కార్డులు సహా వివిధ సహాయకాల కోసం వినతిపత్రాలు అందజేశారు. శుక్రవారం సాయంత్రం ముగింపోత్సవ కార్యక్రమంలో అర్హులుగా ఎంపిక చేసిన వారికి అధికారులు సర్టిపికెట్లు, సహాయకాలకు ఆదేశాలు అందజేశారు. ఈ సందర్భంగా జమాబందీ అధికారి సెల్వమది మాట్లాడుతూ ఐదురోజుల పాటు నిర్వహించిన జమాబందీ శిబిరంలో 365 వినతిపత్రాలు స్వీకరించినట్లు, వాటిలో 18 వినతి పత్రాలను వెంటనే పరిశీలించి సర్టిఫికెట్లు జారీ చేసినట్లు పేర్కొన్నారు. తహసీల్దారు విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్లు శేఖర్, రాజేంద్రన్, ఆర్‌ఐలు భాస్కరన్, పాండ్యన్, కణిమొళి, వీఆర్వోలు సహా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో విజిలెన్స్ దాడులు

వేలూరు: ఆరణి తహసీల్దార్ కార్యాలయంలో విజిలెన్స్ దాడులు జరిగాయి. తిరువణ్ణామలై జిల్లా ఆరణి తాలుకా రామచంద్రాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసన్. ఇతను ప్రస్తుతం ప్రభుత్వ కాంట్రాక్టర్. ఇతను ఆస్తి విలువ సర్టిఫికెట్ పొందేందుకు రూ.20 లక్షల రిజిస్టర్ పత్రాలకు రూ.7,900 నగదును డీడీగా చెల్లించి గ్రామ పరిపాలన అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఆరణి తహసీల్దార్ మంజుల వద్ద ఇచ్చాడు. పరిశీలించిన తహసీల్దార్ సర్టిఫికెట్ మంజూరుకు శ్రీనివాసన్ వద్ద రూ.20 వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేసింది. అతను అంత ఇచ్చుకోలేనని చెప్పడంతో రూ.10వేలు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో శ్రీనివాసన్ తిరువణ్ణామలై విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీంతో శనివారం ఉదయం విజిలెన్స్ డీఎస్పీ తిరువేల్ మురుగన్ ఆధ్వర్యంలో విజిలెన్స్ పోలీసులు శ్రీనివాసన్ వద్ద రసాయనం పూసిన రూ.10 వేలు నగదును ఇచ్చి పంపారు. నగదును తహసీల్దార్ వద్ద శ్రీనివాసన్ అందజేస్తుండగా విజిలెన్స్ అధికారులు తహసీల్దార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని విచారణ చేస్తున్నారు.


తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ పోలీసులు

95 ఏళ్ల వృద్ధురాలి హత్య

- అయిదున్నర తులాల బంగారం కోసం దారుణం

అన్నానగర్: తిరుచ్చి తిరువానైకావలిలో అయిదున్నర తులాల బంగారు నగల కోసం 95 ఏళ్ల వృద్ధురాలిని గొంతు కోసి హత్య చేశారు. దీనికి సంబంధించి పోలీసులు గుర్తుతెలియని వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. వివరాలు.. తిరుచ్చిలోని తిరువానైకావలిలో వాల్నెల్సన్ రోడ్డుకు చెందిన వ్యక్తి నారాయణన్ భార్య శేషాయి అమ్మాళ్ (95). ఈ దంపతులకు రాజా అనే కొడుకు ఉన్నాడు. శేషాయి అమ్మాల్ భర్త నారాయణన్, కుమారుడు రాజా కొన్నేళ్ల క్రితం చనిపోయారు. ఆ తర్వాత శేషాయి అమ్మాళ్ మాత్రమే తన ఇంటిలో ఒంటరిగా జీవిస్తున్నారు. ఈమె ఇంటి దగ్గర రెండు చిన్న ఇళ్లు ఉన్నాయి. వాటిని అద్దెకు ఇచ్చి వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే శేషాయి అమ్మాల్ రాత్రి భోజనం చేసి ఇంట్లో పడుకున్నారు. ఈ క్రమంలో అర్ధరాత్రి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు శేషాయి అమ్మాల్ మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవుల్లోని బంగారు కమ్మలను దోచుకునేందుకు యత్నించారు. ఆ దుండగుల నుంచి తప్పించుకోవడానికి శేషాయి అమ్మాల్ కేకలు వేశారు. ఆమె శబ్దం విని ఇరుగుపొరుగు వారు నిద్ర లేస్తారేమోనన్న భయంతో దుండగులు శేషాయి అమ్మాళ్ గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం ఆమె ధరించిన అయిదున్నర తులాల నగలను అపహరించి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ స్థితిలో శనివారం ఉదయం శేషాయి అమ్మాళ్ ఎంతసేపటికీ ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో ఇరుగుపొరుగు వారికి అనుమానం వచ్చి ఆమె ఇంటికి వెళ్లారు. అక్కడ శేషాయి అమ్మాల్ హత్యకు గురికావడం చూసి షాక్‌కు గురయ్యారు. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు నగల కోసమే హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడించారు.

ఇంట్లోకి చొరబడిన పాము

- పరుగులు పెట్టిన కుటుంబసభ్యులు

తిరువళ్లూరు: విద్యుత్‌శాఖ ఉద్యోగి ఇంట్లో చొరబడిన పది అడుగుల పామును అగ్నిమాపక సిబ్బంది పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. అయితే ఇంట్లోకి పాము చొరబడడాన్ని గమనించిన కుటుంబసభ్యులు భయాందోళనతో పరుగులు పెట్టడం కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా పూంగానగర్ ప్రాంతానికి చెందిన విద్యుత్‌శాఖ ఉద్యోగి ఫ్రాన్సిస్. ఇతని ఇంట్లోకి పది అడుగుల పాము చొరబడింది. పామును గుర్తించిన ఆ ఇంటి సభ్యులు భయాందోళనతో గట్టిగా కేకలు వేస్తూ రోడ్డుపైకి పరుగులు పెట్టారు. విషయం తెలుసుకున్న తిరువళ్లూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి పామును పట్టుకుని పూండి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.


పామును పట్టుకున్న అగ్నిమాపక సిబ్బంది

అస్వస్థతకు గురై ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి

కొరుక్కుపేట: తిరునెల్వేల్లి టౌన్ కోటీశ్వరన్ నగర్ కావేరి రోడ్ 3వ ప్రధాన రహదారికి చెందిన ఇంజినీర్ మారిముత్తు. ఆయనకు భార్య, కూతురు మారి లక్ష్మి (21), ఓ కుమారుడు ఉన్నారు. మారి లక్ష్మి చెన్నైలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతోంది. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా కళాశాలకు సెలవు కావడంతో చెన్నై నుంచి రైలులో తిరునెల్వేలికి వచ్చింది. అప్పుడు మారి లక్ష్మి తిన్న ఆహారం వల్ల అకస్మాత్తుగా అస్వస్థతకు గురైంది. వెంటనే తల్లిదండ్రులు ఆమెకు చికిత్స నిమిత్తం పాలైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆస్పత్రి నుంచి ఇంటికి పంపించారు. కాగా శనివారం ఉదయం మారి లక్ష్మి ఒక్కసారిగా ఊపిరి పీల్చుకోలేక పోయింది. దీంతో తల్లిదండ్రులు వెంటనే తిరునెల్వేల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అక్కడ అడ్మిట్ అయిన కొద్దిసేపటికే విద్యార్థిని మృతి చెందింది. దీంతో ఆమె తల్లి దండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

లోకేశ్ కనకరాజ్‌పై రజనీ ఆగ్రహం?


రజనీకాంత్, దర్శకుడు లోకేశ్ కనకరాజ్

తమిళసినిమా: సినిమా రంగంలో కోపతాపాలు, ఆరోపణలు, ప్రతి ఆరోపణలు సహజం. ఈ మధ్య నటుడు అజిత్ దర్శకుడు విఘ్నేశ్‌శివన్‌పై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారనే ప్రచారం జరిగింది. అందుకు కారణం చిత్ర కథను అనుకున్న టైంలో రెడీ చేయడంలో దర్శకుడు విఘ్నేశ్‌శివన్ విఫలం అయ్యారన్నదే. దీంతో ఆ చిత్రం నుంచి విఘ్నేశ్‌శివన్‌ను తొలగించారనే ప్రచారం జోరుగా సాగింది. ఆ చిత్రమే ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న విడాముయర్చి. ఇదే పరిస్థితిని దర్శకుడు లోకేశ్ కనకరాజ్ ఎదుర్కొంటున్నట్లు టాక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇంతకు ముందు ఈయన చేసిన చిత్రాలన్నీ(లియో చిత్రం మినహా) సంచలన విజయాలను సాధించాయన్న విషయం తెలిసిందే. తాజాగా రజనీకాంత్ హీరోగా కూలీ చిత్రాన్ని చేయనున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్ నుంచి, టైటిల్ ప్రకటన వరకూ అనూహ్య క్రేజ్‌ను తెచ్చుకున్నాయి. కూలీ చిత్రాన్ని జూన్ రెండవ వారంలో ప్రారంభించనున్నట్లు ప్రచారం జరిగింది. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించనుంది. ఈ చిత్రం కోసం రజనీకాంత్ తన 170వ చిత్రం వేట్టైయాన్‌ను త్వరగా పూర్తి చేసినట్లు సమాచారం. అయితే కూలీ చిత్రం అనుకున్న సమయానికి ప్రారంభం కాకపోవడంతో దర్శకుడు లోకేశ్ కనకరాజ్‌పై రజనీకాంత్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అయితే దర్శకుడు లోకేశ్ కనకరాజ్ కూలీ చిత్ర కథనాన్ని మూడు నెలలుగా రాస్తున్నారట. ఇంకా పూర్తికాకపోవడంతో షూటింగ్ ఆలస్యమైందని సమాచారం. ఆయన స్క్రిప్ట్ పక్కాగా పూర్తి అయిన తరువాతనే సెట్ పైకి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. దీంతో కూలీ చిత్రం జూలైలో ప్రారంభం అయ్యే అవకాశం ఉన్నట్లు తాజా సమాచారం. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉందన్నది గమనార్హం.

విమల్ టైటిల్ మారింది

తమిళసినిమా: సక్సెస్‌ఫుల్ చిత్రాల దర్శకుడు వెట్రిమారన్ ప్రస్తుతం సూరి, విజయ్‌సేతుపతి కలిసి నటిస్తున్న విడుదలై–2 చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దీని తరువాత సూర్య కథానాయకుడిగా వాడివాసల్ చిత్రానికి దర్శకత్వం వహించడానికి రెడీ అవుతున్నారు. మరో పక్క తన గ్రాస్ రూట్ ఫిలిం కంపెనీ పతాకంపై వైవిధ్యభరిత కథా చిత్రాలను నిర్మిస్తున్నారు. అలా ఆయన తాజాగా నిర్మిస్తున్న చిత్రం మాపోసీ అనే టైటిల్‌ను నిర్ణయించారు. ఈ చిత్రం పైనా చాలా ఆసక్తి నెలకొంది. నటుడు విమల్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి బోస్ వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విమల్ ఉపాధ్యాయుడిగా నటిస్తున్నారు. ఇది విద్య నేపథ్యంలో సాగే కథా చిత్రంగా రూపొందుతోంది. ఇప్పుడీ చిత్రానికి పేరు మార్చి సార్ అనే టైటిల్‌ను ఖారారు చేశారు. దీనికి సంబంధించిన వీడియోను దర్శకుడు సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. దీంతో సార్ బెటర్ టైటిల్ అని, చిత్ర కథకు సరైన యాప్ట్ అంటూ కామెంట్స్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇందులో నటి చాయాదేవి, శరవణన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఎస్ఎస్ఎస్ పిక్చర్స్ సిరాజ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి సిద్ధుకుమార్ సంగీతాన్ని, ఇనియన్ హరీస్ చాయాగ్రహణం అందిస్తున్నారు.


సార్ చిత్రంలో విమల్

కోలీవుడ్ టాక్స్


రామ్‌కుమార్‌తో విష్ణువిశాల్

విష్ణువిశాల్ హీరోగా
రాక్షసన్–2

తమిళసినిమా: నటుడు విష్ణువిశాల్, దర్శకుడు రామ్‌కుమార్ కాంబోలో 2018లో రూపొందిన చిత్రం రాక్షసన్. ఈ చిత్రం అప్పట్లో సంచలన విజయాన్ని సాధించింది. అదేవిధంగా ఇదే కాంబినేషన్‌లో వచ్చిన ముండాసిపట్టి చిత్రం మంచి విజయాన్ని సాధించింది. తాజాగా విష్ణు విశాల్, దర్శకుడు రామ్‌కుమార్ కాంబినేషన్‌లో మరో చిత్రం తెరకెక్కుతోంది. ఇది రాక్షసన్ చిత్రానికి సీక్వెల్ అని సమాచారం. దీన్ని సత్యజ్యోతి ఫిలింస్ పతాకంపై టీజీ.త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. రాక్షసన్ చిత్రం సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందగా, దానికి సీక్వెల్ ఫాంటసీ జానర్‌లో తెరకెక్కుతున్నట్లు సమాచారం. ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెలువడాల్సి ఉందన్నది గమనార్హం. విష్ణువిశాల్ ఇటీవల ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వంలో నటించిన లాల్ సలాం చిత్రం నిరాశపరచింది. అందులో రజనీకాంత్ అతిథి పాత్రలో నటించినా ఆశించిన ఫలితం రాలేదు. దీంతో విష్ణువిశాల్‌కు రాక్షసన్–2 చిత్రం చాలాకీలకంగా మారిందని చెప్పవచ్చు. దర్శకుడు రామ్‌కుమార్‌తో ఈయన హ్యాట్రిక్ కొడతారా అన్నది వేచి చూడాల్సిందే.

పుష్ప–2కు హైప్ మొదలైంది!


హన్సిక

తమిళసినిమా: టాలీవుడ్ స్టార్ హీరో అల్లుఅర్జున్, రష్మిక మందన్నా జంటగా నటించిన చిత్రం పుష్ప. చిత్రం ఎంత హిట్ అయ్యిందో, అంతకుమించి అందులోని పాటలు హిట్ అయ్యాయి. చిత్రంలో సమంత నటించిన ఊ అంటావా మామా అనే ఐటమ్ సాంగ్ కుర్రకారును గిలిగింతలు పెట్టించింది. ఈపాట దేశ వ్యాప్తంగా పాపులర్ అయ్యింది. పుష్ప చిత్రానికి ఎంతో హైప్ తెచ్చి పెట్టింది. పలువురు సినీస్టార్స్‌తో పాటు, ఇతరులు కూడా ఈ పాటకు డాన్స్ చేసి ఆ వీడియోలను వైరల్ చేశారు. అలా సమంత కూడా చాలా పాపులర్ అయ్యారు. అదేవిధంగా రష్మిక మందన్నా నటించిన రారా సామి అనే పాట కూడా బాగా వైరల్ అయ్యింది. తాజాగా పుష్ప–2 చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం ఆగస్ట్ 15న పాన్ ఇండియా స్థాయిలో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. ఇందులో రష్మిక నటించిన సామి హుక్ అనే పాట కూడా పుష్ప–2 చిత్ర హైప్‌ను పెంచేస్తోంది. ఈ పాటకు హన్సిక లంగా ఓణి ధరించి నలుగురు కుర్రాళ్లతో కలిసి చేసిన డాన్స్ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. ఈ చిత్రానికి చిత్ర యూనిట్ ఇంకా పబ్లిసిటీని ప్రారంభించలేదు. అయితే హన్సిక వంటి సెలబ్రిటీలు అందులోని పాటకు డాన్స్ చేయడంతో ఇప్పటి నుంచే ఫ్రీ పబ్లిసిటీ మొదలైందన్నమాట. ఈమె ప్రస్తుతం తెలుగు, తమిళం భాషల్లో నటిస్తున్న చిత్రాలు త్వరలో వరుసగా తెరపైకిరానున్నాయి.

ఆయనతో ఆ ముగ్గురు భామలు


కియారా అద్వాని, యష్, నయనతార, హ్యూమాఖురేషి

తమిళసినిమా: కేజీఎఫ్ చిత్రం తరువాత ఆ చిత్ర కథానాయకుడు తర్వాత నటించే చిత్రం అంటే ఆ రేంజ్‌కు ఏమాత్రం తగ్గకూడదు. ఎందుకంటే అంత ఎక్స్‌పెక్టేషన్స్ ఉంటాయి మరి. నటుడు యష్ అలాంటి జాగ్రత్తలే తీసుకుంటున్నారనిపిస్తోంది. కేజీఎఫ్ 1, 2 చిత్రాల తరువాత ఈయన టాక్సిక్ అనే చిత్రంలో నటించడానికి సిద్ధమయ్యారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందనున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి మహిళా దర్శకురాలు గీతు మోహన్‌దాస్ తెరకెక్కించనున్నారు. దీంతో చిత్రంలో మల్టీ భాషలకు చెందిన ప్రముఖ తారాగణం నటించనున్నారు. ముఖ్యంగా బీబీసీ సీరీస్ పిక్కీ బ్లైండర్స్ తరహాలో తెరకెక్కనున్న ఈ గ్యాంగ్‌స్టర్స్ కథా చిత్రంలో యష్ సరసన కియారా అద్వానీ నాయకిగా నటించనున్నారు. మరో ప్రధాన పాత్రలో కరీనాకపూర్ నటించనున్నట్లు ప్రచారం జరిగింది. అయితే తాజాగా ఆమె పాత్రలో నయనతార వచ్చి చేరినట్లు తెలిసింది. ఇందులో ఈమె యష్‌కు సిస్టర్‌గా నటించనున్నట్లు సమాచారం . అదేవిధంగా మరో బాలీవుడ్ భామ హ్యూమా ఖురేషి కీలక పాత్రను పోషించనున్నారని తెలిసింది. మరో విషయం ఏమిటంటే దర్శకురాలు ఈ చిత్ర షూటింగ్‌ను 200 రోజుల్లో పూర్తిచేయడానికి ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. అందులో 150 రోజులు లండన్ పరిసర ప్రాంతాల్లోనే చిత్రీకరించనున్నట్లు సమాచారం. అందుకోసం చిత్ర యూనిట్ త్వరలో యూకేకు బయలుదేరనున్నట్లు తెలిసింది. ఇకపోతే ఈ చిత్రాన్ని 2025, ఏప్రిల్ 10వ తేదీన తెరపైకి తీసుకురావాలని నిర్ణయించనట్లు తెలిసింది.

క్లుప్తంగా

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

తిరువొత్తియూరు: గిండి కత్తిపార వంతెన వద్ద బైకును ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. చెన్నై తిల్‌లైగంగానగర్ 26వ వీధికి చెందిన తేనెప్పన్న కుమారుడు యోగిచరణ్ (26). ఇతను వడపళనిలోని స్నేహితుని ఇంటి నుంచి శనివారం తెల్లవారుజామున బైక్‌లో ఇంటికి తిరిగి వెళుతున్నాడు. గిండి, కత్తిపారా వంతెనపై వెళుతుండగా మెట్రో రైలు పనుల కోసం ఇనుప వస్తువుల లోడ్‌తో వస్తున్న భారీ లారీ బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో యోగిచరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సెయింట్ థామస్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని క్రోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్ మహేష్‌కుమార్ యాదవ్‌ను అరెస్ట్ చేశారు.

యువకుడి ఆత్మహత్య

అన్నానగర్: ప్రియురాలు మాట్లాడలేదని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒడిశా రాష్ట్రానికి చెందిన దీప్తి రంజన్ (32). చెన్నై సమీపం మేడవాక్కంలో నివసిస్తున్నాడు. శుక్రవారం రాత్రి దీప్తి రంజన్ తాను ఉంటున్న గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పళ్లికరనై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో దీప్తి రంజన్ ఒడిశాకు చెందిన ఓ యువతిని ప్రేమించుకున్నారు. ఆమె అతనితో పాటు ఉంటూ తనతో కలిసి పని చేసింది. నెల రోజులుగా అతనితో యువతి మాట్లాడడం లేదు. దీంతో మనస్తాపం చెందిన దీప్తిరంజన్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది.

పసికందును నీట ముంచి హత్య

అన్నానగర్: జయంకొండాం సమీపంలో 38 రోజుల పసికందును నీటిలో ముంచి హత్య చేశారు. అరియలూరు జిల్లా చెక్కకోట వెల్లలార్ వీధికి చెందిన వీరముత్తు–రేవతి దంపతుల కుమార్తె సంగీత (28). ఈమెకు తంజావూరు జిల్లాకు చెందిన బాలమురుగన్ (31)తో ఏడాది క్రితం వివాహమైంది. బాలమురుగన్ తిరుపూర్‌లోని ఓ బనియన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సంగీత 38 రోజుల క్రితం మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ చిన్నారికి సాత్విక్ అని పేరు పెట్టారు. సంగీత బిడ్డతో తల్లిదండ్రుల ఇంట్లో ఉంటోంది. శనివారం వేకువజామున చిన్నారిని నిద్రపుచ్చి సంగీత కూడా నిద్రపోయింది. ఆమె తల్లి, తండ్రి బయట నిద్రిస్తున్నారు. ఉదయం సంగీత నిద్రలేచి చూసేసరికి పక్కన పాప కనిపించకపోవడంతో షాక్‌కు గురయ్యారు. ఇంటి వెనుక వెళ్లి చూడగా అక్కడ ఉన్న బ్యారెల్ నీటిలో చిన్నారి దుప్పటితో మునిగిపోయి చనిపోయి ఉండడం చూసి సంగీత కన్నీరుమున్నీరుగా విలపించింది. విషయం తెలిసి పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ ప్రారంభించారు. ఈ విషయమై పోలీసులు చిన్నారి తాత వీరముత్తు, అమ్మమ్మ రేవతిలను విచారిస్తున్నారు.

తాత్కాలిక బస్‌స్టేషన్ ఏఎఫ్‌టీ గ్రౌండ్

కొరుక్కుపేట: పుదుచ్చేరి బస్‌స్టేషన్‌లో బొల్లివూరు సిటీ ప్రాజెక్టు పనులు పూర్తిచేసేందుకు ఏఎఫ్‌టీ గ్రౌండ్‌ను ఆదివారం నుంచి తాత్కాలిక బస్టాండ్‌గా వినియోగించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కందస్వామి వేల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో.. పుదుచ్చేరి బస్‌స్టేషన్ వద్ద బొల్లివూరు సిటీ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో బస్సుస్టేషన్‌ను తాత్కాలికంగా ఏఎఫ్‌టీ గ్రౌండ్‌కు మార్చాలని సమావేశంలో నిర్ణయించారు. బస్‌స్టేషన్ కార్యకలాపాల కోసం గ్రౌండ్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, షెల్టర్ మౌలిక వసతులను త్వరితగతిన ఏర్పాటు చేస్తున్నారు. అందువల్ల, రాబోయే స్వల్పకాలానికి, పుదుచ్చేరి బస్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయ్యేవరకు, అన్ని రూట్ బస్సులు ఏఎఫ్‌టీ మైదానంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌గా నడవనున్నారు. ఈనెల 16వ తేదీ నుంచి ఏఎఫ్‌టీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న బస్‌స్టేషన్‌ను ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు.

బీజేపీ మహిళా నేత భర్తపై హత్యా యత్నం

- ఆరుగురు నిందితుల లొంగుబాటు

తిరువొత్తియూరు: చెన్నై తిరుమంగళం ప్రాంతంలో బీజేపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి భర్తను వెంటాడి వెంటాడి కత్తులతో దాడి చేసిన హత్యా యత్నానికి పాల్పడిన వ్యవహారంలో ఆరుగురు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. వారి వద్ద పోలీసులు విచారణ చేస్తున్నారు. వివరాలు.. చెన్నై తిరుమంగళం ప్రాంతానికి చెందిన నదియ (40) బీజేపీ మహిళా భాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఈమె భర్త శ్రీనివాసన్ (45). ఇతను శుక్రవారం మధ్యాహ్నం చెన్నై తిరుమంగళం గార్డెన్ ప్రాంతంలో బైక్‌లో వెళుతున్న సమయంలో ఓ ఆటోలో వచ్చిన ఆరుగురు అతన్ని అడ్డుకొని కత్తితో దాడి చేయడానికి యత్నించారు. ఇది గమనించిన శ్రీనివాసన్ వారి వద్ద నుంచి తప్పించుకోవడానికి పరిగెత్తాడు. అయినప్పటికీ వారు వెంటాడి శ్రీనివాసన్‌పై కత్తిరితో దాడి చేసి హత్య చేయడానికి ప్రయత్నించి పారిపోయారు. సమాచారం అందుకున్న తిరుమంగళం పోలీసులు ఆక్కడికి వెళ్లి రక్తపు మడుగులో పడి ఉన్న శ్రీనివాసన్‌ను అన్నానగర్‌లో ఉన్న ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సకు చేర్చారు. దీని గురించి వెస్ట్ మండలం జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్ తిరుమంగళం సహాయ కమిషనర్ పరమానందం, ఇన్‌స్పెక్టర్లు అక్కడికి వెళ్లి పరిశీలన చేశారు. శనివారం తెల్లవారుజామున నోలంబురు పోలీస్‌స్టేషన్లో శ్రీనివాసన్‌పై దాడి చేసిన ఆరుగురు లొంగిపోయారు. విచారణలో వారు ప్రసాద్, ప్రకాష్, శ్రీనివాసన్, శరవణన్, రమేష్, గణేషన్ అని తెలిసింది.

ప్రతిభకు దర్పణం ఖగోళ శాస్త్ర ప్రదర్శన

సాక్షి, చెన్నై: ఖగోళ శాస్త్ర ప్రదర్శన శాస్త్రవేత్తలు, పరిశోధకులు విద్యార్థుల ప్రతిభకు దర్పణం అని ఖగోళ శాస్త్ర విభాగం ఉపాధ్యక్షుడు డాక్టర్ అజిత్ సింగ్ తెలిపారు. గో కాస్మో యువర్ టికెట్ స్పేస్ పేరిట పళ్లికరణై బెల్ నగర్‌లోని ఆర్చిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో మూడు రోజుల ఖగోళ శాస్త్ర ప్రదర్శన ప్రారంభమైంది. శనివారం దీనిని డాక్టర్‌అజిత్ సింగ్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఖగోళ శాస్త్రవేత్తలకు కలిగే అనుభవాలు, అంతరిక్షంలోని వింతలు, విశేషాలను విద్యార్థులు తెలుసుకునేందుకు వీలుగా సాంకేతిక ప్రత్యేక సాంకేతిక పరికరాలను కొలువు దీర్చారు. ఏయే గ్రహాలు ఎంత బరువును కలిగి ఉంటాయో తెలిపే విధంగా ప్రత్యేక తూనిక పరికరం కూడా సిద్ధం చేశారు. వ్యోమోగాములు అంతరిక్ష యాత్ర విశేషాలను విద్యార్థులకు కళ్లకు



ప్రదర్శనకు హాజరైన అతిథులు, విద్యార్థులు

గట్టినట్టుగా ప్రదర్శన ద్వారా తెలియజేస్తున్నారు. కార్యక్రమంలో స్కూల్ అకడమిక్స్ ఉపాధ్యక్షుడు డాక్టర్ అన్నా మరియా, పళ్లికరణై స్కూల్ ప్రిన్సిపల్ రజిని ఛార్లెస్, ఆర్చిడ్స్ అకడమిక్స్ స్టూడెంట్ వెల్ఫేర్ ఉపాధ్యక్షుడు హరీష్ గుప్తా, జోనల్ హెడ్ శివకుమార్ పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధి అథారిటీకి కొత్త లోగో


లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రులు ఉదయనిధి, స్వామినాథన్, అన్బిల్ మహేశ్, కయల్ వెలి సెల్వరాజ్, ఐఏఎస్‌లు అతుల్య మిశ్ర, మేఘనాథరెడ్డి

సాక్షి, చెన్నై : తమిళనాడు క్రీడల అభివృద్ధి అథారిటీకి కొత్త లోగోను సిద్ధం చేశారు. దీనిని క్రీడల శాఖ మంత్రి ఉదయ నిధి స్టాలిన్ ఆవిష్కరించారు. తిరుప్పూర్‌లో శనివారం క్రీడా కారులకు క్రీడా కిట్ల పంపిణీ చేశారు. తమిళనాడు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో రాణించేందుకు వీలుగా అన్ని రకాల క్రీడా ఉపకరణాలను అందజేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ పొందేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. అలాగే స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీకి ప్రత్యేకంగా తమిళనాడు మ్యాప్‌తో సహా కొత్త లోగోను పసుపు, నీలం రంగుతో డిజైన్ చేసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉదయ నిధి మాట్లాడుతూ, తమిళ క్రీడాకారులకు అన్ని రకాలుగా ప్రోత్సాహకాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇక ఏ ఎన్నిక జరిగినా డీఎంకే దే గెలుపు అని వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికలలో క్లీన్ స్వీప్‌ను గుర్తు చేస్తూ రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ఇదే తరహా గెలుపుతో మళ్లీ అధికార పగ్గాలను డీఎంకే చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సామినాథన్, అన్బిల్ మహేశ్ పొయ్యమొళి, కయల్విళి సెల్వరాజ్, క్రీడల శాఖ కార్యదర్శి అతుల్య మిశ్రా, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ సభ్య కార్యదర్శి జె. మేఘనాథరెడ్డి పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా


ధర్నా చేస్తున్న టీచర్లు

వేలూరు: తమ డిమాండ్లు పరిష్కరించాలని తమిళనాడు పట్టభద్ర టీచర్ల సంఘం ఆధ్వర్యంలో వేలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాక్టోజియో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సేనా జనార్దన్ మాట్లాడుతూ కొత్త పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పథకాన్ని అమలు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాళీ టీచర్ పోస్టులను భర్తీచేయాలని, డీఎంకే ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, రాష్ట్ర వ్యాప్తంగా టీచర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జయకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జయ ప్రకాష్, కేజీ దేవి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఈశ్వర్ ఆనంద్, కార్యదర్శి సుధాకర్, తిరుకుమరన్, జిల్లా కార్యదర్శి మంజుల, రావణన్ పాల్గొన్నారు.

స్ట్రాహాన్స్ రోడ్డులో ట్రాఫిక్ మార్పులు

- మెట్రో పనుల కారణంగా అధికారుల నిర్ణయం

కొరుక్కుపేట: చెన్నై పులియాన్‌తోపులోని స్ట్రాహాన్స్ రోడ్‌లో మెట్రోపనుల కారణంగా శనివారం నుంచి ఈనెల 17వ తేదీ సోమవారం వరకు ట్రాఫిక్ మార్పులు చేశారు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు ఓ ప్రకటనలో తెలియజేశారు. స్ట్రాహాన్స్ రోడ్డులోని మొత్తం రెండు మార్గాలను తాత్కాలికంగా బ్లాక్ చేస్తారు. దీనికి బదులుగా, వాహనదారులు తమ గమ్యస్థానానికి చేరుకోవడానికి స్ట్రాహాన్స్ రోడ్, చెల్లప్ప వీధికి సమాంతరంగా ఉన్న న్యూ ఫెర్రాన్స్ రోడ్డును ఉపయోగించుకోవాలని కోరారు. ఎంటీసీ బస్సులు సహా వాహనాల కోసం ప్రత్యామ్నాయ మార్గాలు ఉంచారు. అయనావరం నుంచి మింట్‌కు చేరుకోవడానికి అయనావరం నుంచి ఓటేరి బ్రిడ్జి, కుక్స్ రోడ్డు, మేట్టుపాళయం జంక్షన్, స్టీఫెన్ సన్ రోడ్డు, డాక్టర్ అంబేద్కర్ కాలేజ్ రోడ్డు, పులియాన్ తోపు హైరోడ్డు, గాంధీ నగర్ రౌంటానా, బేసిన్ పవర్ రోడ్డు, బిబి టాప్ మీదుగా మింట్‌కు చేరుకోవచ్చును. అలాగే మింట్ నుంచి అయనావరం చేరుకోవడానికి వాహనాలు మింట్ నుంచి బిబి టాప్, బేసిన్ పవర్ రోడ్డు, గాంధీనగర్ రౌంటానా, బేసిన్ ఎలిఫెంట్ గేట్ రోడ్డు, –హాజ్ జంక్షన్ మీదుగా డెమెల్లోస్ రోడ్డు –పెరంబూరు బేరెక్స్ రోడ్డ మీదుగా పులియాన్‌తోపు పోలీసు స్టేషన్, అంబేద్కర్ కాలేజ్ రోడ్డు , స్టీఫెన్ సన్ రోడ్డు, కుక్స్ రోడ్డు, ఓటేరి బ్రిడ్జి, కూన్నూర్ హైరోడ్డు మీదు అయనావరం చేరుకోవచ్చు. పెరంబూరు నుంచి మింట్, మింట్ నుంచి పెరంబూరు, పెరంబూరు –సెంట్రల్– బ్రాడ్ వే తదితర ప్రాంతాల్లోను ట్రాఫిక్ మార్పులు చేసినట్టు ట్రాఫిక్ పోలీసు తెలిపారు. వాహనదారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించి వెళ్లాలని కోరారు.

విద్యార్థుల్లో ఆధ్యాత్మిక చింతన పెరగాలి


ఆలయంలో చిన్నజీయర్‌స్వామి, అహోబిళ రామానుజ జీయర్‌స్వామి

- త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఉద్బోధ
- సుందరకాండపై క్విజ్ పోటీలకు స్పందన

కొరుక్కుపేట: విద్యార్థుల్లో ఆధ్యాత్మిక చింతన పెరగాలని త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఉద్బోధించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్)– చెన్నై విభాగం ఆధ్వర్యంలో వాల్మీకి రామాయణంలోని సుందరకాండపై నిర్వహించిన క్విజ్ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్‌స్వామి మంగళ శాసనాలతో, ప్రత్యక్ష పర్యవేక్షణలో రాయపేట పీటర్స్ రోడ్డులోని ఈఎస్ శేషమహల్‌లో శనివారం సాయంత్రం క్విజ్ పోటీలు ప్రారంభమయ్యాయి. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. క్విజ్ విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలు, ప్రోత్సాహక బహుమతిగా ఐదుగురికి తలా రూ.1,000 చొప్పున చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా బహూకరించి ఆశీస్సులు అందించారు. అనంతరం అందరికీ అనుగ్రహ భాషణలు చేశారు. జెట్–చెన్నై అధ్యక్షుడు పి.రవీంద్రకుమార్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇందులో శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి, శ్రీసిటీ అధినేత రవిసన్నారెడ్డి, గోపురం పసుపు సంస్థ అధినేత వైవి హరికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయపేటలో ఉన్న శ్రీనివాస పెరుమాళ్ దేవస్థానంలో చిన్న జీయర్ స్వామి, అహోబిళ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆస్తి గొడవల్లో వ్యక్తి హత్య

- పెద్దనాన్నను కడతేర్చిన తమ్ముడి కుమారుడు

అన్నానగర్: ఆస్తి గొడవల్లో పెదనాన్నను తమ్ముడి కుమారుడు కడతేర్చాడు. చెంగల్పట్టు జిల్లా గూడువాంచేరి సమీపంలోని పెరుమత్తునల్లూరు పంచాయతీ పరిధిలోని ధార్కాస్ నగర్ తులుకట్టమ్మన్ కోవిల్ వీధికి చెందిన ఉత్తిరాడం (55). గుడువాంచెరి ఎలక్ట్రిసిటీ బోర్డు కార్యాలయంలో 15 ఏళ్లకు పైగా ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొద్ది నెలల క్రితం చెన్నై సమీపంలోని నంగనల్లూరు పవర్ బోర్డు కార్యాలయంలో చేరాడు. శనివారం ఉదయం ఉత్తిరాడం ఇంటి నుంచి దర్కాస్ నగర్ గ్రామ సమీపంలోని సరస్సు వద్దకు ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్లాడు. అప్పుడు అక్కడికి వచ్చిన తమ్ముడి కుమారుడు సుభాష్, ఉత్తిరాడంను కత్తితో నరికి పారిపోయాడు. అతని కేకలు విని ఇరుగుపొరుగు అక్కడికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ ఉత్తిరాడంను పొత్తేరిలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. గూడువాంచేరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఉత్తిరాడం, అతని తోబుట్టువులకు ఆస్తి వివాదం ఉంది. ఆస్తి వివాదంలో తమ్ముడు కుమారుడు హత్య చేసినట్లు తెలిసింది. పోలీసులు పారిపోయిన సుభాష్ కోసం గాలిస్తున్నారు.

కారులో మనిషి పుర్రెలు

- అఘోరాకు రూ.3 వేల అపరాధం

వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి తిరువణ్ణామలై సన్నది వీధిలో ఓ కారు నిలిచి ఉంది. కారు ముందుభాగంలో శివుడు ఆకారంతో కూడిన స్టిక్కర్, స్టీరింగ్ ముందు మనిషి పుర్రెలను వరసగా అమర్చి ఉండడాన్ని స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు విచారణ జరిపారు. విచారణలో వారణాసి నుంచి అఘోరా ఒకరు తిరువణ్ణామలైకి కారులో వచ్చినట్లు తెలిసింది. అఘోరా మాడ వీధిలో నడిచి వెళ్లినట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడకు వెళ్లి చూడగా ఎటువంటి దుస్తులు లేకుండా శరీరం పూర్తిగా విభూది పూసుకొని మెడలో రుద్రాక్ష మాల ధరించి తల వెంట్రుకలను చుట్టి కట్టుకొని అఘోరా నడిచి వెళుతున్నట్లు గుర్తించారు. పోలీసులు అతన్ని గిరివలయం రోడ్డులోని ఆశ్రమానికి తరలించారు. అఘోరా పుర్రెలతో కారులో రావడంతో పాటు ఎటువంటి దుస్తులు లేకుండా మాడ వీధుల్లో నడిచి వెళ్లడంతో పోలీసులు అతనికి రూ.3 వేలు అపరాధం విధించారు.

యువకుడి హత్య

- సగం కాలిన స్థితిలో మృతదేహం గుర్తింపు

అన్నానగర్: తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని చోళాపురం మున్సిపాలిటీలోని అయ్యానల్లూర్ కాళియమ్మన్ కోయిల్ వీధికి చెందిన రైతు తంబిదురై కుమారుడు గోకుల్ (25). ఇతడు కుంభకోణంలోని ఓ ప్రైవేట్ మెడికల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. గత 12వ తేదీ రాత్రి మెడికల్ నైట్ షిఫ్ట్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. మరుసటి రోజు ఉదయం గోకుల్ ఎంతసేపటికీ ఇంటికి రాలేదు. సెల్ ఫోన్ స్విచాఫ్ చేసి ఉంది. దీంతో షాక్ తిన్న తల్లిదండ్రులు గోకుల్ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. అయితే ఎక్కడా కనిపించకపోవడంతో చోళాపురం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పోలీసులు కేసు నమోదు చేసి గోకుల్ కోసం వెతికారు. ఈ స్థితిలో శనివారం ఉదయం కోవిలచేరి పంచాయతీ పాళవాట్రంగరై సమీపంలోని శ్మశాన వాటికలో ఓ యువకుడి మృతదేహం సగం కాలిన స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. చోళపురం పోలీసులు హుటాహుటిన వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లి విచారణ చేపట్టారు. ఆ సమయంలో సగం కాలిపోయిన శవం కనిపించకుండా పోయిన గోకుల్‌దిగా గుర్తించారు. గోకుల్‌ను హత్య చేసి దహనం చేసి ఉంటారని భావిస్తున్నారు. హంతకులు ఎవరు, అసలు కారణం ఏమిటనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

వైద్యసేవలు మెరుగు పడాలి


సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ ప్రభుశంకర్

తిరువళ్లూరు: ప్రభుత్వ వైద్యశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పేదలకు అందించే వైద్యసేవలను మరింత మెరుగు పడాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ ఆదేశించారు. తిరువళ్లూరు కలెక్టరేట్‌లో ప్రభుత్వ వైద్యశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందించే వైద్యసేవలను మరింత మెరుగు పరిచే అంశంపై అధికారులతో సమీక్ష శనివారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ వైద్యశాలలు, ఏరియా వైద్యశాలల్లో మౌలిక సదుపాయాలు, మందుల కొరత, రోగులకు అందించే వైద్యంలో నిర్లక్ష్యం వద్దని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో ఓపీ, ప్రసవం, చిన్నపిల్లలకు అందించే వైద్యం, ఆపరేషన్ విభాగం, డిస్పెన్సరీ, మందుల విభాగాలను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. వైద్యశాలలో కొరత, మౌలిక సదుపాయాలపై సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. దీంతో పాటు ఎక్స్‌రే, స్కానింగ్, ఈసీజీ, బ్లడ్‌బ్యాంకు, ల్యాబ్ పనితీరును మరింత మెరుగు పరచాలని ఆదేశించారు. రాత్రి సమయంలో వైద్యశాలకు వచ్చే రోగులకు అందించే వైద్యంపై ప్రత్యేకంగా చొరవ చూపాలని ఆదేశించారు. డీఆర్వో రాజ్‌కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రేవతి, జాయింట్ డైరెక్టర్ మీరా, వైద్యులు పాల్గొన్నారు.

చెన్నై కార్పొరేషన్‌లో రూ.22.44 కోట్ల పన్ను బకాయిలు

కొరుక్కుపేట: చెన్నై కార్పొరేషన్ తన అధికారిక వెబ్‌సైట్‌లో రూ.22.44 కోట్ల ఆస్తిపన్ను బకాయి ఉన్న 100 మంది జాబితాను ప్రచురించింది. ఆస్తి, వ్యాపార పన్ను చెన్నై కార్పొరేషన్ ప్రధాన ఆదాయ వనరు. 13 లక్షల మంది ఆస్తి యజమానుల నుంచి రూ.1,800 కోట్లకు పైగా ఈ పన్ను వసూలు చేస్తున్నారు. అదే సమయంలో, చాలా కాలం పాటు, కార్పొరేషన్‌కి ఆస్తి పన్ను చెల్లించని కంపెనీలు, వ్యక్తుల నుంచి ఆస్తిపన్ను వసూలు చేసేందుకు కార్పొరేషన్లు పలు చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ మే 31 వరకు ఆస్తి పన్ను చెల్లించని 100 మంది నోటీసును httpr://chennaicorporation.gov.in/ వెబ్‌సైట్‌లో ప్రచురించింది. కార్పొరేషన్ రూ.22.44 కోట్ల ఆస్తిపన్ను చెల్లించలేదని వారు నివేదించారు. ఈ విషయమై మున్సిపల్ కార్పొరేషన్ అధికారి మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈ అర్ధ సంవత్సరంలో రూ.487 కోట్లు వసూలు చేశామని, ఆస్తి పన్ను చెల్లించని వ్యక్తుల సమాచారాన్ని అప్‌లోడ్ చేయడం వంటి కార్యక్రమాల ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నారు. వెబ్‌సైట్‌లో, నోటీసులు జారీ చేయడం జప్తు చేయడం చేస్తామని పేర్కొన్నారు. ఈ 100 మంది వెంటనే ఆస్తిపన్ను చెల్లించకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దైవదర్శనానికి వెళ్తూ కానరాని లోకాలకు..

- చింతచెట్టును ఢీకొన్న కారు
- ఆంధ్రాకు చెందిన ముగ్గురి మృతి


సంఘటన స్థలంలో పోలీసులు

వేలూరు: చింతచెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఆంధ్రాకు చెందిన ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఆంధ్ర రాష్ట్రం గుంటూరు జిల్లా పెన్‌కురియంబాడి గ్రామానికి చెందిన శశిధరూర్, కల్యాణి (33) దంపతులు. వీరికి పింకా రామచంద్రన్, శ్రీరితిషా(8) ఇద్దరు పిల్లలు. వీరి బంధువులు బెంగళూరుకు చెందిన రవి(24) ఈశ్వరి కలిసి తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ దర్శనార్థం గుంటూరు నుంచి శుక్రవారం రాత్రి బయలుదేరారు. కారు తిరువణ్ణామలై జిల్లా పోలూరు జిల్లా కురివిమలై వద్ద వెళుతుండగా అదుపుతప్పిన కారు రోడ్డు పక్కన ఉన్న చింతచెట్టును ఢీకొంది. ఈప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జు కావడంతో కారులో ఉన్న రవి, కల్యాణి, రితిషా అక్కడికక్కడే మృతిచెందారు. భార్య, కుమార్తెలు ఇద్దరూ తన కళ్ల ఎదుటనే మృతిచెందడంతో శశిధరూర్ కన్నీరు మున్నీరయ్యారు. ఈశ్వరి, పింకారామచంద్రన్‌లకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలిసి పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకొని క్షత గాత్రులను పోలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరువణ్ణామలై ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి పోలీసులు విచారణ చేస్తున్నారు.

మాజీ రిజిస్ట్రార్ రూ.50 లక్షల వ్యయంపై విచారణ

కొరుక్కుపేట: సేలం పెరియార్ యూనివర్సిటీలో పలు అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు అందాయి. దీనిపై ఉన్నత విద్యాశాఖ నియమించిన ఐఏఎస్ అధికారి పళని సామి నేతృత్వంలోని ఇద్దరు సభ్యుల బృందం విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అందులో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జగన్నాథన్, మాజీ రిజిస్ట్రార్ తంగవేలు సహా నలుగురిపై అక్రమాస్తుల ఆరోపణలు రుజువయ్యాయి. ఇందులో మాజీ రిజిస్ట్రార్ తంగవేలు పదవీ విరమణ పొందారు. వైస్ చాన్సలర్ జగన్నాథన్ మూడేళ్ల పదవీ కాలం ఈ నెలతో ముగియనుంది. అయితే వీరిద్దరిపై యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం, కార్మిక సంఘం పలు ఆరోపణలు చేస్తూ గవర్నర్, ముఖ్యమంత్రికి ఫిర్యాదులు పంపాయి. ఈ కేసులో సేలం పెరియార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జగన్నాథన్, మాజీ రిజిస్ట్రార్ తంగ కదిరవన్‌కి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించేందుకు తంగవేలు పరీక్షల కమిషనర్ అదనంగా రూ. 50 లక్షలు ఖర్చు చేశారని, దీనిపై తగు విచారణ జరిపి డబ్బులు ఇప్పించాలని ఉపాధ్యాయ సంఘం అధినేత వైద్యనాథన్ ఫిర్యాదు చేశారు. విశ్వవిద్యాలయ నిధికి తిరిగి చేర్చాలని కోరుతూ ఆయన ఈ ఫిర్యాదును తమిళనాడు ప్రభుత్వానికి పంపారు.

- ఉత్సవాలు

భారతీయ వంటకాలపై దృష్టి పెట్టే విధంగా సెలబ్రిటీ చెఫ్ సారా టాడ్ నేతృత్వంలో వేళచ్చేరిలో ఫీనిక్స్ షాపింగ్ ఫెస్టివల్ 2024కు శనివారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జరిగిన ఫ్యాషన్ లోగో ఆవిష్కరణలో మోడల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. – సాక్షి, చెన్నై



సముద్రంలో పడవ బోల్తా

- ఇద్దరు మత్స్యకారుల మృతి
- మరొకరు గల్లంతు

అన్నానగర్: మండపం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి సముద్రంలో పడవ బోల్తాపడి ఇద్దరు మత్స్యకారులు మృతి చెందారు. గల్లంతైన మరొకరి కోసం కోస్ట్ గార్డ్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. వివరాలు.. తమిళనాడు కోస్తా తీరంలో చేపలు పట్టడంపై విధించిన నిషేధం శుక్రవారం అర్ధరాత్రితో ముగిసింది. దీంతో రామనాథపురం జిల్లా మండపం సేతునగర్‌కు చెందిన సుందరేషన్ పవర్ బోటులో మత్స్యకారులు బరకతుల్లా, ఖలీల్ రహమాన్, మహమ్మద్ హనీఫా, ప్రసాద్, ఆరోగ్యం ఉత్తర సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. ఈ నేపథ్యం మండపం తీరానికి 6 మైళ్ల దూరంలో ఉన్నప్పుడు, హఠాత్తుగా బోటులో ఇంజిన్ చెడిపోవడంతో సముద్రంలో మునిగిపోయింది. దీంతో అందులో ఉన్న ఐదుగురు మత్స్యకారులు తమను రక్షించమని అరిచారు. మరో బోటులో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు అక్కడికి చేరుకుని బోటులో ఉన్న మహమ్మద్ హనీబా, ప్రసాద్‌లను రక్షించారు. అయితే అప్పటికి బోటు బోల్తా పడడంతో బరకతుల్లా, ఖలీల్ రహమాన్, ఆరోగ్యం సముద్రంలో మునిగి గల్లంతయ్యారు. రక్షించిన మత్స్యకారు లిద్దరిని ఒడ్డుకు చేర్చారు. బోటు యజమాని సుదర్శన్ ఫిర్యాదు మేరకు మండపం తీరప్రాంత పరిరక్షణ పోలీసులు గల్లంతైన ముగ్గురు మత్స్యకారుల కోసం గాలింపు చేపట్టారు. ఇందులో ఆరోగ్యం, బరాక్కతుల్లా మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో మత్స్యకారుడి కోసం పోలీసులు తీవ్రంగా వెతుకుతున్నారు.

పోలీసులకు ఫైబ్రో స్కాన్ లివర్ స్క్రీనింగ్ పరీక్ష

సాక్షి, చెన్నై: పోలీసుల కోసం చెన్నై గ్లెనెగల్స్ హెల్త్ సిటీలో ఫైబ్రో స్కాన్ లివర్ స్క్రీనింగ్ క్యాంప్ ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్యాంప్‌ను శనివారం తాంబరం అదనపు పోలీసు కమిషనర్, ఐజీ సీ మహేశ్వరి ప్రారంభించారు. తాంబరం పోలీసు కమిషనరేట్ పరిధిలోని సిబ్బందికి వైద్య సేవలను మరింత చేరువ చేసే దిశగా హెల్త్ సిటీ నేతృత్వంలో గత కొంతకాలంగా వైద్య సేవలను విస్తృతంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఫైబ్రో స్కాన్ లివర్ స్క్రీనింగ్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు ఈ శిబిరంలో స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ


జ్యోతి ప్రజ్వలనతో క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఐజీ మహేశ్వరి

సందర్భంగా ఐజీ సీ మహేశ్వరి మాట్లాడుతూ, పోలీసులు ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక సేవలో భాగంగా నిబద్ధతతో పోలీసుల కోసం ఆరోగ్య సేవకు చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. హెల్త్ సిటీ సీఈఓ డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది తరచూ అధిక ఒత్తిడికి లోనవుతుంటారని, ఇది వారి కాలేయం మీద ప్రభావం చూపిస్తుందని, అందుకే ఈ శిబిరం ద్వారా కాలేయ పరిస్థితిని నొప్పి అన్నది లేకుండా, ఖచ్చితమైన అంచనాలతో పరీక్షించి, చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెపటాలజీ, ట్రాన్స్ ప్లాంట్ విభాగం డైరెక్టర్ జాయ్ వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బుర్రిపాలెం సచివాలయంలో టీడీపీ విధ్వంసం

- సచివాలయంలో పసుపు నీళ్లు చల్లి పలు పత్రాలను తగులబెట్టారు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వీడియోలు


సచివాలయంలో పసుపు నీళ్లు చల్లుతున్న టీడీపీ కార్యకర్త

బుర్రిపాలెం (తెనాలి): సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన రోజున తెనాలి రూరల్ మండలం బుర్రిపాలెంలో టీడీపీ కార్యకర్తలు సచివాలయాన్ని టార్గెట్ చేశారు. సచివాలయంలోని ప్రభుత్వ పథకాల బ్రోచర్లు, కరపత్రాలను బయటకు తీసుకువచ్చి తగులబెట్టారు. పసుపునీళ్లు కలిపి సచివాలయం పైనా, లోపల చల్లారు. సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తుల సమక్షంలోనే ఈ ఘటన జరిగినప్పటికీ దీనిపై ఎలాంటి ఫిర్యాదు లేదని తెలుస్తోంది. ఈ వీడియోలు ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చాయి. బుర్రిపాలెం సినీనటుడు సూపర్‌స్టార్ కృష్ణ స్వస్థలం. ఆయన కుమారుడు మహేశ్‌బాబు ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. అలాంటి బుర్రిపాలెంలో కేంద్ర మంత్రి పెమ్మసాని ఇంటికి ఫర్లాంగు దూరంలోనే ఈ ఘటన జరగటం గమనార్హం.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం వెనుక భాగం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం పట్టణ నడిబొడ్డున ఉన్న దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాన్ని దుండగులు గురువారం ధ్వంసం చేశారు. బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేస్తుండగా స్థానికులు గుర్తించి కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. అప్పటికే విగ్రహం ఎడమ చేయి బొటన వేలు, మెడ భాగం ధ్వంసమయ్యాయి.

వైఎస్సార్‌సీపీ నేత ఇంటి నిర్మాణం ధ్వంసం


పోలీసుల సమక్షంలోనే ఇంటి నిర్మాణాలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

కావలి: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలోని 13వ వార్డు పుల్లారెడ్డినగర్‌లో వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసులురెడ్డికి చెందిన నిర్మాణంలో ఉన్న ఇంటి గోడలను ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు శనివారం జేసీబీతో ధ్వంసం చేశారు. రెవెన్యూ అధికారులు జారీ చేసిన పట్టా ఉన్నప్పటికీ అధికారులు ఇంటి నిర్మాణాలను తొలగించారు. టీడీపీ నేతలు రాజకీయ కక్షతోనే తన ఇంటి పనులు అడ్డుకుని ధ్వంసం చేయించారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జేసీబీతో ధ్వంసం చేస్తుండగానే పోలీసులు వెళ్లి పరిశీలించారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ వర్గీయుల దాడి

తుగ్గలి: కర్నూలు జిల్లా తుగ్గలి మండల పరిధిలోని దిగువచింతలకొండలో వైఎస్సార్‌సీపీ నాయకుడిపై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసులు శుక్రవారం తన మేనల్లుడు సోమశేఖర్‌తో కలిసి పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నించేందుకు వెళ్లాడు. పని పూర్తి చేసుకుని ఇంటికి చేరుకున్నాడు. మరో పొలంలో దుక్కి దున్నేందుకు సోమశేఖర్ వెళ్లగా అదే సమయంలో శభాష్‌పురానికి చెందిన టీడీపీ వర్గీయులు గంగసాని చెన్నకేశవులు, రంగస్వామి, సురేష్, డీసీకొండకు చెందిన మనోజ్ పాత కక్షలను మనసులో పెట్టుకొని సోమశేఖర్‌పై దాడికి యత్నించడంతో వారి బారి నుంచి తప్పించుకున్నాడు. విషయం తెలుసుకున్న శ్రీనివాసులు అక్కడికి వెళ్లడంతో టీడీపీ వర్గీయులు రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడు పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆత్మహత్య


నివాళులర్పిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ఎన్నికల్లో పార్టీ ఓటమిని తట్టుకోలేక మనోవేదనకు గురై గుంటూరు జిల్లా చింతలపూడికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మండే రవీంద్ర (30) గురువారం రాత్రి పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. ఎన్నికల్లో రవీంద్ర పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ బూత్ ఏజెంట్‌గా పనిచేశాడు. రవీంద్ర భౌతికకాయం వద్ద పొన్నూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ నివాళుర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఆగని విధ్వంసం

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సచివాలయాలు, ఆర్బీకేల శిలాఫలకాలు, ఆర్చిల ధ్వంసం

- తణుకు మండలం మండపాకలో సచివాలయం, ఆర్బీకే శిలాఫలకాల ధ్వంసం
- నూజివీడులో అభివృద్ధి పనుల శిలాఫలకాలు కూల్చివేత
- ప్రకాశం జిల్లా చినమనగుండంలో టీడీపీ శ్రేణుల దుశ్చర్య
- చీమకుర్తి నూతన మునిసిపల్ కార్యాలయంపై వైఎస్సార్ పేరు తొలగింపు

సాక్షి నెట్‌వర్క్: టీడీపీ పార్టీ కార్యకర్తలు పేట్రేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ, శంకుస్థాపనల శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం మండపాకలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాల వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రాలున్న శిలాఫలకాలను టీడీపీ శ్రేణులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశాయి. శనివారం ఉదయం విధులకు హాజరైన సచివాలయ సిబ్బంది దీనిని గుర్తించారు. ఈ ఘటనపై తణుకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు తెలిపారు.

నూజివీడులో శిలాఫలకం కూల్చివేత

ఏలూరు జిల్లా నూజివీడు నెహ్రూ పేటలో శనివారం తెల్లవారుజామున ఒక శిలాఫలకాన్ని కూల్చివేశారు. వారం రోజుల క్రితం చాట్రాయి మండలం పోలవరంలో నాలుగు శిలాఫలకాలను ధ్వంసం చేయగా.. ఈ నెల 11న రాత్రి నూజివీడు మండలం బోర్వంచలో గ్రామ సచివాలయ భవనం కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. ఎంఎస్‌పాలెంలో రెండు శిలాఫలకాలను, సీతారామపురంలో ఒక శిలాఫలకాన్ని, తూర్పుదిగవల్లిలో గ్రామ సచివాలయం బోర్డును ధ్వంసం చేశారు.


ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం చినమనగుండం సచివాలయ శిలాఫలకం ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్త

సచివాలయంపై టీడీపీ జెండా

ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం చినమనగుండం సచివాలయం ప్రారంభోత్సవ శిలాఫలకాలను టీడీపీ కార్యకర్తలు నెలకుర్తి దినేష్, గుత్తా మహేందర్ ధ్వంసం చేశారు. సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం వద్ద ఉన్న శిలాఫలకం కూడా ధ్వంసం చేశారు. అనంతరం గ్రామ సచివాలయంపై టీడీపీ జెండా పెట్టారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యాలను టీడీపీ కార్యకర్తలు వీడియో తీసి వాట్సాప్ గ్రూపుల్లో పెట్టి మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని కామెంట్లు పెట్టారు. ధ్వంసం చేసిన శిలాఫలకాల బోర్డులను, సచివాలయ భవనాలను శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ వడ్లమూడి మురళీమోహన్, ఎంపీటీసీ కోండ్రు వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు పరిశీలించారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి నాగార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొదిలి సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ మాధవరావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఐ, ఎస్ఐ చెప్పారు.



ప్రకాశం జిల్లా చినమనగుండం సచివాలయ భవనంపై టీడీపీ కార్యకర్తలు పెట్టిన జెండా


నూజివీడు మండలం బోర్వంచలో ధ్వంసమైన గ్రామ సచివాలయం కిటికీ అద్దాలు


మండపాకలో జగనన్న కాలనీలోని వెల్‌నెస్ సెంటర్ వద్ద నవరత్న పథకాల శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన టీడీపీ శ్రేణులు


వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును తొలగించిన నూతన మునిసిపల్ కార్యాలయ భవనం

వైఎస్సార్ పేరు తొలగింపు

ప్రకాశం జిల్లా చీమకుర్తిలోని నూతన మునిసిపల్ కార్యాలయంపై గల దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు, కార్యాలయం ప్రవేశ ఆర్చిపై ఉన్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి, వెంకాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ పేర్లను టీడీపీ నాయకులు శనివారం తొలగించారు. మునిసిపల్ కార్యాలయం 6 నెలల క్రితం ప్రారంభం కాగా.. ఆర్చిని బూచేపల్లి శివప్రసాదరెడ్డి సొంత నిధులతో నిర్మించారు. వీటితో పాటు చీమకుర్తిలోని ప్రభుత్వాస్పత్రి ప్రవేశ ద్వారం ఆర్చిపై ఉన్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి, వెంకాయమ్మ పేర్లను కూడా తొలగించారు. ఈ ఘటనలపై వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, కౌన్సిలర్ సోమా శేషాద్రి, గోపురపు చంద్ర, ఆముదాలపల్లి రామబ్రహ్మం తదితరులు సీఐని కలిసి వినతిపత్రం అందించారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


బూచేపల్లి సుబ్బారెడ్డి, వెంకాయమ్మ పేర్లను తొలగించిన ఆర్చి

పుంగనూరులో రెచ్చిపోయిన టీడీపీ నేతలు

- దళిత నేత, ఇద్దరు బీసీ నాయకులపై దాడి
- వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం.. ఇల్లు ధ్వంసం

పుంగనూరు: చిత్తూరు జిల్లా పుంగనూరులో వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత నేత, ఇద్దరు బీసీ నాయకులపై టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడి చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం పుంగనూరులో సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. దీనిని అడ్డుకుంటామని, సమావేశాన్ని జరగనివ్వబోమని టీడీపీ నేతలు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించారు. వైఎస్సార్‌సీపీ దళిత నేత, మాజీ ఎంపీపీ నరసింహులు, మల్లుపల్లికి చెందిన గోపీనాథ్ సమావేశానికి వస్తుండగా టీడీపీ నేతలు అడ్డుకుని వారిపై దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన నరసింహులును మదనపల్లె ఆస్పత్రికి స్థానికులు తరలించారు. అలాగే, ర్యాలీ పుంగనూరులోని ఎంబీటీ రోడ్డు వద్దకు చేరుకోగా..పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న పీకేఎం ఉడా మాజీ చైర్మన్, బీసీ నేత వెంకటరెడ్డి యాదవ్ ఇంటిపై టీడీపీ నేతలు నవీన్, ఎల్‌పీ.రమణ, ఉమేష్ తదితరులు రాళ్ల దాడి చేసి ఇంటి అద్దాలను ధ్వంసం చేశారు. ఇంట్లో ఉన్న వెంకటరెడ్డి యాదవ్‌పై ఇనుపరాడ్లతో దాడి చేసి, హత్యాయత్నం చేయబోయారు. ఆ సమయంలో యాదవ్ సన్నిహితులు ఆయనను కాపాడారు.


గాయపడిన నరసింహులు నుంచి వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసులు

విషయం తెలుసుకున్న ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, తదితర వైఎస్సార్‌సీపీ నేతలు యాదవ్‌కు మద్దతుగా ఆయన ఇంటి వద్దకు భారీగా చేరుకున్నారు. దాడిపై వెంకటరెడ్డి యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, పోలీస్‌స్టేషన్ ఎదురుగా కూడా దాడులు జరిగినా పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం.

పెద్దిరెడ్డి రాజీనామా చేయాలంటూ టీడీపీ ధర్నా

తన పదవికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రాజీనామా చేయాలని కోరుతూ టీడీపీ నేతలు పుంగనూరు అంబేడ్కర్ సర్కిల్‌లోని జాతీయ రహదారిపై బైఠాయించారు. శనివారం పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరులోని పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు 'గతంలో చంద్రబాబును అడ్డుకున్నారు కదా? ఇప్పుడు పెద్దిరెడ్డిని అడ్డుకుంటాం..పెద్దిరెడ్డి రాజీనామా చేయాలి' అంటూ నినాదాలు చేశారు.

వైఎస్సార్‌సీపీ నేతల దుకాణాలు, ఇళ్లు ధ్వంసం

- విజయవాడ మాజీ డెప్యూటీ మేయర్ కారు అద్దాల ధ్వంసం
- పార్టీ కార్యకర్త టైలరింగ్ దుకాణంపై దాడి
- మరో నాయకుడి కారు అద్దాలు ధ్వంసం
- పల్నాడు జిల్లా గొట్టిపాళ్లలో వైఎస్సార్‌సీపీ నేతల గృహాల్లోని సామగ్రి దహనం

సాక్షి, విజయవాడ: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరుల ఇళ్లు, వాహనాలు, కార్యాలయాలపై టీడీపీ నాయకులు, కార్యకర్తల దాడులు కొనసాగుతున్నాయి. అజిత్‌సింగ్‌నగర్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్త జహీర్‌బాషాకు చెందిన టైలరింగ్ దుకాణాన్ని టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. కుట్టుమెషిన్లు, ఎల్ఈడీ టీవీ, ఇతర ఫర్నిచర్ ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దిరెడ్డి శివారెడ్డి కారు అద్దాలను పగులగొట్టారు. ఇంటిపై రాళ్లు రువ్వి శివారెడ్డిని దుర్భాషలాడారు. ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరి ఎన్నికల్లో పనిచేసిన నగర మాజీ డెప్యూటీ మేయర్ గోగుల రమణ కారు అద్దాలను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరిపై ఏకంగా దాడికి పాల్పడ్డారు.


గొట్టిపాళ్లలో టీడీపీ నాయకులు దహనం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంట్లోని వస్తువులు

వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లలో సామగ్రి దహనం

వెల్దుర్తి: వైఎస్సార్‌సీపీ నాయకులకు చెందిన రెండు గృహాలపై టీడీపీ శ్రేణులు దాడికి తెగబడి ఇళ్లల్లోని సామగ్రిని దహనం చేసిన ఘటన పల్నాడు జిల్లా గొట్టిపాళ్లలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పిన్నెబోయిన బాలగురవయ్య యాదవ్, పల్లపాటి వీరనారాయణ యాదవ్ గృహాలపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు గుంపులుగా వచ్చి దాడి చేశారు. ఆ రెండు గృహాల్లో ఉన్న విలువైన సామగ్రి, పత్రాలపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. టీడీపీ శ్రేణులు దాడులు చేస్తారనే భయంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఊరు వదిలి వెళ్లిపోగా.. మహిళలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇదే అదనుగా భావించిన టీడీపీ శ్రేణులు ఆ రెండు ఇళ్లపై దాడులకు పాల్పడి మొత్తం సామగ్రిని దహనం చేశారు. రూ.10 లక్షల విలువైన వస్తువులు కాలిపోయినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

రాజకీయ కక్షతో వైఎస్సార్‌సీపీ నేత ఇల్లు కూల్చివేత

అక్రమణల నెపంతో విజయవాడలో టౌన్‌ప్లానింగ్ అధికారుల హడావుడి

పాయకాపురం (విజయవాడ రూరల్): విజయవాడ ప్రకాష్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీకి చెందిన కోఆప్షన్ సభ్యుడు నందెపు జగదీశ్‌కు చెందిన భవనాన్ని వీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం కూల్చి వేశారు. 12 ఏళ్ల క్రితం మంజూరు చేసిన ప్లాన్ ప్రకారం సర్వే నంబర్ 89లో జగదీశ్ 3 పోర్షన్ల భవనాన్ని నిర్మించారు. ప్లానింగ్ అధికారులు శుక్రవారం భవన యజమానులకు సమాచారం ఇవ్వకుండా కొలతలు తీసి భవనానికి నోటీసులు అంటించారు. శనివారం కూల్చివేత చేపట్టారు. జగదీశ్ భార్య సౌభాగ్యలక్ష్మి భవనం కూల్చివేస్తున్నారని తెలుసుకొని భవనం దగ్గరకు వచ్చి ఎందుకు కూల్చి వేస్తున్నారని అధికారులను అడుగుతున్నా ఎలాంటి సమాధానం చెప్పకుండా భవనం వెనుకవైపు కూల్చి వేశారు. భవనం పక్కనే ఉన్న రేకుల షెడ్డును కూడా ఆక్రమణలో ఉందని, వీఎంసీ స్థలంలో నిర్మించినట్లుగా గుర్తించామని చెబుతూ కొంత కూల్చివేశారు. దీనిపై కోర్టు స్టే ఉండటంతో అధికారులు కూల్చివేతను నిలిపివేశారు.


భవనం కూల్చివేస్తున్న వీఎంసీ సిబ్బంది

రాజకీయ కక్షలే కారణం..

రాజకీయ కక్షలతోనే భవనం కూల్చివేత జరిగిందని సౌభాగ్యలక్ష్మి పేర్కొన్నారు. హరిబాబు అనే వ్యక్తి నుంచి 214 గజాల స్థలాన్ని కొనుగోలు చేశామన్నారు. 12 ఏళ్ల క్రితం విజయవాడ కార్పొరేషన్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి అనుమతులు తీసుకొని భవనం నిర్మించామని, భవనం నిర్మాణంలోని ఆక్రమణలను అధికారులు ఇప్పుడే గుర్తించడం ఏమిటని ప్రశ్నించారు. అధికార పార్టీ నేతల ఆదేశాలతో అధికారులు భవనం కూల్చివేత చేపట్టగా..ఆ విషయం తెలుసుకుని వచ్చిన వైఎస్సార్‌సీపీ నగర ప్రధాన కార్యదర్శి విజయకుమార్ ఆకస్మికంగా ఎందుకు కూల్చుతున్నారని ప్లానింగ్ అధికారి కృష్ణను ప్రశ్నించారు. ఫిర్యాదు ఇప్పుడే అందింది కాబట్టి కూల్చివేస్తున్నామని అధికారులు సమాధానమిచ్చారు.

బందరు ర్యాలీలో టీడీపీ కార్యకర్తల వీరంగం

- మాజీ మంత్రి పేర్ని ఇంటిపై రాళ్లతో దాడి
- అడ్డుకున్న పోలీసులకూ తప్పని రాళ్ల దెబ్బలు

సాక్షి, విజయవాడ: బందరు నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన కొల్లు రవీంద్ర విజయోత్సవ ర్యాలీలో టీడీపీ కార్యకర్తలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారు. ర్యాలీలో పాల్గొన్న టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల ఇళ్లను టార్గెట్‌గా పెట్టుకుని బైక్ ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీ బస్టాండ్ సెంటర్‌లో ఉండగానే టీడీపీ కార్యకర్తలు జెడ్పీ సెంటర్ నుంచి చిలకలపూడికి వెళ్లే రోడ్డులోకి పెద్ద ఎత్తున బైక్‌లపై చేరుకున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న కొంతమంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై భౌతిక దాడి చేసి మిగిలిన కార్యకర్తలను రెచ్చగొట్టారు. పోలీసులు భారీగా అక్కడికి చేరుకుని సమస్యను సద్దుమణిగించారు. మూడు స్తంభాల సెంటర్ నుంచి కోనేరు సెంటర్, బస్టాండ్ సెంటర్, లక్ష్మీటాకీస్ సెంటర్, జెడ్పీ సెంటర్, చిలకలపూడి, పరాసుపేటల మీదుగా అర్ధరాత్రి ఒంటి గంటకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం సమీపానికి ర్యాలీ చేరుకుంది. అక్కడ టీడీపీ కార్యకర్తలు కొల్లు రవీంద్రకు మద్దతుగా నినాదాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై రాళ్లతో దాడి చేశారు. పేర్ని నాని ఇంటికి అడ్డుగా ఉన్న బారికేడ్‌లను తప్పించి ముందుకు వెళ్లేందుకు యత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉంచుకున్న రాళ్లను పేర్ని నాని ఇంటి వైపు టీడీపీ కార్యకర్తలు విసిరారు. పరుష పదజాలంతో దూషించారు. పోలీసులను పక్కకునెట్టి బారికేడ్‌లపై నుంచి దూకి పార్టీ కార్యాయలంలోకి వెళ్లేందుకు యత్నించారు. దీన్ని అడ్డుకునే క్రమంలో పలువురు పోలీసులకూ రాళ్ల దెబ్బలు తగిలాయి.

హామీలు నెరవేర్చకుండా విపక్షంపై దాడులా?

వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు ధ్వజం

సాక్షి, అమరావతి: నారా లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగమే ఈ ప్రభుత్వం పతనానికి కారణం అవుతుందని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు చెప్పారు. ఎన్నికలు ముగిసిన తరువాత విపక్ష నేతలు, కార్యకర్తల ఇళ్లపై దాడులను తొలిసారిగా చూస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, పవన్ కళ్యాణ్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తమకు ఓటు వేయని వారిపై దాడులకు పురిగొల్పడం సరికాదని సూచించారు. తాడేపల్లిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇలాంటి ఆటవిక రాజ్యాన్ని బిహార్, యూపీలో సైతం చూడలేదన్నారు. మీరు టీడీపీ కార్యకర్తలా? లేక గూండాలా? అని ప్రశ్నించారు. ఈ అకృత్యాలను ప్రధానితోపాటు రాజ్యాంగ వ్యవస్థల దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు కక్ష సాధింపు కోసం అధికారం ఇవ్వలేదని గుర్తుంచుకోవాలన్నారు. అధికారులకు 'రాజకీయ' బ్రాండింగ్ ఇవ్వటం ఏమిటని విస్మయం వ్యక్తం చేశారు. కులం, వర్గం, రాజకీయ రంగులు పులిమి సమాజాన్ని చంద్రబాబు ఎటు తీసుకెళ్లాలనుకుంటున్నారని ప్రశ్నించారు. జగన్ ఓడాడు కానీ చావలేదు..! చచ్చేదాకా కొట్టాలి! అంటూ విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేత అయ్యన్నపాత్రుడికి ప్రజలు సరైన సమయంలో కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు. 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయో చెప్పాలన్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ప్రశ్నకు కూటమి నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పాలనలో చట్టం, స్వేచ్ఛను కాలరాసి అన్యాయం రాజ్యమేలుతుందని ధ్వజమెత్తారు. భావి తరాలకు హింసా సంస్కృతిని నేర్పవద్దని సూచించారు.



నూతన ప్రభుత్వం దాడులను అరికట్టాలి

సామాజిక ఉద్యమకారులు డాక్టర్ బైరి నరేష్, రెంజర్ల రాజేష్

పొన్నూరు: రాష్ట్రంలో జరుగుతున్న దాడులను అరికట్టే విధంగా నూతన ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సామాజిక ఉద్యమకారులు డాక్టర్ బైరి నరేష్, రెంజర్ల రాజేష్ సూచించారు. గుంటూరు జిల్లా పొన్నూరులో శనివారం 'ఎన్నికల అనంతరం దళిత బహుజనులపై దాడులు' అనే అంశంపై ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. న్యాయవాది పొందుగల చైతన్య అధ్యక్షత వహించారు. డాక్టర్ బైరి నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఎన్నికల అనంతరం జరిగిన దాడులపై న్యాయ విచారణ జరిపించాలని కోరారు. ఈ విషయంపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని, ఈ ఘటనలను సుమోటోగా తీసుకోవాలని కోరారు. ప్రముఖ అంబేడ్కరిస్ట్ రెంజర్ల రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వం మారిన వెంటనే మాదిగ, మాల పల్లెలపై దాడులు జరుగుతున్నాయని, అక్రమంగా కేసులు పెడుతూ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అక్రమ కేసులను వెంటనే తొలగించాలని లేదంటే ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. త్వరలోనే రాజకీయ పార్టీలకు అతీతంగా నిజనిర్ధారణ కోసం అన్ని ప్రాంతాలకు వెళ్లి బాధితులను కలుస్తామన్నారు. వివిధ సంఘాల నాయకులు పెరికల రమణయ్య, మాకాని బాలు, వై.వందనం, దేవరపల్లి సునీల్, రాజు, బలబద్ర శ్రీనివాస్, పుచ్చర్ల శోభన్‌బాబు, వాసిమల్ల విజయ్, షేక్ దాదా హుస్సేన్, అచ్యుతరాజ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బైరి నరేష్

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

రాయదుర్గం: అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామంలో పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త రవీంద్రనాథ్‌రెడ్డిపై టీడీపీ కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. కాలవ శ్రీనివాసులు ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత శనివారం తొలిసారి రాయదుర్గం వచ్చారు. ఊరేగింపు అనంతరం మురడిలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. స్థానిక టీడీపీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తరఫున సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే రవీంద్రనాథ్‌రెడ్డి ఇంటి వద్ద పెద్దఎత్తున బాణాసంచా పేల్చారు. దీంతో పొగ భారీగా అతడి ఇంట్లోకి వెళ్లింది. టపాసులు కాస్త దూరంగా పెట్టుకోవచ్చు కదా అని రవీంద్రనాథ్‌రెడ్డి తన ఇంట్లో వారితో అనడంతో ఇది విన్న కొందరు టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. అతనిపై దాడి చేసి దుస్తులన్నీ చించేశారు. ఇంట్లోకి చొరబడి సామగ్రిని చెల్లాచెదురు చేశారు. రవీంద్రనాథ్‌రెడ్డితో వైఎస్సార్‌సీపీ రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు.

వైరల్



బ్యూటీఫుల్ ఫాదర్ అండ్ డాటర్

ఆటవిడుపులో భాగంగా సెలబ్రిటీలు కుటుంబంతో గడిపే సంతోష సమయాలు వారికి మాత్రమే పరిమితమైనవి కాదు. అభిమానులకు కూడా సంతోషం కలిగిస్తాయి. 'క్రికెటర్‌గా రోహిత్‌శర్మ ఏమిటి?' అని చెప్పడానికి బోలెడు సమాచారం ఉంది. 'తండ్రిగా రోహిత్ ఏమిటి?' అని చెప్పడానికి ఈ వైరల్ ఫొటో ఒక్కటి చాలు. 'ఫాదర్స్ డే' సందర్భంగా నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. సముద్రపు ఒడ్డున తన కూతురు సమైరతో కలిసి రోహిత్‌శర్మ ఇసుకలో పిచ్చుక గూడు కడుతున్న ఫొటో 'ఆహా' అనిపిస్తోంది. ఈ ఫొటోకు 'ఫ్యామిలీ టైమ్ ఈజ్ ది బెస్ట్ టైమ్' అని కాప్షన్ ఇచ్చారు నెటిజనులు.

'ది ఫాదర్, ది కెప్టెన్, ది హిట్‌మ్యాన్, ది భయ్యా, ది ఓపెనర్' అని ఒక యూజర్ కామెంట్ పెట్టాడు.

మరో యూజర్ 'బ్యూటీఫుల్ డాటర్ అండ్ ఫాదర్. లవ్ యూ మై మ్యాన్' అని కామెంట్ పెట్టాడు.

కన్నా... నేనున్నా



తల్లి ఎదురుగా ఉంటే ఎంతమంది ఉంటే మాత్రం ఏమిటి? సంప్రదాయ నృత్య దుస్తులు ధరించిన అమ్మాయి భయం భయంగా స్టేజీ ఎక్కింది. ఎదురుగా ఎంతోమంది జనం. తన వైపే చూస్తున్నారు. 'భయపడవద్దు' అన్నట్లుగా సైగ చేసింది తల్లి. అంతేకాదు...మ్యూజిక్ స్టార్ట్ కాగానే డ్యాన్స్ స్టెప్స్‌ను ఆటిస్టిక్ కుమార్తెకు చూపెట్టడం మొదలుపెట్టింది. స్టేజీ ముందు ఉన్న తన తల్లిని నిశితంగా గమనిస్తూ అందంగా, అద్భుతంగా డ్యాన్స్ చేసింది ఆ అమ్మాయి. 'స్పెషల్-నీడ్స్ చిల్డ్రన్ ఆలనా పాలనకు ఎంతో ఓపిక, అంకితభావం కావాలి. అవి ఈ తల్లిలో కనిపిస్తున్నాయి' అని నెటిజనులు స్పందించారు. అపర్ణ అనే యూజర్ 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

మస్కా మజాకా!

తన 'తప్పట్టం' సినిమా పోస్టర్‌ను 'వరల్డ్-ఫేమస్' చేసినందుకు ఎలాన్ మస్క్‌కు కృతజ్ఞతలు తెలియజేశాడు తమిళ చిత్ర నిర్మాత ఆదమ్ భవా. 'హౌ ఇంటెలిజెన్స్ వర్క్స్' కాప్షన్‌తో డిజైన్ చేసిన మీమ్ పోస్టర్‌ను 'ఎక్స్'లో షేర్ చేశాడు మస్క్.



ఈ పోస్టర్‌లో ఇద్దరు నటులు కొబ్బరి నీటిని షేర్ చేసుకుంటూ కనిపిస్తారు. ఈ కొబ్బరినీటి షేరింగ్‌ను యాపిల్, ఓపెన్ ఏఐల మధ్య డేటా షేరింగ్ డైనమిక్స్‌తో పోల్చుతుంది ఈ మీమ్. అంత పెద్ద ఎలాన్ మస్క్ 'ఎక్స్'లో పోస్ట్ చేయడంతో 'తపట్టం' సినిమా పోస్టర్ రాత్రికి రాత్రే వైరల్ అయింది. లక్షల వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఈ పోస్టర్ పుణ్యమాని యాపిల్-ఓపెన్ ఏఐ భాగస్వామ్యం గురించి చర్చ కూడా జరుగుతుంది.

నాన్న ఇచ్చిన రెక్కలు

ఫాదర్స్ డే స్పెషల్

ఇంటి గడప దాటకూడని ఆంక్షలు
అక్కడా ఇక్కడా ఇంకా కొనసాగుతున్నా
నేడు భారతీయ యువతులు
ఆకాశమే హద్దుగా ఎదుగుతున్నారు.
ఎగురుతున్నారు.
కొడుకు ఎంతో కూతురూ అంతే
అనే ఎరుక కలిగిన తల్లిదండ్రులు
వారిని ప్రోత్సహిస్తున్నారు.
అమ్మ ఆశీస్సులు ఉన్నా నాన్న ప్రోత్సాహమే
తమను ముందుకు నడిపిందని
ఈ మహిళా ఫ్లయింగ్ ఆఫీసర్లు అంటున్నారు.
దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో
శనివారం నిర్వహించిన
పాసింగ్ ఔట్ పరేడ్‌లో పాల్గొన్న
మహిళా ఫ్లయింగ్ ఆఫీసర్ల విజయగాథలు ఇవి.



తండ్రి శ్రీకాంత్, తల్లి ప్రజ్ఞతో శ్రీప్రియ

నాన్న మాటే ఇంధనం

నా పేరు శ్రీప్రియ మోదలే. మాది మహారాష్ట్రలోని పూణే. నాన్న శ్రీకాంత్ మోదలే. అమ్మ ప్రజ్ఞ మోదలే. మా తల్లిదండ్రులకు నేను ఒక్కదాన్నే సంతానం. అయినా కూడా మా తల్లిదండ్రులు నన్ను ఎంతో ప్రోత్సహించారు. మా నాన్న పెట్రోల్ పంపులకు సంబంధించిన చిన్న వ్యాపారం చేస్తారు. అమ్మ ఇంట్లోనే ఆహారం తయారు చేసి అమ్ముతుంది. ఇలా దిగువ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చినా నా తల్లిదండ్రులు నన్నెప్పుడూ నిరాశపర్చలేదు. మా నాన్నైతే నీకు నచ్చిన వృత్తిలో వెళ్లు అని వెన్నుతట్టి ప్రోత్సహించారు. నేను పూణే యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ఆ తర్వాత ఎట్మాస్ఫియరిక్ సైన్సెస్‌లో ఎంటెక్ చేశాను. ఆ తర్వాత రీసెర్చ్ అసోసియేట్‌గా, స్విమ్మింగ్ కోచ్‌గా, జాతీయ స్థాయి కరాటే ప్లేయర్‌గా, సెల్ఫ్ డిఫెన్స్ ఇన్‌స్ట్రక్టర్‌గా రకరకాల పనులు చేశాను. ఇన్ని చేసినా ఎక్కడో అసంతృప్తి నాలో ఉండేది. దేశ సేవలో భాగం అయ్యేందుకు నాకున్న బలాలను, అవకాశాలను ఆలోచించాను. దేశ రక్షణ కోసం పనిచేసే ఉద్యోగం కరెక్ట్ అనిపించింది. అందుకే నేను భారత వాయుసేన వైపు రావాలని నిర్ణయించుకుని కష్టపడ్డాను. చివరకు ఫ్లయింగ్ ఆఫీసర్‌గా శిక్షణ పూర్తి చేయడం సంతోషాన్ని, ధైర్యాన్ని ఇచ్చింది. వాయుసేన ఆపరేషన్స్ అన్నింటికీ వాతావరణ సమాచారం అత్యంత కీలకమైంది. వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అందించే కీలక బాధ్యతలు దక్కడం నాకు సంతోషంగా ఉంది.

– శ్రీప్రియ, ఫ్లయింగ్ ఆఫీసర్



తండ్రి శివ్‌నారాయణ్, సంతోషికుమారిలతో నందిని సొరిత్

నాన్నే నాకు స్ఫూర్తి

నా పేరు నందినీ సొరిత్. హర్యానాలోని పల్వల్ జిల్లా మా స్వస్థలం. నాన్న శివ్‌నారాయణ్ సొరిత్, అమ్మ సంతోషికుమారి సొరిత్. మా నాన్న ఫ్లయిట్ లెఫ్టినెంట్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. చిన్నప్పటి నుంచి అన్ని విషయాల్లో ఆయనే నాకు స్ఫూర్తి. మా తల్లిదండ్రులకు నేను ఒక్కగానొక్క సంతానం. పైగా అమ్మాయిని అయినా నాన్న నాకు ఎప్పుడూ ఎలాంటి ఆంక్షలూ లేకుండా పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. మా నాన్న కోరిక వల్లే నేను ఎయిర్ ఫోర్స్‌లో చేరాను. 'నా కూతురు ఎంతో ఉన్నతంగా అందరికంటే ఎత్తులో ఉండాలి' అని నాన్న నాకు చెబుతూ ఉండేవారు. అదే నాలో చిన్ననాటి నుంచి స్ఫూర్తి నింపింది. నేను ఎన్‌సీసీ కేడెట్‌ను. జాతీయ స్థాయిలో అథ్లెట్‌ను. భారత వాయుసేనలో చేరిన తర్వాత శిక్షణ సమయంలో ఇవి నాకు ఎంతో ఉపయోగపడ్డాయి. కఠోర శిక్షణ పూర్తి చేసి ఈ రోజు నేను ఫ్లయింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకోవడం ఎంతో గర్వంగా ఉంది. నా తల్లిదండ్రులు ఇప్పుడు నా పక్కన ఉండడం నాకు మరింత సంతోషంగా ఉంది. నేను శిక్షణలో ఆర్డర్ ఆఫ్ మెరిట్‌తో ఎడ్యుకేషన్ బ్రాంచ్‌కు ఎంపికయ్యాను. వాయుసేనకు సంబంధించిన కీలక బాధ్యతలు అవి.

– నందినీ సొరిత్, ఫ్లయింగ్ ఆఫీసర్

నాన్నే దేశసేవ చేయమన్నారు

మాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. శామిలి జిల్లా. పుట్టిపెరిగింది అంతా ఢిల్లీలోనే. అక్కడే కేంద్రీయ విద్యాలయ్‌లో చదువుకున్నాను. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీకామ్ పూర్తి చేశాను. మా నాన్న రవీందర్‌కుమార్ ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీసర్, అమ్మ అంజేష్ గృహిణి. ఎయిర్‌ఫోర్స్‌లో చేరడానికి ముందు నేను ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తుండేదాన్ని.'ఆ ఉద్యోగాలు చేసేందుకు అందరూ ఉత్సాహపడతారు. కాని దేశ సేవ కోసం కొందరే ముందుకు వస్తారు. నువ్వు దేశ సేవ చేయమ్మా' అని నాన్న అన్నారు. నా మొదటి



తండ్రి రవీందర్‌కుమార్, తల్లి అంజేష్‌లతో మాన్వి

ప్రయత్నంలోనే ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు ఎంపికయ్యాను. మా కుటుంబంలో భారత సైన్యంలోకి వచ్చిన మొదటి ఆఫీసర్‌ని నేనే. అందుకు నాకు గర్వంగా ఉంది. శారీరకంగా, మానసికంగా ఎంతో గొప్ప ఉద్యోగం ఇది. అకాడమీకి రాక ముందు, ఇప్పుడు ట్రైనింగ్ పూర్తి చేసిన తర్వాత నాలో నేనే ఎంతో మార్పు గమనించాను. ఇక్కడ వృత్తిగతంగానే కాదు వ్యక్తిగత జీవితానికి సంబంధించి కూడా ఎన్నో అంశాలు నేర్చుకున్నాను. నాపై నాకు ఆత్మవిశ్వాసం పెరిగింది. నేను అకౌంట్స్ బ్రాంచ్‌లో ఉత్తమ కేడెట్‌గా నిలిచాను. నాకు ఇప్పుడు అకౌంట్స్ బ్రాంచ్ ఇచ్చారు.

– మాన్వి, ఫ్లయింగ్ ఆఫీసర్

– నాగోజు సత్యనారాయణ, స్టేట్ క్రైం రిపోర్టర్, హైదరాబాద్.
ఫొటోలు: నోముల రాజేశ్

హెల్త్

గర్భవతులు మరింత బరువు పెరిగితే..?



గర్భధారణ సమయంలో కొందరు మహిళలు బరువు పెరగడం మామూలే. అది పరిమితంగానే ఉంటే పర్లేదు. కానీ మరీ ఎక్కువగా బరువు పెరిగితే కొన్ని అనర్థాలు రావచ్చు. అవి తల్లికీ, బిడ్డకూ సమస్యలు తెచ్చిపెట్టవచ్చు.

● **గర్భవతుల్లో స్థూలకాయం అంటే...**

గర్భవతులు కొంత బరువు పెరగడం సాధారణమే అయినప్పటికీ... బాడీ మాస్ ఇండెక్స్ ప్రకారం... ఆ మహిళ ఎత్తుకు తగినట్లుగా ఉండాల్సిన బరువు కంటే (బీఎమ్ఐ 30 కంటే) ఎక్కువ ఉంటే దాన్ని ఒబేసిటీగా పరిగణించవచ్చు.

● **గర్భిణుల్లో దుష్ప్రభావాలు...**

సాధారణ సమస్యలు: ఇతర మహిళలతో పోలిస్తే బరువు పెరుగుతున్న గర్భిణుల్లో సాధారణ ఆరోగ్య సమస్యలైన గుండెమంట, ఛాతీలో మంట, కొన్ని మామూలు ఇన్ఫెక్షన్ల వంటివి వచ్చే అవకాశాలు కాస్త ఎక్కువ.

జెస్టేషనల్ డయాబెటిస్: గర్భవతిగా ఉన్న టైమ్‌లో ఒంట్లో చక్కెర మోతాదులు పెరగడం వల్ల వచ్చే డయాబెటిస్‌ను 'జెస్టేషనల్ డయాబెటిస్' అంటారు. ఈ సమస్య వచ్చినప్పుడు కడుపులోని బిడ్డ బరువు పెరగడంతో తల్లికి ప్రసవం కష్టం కావడం.

ప్రీ-ఎక్లాంప్సియా: గర్భంతో ఉన్నప్పుడు వచ్చే అధిక రక్తపోటు (హైబీపీ / హైపర్‌టెన్షన్)ను 'ప్రీ-ఎక్లాంప్సియా' అంటారు. ఒంట్లోకి చేరిన ద్రవాలు అదే స్థాయుల్లో బయటకు వెళ్లకపోవడం వల్ల ఒంట్లో వాపు వచ్చి 'ప్రీ-ఎక్లాంప్సియా'తో కొన్నిసార్లు కడుపులోని చిన్నారికి రక్తప్రసరణ తగ్గడం.

నొప్పులు చాలాసేపు రావడం: బరువు పెరిగిన మహిళల్లో ప్రసవం నొప్పులు చాలాసేపు వస్తూనే ఉండటం.

సిజేరియన్‌కు అవకాశాలు పెరగడం: మామూలు ప్రసవానికి అవకాశాలు తగ్గడంతో కొన్నిసార్లు సిజేరియన్ తప్పకపోవడం.

● **బిడ్డలకు కలిగే అనర్థాలు**

మ్యాక్రోసోమియా: కడుపులో బిడ్డ అనూహ్యంగా బరువు పెరగడంతో ప్రసవ మార్గం (బర్త్ కెనాల్) నుంచి తేలిగ్గా ప్రసవం కాకపోవడంతోపాటు... బర్త్‌కెనాల్ నుంచి బిడ్డ భుజాలు రావడం కష్టం. ఇలాంటి సందర్భాల్లో బిడ్డకు గాయాలయ్యే (షోల్డర్ డిస్టోసియా) ప్రమాదం ఎక్కువ.

బిడ్డలో ఎదుగుదల / వికాసం లోపించడం: ప్రసవం తేలిగ్గా జరగకపోవడంతో ఫోర్‌సెప్స్ డెలివరీ వంటివి జరిగినా లేదా ప్రసవం వెంటనే జరగక బిడ్డ మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోవడంతో బిడ్డ ఎదుగుదల / మెదడు వికాసంలో లోపాలు.

న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్: బిడ్డ వెన్నుపాము ఎదుగుదల సాధారణ స్థాయిలో జరగకపోవడం వల్ల కలిగే సమస్యను 'న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్' అంటారు. బిడ్డ పుట్టుకకు ముందుగా మహిళలు తగినంత ఫోలిక్ యాసిడ్ తీసుకోని సందర్భాల్లో ఫోలిక్ యాసిడ్ లోపం ప్రెగ్నెన్సీ టైమ్‌లో బరువు పెరుగుతున్న మహిళల్లోనూ ఈ ప్రమాదం ఏర్పడే అవకాశం.

పిల్లల్లో స్థూలకాయం : తల్లికి స్థూలకాయం ఉంటే పిల్లల్లోనూ ఊబకాయం వచ్చి, పెద్దయ్యాక కూడా అది కొనసాగే అవకాశమెక్కువ. భవిష్యత్తులో గుండె సమస్యలు వచ్చే అవకాశాలూ ఎక్కువే.

● **వైద్య పరీక్షలు...**

గర్భిణులు రొటీన్‌గా చేయించే పరీక్షలతోపాటు బిడ్డలో న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్స్ తెలుసుకునేందుకు గర్భధారణ తర్వాత మూడోనెలలో అల్ట్రాసౌండ్ పరీక్ష ద్వారా గుర్తించవచ్చు. (స్థూలకాయం ఉన్నవారిలో... వారి కడుపులోని కొవ్వు పొరల కారణంగా... కొన్ని సమస్యలు స్పష్టంగా తెలియకపోవచ్చు. ఈ రకంగా చూసినా గర్భిణుల్లో బరువు పెరగడం, లావెక్కడం ప్రమాద సూచికలే.)

● **నివారణ / మేనేజ్‌మెంట్...**

● గర్భవతిగా ఉన్నవారు మరీ ఎక్కువ బరువు పెరగకుండా జాగ్రత్త తీసుకోవడం.

● ఆ టైమ్‌లో తీసుకోవాల్సిన మంచి సమతులాహారం, చేయాల్సిన వ్యాయామాలపై అవగాహన కలిగి ఉండటం.

● ముందునుంచే ఎక్కువ బరువు ఉండేవారు గర్భధారణ తర్వాత అకస్మాత్తుగా బరువు తగ్గకూడదు. అలా తగ్గితే బిడ్డకు అందాల్సిన క్యాలరీలు, పోషకాలు అందకపోవచ్చు. అందుకే ఆ సమయంలో పిండం ఎదుగుదలకు కావాల్సినంత ఆహారం తీసుకుంటూ ఉండాలి. బిడ్డలో తెలివితేటలు, వికాసానికి అడ్డుపడే న్యూరల్ ట్యూబ్ సమస్యల నివారణకు ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకున్నప్పటి నుంచే 'ఫోలిక్ యాసిడ్' టాబ్లెట్లు క్రమం తప్పకుండా తీసుకుంటూ ఉండటం.



డాక్టర్ బి. రూప
ఆబ్‌స్టెట్రీషియన్ & గైనకాలజిస్ట్

● మయాల్జియా

కండరాల నొప్పులూ... ఒంటి నొప్పులు!



ప్రతి ఒక్కరూ ఏదో ఒక దశలో ఒళ్లు నొప్పులతో బాధపడటం సహజం. వైద్యపరిభాషలో 'మయాల్జియా'అని పిలిచే ఈ ఒళ్లు నొప్పులనేవి ఒక వ్యాధి కాదు... ఎన్నో రుగ్మతల్లో కనిపించే ఒక లక్షణం మాత్రమే. నిజానికి అది కండరాల నొప్పి, మృదుకణజాలంలో నొప్పి, ఎముకల్లో నొప్పులు, నరం లాగడం... ఇలా అది ఏదైనా... అవన్నీ ఒళ్లు నొప్పుల రూపంలోనే బయటపడతాయి. అందువల్ల ఒళ్లునొప్పులు వచ్చినప్పుడు అందుకు కారణమేమిటో తెలుసుకుని దానికి తగిన చికిత్స అందించాలి.

ఒళ్లు నొప్పులకు మామూలుగా అపాయకరం కాని కారణాలు మొదలుకొని తీవ్రమైన అస్వస్థత వరకు కారణాలేమైనా కావచ్చు. ఉదాహరణకు... పరిమితికి మించి శ్రమపడ్డప్పుడు, ఒంట్లో క్యాల్షియమ్, మెగ్నీషియమ్ వంటి లవణాలూ, బి12, డి వంటి విటమిన్లు తగ్గినప్పుడు; ఏదైనా ప్రమాదంలో గాయపడ్డప్పుడు ఒళ్లు నొప్పులు రావడాన్ని సాధారణ కారణాలుగా చెప్పుకోవచ్చు. ఇక అపాయకరమైన కారణాల విషయానికి వస్తే ఆటో ఇమ్యూన్ వ్యాధులతో పాటు రాబ్డోమయోలైసిస్ వంటి జబ్బులతో బాధపడుతున్నప్పుడు, జీవక్రియల్లో లోపాలతో వచ్చే మెటబాలిక్ డిసీజ్‌లతో... ఇలా రకరకాల పరిస్థితుల్లో కండరాల నొప్పులు లేదా ఒళ్లునొప్పులు వస్తాయి. అలాంటి కొన్ని సందర్భాలివి...

కొన్ని వ్యాధులు / ఆరోగ్య సమస్యల్లో...

■ డెంగీ వంటి కొన్ని వైరల్ ఇన్ఫెక్షన్స్‌లో. ■ జ్వరం తగ్గాక వచ్చే ఒళ్లునొప్పులు. (వీటిని పోస్ట్ వైరల్ మయాల్జియాస్ అంటారు) ■ ట్రికినోసిస్ వంటి పరాన్నజీవులు ఒంట్లోకి చేరడం వల్ల వచ్చే ఇన్ఫెక్షన్స్‌లో ■ స్పాండిలోసిస్ వంటి కేసుల్లో నరం నొక్కుకుపోతున్నప్పుడు.

కొన్ని మందులతో... ■ కొన్ని టీకాలు తీసుకున్నప్పుడు. ■ ఫైబ్రేట్స్ లేదా స్టాటిన్స్, ఏసీఈ ఇన్హిబిటార్స్, హెచ్ఐవీ మందుల వంటివి కొన్ని వాడుతున్నప్పుడు.

కొన్ని మందుల వాడకం ఆపినప్పుడు...

■ కొన్ని రకాల మందులు ముఖ్యంగా కార్టికోస్టెరాయిడ్స్, ఓపియాయిడ్స్, బార్బిట్యురేట్స్, బెంజోడయజిపైన్స్ వంటి వాటిని అకస్మాత్తుగా ఆపినప్పుడు.

ఆటో ఇమ్యూన్ డిసీజెస్ వల్ల... సొంత వ్యాధినిరోధకత సొంత కణాలపై ప్రతికూలంగా పనిచేసే ఆటో ఇమ్యూన్ వ్యాధులైన సిస్టమిక్ ల్యూపస్ అరిథమెటోసస్ (ల్యూపస్); పాలీమయాల్జియా రుమాటికా; పాలీమైయోసైటిస్; డెర్మటోమయోసైటిస్; మల్టిపుల్ స్క్లిరోసిస్ వంటి కేసుల్లో.

జీవక్రియల్లో లోపాలతో వచ్చే మెటబాలిక్ డిసీజెస్‌లో... దేహంలో జీవక్రియలన్నీ ఒక క్రమపద్ధతిలో జరగకుండా అస్తవ్యస్తంగా జరుగుతున్నప్పుడు వచ్చే వ్యాధులైన మెటబాలిక్ డిసీజెస్‌లో... ఉదాహరణకు హైపర్ థైరాయిడిజమ్; హైపో థైరాయిడిజమ్; తగినంత ఎడ్రినాలిన్ స్రావాలలోపం (అడ్రినాలిన్ ఇన్‌సఫిషియెన్సీ); కార్నిటిన్ పాల్మిటైల్ ట్రాన్స్‌ఫరేజ్ లోపం; కాన్స్ సిండ్రోమ్ వల్ల.

లక్షణాలు...

మొదటి లక్షణం ఒంటినొప్పులు. వాటితో పాటు... ■ నొప్పి కారణంగా దేహంలోని ఆ భాగం కదలలేకపోవడం (కాళ్లు, చేతుల్లో) ■కండరం బిగుసుకుపోవడం లేదా లాగినట్టుగా తీవ్రమైన నొప్పి ■ కండరం తీవ్రమైన అలసట (ఫెటీగ్) లేదా నీరసానికి గురై ఆ అవయవాన్ని కదిలించలేకపోవడం ■ నొప్పి కారణంగా నిద్రపట్టకపోవడం ■కండరాల్లో మంట లేదా సూదితో పొడుస్తున్నట్లుగా నొప్పి. (ఇది ఒకే చోట గానీ లేదా నొప్పి వస్తున్న పరిసరాలంతటిలోనూ వచ్చే నొప్పి) ■ తీవ్రమైన నొప్పి కారణంగా డిప్రెషన్‌కు లోనుకావడం.

అపోహ... వాస్తవం:

■ కండరం గాయపడటం వల్ల నొప్పి వచ్చినప్పుడు దాంతో మళ్లీ బాగా పని చేయించినప్పుడు అది బాగవుతుంది, నొప్పి తగ్గుతుంది అనేది అపోహ. అలాగే జిమ్‌లో వ్యాయామం చేస్తున్నప్పుడు పట్టేసిన కండరం కూడా మళ్లీ అదే ప్రక్రియ చేస్తున్నప్పుడే రిలాక్స్ అవుతుందన్నది కూడా అపోహే. నొప్పి వస్తున్నప్పుడు అదే కండరంతో పదే పదే పనిచేయిస్తే అది మరింత గాయపడుతుంది. ఆ గాయాన్ని 'రిపిటీటివ్ స్ట్రెయిన్ ఇంజురీ' అంటారు. గాయపడి నొప్పిగా ఉన్న కండరానికి నొప్పి తగ్గేవరకు విశ్రాంతి ఇవ్వాలి.

నివారణ: ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా...
■ అన్ని పోషకాలతో సమతులాహారం
■ క్రమం తప్పని వ్యాయామం ■ కంటి నిండా నిద్ర

చికిత్స: ■ ఉపశమనం కోసం డాక్టర్ల సలహా మేరకు ఎన్ఎస్ఏఐడీ (నాన్ స్టెరాయిడ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్) ■ ఒళ్లునొప్పులు లేదా కండరాల నొప్పులు వస్తున్నప్పుడు... అందుకు సరైన కారణాన్ని కనుగొని, వ్యాధి నిర్ధారణ తర్వాత ఏ కారణం వల్ల ఆ నొప్పులు వస్తున్నాయన్నది గుర్తించి, దానికి తగిన చికిత్స తీసుకోవడం.

■ **శస్త్రచికిత్సలు:** స్పాండిలోసిస్, సయాటికా లేదా నడుము భాగంలోని వెన్నుపూసల అరుగుదల వంటి సందర్భాల్లో నరం నొక్కుకుపోయి వచ్చే నొప్పులు ఎంతకీ తగ్గనప్పుడు చివరి ప్రత్యామ్నాయంగా శస్త్రచికిత్స చేయాల్సి రావచ్చు.



డాక్టర్ కె. శివరాజు
సీనియర్ ఫిజిషియన్

మెడి టిప్

ఆప్నియా... గురక నివారణ ఇలా...



మామూలు గురకకూ, ఆప్నియాకు కాస్త తేడా ఉంటుంది. అదేమిటంటే... గురక వస్తుంటే ఆప్నియా ఉన్నట్లు కాదు. కానీ... ఆప్నియా ఉంటే మాత్రం గురక తప్పక వస్తుంది. ఆప్నియా అంటే... దానివల్ల గుండెకు, మెదడుకు ఆక్సిజన్ అందకుండా పోయే ప్రమాదం ఉంది. అలా ఆక్సిజన్ అందనప్పుడల్లా... మెలకువ వచ్చేలా మెదడు దేహాన్ని ఆదేశిస్తుంటుంది. రాత్రి నాణ్యమైన నిద్ర ఉండకపోవడంతో పగలంతా జోగుతూ డల్‌గా ఉంటారు. ఈ ఆప్నియా రక్తపోటు పెరగడానికి, డయాబెటిస్ బాధితుల్లో చక్కెరలు నియంత్రణలో లేకపోవడానికీ, పక్షవాతానికీ దారితీసే ప్రమాదం ఉన్నందున దాన్ని నివారించుకోవాల్సిన అవసరముంది.

ఇలా తగ్గుతుంది... ● మంచి జీవనశైలితో ఆప్నియాను చాలావరకు నివారించవచ్చు ● స్థూలకాయం ఉన్నవారు ఆరోగ్యకరమైన వ్యాయామంతో బరువు తగ్గడం ● ఆల్కహాల్ అలవాటు ఉన్నవారు పూర్తిగా మానేయడం.



భారత్ X దక్షిణాఫ్రికా

భారత మహిళల క్రికెట్ జట్టు కొత్త సీజన్‌ను సొంతగడ్డపై మొదలు పెట్టనుంది. దక్షిణాఫ్రికా ప్రత్యర్థిగా వన్డే సిరీస్‌కు హర్మన్‌ప్రీత్ సేన సిద్ధమైంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో తొలి వన్డే జరుగుతుంది. దీని తర్వాత సఫారీ టీమ్‌తోనే 3 టి20 మ్యాచ్‌ల సిరీస్ కూడా జరుగుతుంది. గత జనవరిలో ఆస్ట్రేలియా చేతిలో వన్డే, టి20 సిరీస్ కోల్పోయిన భారత మహిళలు... ఆ తర్వాత బంగ్లాదేశ్‌ను టి20ల్లో 5–0తో చిత్తుగా ఓడించారు. బ్యాటింగ్‌లో హర్మన్‌తో పాటు స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ కీలకం కానున్నారు.

ఫైనల్లో సుమీత్ నగాల్

పెరుగియా ఓపెన్ ఏటీపీ–125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత ఆటగాడు సుమీత్ నగాల్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీ సెమీఫైనల్ మ్యాచ్‌లో శనివారం ఆరో సీడ్ నగాల్ 7–6 (7/2), 1–6, 6–2 స్కోరుతో బెర్నబె జపటా మిరాల్స్ (స్పెయిన్)పై విజయం సాధించాడు. 2 గంటల 38 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో ఐదు సార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన నగాల్...తన సర్వీస్‌ను 6 సార్లు నిలబెట్టుకున్నాడు.

న్యూజిలాండ్ నెగ్గింది

- చిత్తుగా ఓడిన ఉగాండా
- 5.2 ఓవర్లలో 41 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన కివీస్



సౌతీ

తరుబా: టి20 ప్రపంచకప్‌లో పేలవ ప్రదర్శనతో ఇప్పటికే సూపర్–8 దశకు దూరమైన 2021 రన్నరప్ న్యూజిలాండ్... క్రికెట్ కూన ఉగాండాపై బంతి, బ్యాట్‌తో చెలరేగింది. శనివారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో కివీస్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టోర్నీలో రెండు ఓటముల తర్వాత కివీస్‌కు ఇదే తొలి విజయం. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేపట్టిన ఉగాండా 18.4 ఓవర్లలో 40 పరుగులకే కుప్పకూలింది. ఈ టోర్నీలో ఇదివరకే వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఉగాండా 39 పరుగులకే ఆలౌటైంది. కివీస్ పేస్, స్పిన్ ఉచ్చులో పడి బ్యాటర్లు చేతులెత్తేయగా... కెన్నెత్ వయిస్వా (11) ఒక్కడే రెండంకెల స్కోరు చేశాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' టిమ్ సౌతీ (4–1–4–3)తో పాటు బౌల్ట్, రచిన్, సాన్‌ట్నర్ తలా 2 వికెట్లతో ఉగాండాను దెబ్బ కొట్టారు. చిన్న లక్ష్యాన్ని న్యూజిలాండ్... పవర్‌ప్లే ముగియక ముందే 5.2 ఓవర్లలో వికెట్ నష్టపోయి 41 పరుగులు చేసి ఛేదించింది. ఓపెనర్ అలెన్ (9) అవుట్ కాగా... డెవాన్ కాన్వే (15 బంతుల్లో 22 నాటౌట్; 4 ఫోర్లు), రచిన్ రవీంద్ర (1 నాటౌట్) చకచకా ముగించారు.

అయ్యో నేపాల్..!



ఓటమి అనంతరం నేపాల్ ఆటగాళ్లు సోంపాల్, గుల్షన్‌ల నిర్వేదం

దక్షిణాఫ్రికాపై చేజారిన సంచలన విజయం

- పరుగు తేడాతో గట్టెక్కిన సఫారీ టీమ్

కింగ్స్‌టౌన్: ప్రపంచ క్రికెట్‌లో దక్షిణాఫ్రికా గట్టి ప్రత్యర్థి. అలాంటి జట్టుపై సంచలన విజయం సాధించే స్వర్ణావకాశాన్ని నేపాల్ జట్టు కోల్పోయింది. మ్యాచ్ ఆఖర్లో ఆ జట్టును దురదృష్టం వెంటాడింది. చివరకు సఫారీ అతి కష్టమ్మీద పరుగు తేడాతో గట్టెక్కి ఊపిరి పీల్చుకుంది. చివర్లో ఉత్కంఠభరిత క్షణాలు మ్యాచ్‌ను ఒక్కసారిగా ఆసక్తికరంగా మార్చేశాయి. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 116 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 17వ ఓవర్ ముగిసేసరికి నేపాల్ 98/3 స్కోరు చేసింది. ఇక 18 బంతుల్లో 18 పరుగులు కావాలి. చేతిలో 7 వికెట్లున్న నేపాల్‌కే ఈ దశలో విజయావకాశాలు మెండుగా ఉన్నాయి. ఇక్కడే డ్రామా షురూ... 18వ ఓవర్ వేసిన షమ్సీ 2 పరుగులిచ్చి... దీపేంద్ర సింగ్ (6)తో పాటు క్రీజులో పాతుకుపోయిన ఆసిఫ్ షేక్ (49 బంతుల్లో 42; 4 ఫోర్లు, 1 సిక్స్)నూ అవుట్ చేశాడు. 19వ ఓవర్లో నోర్జే... కుశాల్ మల్లా (1)ను పెవిలియన్ పంపినా, ఒక సిక్స్ సహా 8 పరుగులిచ్చాడు. 6 బంతుల్లో 8 పరుగుల సమీకరణంతో ఆఖరి ఓవర్ ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. బార్ట్‌మన్ వేసిన ఈ ఓవర్లో తొలి రెండు బంతులు డాట్ బాల్స్ అయ్యాయి. 3, 4 బంతుల్లో గుల్షన్ ఝా 4, 2 పరుగులు సాధించాడు. ఇక 2 బంతుల్లో 2 పరుగులు నేపాల్ వైపే ఆశల్ని రేకెత్తించాయి. కానీ ఐదో బంతికి పరుగు రాలేదు. ఆఖరి బంతి కూడా నేరుగా కీపర్ డికాక్ చేతుల్లోకి వెళ్లింది. సింగిల్ తీసి స్కోరును సమం చేసే ప్రయత్నంలో నేపాల్ పరుగు తీయబోయింది. అయితే కీపర్ డికాక్ నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లో రనౌట్ చేసేందుకు త్రో విసిరాడు. కానీ బంతి గుల్షన్ ఝాకు తగిలి... క్లాసెన్ దగ్గరకు వచ్చింది. క్షణంలోనే క్లాసెన్ వికెట్లను గిరాటే వేయడంతో గుల్షన్ (6) రనౌటయ్యాడు. పరుగు తేడాతో దక్షిణాఫ్రికా హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంది. దీంతో గ్రూప్ 'డి'లో ఆడిన నాలుగు మ్యాచ్‌లనూ గెలిచి సఫారీ టీమ్ సంపూర్ణ విజయాన్ని అందుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా... నేపాల్ స్పిన్నర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 115 పరుగులే చేయగలిగింది. హెండ్రిక్స్ (49 బంతుల్లో 43; 5 ఫోర్లు, 1 సిక్స్), స్టబ్స్ (18 బంతుల్లో 27 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. కుశాల్ భుర్టెల్ 4, దీపేంద్ర 3 వికెట్లు తీశారు. తర్వాత నేపాల్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 114 పరుగులు చేసి గెలుపు వాకిట బోర్లా పడింది. ఆసిఫ్‌తో పాటు అనిల్ సాహ్ (24 బంతుల్లో 27; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తబ్రేజ్ షమ్సీ (4/19) ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. మరో వైపు రేప్ కేసునుంచి బయటపడినప్పటికీ సందీప్ లమిచానెకు అమెరికా రెండు సార్లు వీసా తిరస్కరించడంతో అక్కడ జరిగే మ్యాచ్‌ల్ని ఆడలేకపోయాడు. ఎట్టకేలకు ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్ ఆడే అవకాశం దక్కింది. వికెట్లు తీయకపోయినా...పొదుపుగా (0/18) బౌలింగ్ చేశాడు.



షమ్సీ



భారత్ పోరు వర్షార్పణం

కెనడాతో ఆఖరి మ్యాచ్ రద్దు

లాడర్‌హిల్: టి20 ప్రపంచకప్‌లో టీమిండియా జైత్రయాత్రను వరుణుడు అడ్డుకున్నాడు. గ్రూప్ 'ఎ'లో భారత్ ఆఖరి లీగ్ మ్యాచ్ వర్షార్పణమైంది. శనివారం కెనడాతో జరగాల్సిన మ్యాచ్ రద్దయ్యింది. భారత కాలమానం ప్రకారం ముందుగా రాత్రి 7.30 గంటలకు తొలిసారి మైదానాన్ని పరిశీలించారు. మైదానం సిద్ధం కాకపోవడంతో టాస్ ఆలస్యమైంది. అయితే ఆ తర్వాతా పరిస్థితి మెరుగుపడలేదు. చివరి సారిగా రాత్రి 9 గంటలకు పిచ్, అవుట్ ఫీల్డ్‌ను పూర్తి స్థాయిలో సమీక్షించిన ఫీల్డు అంపైర్లు ఇక ఆట జరిగే పరిస్థితి లేదని తేల్చేశారు. మరో సమీక్షకు తావు లేకుండా మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ దక్కింది. గ్రూప్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌లు గెలిచి సంపూర్ణ విజయం సాధించే అవకాశం రాకపోయినా... ఇదివరకే సూపర్–8కు చేరిన భారత్ 7 పాయింట్లతో గ్రూప్ 'ఎ' టాపర్‌గా నిలిచింది. కెనడా లీగ్ దశలో ఐర్లాండ్‌పై ఏకైక విజయాన్ని అందుకుంది. ఇక ఈ మెగా ఈవెంట్‌లో భారత ఆటగాళ్ల ప్రదర్శన సంతృప్తికరమనే చెప్పొచ్చు. కోహ్లి (1, 4, 0) మూడు మ్యాచ్‌ల్లోనూ నిరాశపరిచినా... దీన్ని భూతద్దంలో చూడాల్సిన పనిలేదు. సూపర్–8లో అతను కీలక ఇన్నింగ్స్‌లు ఆడతాడని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. కెప్టెన్ రోహిత్ ఒక అర్ధ సెంచరీ బాదగా, రిషభ్ పంత్ వన్‌డౌన్‌లో మెరుగ్గా ఆడాడు. ఐర్లాండ్, పాక్‌లతో విఫలమైన హిట్టర్లు సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబేలిద్దరు అమెరికాతో జరిగిన పోరులో టచ్‌లోకి వచ్చారు. ఇక బౌలింగ్‌లో అనుభవజ్ఞుడైన బుమ్రా, హార్దిక్, సిరాజ్‌లతో పాటు అర్ష్‌దీప్ రాణించాడు. స్పిన్నర్లు ఫర్వాలేదనిపించారు. దీంతో విజయాల జట్టును మార్చకుండానే బరిలోకి దిగింది. సూపర్–8లోనూ ఇదే పంథా కొనసాగించే అవకాశాలే ఉన్నాయి. గ్రూప్ 'ఎ' నుంచి భారత్‌తో పాటు అమెరికా ముందంజ వేయగా, గత రన్నరప్ పాక్ లీగ్ దశతోనే సరిపెట్టుకుంది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X స్కాట్లాండ్
వేదిక: గ్రాస్ ఐలెట్; ఉ.గం.6.00 నుంచి
పాకిస్తాన్ X ఐర్లాండ్
వేదిక: లాడర్‌హిల్; రాత్రి గం. 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

సూపర్–8లో భారత్ మ్యాచ్‌లు

జూన్ 20 - అఫ్గానిస్తాన్‌తో (బ్రిడ్జ్‌టౌన్)
జూన్ 22 - బంగ్లాదేశ్ (లేదా) నెదర్లాండ్స్‌తో (నార్త్‌సౌండ్)
జూన్ 24 - ఆస్ట్రేలియాతో (గ్రాస్ ఐలెట్)



విర్ట్జ్

జర్మనీ శుభారంభం

యూరో కప్ ఫుట్‌బాల్

మ్యూనిచ్: సొంతగడ్డపై ప్రారంభమైన ప్రతిష్టాత్మక యూరో కప్–2024 ఫుట్‌బాల్ టోర్నీలో జర్మనీ విజయంతో మొదలు పెట్టింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో జర్మనీ 5–1 గోల్స్ తేడాతో స్కాట్లాండ్‌పై ఘన విజయం సాధించింది. జర్మనీ తరఫున విర్ట్జ్ (10వ నిమిషం), ముసియాల (19వ ని.), హావెర్ట్జ్ (45+1వ ని.), ఫుల్‌క్రుగ్ (68వ ని.), క్యాన్ (90+3వ ని.) గోల్స్ సాధించారు. స్కాట్లాండ్ ఆటగాళ్లలో ర్యూడిగర్ (87వ ని.) ఏకైక గోల్ కొట్టాడు. ఇదే గ్రూప్‌లోని మరో మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ 3–1తో హంగేరీని ఓడించింది. స్విస్ తరఫున దువా (12వ నిమిషం), ఎబిషర్ (45వ ని.), ఎంబోలో (90+3వ ని.) గోల్స్ కొట్టగా... హంగేరీ తరఫున వర్గా (66వ ని.) గోల్ సాధించాడు.

పురుషుల జట్టుకూ నిరాశ

ఆర్చరీ ఒలింపిక్ క్వాలిఫయర్

అంటల్యా (టర్కీ): పారిస్ ఒలింపిక్స్ ఆర్చరీ ఆఖరి క్వాలిఫయర్ ఈవెంట్‌లో భారత పురుషుల జట్టు కూడా మహిళల టీమ్ బాటలోనే పయనించింది. భారత పురుషుల జట్టు క్వార్టర్ ఫైనల్లో ఓటమిపాలైంది. దాంతో పారిస్ మెగా ఈవెంట్‌కు అర్హత సాధించాలంటే జట్టు ర్యాంకింగ్‌పైనే ఆధారపడి ఉంటుంది. ఈ టోర్నీలో టాప్–3లో నిలిచే జట్లకు నేరుగా ఒలింపిక్స్ అవకాశం దక్కేది. క్వార్టర్స్‌లో వరల్డ్ నంబర్ 2 భారత పురుషుల జట్టు 4–5 (57–56, 57–53, 55–56, 55–58), (26–26) స్కోరుతో మెక్సికో చేతిలో పరాజయాన్ని ఎదుర్కొంది. తొలి రెండు సెట్‌లను గెలిచి ఆధిక్యంలో నిలిచిన భారత్ మూడో సెట్‌లో సమంగా నిలిచినా సెమీస్ చేరేది. కానీ ఒక పాయింట్ తేడాతో సెట్‌ను కోల్పోయిన జట్టు తర్వాతి సెట్‌ను కూడా మెక్సికోకు అప్పగించింది. అయితే షూటౌట్‌లో భారత్ మ్యాచ్ కోల్పోయింది. మెక్సికో ఆర్చర్లు లక్ష్యానికి అతి సమీపంగా బాణాలను సంధించి పైచేయి సాధించారు.

ముజీబ్ స్థానంలో హజ్రతుల్లా

గ్రాస్ ఐలెట్: టి20 వరల్డ్ కప్ సూపర్–8 దశకు ముందు అఫ్గానిస్తాన్ కీలక బౌలర్ సేవలు కోల్పోయింది. ఆఫ్ స్పిన్నర్ ముజీబ్ ఉర్ రహమాన్ వేలికి గాయంతో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. అతని స్థానంలో మరో ఆటగాడిని ఎంపిక చేసేందుకు అనుమతి ఇచ్చింది. అయితే అఫ్గాన్ జట్టు బౌలర్‌కు బదులుగా టాపార్డర్ బ్యాటర్‌ను ఎంచుకుంది. ముజీబ్ స్థానంలో హజ్రతుల్లా జజాయ్ జట్టులోకి వచ్చాడు. జజాయ్ జాతీయ జట్టు తరఫున 43 టి20 మ్యాచ్‌లు ఆడి 1138 పరుగులు చేశాడు. అతని ఖాతాలో అంతర్జాతీయ సెంచరీ (162 నాటౌట్) ఉండటం విశేషం.

సినిమా



'సలార్'లో ప్రభాస్



'దేవర'లో ఎన్టీఆర్



'గేమ్ చేంజర్'లో రామ్‌చరణ్

నాన్న... ఓ సూపర్ హీరో

చిన్నప్పుడు చేయి పట్టుకుని నడిపించి, జీవితంలో మెట్టు మెట్టు పైకి ఎక్కించే నాన్నని చాలామంది తమ 'సూపర్ హీరో'లా భావిస్తారు. అందుకే కొందరు నాన్న ప్రేమను, ఆస్తిని మాత్రమే కాదు పగను కూడా పంచుకుంటారు. నాన్నని కష్టాలపాలు చేసినవారిపై పగ తీర్చుకుంటారు. మొత్తానికి నాన్నతో ఓ ఎమోషనల్ బాండింగ్ పెంచుకుంటారు. రానున్న కొన్ని చిత్రాల్లో తండ్రీ కొడుకుల రివెంజ్, ఎమోషనల్ డ్రామా వంటివి ఉన్నాయి. నేడు 'ఫాదర్స్ డే' సందర్భంగా ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.

■ 'సలార్'లో తండ్రీకొడుకుగా ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలోని తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' గత డిసెంబరులో విడుదలైంది. ఈ చిత్రంలో కొడుకు దేవా పాత్రలో ప్రభాస్ కనిపించారు. మలి భాగం 'సలార్: శౌర్యాంగపర్వం'లో దేవా తండ్రి ధారా పాత్రకు చెందిన విషయాలు ఉంటాయి. తండ్రికి దక్కాల్సిన ఖాన్సార్ సామ్రాజ్యాధికారం, గౌరవాన్ని తాను తిరిగి తెచ్చుకునేందుకు దేవా ఏం చేస్తాడనేది మలి భాగంలో ఉంటుందని భోగట్టా. ఫస్ట్ పార్ట్‌లో కొడుకు పాత్రలో కనిపించిన ప్రభాస్ మలి భాగంలో తండ్రీకొడుకుగా కనిపిస్తారట.

■ తండ్రికి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకునే కొడుకు పాత్రలో ఎన్టీఆర్‌ను 'దేవర' చిత్రంలో చూడబోతున్నామట. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రెండు భాగాలుగా రూపొందుతున్న సినిమా 'దేవర'. భారతదేశంలో విస్మరణకు గురైన తీర ప్రాంతాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో తండ్రీ కొడుకుగా ఎన్టీఆర్ నటిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. మరి.. దేవర (తండ్రి పాత్ర)ను ఎవరు మోసం చేశారు? ఎందుకు చేశారు? అనేది థియేటర్స్‌లో చూడాలి. తొలి భాగం సెప్టెంబరు 27న రిలీజ్ కానుంది. తొలి భాగంలో కొడుకు పాత్ర ప్రస్తావన ఎక్కువగా, చివర్లో తండ్రి పాత్ర గురించిన పరిచయం ఉండి, రెండో భాగంలో తండ్రి పాత్ర చుట్టూ ఉన్న డ్రామాను రివీల్ చేయనున్నారట.

■ తండ్రి ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లే కొడుకు పాత్రలో రామ్‌చరణ్ నటిస్తున్నారని తెలిసింది. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ మూవీ 'గేమ్ చేంజర్'. ఈ చిత్రంలో ఐఏఎస్ ఆఫీసర్ రామ్‌నందన్ పాత్రలో రామ్‌చరణ్ కనిపిస్తారని భోగట్టా. రామ్‌నందన్ తండ్రి పేరు అప్పన్న (ప్రచారంలో ఉన్న పేరు). అప్పన్న రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటాడు. కానీ అతని స్నేహితులు కొందరు మోసం చేస్తారు. ఈ క్రమంలోనే అప్పన్న చనిపోతాడట. ఆ తర్వాత అతని కొడుకు ఐఏఎస్ ఆఫీసర్‌గా ఛార్జ్ తీసుకుని, తన తండ్రికి అన్యాయం చేసినవారికి ఎలా బుద్ధి చెప్పాడు? అన్నదే 'గేమ్ చేంజర్' కథ అని ప్రచారం సాగుతోంది. ఈ చిత్రంలో తండ్రీకొడుకుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని తెలిసింది.



'రామం రాఘవం'లో ధన్‌రాజ్, సముద్ర ఖని



'మా నాన్న సూపర్ హీరో' పోస్టర్

■ మా నాన్న సూపర్ హీరో అంటున్నారు సుధీర్‌బాబు. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్‌రెడ్డి కంకర ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. తండ్రీతనయుల మధ్య సాగే అనుబంధాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని యూనిట్ పేర్కొంది.

■ హాస్యనటుడు ధన్‌రాజ్ దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'రామం రాఘవం'. తండ్రీ కొడుకు మధ్య నెలకొన్న బలమైన భావోద్వేగాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో తండ్రి పాత్రలో సముద్ర ఖని, కొడుకు పాత్రలో ధన్‌రాజ్ నటిస్తున్నారు. తనయుడు బాధ్యతగా ఉండాలని తాపత్రయపడే తండ్రిగా సముద్ర ఖని, తనను తన తండ్రి అర్థం చేసుకోవడం లేదని బాధపడే కొడుకుగా ధన్‌రాజ్ కనిపిస్తారు. ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ కానుంది.

■ కరోనా నేపథ్యంతో తండ్రీకొడుకుల ఎమోషన్ ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన సినిమా 'డియర్ నాన్న'. ఈ చిత్రంలో తండ్రి పాత్రలో సూర్యకుమార్ భగవాన్ దాస్, కొడుకు పాత్రలో చైతన్యా రావ్ నటించారు. యష్ణ చౌదరి, సంధ్య జనక్, శశాంక్, మధునందన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన 'డియర్ నాన్న' శుక్రవారం నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది.

ఇలా తండ్రి భావోద్వేగం ప్రధాన ఇతివృత్తంగా రూపొందుతున్న చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.




'డియర్ నాన్న'లో చైతన్యా రావ్, సూర్య



అతనితో పెట్టుకున్నవారి పాలిట యమడవుతాడు... గొడ్డలి చేత పట్టాడా అంతే సంగతులు. శత్రువులను పరుగులు పెట్టించి మరీ రఫ్ఫాడేస్తాడు. 'సరిపోదా శనివారం'లో నాని చేస్తున్న సూర్య క్యారెక్టర్ ఇలానే ఉంటుంది. నాని హీరోగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలోని 'గరం గరం...' అంటూ సాగే తొలి పాటను విడుదల చేశారు. 'గరం గరం యముడయో.. సహనాల శివుడయో..' అంటూ ఈ పాట సాగుతుంది. హీరో ఏ స్థాయిలో ఉగ్రరూపం దాల్చుతాడో ఈ పాటలో నాని లుక్స్, చేసే ఫైట్ ద్వారా చూపించారు. సంగీతదర్శకుడు జేక్స్ బిజోయ్ స్వరపరచిన ఈ పాటకు సహపతి భరద్వాజ్ సాహిత్యం అందించగా విశాల్ దద్లానీ పాడారు. ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్‌జె సూర్య కీలక పాత్ర చేస్తున్నారు. ఆగస్టు 29న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

ఇస్మార్ట్ నిర్ణయం



రామ్

ఇస్మార్ట్ (తెలివి)గా ఆలోచించి, ఓ నిర్ణయం తీసుకుంది 'డబుల్ ఇస్మార్ట్' టీమ్. ఈ చిత్రం విడుదల తేదీని తెలివిగా నిర్ణయించింది. రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఈ చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లు శనివారం అధికారికంగా ప్రకటించారు. "ఆగస్టు 15 గురువారం సెలవు. అలాగే సోమవారం రక్షాబంధన్. మధ్యలో శని, ఆదివారాల వీకెండ్ కలిసొస్తుంది. ఇలా మా 'డబుల్ ఇస్మార్ట్' విడుదలకు ఆగస్టు 15 పర్ఫెక్ట్ డేట్" అని చిత్రబృందం పేర్కొని, రామ్ కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది. రామ్ సరసన కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నారు. రామ్–పూరి కాంబినేషన్‌లో వచ్చిన సూపర్ హిట్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందుతోంది. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

ఆ ఎమోషన్‌కి కనెక్ట్ అయ్యా! - నిర్మాత సుబ్రహ్మణ్యం



సుమంత్, సుబ్రహ్మణ్యం

సుధీర్ బాబు, మాళవికా శర్మ జంటగా జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హరోం హర'. సుబ్రహ్మణ్యం, సుమంత్. జి నాయుడు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలైంది. శనివారం విలేకర్ల సమావేశంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ– "సినిమాలపై ఆసక్తితో ఇండస్ట్రీకి వచ్చాను. మా అబ్బాయిని (సుమంత్ జి. నాయుడు) ఇండస్ట్రీలో నిలదొక్కుకునేలా చేయడమే మా ప్రయత్నం. 'హరోంహర' సినిమాకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ రావడం సంతోషాన్నిచ్చింది. ప్రేక్షకులకు ఓ మంచి సినిమా అందిస్తామని చెబుతూ వచ్చాం. ఆ మాటను నిజం చేశాం. వసూళ్లు బాగున్నాయి. 'హరోంహర'లోని తండ్రీ కొడుకుల ఎమోషన్‌కు నేను బాగా కనెక్ట్ అయ్యాను" అన్నారు. "మా నాన్న బిజీగా ఉండటంతో 'హరోంహర' నిర్మాణాన్ని వంద శాతం నేనే చూసుకున్నాను. నాకు ప్రభాస్, రామ్‌చరణ్‌గార్లంటే చాలా ఇష్టం. స్టెప్ బై స్టెప్ ఎదిగి, అవకాశం వస్తే వారితో సినిమాలు చేయాలని ఉంది" అన్నారు సుమంత్.

ఫీల్ గుడ్ లవ్



సదన్, ప్రియాంకా ప్రసాద్

ప్రముఖ నటుడు అలీ ఫ్యామిలీ నుంచి 'ప్రణయ గోదారి' చిత్రం ద్వారా సదన్ హీరోగా పరిచయం కానున్నారు. ఇందులో ప్రియాంకా ప్రసాద్ హీరోయిన్. పీఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో పీఎల్‌వీ క్రియేషన్స్‌పై పారమళ్ల లింగయ్య నిర్మించారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను, నిర్మాణ సంస్థ లోగోను తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రిలీజ్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. జెడ్‌పిటిసి సభ్యులు సురేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. "ఫీల్ గుడ్ లవ్ మూవీగా రూపొందించాం. నేచురల్ లొకేషన్స్‌లో చిత్రీకరించాం. గోదారి అందాలు కనువిందుగా ఉంటాయి. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం" అన్నారు లింగయ్య.



జీవితంలో ఏ సినిమాను మర్చిపోలేను - ఉపేంద్ర

ఉపేంద్ర నటించి, దర్శకత్వం వహించిన సినిమా 'ఏ'. ఉపేంద్ర సరసన చాందిని నటించారు. 1998లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. పాతిక సంవత్సరాల తర్వాత ఈ సినిమాను తెలుగులో రీ రిలీజ్ చేస్తున్నారు. ఉప్పి క్రియేషన్స్, చందు ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్లపై ఈ చిత్రం తెలుగులో 4కేలో ఈ నెల 21న రీ రిలీజ్ కానుంది. ఈ సినిమా రీ రిలీజ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఉపేంద్ర మాట్లాడుతూ– "నా జీవితంలో నేను మర్చిపోలేని సినిమా 'ఏ'. ఈ సినిమాను థియేటర్స్‌లో చూసి, ఈ తరం ప్రేక్షకులు షాక్ అవుతారు" అన్నారు. "ఛత్రపతి, యోగి' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలను రీ రిలీజ్ చేశాం. ఇప్పుడు 'ఏ' సినిమాను విడుదల చేస్తున్నాం" అని చెప్పుకొచ్చారు చందు ఎంటర్టైన్మెంట్ స్థాపకుడు లింగం యాదవ్. "'ఏ' రిలీజ్ ప్రమోషన్స్ కోసం ఓ చిన్న వీడియో కావాలని ఉపేంద్రగారిని అడిగితే, స్వయంగా హైదరాబాద్ వచ్చి సినిమాను ప్రమోట్ చేస్తానని చెప్పి ఆశ్చర్యపరిచారు" అన్నారు నిర్మాత సైదులు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



క్రిస్టియన్ మాల/31 / 5'8" / B.Tech/ SWE / Hyd / 1 Lakh.PM / అందమైన వరుడికి వధువు కావలెను. అర్జెంట్. Ph: 8919759359 [HA-14386]

హిందూ మాల/కట్నప్రసక్తి లేదు/ B.Tech /Govt.Asst. ఇంజినీర్/జెన్‌కో/ 14 Lakhs. PA/6'ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-14386]

కుల పట్టింపు లేదు/49yr 2వ మ్యారేజ్ ప్రైవేట్ జాబ్ మంచి జీతం కలిగిన వరునకు 40 సం॥ పై బడిన విడో & డైవర్సీ గల వధువు కావలెను (మధ్య తరగతి వారికి ప్రాధాన్యత) డైరెక్ట్ సంప్ర : 9492373784 [H-778866]

కుల పట్టింపులేదు/2nd మ్యారేజ్/BC/ 51y/ 5'6"/ 10th క్లాస్/ టైలరింగ్ బిజినెస్/ సొంత ఇల్లు గల వెల్‌సెటిల్డ్ వరుడుకి అందమైన, సాంప్రదాయ బద్ధమైన వధువు కావలెను. Ph: 8074835109 [H-796302]

క్రిస్టియన్ మాదిగ / M.Tech, Ph.D/ Govt. సైంటిస్ట్/అగ్రికల్చర్ Dept/1 Lakh. PM / 5'11" ఎత్తు/30 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-14386]

వడ్డెర /కట్నప్రసక్తి లేదు/B.Tech/ C. Govt.బ్యాంక్ మేనేజర్/SBI/80,000/-PM/ 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14386]

యాదవ /కట్నప్రసక్తి లేదు/B.Tech (సివిల్)/C.Govt. డిప్యూటీ మేనేజర్/ SBI/ 85000/-PM/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-14386]

క్రిస్టియన్ మాల /కట్న ప్రసక్తి లేదు/29/ 5'10"/ B.Tech/ C.Govt.Asst.ఇంజినీర్/ HPCL/1 Lakh. PM/అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14386]

SC మాదిగ & క్రిస్టియన్/M.Tech/ C. Govt. కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్/14 Lakhs. PA/ 5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. Ph: 6304407230 [HA-14387]

కమ్మ /B.Tech, IIIT/గ్రూప్-A ఆఫీసర్/ C.Govt. R&D ఆర్గనైజేషన్/2 Lakhs. PM/5'10"ఎత్తు/30 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618579861 [HA-14387]

SC మాల /కట్న ప్రసక్తి లేదు/M.Tech, IIT/ C. Govt. Asst. మేనేజర్ /ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్/2 Lakhs. PM/5'9" ఎత్తు/29 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 8897389698 [HA-14387]

కుల ప్రసక్తి లేదు /2వ పెళ్లి/విడోయర్/ B.Sc / Ownబిజినెస్/1 Lakh. PM/5'8" ఎత్తు/45 సం॥ల వరునికి వధువు కావలెను. పిల్లలున్నా OK. డైరెక్ట్. Ph: 9391354049 [HA-14387]

2వ: కమ్మ MBA, ఆస్తి, IT జాబ్ గల వరునికి చదువు ఆస్తి కుల పట్టింపు లేదు. 32 సం॥ల లోపు వధువు కావలెను. డైరెక్ట్. Ph: 8978609410 [HA-14376]

35 YEARS: అబ్బాయి, 60 Lakh, PA కల్గిన అబ్బాయికి తగిన వధువు కావలెను CNB, డైరెక్ట్ సంప్రదించండి: Ph: 9182213897 [HA-778740]

36 సం॥ల: బిజినెస్ చేస్తున్న వరుడుకి రెండోవ/విడో పిల్లలు ఉన్న వారు అయిన సంప్రదించండి. దొరీ, కుల ప్రసక్తి లేదు. ఫోన్: 6301943220, 9866724586 [HA-97645]

రెడ్డి, 40Yrs/5'.10"/Fair/Pvt Company Manager గల వరుడికి కుల, మత, వయస్సు ప్రసక్తి లేని వధువు కావలెను. (ఇల్లరికం OK) సెల్: 9133857101. [T-1235480]

Reddy Groom- 27/5'9"/MD (General) Final Year, Fair, Seeks Bride Any PG Doctor. Contact : 9391198332 [H-778740]

★

వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్, పద్మశాలీ, 32 Yr./ 5'5"/Qly : B.Sc., Comp. Diploma DOA, Occup : బిజినెస్, 2వ పెళ్లి, వెల్ సెటిల్డ్. సెల్ - 94413 86713, 99481 19207. [M-1185251]

No Brokers: Divorced, 42, BC. D, MA, B.Ed, 30,000, ఇల్లు, పిల్లలు లేని వరునికి, పిల్లలు లేని 2వ వధువు కావలెను. కులం, ఆస్తి ప్రసక్తి లేదు. వరంగల్. 9392850846 [W-1242486]

కోమట్ల అమ్మాయి కావలెను. 1,2 కోమట్ల అబ్బాయి, ప్రైవేట్ లెక్చరర్ M.Sc., వ్యవసాయం నల్లగొండ, వీరయ్య- 9121325068, M9HB, మునుగోడ్ రోడ్. [Y-798335]

★★

కమ్మ, 31 సం॥, 3 కోట్లు ఆస్తి కలిగి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వరునకు అందమైన కమ్మ వధువు కావలెను. ✆ 95537 05643 [B-190517]

క్రిస్టియన్-శ్రీవైష్ణవులు,(BC-D) ప్రభుత్వ ఉద్యోగి, జీతం: 56 వేల వయస్సు 46 సం॥, 2వ, ఎత్తు 5'6", టీచర్ వరునకు హౌస్‌వైఫ్‌గా ఉండతగిన క్రిస్టియన్ వధువు కావలెను."నోబ్రోకర్స్" డైరెక్ట్ ✆ : 99632 13831 [R-6772]

కుల పట్టింపు లేదు, M.B.A., 40Y, 5.8 ఎరుపు, సొంత బిజినెస్, రూ. 30 కోట్ల ప్రాపర్టీ, ఒంటరి వరునికి విడో, ఒంటరి, లేటు, డైవర్సీ 40 సం॥లోపు వధువు కావలెను. (నో బ్రోకర్స్)సంప్ర:9908382425,9533242696 [B-1239279]

కమ్మ 35/5.9/70K PM/ బిజినెస్ చేయు వరుడుకి తగిన 1వ, 2వ, వితంతు వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు. పిల్లలు ఉన్నా ఓకే. ఫోన్: 83283 03662 [V- 786760]

రెడ్డి/వాల్మీకి: 36Yrs/ 6feet / B.Com Salary: 30,000/- ప్రైవేట్ జాబ్ గల వరుడికి అందమైన వధువు కావలెను. నోబ్రోకర్స్, డైరెక్ట్ సం.ప్ర: 95501 37911. [L-792233]

వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపు లేదు/ జాబ్/ వ్యాపారం/ ఫ్లాట్స్/5L/PM/వెల్ సెటిల్డ్/5 కోట్ల ప్రాపర్టీ గల అందమైన సాంప్రదాయ వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం OK. ముఖాముఖి కల్పించి త్వరగా కుదుర్చబడును. 7207636129 [H-796302]

రెడ్డి/ 2nd మ్యారేజ్: కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ Age: 29/డిగ్రీ/సొంత వ్యాపారం గల అందమైన వధువుకి వరుడు కావలెను. 1st/2nd (ఇల్లరికం OK) Ph: 9515673252 [HA-14387]

కుల పట్టింపు లేదు/ విడో/ 46y/NPPA Department/1 L PM/ Own House/ 30 ఎ॥ తోటలు/కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా వెల్ సెటిల్ వధువుకు వరుడు కావలెను. Ph: 9849632087 [H-796078]

కుల ప్రసక్తి లేదు / విడో /58y/Fair/ ఆంధ్ర/Govt. Rtd పెన్షనర్/40,000/-PM/Real Estate, Lands, Own House పిల్లలు లేని ఏ బాదర బందీలేని వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. Ph: 8519803423 [H-796078]

డాక్టర్స్ వధువులు/29, PG, రెడ్డి. *28, PG, రెడ్డి *27, PG, బలిజ, (Caste No Bar) *Divorce 31, PG, రెడ్డి తగిన వరులు కావలెను. * డాక్టర్స్ సంబంధాల కోసం కాంటాక్ట్/Whatsapp: 6304826162 [H-796078]

బ్రాహ్మణ/47yr /5'4"/ 2nd మ్యారేజ్/కుల పట్టింపు లేదు/PG/Govt. ఎంప్లాయ్ 1 లక్ష (PM) & 2 సొంత ఇల్లులు కలిగి పిల్లలు లేని వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 8341101996 [H-778866]

కమ్మ-రెడ్డి/ కుల పట్టింపు లేదు /ఏజ్ 58yrs/ 2nd మ్యారేజ్ & లేట్ మ్యారేజ్ అయినా ఓకే/ 5'4"/ ఫెయిర్/Govt. జాబ్ 90K (PM)/ ఒంటరి/ ప్రాపర్టీస్ కలవు/ఇల్లరికం కావలెను. # 9581120134 [H-778866]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 29, 6' 2", SWE, 310 K, H1, USA, 100 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 6', Engineer, 300 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 33, 5' 11", SWE, 295 K, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Atlanta, BE, MS, 31, 6' 1", Sr SWE, 110 K, H1, 10 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి MBBS, MD, 28, 5' 2", Residency Doctor, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 2", SWE, 130 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 6", Developer, 10 Crores, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 26, 5' 3", SWE, 30 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 29, 5' 11", SWE, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, MBA, 30, 5' 11", 130 K, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 11", PG Doctor, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 32, 5' 10", SWE, 350 K, H1, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 4", SWE, 120 K, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Seattle, BE, MS, 26, 5' 7", Amazon, 129 K, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 27, 5' 4", USA, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MS, 32, 5' 7", Data Manager, 200 K, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

కమ్మ/40yr/ఫెయిర్/కుల పట్టింపు లేదు/ Govt. ఎంప్లాయ్ 60K (PM), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ 2 సొంత ఇల్లులు & బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను. (1st, 2nd మ్యారేజ్ & ఇల్లరికం OK) సంప్ర : 9640133485 [H-778866]

రెడ్డి/50yr/ కుల పట్టింపు లేదు/ఫెయిర్/Govt. ఎంప్లాయ్ 3 లక్షలు(PM), వెల్ సెటిల్డ్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 8374802603 [H-778866]

కాపు/విడో/ 60y/ ప్రభుత్వ రిటైర్డ్/ Own House/ 4 ఎకరముల వరి పొలము గల ఒంటరి వధువుకు స్నేహపూర్వకమైన వరుడు కావలెను. కులపట్టింపులేదు. Ph: 8897763439 [H-796302]

కమ్మ/విడో/ 60y/5'5"/ V.Fair/ Govt. (HM) రిటైర్డ్/ పెన్షనర్/ సొంత ఇల్లు & రెంట్స్ 26 ఎకరాల పంట పొలం, ఏ బాదరాబందీలేని వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తిలేదు. Ph: 7287079096 [H-796302]

రెడ్డి/కుల పట్టింపులేదు/ 2వ పెళ్లి/56y/ విడో/ సొంత ఇల్లు & రెంట్స్/ పిల్లలులేరు/ సొంత ప్రాపర్టీ/ ఎలాంటి బాధరాబందీలేని వధువుకు వరుడు కావలెను (అర్జెంట్). (ఇల్లరికం Ok) (నో బ్రోకర్స్). Ph: 7799083500/ 7386660643 [H-796302]

2వ పెళ్లి/ Govt Job, 39 Years, 2,75,000. PM/ కల్గిన అమ్మాయికి, అందమైన వరుడు కావలెను. పిల్లలు ఉన్నా OK కుల ప్రసక్తి లేదు, సంప్ర: 9182213897 [H-778740]

కులపట్టింపు లేదు: Age: 44 Q: B.Ed Govt Job, 80K Salary(p.m) Widow. Own House undi Well Setill గల వధువుకు తగిన వరుడు కావలెను పిల్లలు ఉన్న ఇల్లరికం అయినా OK అర్జెంట్ సంప్ర: 7286031653 [H-778740]

రెడ్డి: 36 Yrs/5'5"/ ఫెయిర్/కులపట్టింపు లేదు/B-tech/ సెంట్రల్ Govt ఎంప్లాయ్ 85k (PM), వెల్ సెటిల్డ్ & సొంత ఇల్లు కలిగిన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర: 9133672661 [H-778740]

యాదవ/B.Tech, IIT/C.Govt. కస్టమ్స్ ఆఫీసర్/Airport/80,000/-PM/5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-14386]

క్రిస్టియన్ మాల/25 /5'4" /B.Tech/ C. Govt.Asst.మేనేజర్/ఇండియన్ బ్యాంక్ /60,000/-PM అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14386]

SC మాల & క్రిస్టియన్/ఏకైక కుమార్తె/ B.Tech, MBA/C.Govt. డిప్యూటీ మేనేజర్/ SBI/ 65000/-PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-14386]

రజక/B.Tech/C.Govt. బ్యాంక్ క్లర్క్ & క్యాషియర్/SBI/45000/-PM/5'4"ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14386]

రెడ్డి/2nd మ్యారేజ్ (కుల, మత, ఆస్తి) ప్రసక్తి లేదు/ Age: 32/ప్రైవేట్ టీచర్, సొంత ఇల్లు, 1 ఎకరం ల్యాండ్ వెల్ సెటిల్డ్ అందమైన సాంప్రదాయ వధువుకి 1వ లేదా 2వ వరుడు కావలెను. (ఇల్లరికం OK) Ph: 9908279018 [HA-14387]

రెండోపెళ్ళి/59y&58y&56y&55y&53y&52y&50y&49y&47y&46y&44y&43y&41y&40y&38y&37y&35y&33y&31y&30y&28y&27y&25y&24y/ "మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [HA-14387]

వయసు: 35yrs/ఎత్తు 5'5" గవర్నమెంట్ జాబ్, 1.5 Laks జీతం కలిగిన అందమైన అమ్మాయికి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. పిల్లలున్నా OK. Ph: 9515970322 [HA-14387]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc *27/5'4"/ MBA *30/ 5'3"/B.Sc *27/5'2"/ ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువు లకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/ పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-14387]

Andhra Sunni Muslim Parents Settled at Hyderabad invite alliance for their only Daughter 30 years. M.Tech 5'4" beautiful, Property holder, Widow with 4 years daughther. Groom Should be educated, employed in Hyderabad, below 36 years. Shall Whats App Photo and biodata to 7337047741 [H-778915]

★

రెండవ సంబంధం : గౌడ్/33/5'2"/MBBS, MD *31/5'3"/OPT/USA *32/5'4"/M.Tech / B.ED/Asst Professor/31/5'4"/MBA/HYD *35/ 5'6"/MBA DAT/HYD *29/5'3"/M.Tech/ LWB పిల్లలు లేని గౌడ్ అమ్మాయిలకు పిల్లలు లేని తగిన గౌడ్ అబ్బాయిలు కావలెను. సం॥ "శుభమస్తు" DSNR, HYD. S.రాములు గౌడ్. 8790690309 [H-796303]

★★

క్రిస్టియన్/మాల / 1991 / MDS / కోటిపై గా ఆస్తి / స్వంత క్లినిక్ / త్వరలో Govt. జాబ్ పొందే అందమైన వధువుకు వెల్ సెటిల్డ్ SWE/ తగిన Govt. ఎంప్లాయ్ / డాక్టర్ వరుడు కావలెను. డైరెక్ట్ ✆ 94416 12898 [B-1264394]

మాల క్రిస్టియన్స్, 2nd మ్యారేజ్, వయస్సు 37, H.5'3" చదువు MBA, బ్యాంక్ మేనేజర్,వధువుకి వరుడు సాఫ్ట్‌వేర్/ Govt ఎంప్లాయి కావలెను. ✆ : 77949 11019 [R-1229016]

వేదికలు



సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8555980066 [H-796078]

రెండవ పెళ్ళి సంబంధాలు మాత్రమే. అన్ని కులాలకు వయస్సుతో నిమిత్తం లేకుండా మంచి పేరు, సాంప్రదాయ పద్ధతి మరియు ఇల్లరికం సంబంధాలు కలవు. Ph: 9346631045 [H-796078]

మధుర మ్యారేజెస్, రెడ్డి, కాపు మరియు BC ఇతర కులాల 1వ, 2వ, డాక్టర్స్, ఇంజనీర్స్, Govt, NRI, సాఫ్ట్‌వేర్, బిజినెస్ మరియు మీరు కోరిన సంబంధాలు చూపబడును. 8125831394 [HA-14387]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులాల Govt/ SWE/ డాక్టర్స్/ NRI/ బిజినెస్/ PVT/2ndపెళ్లి సంబంధాలకై నిజాయితీగా సర్వీస్. ఈ ప్రకటన 100% నిజం Ph: 9866775306 [H-14341]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 14-07-2024న ఉ॥ 9 గం॥లకు 65వ ఆర్య వైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ॥ 2 గం॥లకు 20న పునర్ వివాహ పరిచయ వేదిక, విజయవాడ, K.B.N. కాలేజీ లో జరుగును. మరియు ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కూడా కలదు. ✆ 99895 00130 [B-284]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14391]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14391]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14391]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14391]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14391]

ఫాస్ట్ సెటిల్‌మెంట్-ప్రత్యేక శ్రద్ధతో. అన్ని కులాలు, అన్ని ప్రాంతాలు, సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్, VIP వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-2950]

శ్రీ లలిత వివాహ వేదిక. కేవలం సేవాభావంతో అన్ని శాఖల బ్రాహ్మణ వధువు, వరుల సంబంధముల కొరకు ఉచితంగా నడుపుతున్న సంస్థ శ్రీమతి గౌరిదేవి ✆ 94410 51100 [B-112]

★

Free Register హిందూ మాల/ మాదిగ & క్రిస్టియన్ వధూవరుల online స్వయంవరం July 14th bhavanimatrimony, Hyd. 9704656103/ 9533608887 [HA-878]

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE, Govt., Doctors, MNC Matches, Late &2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp). [HA-841]

మాదిగ వివాహ పరిచయ వేదిక, ఆదివారం (16-6-24) 10AM-6PM * మంచిర్యాల ఫీ: 1 వెయ్యి Ph: 9347046175 నిర్వహణ : స్వప్న వివాహ వేదిక [H-800496]

★★

తోడు ద్వితీయ వివాహ వేదిక: ఒంటరి ఉద్యోగులు మరియు పెన్షనర్లకు... OC, BCల వారికి సేవాదృక్పధంతో వివాహ సంబంధములు చూడబడును. ✆ 94906 58699, 90598 27307 [B-190518]

సాక్షి పెళ్ళిచూపులు ప్రకటనల కొరకు
3+2 3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
AP+TS+Metros: 1800/- for 4 Lines (Chennai + Bengaluru + Delhi + Mumbai) 485/- Extra Line
Andhra Pradesh: 1350/- for 4 Lines (Incl. Hyd) 375/- Extra Line
Telangana (Incl. Hyd) 1100/- for 4 Lines 300/- Extra Line
* Color 25% Extra
గమనిక: ప్రకటనలపై 5% GST అదనం
హైదరాబాద్ : 99122 25453 | వరంగల్ : 99516 02872
మెదక్ : 99122 25456 | నల్గొండ : 95055 08382
నిజామాబాద్ : 99122 20764 | మహబూబ్‌నగర్ : 99516 02829
కరీంనగర్ : 97059 33396 | ఖమ్మం : 99516 02868
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, Hyd ✆ 040-23256000 Ext: 6235/6290 Cell : 9912225453, email2sakshi.ads@sakshi.com

అక్రమంగా తరలిస్తున్న 387 తాబేళ్ల పట్టివేత

- కారులో తీసుకెళుతుండగా పట్టుకున్న అధికారులు



రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): రంపచోడవరం అటవీ డివిజన్ పోక్స్‌పేట రేంజ్ పరిధిలో కారులో అక్రమంగా తరలిస్తున్న 387 తాబేళ్లను అటవీ అధికారులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎఫ్‌వో నరేంధిరన్ జీజీ శనివారం వెల్లడించారు. షెడ్యూల్-1 వన్యప్రాణి తాబేళ్లను అక్రమంగా తరలిస్తున్న సమాచారంతో సుద్దగొమ్ము గ్రామం వద్ద స్పెషల్ టీమ్ సబ్ డీఎఫ్‌వో రామారావు, రేంజ్ అధికారి కరుణాకర్‌ల ఆధ్వర్యంలో కారులో తరలిస్తున్న తాబేళ్లను పట్టుకున్నట్లు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాల్లోని మంచినీటి చెరువుల్లో తాబేళ్లను సేకరించి ఒడిశా ప్రాంతానికి ఆహార పదార్థంగా వండుకొనేందుకు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడిన వారు తప్పించుకున్నారని, తాబేళ్ల రవాణాకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుల కోసం దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు.

తాగునీటిలో విష ప్రయోగం

నీటి ట్యాంకులో పురుగుల మందు కలిపిన దుండగులు | సకాలంలో గుర్తించడంతో తప్పిన ముప్పు | అనంతపురం జిల్లా తుంబిగనూరులో ఘటన

కణేకల్లు: ప్రజలు తాగే నీళ్లలో విషాన్ని కలిపారు.. ఆ నీరు తాగినోళ్ల ప్రాణాలతో ఉండకూడదనుకున్నారో.. లేక వాంతులు, విరేచనాలొచ్చి నిర్వహణ చేసే వారికి చెడ్డపేరు రావాలనుకున్నారో గానీ అత్యంత అమానుష ఘటనకు ఒడిగట్టారు. వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు సకాలంలో గుర్తించడంతో ముప్పు తప్పింది. అనంతపురం జిల్లా కణేకల్లు మండలం తుంబిగనూరులో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తుంబిగనూరులో సుజలాన్ ఎనర్జీ లిమిటెడ్.. రెండేళ్ల క్రితం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీకి అప్పగించింది. గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఫణీంద్ర గౌడ్ వాటర్ ప్లాంట్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేందుకు తన తండ్రి తిప్పయ్యను ప్లాంట్ వద్దే ఉంచారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పంచాయతీ ఆధ్వర్యంలో రూ.5కే రెండు బిందెల నీటిని పంపిణీ చేస్తున్నారు.

ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు దుప్పటి కప్పుకుని మినరల్ వాటర్ ప్లాంట్ వద్దకు వచ్చారు. కిటికీలు తీసి నీటి ట్యాంకులో టెర్మినేటర్ పురుగుల మందు కలిపారు. అదే సమయంలో బహిర్భూమి కోసం లేచిన తిప్పయ్య ప్లాంట్ వద్ద వ్యక్తులు ఉండటాన్ని గమనించి.. ఎవరక్కడ అంటూ గద్దించాడు. దీంతో పొరుగున ఉండే తలారి హనుమంతు, కొట్రేగౌడ్ నిద్ర లేచి అక్కడికి వచ్చారు. ఇంతలోనే దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించగా.. అందులో పురుగుల మందు కలిపినట్టు తేలింది. ఈ ఘటనను అనంతపురం జిల్లా ఎస్పీ గౌతమి శాలి సీరియస్‌గా తీసుకున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేవారిని ఉపేక్షించొద్దని పోలీసు అధికారులను ఆదేశించారు. కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, కణేకల్లు ఎస్‌ఐ శ్రీనివాసులు డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌ను రంగంలో దింపి ఆధారాలను సేకరించారు. జరిగిన ఘటనపై తిప్పయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.



నీటిట్యాంకులో పురుగుల మందును కలిపి బాటిల్ పడేసిన దృశ్యం

ఎల్లో మీడియాలో దుష్ప్రచారం

ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మెజార్టీ రాలేదన్న ఉద్దేశంతో నేనే కొందరితో తాగునీటిలో విషం కలిపించానంటూ ఎల్లో మీడియాలో ప్రసారం చేయడం దుర్మార్గం. గ్రామ సర్పంచ్‌గా నేను 365 ఓట్ల మెజార్టీతో గెలిచాను. గ్రామంలో సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 494 ఓట్లు రాగా.. టీడీపీకి 512 ఓట్లు వచ్చాయి. ఓట్లు వేయలేదని ప్రజలను బెదిరించడం, దౌర్జన్యం చేయడం లాంటివి నేను ఏరోజూ చేయలేదు. ఎల్లో మీడియా నాపై నింద వేయడం బాధాకరం. - ఫణీంద్ర గౌడ్, గ్రామ సర్పంచ్, తుంబిగనూరు

ప్రభుత్వ మాజీ ఉద్యోగి భూకబ్జా

- భూమికి అడ్డుగా ఉందని దళిత మహిళ హోటల్ ధ్వంసం
- తిరుపతి రూరల్ మండలంలో ఘటన

తిరుపతి రూరల్ (తిరుపతి జిల్లా): ప్రభుత్వ మాజీ ఉద్యోగి ఒకరు దళిత మహిళ స్థలాన్ని కబ్జా చేశాడు. అంతేకాకుండా ఆమె జీవనోపాధికి ఏర్పాటు చేసుకున్న హోటల్‌ను ధ్వంసం చేసి మూయించాడు. ఈ దారుణ ఘటన తిరుపతి రూరల్ మండలం కేసీ పేటలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే కేసీ పేట పంచాయతీ పరిధి సర్వే నం.260లో బ్రాహ్మణకాలువ ఉంది. ఈ కాలువపై ప్రభుత్వ మాజీ ఉద్యోగి భూపతి కన్నేశాడు. కాలువను ఆక్రమించి గతంలో భవనాన్ని నిర్మించాడు. అడ్డుకున్న వారిపై ప్రైవేటు కేసులు పెట్టించి వేధించాడు. అయినా కేసీ పేట గ్రామస్తులు కలెక్టర్‌కు, ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో సర్వే చేసిన రెవెన్యూ అధికారులు కాలువను ఆక్రమించి నిర్మించినట్లు నిర్ధారించి అక్రమ భవనాన్ని కూల్చివేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని మద్దతు తనకు ఉందంటూ తిరుచానూరు స్టేషన్‌లోని ఓ పోలీస్ కానిస్టేబుల్‌తో కలిసి భూపతి భూకబ్జాకు తెగబడ్డాడు. నాడు రెవెన్యూ అధికారులు అడ్డుకున్న ప్రభుత్వ భూమిని తాజాగా ఆక్రమించాడు. దాని చుట్టూ కంచెను ఏర్పాటు చేస్తున్నాడు. అంతేకాకుండా ఈ ఆక్రమణకు అడ్డుగా ఉందని దళిత మహిళ సులోచన ఎన్నో ఏళ్ల నుంచి జీవనోపాధి కోసం నిర్వహించుకుంటున్న హోటల్‌ను సైతం ధ్వంసం చేశాడు. ట్రాక్టర్‌తో ఇసుకను తెప్పించి హోటల్లోని పొయ్యిలో, పొయ్యి ముందు పోశాడు. హోటల్‌ను మూసివేయాలని.. లేకుంటే చంపుతానని బెదిరించినట్లు బాధితురాలు సులోచన కన్నీరుమున్నీరయ్యారు. కాలువను ఆక్రమించడమే కాకుండా తనకు జీవనోపాధిగా ఉన్న హోటల్‌ను ధ్వంసం చేసిన భూపతిపై చర్యలు తీసుకోవాలని శనివారం ఆమె తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫిర్యాదుపై మాజీ ఉద్యోగికి వత్తాసు పలుకుతున్న కానిస్టేబుల్ కేసు నమోదు కాకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



కాలువ భూమిని ఆక్రమించి ఫెన్సింగ్ వేసేందుకు పాతిన సిమెంటు దిమ్మెలు

• తెలంగాణ

యాదాద్రిలో గిరిప్రదక్షిణ

సాక్షి, యాదాద్రి: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహస్వామి గిరి ప్రదక్షిణ ప్రాముఖ్యతను తెలిపేందుకు ఈనెల 18న దేవస్థానం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనుంది. శ్రీ స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారు. దేవస్థానం ఉద్యోగులు, సిబ్బంది, వ్యాపారులు, భక్తులు అంతా కలిపి 4 వేల మందితో ప్రత్యేక గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం 2.6 కిలోమీటర్ల మేర దారిని సిద్ధం చేస్తున్నారు. తమిళనాడులోని అరుణాచలం, ఏపీలోని సింహాచలం అప్పన్న స్వామి ఆలయం చుట్టూ భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. అదే తరహాలో యాదగిరిగుట్టలో గిరి ప్రదక్షిణ ప్రాముఖ్యతను చాటి చెప్పే కార్యక్రమం చేపట్టారు. గిరిప్రదక్షిణ చేసి వచ్చే భక్తులకు నేరుగా స్వామివారి దర్శనం కల్పిస్తారు. ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజున జరిగే గిరి ప్రదక్షిణ రోజున శ్రీ స్వామివారికి సహస్ర కళశాభిషేకం చేస్తారు. ఇందులో పాల్గొనడానికి భక్తులు సంప్రదాయ దుస్తులతో రావాల్సి ఉంటుంది.

పవన విద్యుత్తుకు రాష్ట్రమే బెస్ట్



- రాష్ట్రంలో పవన విద్యుత్ సామర్థ్యం 9.8 శాతం పెరుగుదల
- 9009.97 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌లో 4083 మెగావాట్లు పవన విద్యుత్తే
- జాతీయ వృద్ధికంటే 1.8 శాతం ఎక్కువతో దేశంలోనే 6వ స్థానం
- పవన విద్యుత్‌కు రాష్ట్రంలో అత్యంత అనుకూల వాతావరణం
- అతి తక్కువ ధరకే పవన విద్యుత్ లభ్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ సంస్కరణల ఫలితంగా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం భారీగా పెరుగుతోంది. ఇందులో పవన విద్యుత్‌ది ప్రథమ స్థానం. రాష్ట్రంలో పవన్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 9.8 శాతం పెరిగింది. పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం దేశవ్యాప్తంగా 8 శాతం పెరిగితే మన రాష్ట్రంలో అంతకంటే 1.8 శాతం ఎక్కువగా ఉంది. దేశంలోనే 6వ స్థానంలో ఏపీ నిలిచింది. రాష్ట్రంలో ఉన్న 9009.973 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌లో పవన విద్యుత్ వాటా 4083.37 మెగావాట్లుగా ఉంది. పవన విద్యుత్‌ను పెంచడం ద్వారా దేశంలో మిలియన్లకు పైగా ఉద్యోగాలను సృష్టించవచ్చని గ్లోబల్ విండ్ ఎనర్జీ కౌన్సిల్ (జీడబ్ల్యూఈసీ) పేర్కొంది.

అందుబాటులో టారిఫ్

దీర్ఘకాల పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ల (పీపీఏ)తో ఆర్థికంగా కుదేలవుతున్న డిస్కంలకు ఊరట కలిగిస్తూ ఏపీఈఆర్‌సీ పవన విద్యుత్ ధరలను నిర్ణయించింది. చాలా తక్కువ ధరకు పవన్ విద్యుత్ లభిస్తుంది. పవన విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకున్న డిస్కంలు తొలి పదేళ్లు యూనిట్‌కు రూ.3.43 చొప్పున చెల్లించాలని ఏపీఈఆర్‌సీ తెలిపింది. 11వ సంవత్సరం నుంచి 20 ఏళ్ల వరకు యూనిట్‌కు రూ.2.64 చెల్లించాలని తెలిపింది.

అనుకూలమని తేల్చిన అధ్యయనాలు

వాతావరణంలో వస్తున్న మార్పులతో ఏపీలో పవన విద్యుత్‌కు అత్యంత అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటీయెరాలజీ (పూణె) పరిశోధకులు వెల్లడించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో గాలి వేగం తగ్గి, ఏపీలో పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ఏపీలోని సముద్రతీర ప్రాంతాలపై గాలి సామర్థ్యం పెరుగుతున్నట్లు 'కపుల్డ్ మోడల్ ఇంటర్-కంపారిజన్ ప్రాజెక్ట్' ప్రయోగాల్లో తేలింది. ప్రస్తుతం రోజుకి 15 మిలియన్ యూనిట్ల నుంచి 20 మిలియన్ యూనిట్ల మధ్య పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. భవిష్యత్తులో ఇది మరింత పెరుగుతుందని ఇంధన శాఖ అధికారులు చెబుతున్నారు.

రాష్ట్రంలో విస్తారంగా వానలు

- అక్కడక్కడ భారీ వర్షాలు
- ఉత్తర కోస్తాకు విస్తరిస్తున్న రుతుపవనాలు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వర్షాలు కురవడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. రానున్న మూడు రోజులు మరింత విస్తారంగా కురవనున్నాయి. ప్రస్తుతం రాయలసీమ నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా మధ్య బంగాళాఖాతం వరకు సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. మరోవైపు నైరుతి రుతుపవనాలు ఉత్తర కోస్తాంధ్ర వ్యాప్తంగా మరింతగా విస్తరించనున్నాయి. వీటి ఫలితంగా ఆదివారం అల్లూరి సీతారామరాజు, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమ, మంగళవారాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు ఆస్కారం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. వర్షాలతో పాటు అక్కడక్కడ పిడుగులు పడతాయని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వివరించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు రాష్ట్రంలో అత్యధికంగా విశాఖ జిల్లా గాజువాకలో 10.5 సెంటీమీటర్లు, పి.లింగవలస (విజయనగరం)లో 7.8, శంఖవరం (కాకినాడ)లో 5.1, చోడవరం (అనకాపల్లి)లో 3.7, గూడవల్లి (బాపట్ల)లో 2.4, రామచంద్రాపురం (కోనసీమ)లో 2.3, పట్టిసీమ (ఏలూరు)లో 2.1, పైడి భీమవరం (శ్రీకాకుళం)లో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ బులెటిన్‌లో పేర్కొంది.

క్లుప్తంగా...

డీఎస్సీకి ముందే టెట్ నిర్వహించాలి: ఆప్టా

సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీని ప్రకటించిన సీఎం చంద్రబాబు నాయుడు డీఎస్సీ కంటే ముందు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) కోరింది. ఈమేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రావు శనివారం మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ అధికారులకు శనివారం వినతి పత్రం సమర్పించారు. గతంలో తక్కువ పోస్టులతో డీఎస్సీ ప్రకటించడంతో టెట్‌కు చాలా మంది హాజరు కాలేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అత్యధిక పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించడంతో మరోసారి టెట్ నిర్వహించి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు.

20న హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో స్పాట్ అడ్మిషన్లు

చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు వి.వనజ

కొరిటెపాడు(గుంటూరు): ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ, వెంకటగిరిలో ఈనెల 20న మూడేళ్ల డిప్లొమా కోర్సులో స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్టు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు వి.వనజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్థ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్నదని, 1992లో దీన్ని ప్రారంభించారని, హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమా కోర్సులో శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ వారిచే సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు వనజ వెల్లడించారు. ఈ సంస్థలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు స్టయిఫండ్ పొందేందుకు అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 20న స్పాట్ అడ్మిషన్ల కోసం వెంకటగిరి ఇన్‌స్టిట్యూట్‌లో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు కళాశాల వెబ్‌సైట్ ఓిఓిఓ. జీజ్ఞిరిజట.ఛొౌఝను సందర్శించాలని, 9441795408, 9866169908, 9010243054 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

జీవో నంబర్ 107, 108లను రద్దు చేయాలి

ఏపీ మెడికల్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్: పేద విద్యార్థుల ప్రతిభకు గొడ్డలిపెట్టులా ఉన్న జీవో నంబరు 107, 108లను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు కోరారు. శనివారం గుంటూరు అమరావతి రోడ్డులోని ఆలా హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సగం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్నారై కేటగిరి సీట్ల పేరుతో అమ్ముకానికి వీలుగా ఉన్న జీవో 107, 108లను తక్షణమే రద్దు చేయాలన్నారు. తాము అధికారంలోకి వస్తే ఈ జీవోలను రద్దు చేస్తామని టీడీపీ వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. గత పదేళ్లుగా తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల మధ్య ఉన్న 15 శాతం అన్ రిజర్వుడు సీట్ల ఒప్పందం ఈ ఏడాది ముగిసిందని, దీని ద్వారా ఏపీ విద్యార్థులు దాదాపు 300 మంది ఎంబీబీఎస్ సీట్లు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు.

మంచి న్యాయవాది వద్ద శిష్యరికం చేయండి

- అప్పుడే న్యాయవాద వృత్తిలో రాణించగలరు
- వాదనలు వినిపించడం ఓ కళ.. దానిని నేర్చుకోండి
- ఫీజుల విషయంలోనూ సహేతుకంగా ఉండాలి
- యువ లాయర్లకు ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి ఉద్బోధ
- పెద్ద కలలు కనండి.. ఏదో ఒక స్థాయికి చేరుకుంటారు
- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు


ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డిని సత్కరిస్తున్న బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్. ద్వారకనాథరెడ్డి, ఇతర బార్ కౌన్సిల్ సభ్యులు

సాక్షి, అమరావతి: యువ న్యాయవాదులు వృత్తి మెళకువలు నేర్చుకుని పైకి రావాలంటే ఓ మంచి న్యాయవాదిని ఎంపిక చేసుకొని, ఆయన వద్ద శిష్యరికం చేయాలని ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. మంచి న్యాయవాది అంటే ఆర్థికంగా బలం ఉన్న వ్యక్తి కాదని, న్యాయశాస్త్రంలో అంశాల మీద మంచి పట్టున్న వ్యక్తి అని చెప్పారు. అలాంటి వ్యక్తి వద్ద చేరితే కేసులను వాదించే అవకాశం దక్కి, మన సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం వస్తుందని, తద్వారా వృత్తిలో ముందుకెళ్లే అవకాశం దొరుకుతుందని చెప్పారు. వాదించే అవకాశం సులభంగా రాదని, బాగా కష్టపడాలని ఉద్బోధించారు. తాను కూడా అలా కష్టపడితేనే ఈ రోజు ఈ స్థానంలో ఉన్నానన్నారు. యువ న్యాయవాదులకు రాష్ట్ర న్యాయవాద మండలి (బార్ కౌన్సిల్), కేఎల్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతుల్లో రెండో రోజు శనివారం ‘ఆర్ట్ ఆఫ్ అడ్వొకసీ’ అనే అంశంపై జస్టిస్ నాగార్జునరెడ్డి మాట్లాడారు. కేవలం వాదనలు వినిపిస్తే సరిపోదని, వాదనలు ఎలా వినిపించాలో నేర్చుకోవాలని, అది ఓ కళ అని తెలిపారు. ఆ కళని ఒంటబట్టించుకుంటేనే విజయవంతమైన న్యాయవాది అవుతారన్నారు. ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవాలని తెలిపారు.

అందరిలో ఒకరిలా ఉండిపోకండి

‘న్యాయ పాలనలో న్యాయవాదులు, న్యాయమూర్తుల పాత్ర’ అన్న అంశంపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడారు. న్యాయమూర్తిగాకంటే న్యాయవాదిగా తాను ఎక్కువ ఆనందంగా ఉన్నానని ఆయన చెప్పారు. మూడుసార్లు తాను న్యాయమూర్తి పోస్టును తిరస్కరించానని, చివరకు విధి లేని పరిస్థితుల్లో ఆ పోస్టును అంగీకరించాల్సి వచ్చిందన్నారు. ఆ మరుసటి రోజే తన అంగీకారన్ని ఉపసంహరించుకుంటానని అప్పటి ప్రధాన న్యాయమూర్తిని కోరానని, అప్పటికే జాబితా కేంద్ర ప్రభుత్వానికి వెళ్లిపోవడంతో అది సాధ్యం కాలేదని తెలిపారు. తాను ఎక్కడో చిన్న పల్లెలో పుట్టి ఈ స్థాయికి రావడం వెనుక ఎంతో కృషి ఉందన్నారు. ఎప్పుడూ పెద్ద కలలు కనాలని, అప్పుడే ఖచ్చితంగా ఏదో ఒక స్థానానికి చేరుకుంటారని, అసలు కలలు కనకుంటే ఏ స్థాయికీ రాలేరని తెలిపారు. అందరిలో ఒకరిలా ఉండపోకూడదని, మనకంటూ ఓ ప్రత్యేకత ఉండేలా చూసుకోవాలని చెప్పారు. న్యాయస్థానాల్లో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవ్యవస్థపై ఉన్న ప్రతికూల అభిప్రాయాన్ని తొలగించాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. అనంతరం జస్టిస్ నాగార్జునరెడ్డి, జస్టిస్ లావు నాగేశ్వరరావును బార్ కౌన్సిల్ చైర్మన్ ఎస్.ద్వారకనాథరెడ్డి, ఇతర సభ్యులు ఘనంగా సన్మానించారు.

కక్షిదారుడు న్యాయవాదులకు దేవుడు

మనకు కేసు అప్పగించే కక్షిదారుడిని ఎప్పుడూ దేవుడిలా చూడాలని జస్టిస్ నాగార్జునరెడ్డి చెప్పారు. కక్షిదారుడిని అవమానించడం, తక్కువ చేసి చూడటం, అతనితో కర్కశంగా మాట్లాడటం వంటివి చేయకూడదన్నారు. కక్షిదారుడు ఇచ్చే ఫీజుతో మన కుటుంబాలు నడుస్తున్నాయన్న విషయాన్ని విస్మరించకూడదని స్పష్టం చేశారు. అలాగే కక్షిదారుల నుంచి వసూలు చేసే ఫీజుల విషయంలో కూడా సహేతుకంగా ఉండాలని హితవు పలికారు.

దేశంలో తృణధాన్యాల వినియోగం తగ్గుదల



- పాలు, మాంసం, ఇతర ప్రొటీన్ ఆహారం ఎక్కువగా వినియోగిస్తున్న ప్రజలు
- తృణధాన్యాల నెలవారీ తలసరి వినియోగం 1999–2000లో గ్రామాల్లో 12.72, పట్టణాల్లో 10.42 కిలోలు
- 2022–23 నాటికి గ్రామీణంలో 9.61, పట్టణాల్లో 8.05 కిలోలు
- 2022–23 గృహవినియోగ వ్యయ సర్వేలో వెల్లడి

దేశంలో తృణధాన్యాల తలసరి వినియోగ పరిమాణం తగ్గుదల ఇలా (కిలోల్లో)

సంవత్సరం	గ్రామీణ ప్రాంతాలు	పట్టణ ప్రాంతాలు
1999-2000	12.72	10.42
2004-05	12.12	9.94
2009-10	11.35	9.39
2011-12	11.23	9.32
2022-23	9.61	8.05

సాక్షి, అమరావతి: ప్రజలు తమ ఆదాయం పెరుగుతున్న కొద్దీ ఆహార అలవాట్లలో మార్పులు చేసుకుంటూ వెళుతున్నారు. పాలు, మాంసం, గుడ్లు వంటి ఇతర ప్రొటీన్ ఆహారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా తృణధాన్యాల వినియోగం తగ్గుతోంది. గృహవినియోగ వ్యయ సర్వే 2022–23లో ఈ విషయం వెల్లడైంది. దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 1999–2000 నుంచి 2022–23 మధ్య తృణధాన్యాల తలసరి వినియోగం క్రమంగా క్షీణించింది. 1999–2000లో నెలవారీ తలసరి తృణధాన్యాల వినియోగం గ్రామీణ ప్రాంతాల్లో 12.72, పట్టణ ప్రాంతాల్లో 10.42 కిలోలుగా ఉండేది. ఇది 2022–23లో గ్రామాల్లో 9.61, పట్టణాల్లో 8.05 కిలోలకు పడిపోయింది.

పశ్చిమబెంగాల్‌లో అధికం

రాష్ట్రాల వారీగా తృణధాన్యాల వినియోగం పరిశీలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో 11.23 కిలోలతో పశ్చిమబెంగాల్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. ఒడిశా 11.21 కిలోలు, బీహార్ 11.14 కిలోలు, ఛత్తీస్‌గఢ్ 10.27 కిలోలతో తర్వాత స్థానాల్లో ఉన్నాయి. అదే పట్టణ ప్రాంతాల్లో వినియోగం బిహార్‌లో 10.45 కిలోలు, ఛత్తీస్‌గఢ్‌లో 10.43, జార్ఖండ్‌లో 9.59 కిలోలు. గ్రామీణ ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్‌లో 9.30 కిలోలు, తెలంగాణలో 10.11, పట్టణాల్లో ఆంధ్రప్రదేశ్‌లో 8.29, తెలంగాణలో 8.77 కిలోల చొప్పున వినియోగిస్తున్నారు.

బియ్యానిదే పైచేయి

మొత్తం తృణధాన్యాల వినియోగంలో బియ్యం వాటా ఎక్కువగా ఉంది. దేశవ్యాప్తంగా గ్రామాల్లో 9.61 కిలోల నెలవారీ తలసరి వినియోగంలో 55.35 శాతం బియ్యం, 40.93 శాతం గోధుమ, 3.48 శాతం ముతక, 0.22 శాతం ఇతర తృణధాన్యాలు ఉన్నాయి. పట్టణాల్లో 8.05 కిలోల నెలవారీ తలసరి వినియోగంలో 53.20 శాతం బియ్యం, 44.53 శాతం గోధుమ, 2.09 శాతం ముతక, 0.19 ఇతర తృణధాన్యాలు ఉన్నాయి. ఏపీలోని వినియోగిస్తున్న మొత్తం తృణధాన్యాల్లో గ్రామీణ ప్రాంతాల్లో 92.22 శాతం, పట్టణాల్లో 90.55 శాతం బియ్యం వాటా నమోదైంది.

పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాడాలి..

- ఏఐకేఎంకేఎస్ కన్వీనర్ సుబోధ్ మిత్రా పిలుపు
- ఏలూరులో రైతు కూలీ సంఘం మహాసభలు ప్రారంభం


రాష్ట్ర మహాసభల్లో ప్రారంభోపన్యాసం చేస్తున్న జాతీయ కన్వీనర్ సుభోద్ మిత్రా

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో, రాష్ట్రంలో వరుసగా అధికారంలోకి వస్తున్న పాలకులంతా రైతాంగ, ఆదివాసీ వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐకేఎంకేఎస్ కన్వీనర్ సుబోధ్‌మిత్రా పిలుపునిచ్చారు. రైతు కూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలు శనివారం ఏలూరులో ప్రారంభమయ్యాయి. సుబోధ్ మిత్రా ప్రారంభోపన్యాసం చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సభల్లో ముందుగా రైతు కూలీ సంఘం పతాకాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ ఆవిష్కరించారు. అనంతరం సుబోధ్ మిత్రా మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగానికి ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన చరిత్ర ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మూడువేల గ్రామాలు భూస్వాముల పీడన నుంచి విముక్తి చేసి, పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేసుకున్నారని గుర్తు చేశారు. దున్నేవాడిదే భూమి హక్కు కేంద్ర విధానంగా దేశంలో బలమైన రైతాంగ ఉద్యమం సాగాలన్నారు. అటవీ సంరక్షణ చట్టానికి సవరణల పేరుతో అటవీ ప్రాంతాల నుంచి ఆదివాసీలను తరిమేసి గనుల తవ్వకానికి, సహజ సంపదల దోపిడీకి కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలను పాలకులు వేగిరం చేస్తున్నారని, వీటిపై అవిశ్రాంత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు రావి గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ 1937 జూలైలో ఇచ్ఛాపురం నుంచి మద్రాస్ వరకూ సాగించిన రైతు రక్షణ యాత్రకు నాయకత్వం వహించిన జిల్లా రైతులు కొమ్మారెడ్డి సత్యనారాయణ, చలసాని వాసుదేవరావుల పోరాట వారసత్వాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర సహాయక కార్యదర్శి దంతులూరి వర్మ.. గత మహాసభల నుంచి ఇప్పటి వరకు సాగిన రైతాంగ ఉద్యమంలో అమరులైన 750 మందికి జోహార్లు అర్పిస్తూ తీర్మానం చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ రైతుల హక్కుల సాధనకు ప్రాణాలైనా అర్పించి పోరాడాలని పిలుపునిచ్చారు. పాలస్తీనాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న హత్యాకాండలో మరణిస్తున్న వారికి మహాసభ సంతాపం తెలియజేసింది. ఏఐఎఫ్‌టీయూ(న్యూ) జాతీయ అధ్యక్షుడు గుర్రం విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి జె.కిషోర్ బాబు, ఏఐకేఎంకేఎస్ ఒడిశా నేత శ్రీకాంత్ మొహంతి, తెలంగాణ నేత ప్రసాదన్న, కర్ణాటక నేత చాగనూరు మల్లికార్జునరెడ్డి, ఆహ్వాన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గ్రామాల్లో ఉండాలంటే మేము చెప్పినట్లు చెయ్యాలి

- లేకపోతే అక్రమ కేసులు పెట్టి వేధిస్తామని టీడీపీ నేత హెచ్చరిక
- పోలీసులను ఆశ్రయించిన మహిళలు
- ఫిర్యాదు స్వీకరించలేదంటూ ఆవేదన వ్యక్తం చేసిన రామిరెడ్డిపల్లి మహిళలు



ఫిర్యాదు స్వీకరించకపోవడంతో పోలీస్‌స్టేషన్ నుంచి వెళ్లిపోతున్న మహిళలు

చంద్రగిరి (తిరుపతి జిల్లా): ఎన్నికల అనంతరం తిరుపతి జిల్లా చంద్రగిరి మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి పంచాయతీ కూచువారిపల్లిలో జరిగిన హింసాత్మక ఘటనలు తెలిసిందే. కూచువారిపల్లి, రామిరెడ్డిపల్లిలో ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. అయితే స్థానిక టీడీపీ నేత రామిరెడ్డిపల్లి గ్రామస్తులకు ఫోన్‌లు చేస్తూ బెదిరిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులైన పలువురు మహిళలు శనివారం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. తమకు రక్షణ కల్పించాలని, ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తి నుంచి తమను కాపాడాలని రామిరెడ్డిపల్లి మహిళలు స్టేషన్‌కు వెళ్లారు. అయితే పోలీసులు ఫిర్యాదులు కూడా తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని, రామిరెడ్డిపల్లి గ్రామస్తులందరూ కూచువారిపల్లి భజన మందిరం వద్దకు వచ్చి బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ నేత బెదిరింపులకు పాల్పడుతున్నట్లు మహిళలు వాపోయారు. లేకపోతే ఒక్కొక్కరిపై కేసులు పెట్టి మీ అంతు చూస్తామంటున్నారని, దీంతో గ్రామంలో పలువురు యువకులు ప్రాణభయంతో పారిపోయారని తెలిపారు. కూచువారిపల్లికి చెందిన ఓ వ్యక్తి తమను బెదిరిస్తున్నాడంటూ, కాల్ రికార్డింగ్‌ను పోలీసులకు వినిపించినట్లు తెలిపారు. దీనిపై పోలీసులు తమ ఫిర్యాదులు తీసుకోలేదని మహిళలు తెలిపారు. ఎవరిని బెదిరించారో వారే ఫిర్యాదు చేయాలే తప్ప, కుటుంబ సభ్యులు రాకూడదని పోలీసులు అంటున్నారని, తమకు ఆత్మహత్యలే శరణ్యమని మహిళలు అంటున్నారు.

21, 22 తేదీల్లో వెయిట్ లిఫ్టింగ్ శిక్షణకు అర్హత పరీక్ష

సాక్షి, అమరావతి: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఏలూరు సెంటర్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో బాలికల వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ కోసం నిర్వహించే బ్యాటరీ పరీక్ష ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి డీఎస్వో వినాయక ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన బాలికలకు (అండర్–14, 16, 18 విభాగాలు) అన్ని సదుపాయాలతో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల బాలికలు ఈ నెల 21న ఆధార్, పుట్టిన తేదీ, స్పోర్ట్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలోని సాయ్ సెంటర్‌లో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు 98853 12356 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

అవగాహనతోనే అత్యుత్తమ బోధన

వీవీఐటీలో ముగిసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకుల శిక్షణ


మాట్లాడుతున్న రమణబాబు

పెదకాకాని: అధ్యాపకులు ఆధునిక సాంకేతికతపై అవగాహన కలిగి ఉండడం ద్వారానే విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించగలుగుతారని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెక్రటరీ కేవీ రమణబాబు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నందు ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక విద్య శిక్షణా మండలి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్, చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి కేవీ రమణబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో రమణబాబు మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు తగ్గట్టు విద్యార్థులను సన్నద్ధం చేయవలసిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఆధునిక బోధన, ల్యాబ్‌లను ఏర్పాటుచేసి ఎన్‌బీఏ వంటి జాతీయ స్థాయి గుర్తింపును ప్రభుత్వ కళాశాలలకు తీసుకురావడమే లక్ష్యమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ట్రైనింగ్ రీసోర్స్ పర్సన్ డాక్టర్ నితీష్ భట్, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ నాగేశ్వరరావు, వీవీఐటీ డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఎన్ఐఏ వేధింపులు ఆపాలి

ప్రజాసంఘాల నాయకులు


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: ప్రజాసంఘాల నాయకులను విచారణ పేరుతో ఎన్ఐఏ అధికారులు వేధించడం మానుకోవాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు కోరారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఎన్‌జీవో హోమ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఎన్ఐఏ వ్యవహరిస్తున్న తీరు దేశ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. ఎక్కడో కేరళలో కేసు విచారణకు 160 సీఆర్‌పీసీ పేరుతో ఏపీలో విచారణ పేరుతో వేధించడమే కాక, కేరళ రావాలని నోటీసులు జారీ చేయడం చట్టవ్యతిరేకమని తెలిపారు. ఇది భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన ప్రాథమిక హక్కులను కాలరాయడమే అవుతుందన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టబోయే ముందు రాష్ట్రంలో తాము పౌర ప్రజాస్వామిక హక్కులు కాపాడతామని చంద్రబాబునాయుడు ప్రకటించారని, రాష్ట్రంలో హక్కుల ఉల్లంఘన జరగకుండా చూడాలని, ఎన్ఐఏ లాంటి సంస్థలను అదుపు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి శికినం చిన్న, పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, నాయకులు నల్లపాటి రామారావు, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

ట్యూమర్... టెర్రర్



- బ్రెయిన్ సమస్యలతో బాల్యం, యువత
- అత్యాధునిక పరీక్షలతో తొందరగా గుర్తింపు
- రెండో దశలోనే చికిత్సతో తగ్గుతున్న తీవ్రత

అమలాపురం టౌన్: మనిషి మనుగడకు అతని మెదడే కీలకం.. అది ఆరోగ్యంగా ఉంటేనే శరీరంలో అన్ని అవయవాలను అదుపులో ఉంచుతోంది. అలాంటి మెదడు గతి తప్పితే ప్రమాదమే. జిల్లాలో ఇటీవల కాలంలో బ్రెయిన్ ట్యూమర్, బ్రెయిన్ స్ట్రోక్ కేసులు అధికమవుతున్నాయి. గతంలో ఈ మెదడు సంబంధిత వ్యాధులు 50 ఏళ్ల వయసు దాటిన వారికి వచ్చేవి. ఇటీవల కాలంలో పది నుంచి 15 ఏళ్ల పిల్లలు, 30 నుంచి 40 ఏళ్ల వయస్కులకు కూడా వచ్చి ఆసుపత్రుల పాలవుతున్నారు. చిన్న పిల్లల్లో జన్యుపరమైన లోపాలతోపాటు మారుతున్న ఆహార అలవాట్లు కూడా మెదడు వ్యాధులకు కారణమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. మరి కొంతమందికి పొగ, మద్యం తీసుకోవడంతో వస్తోంది. ఇటీవల కాలంలో బ్రెయిన్ ట్యూమర్, స్ట్రోక్ వ్యాధులు బయటపడి ఆసుపత్రులకు వెళుతున్న వారి సంఖ్య జిల్లాలో నెలకు పది నుంచి పదిహేను వరకూ ఉంటోంది. ఈ రోగులకు అత్యవసర వైద్యం నిమిత్తం కాకినాడ, రాజమహేంద్రవరం, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు రోగి బంధువులు ఉన్నఫళంగా పరుగులు తీస్తున్నారు. న్యూరాలజీ స్పెషలిస్టులు, సర్జన్లను ఆశ్రయిస్తున్నారు.

నిర్ధారణకు అత్యాధునిక పరీక్షలు

గతంలో బ్రెయిన్ ట్యూమర్‌తో వచ్చిన రోగి నాలుగో దశ వచ్చే వరకూ గుర్తించే వారు కాదు. అప్పట్లో వ్యాధి నిర్ధారణ కాక ముందే లేదా నిర్ధారణ అయ్యాక అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయి ఒక్కోసారి రోగి ప్రాణాలు కూడా దక్కేవి కావు. ఇప్పుడు అత్యాధునిక డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులోకి రావడంతో వ్యాధి నిర్ధారణ తొందరగా జరిగి సకాలంలో చికిత్స మొదలు పెట్టేందుకు వీలు చిక్కుతోంది. తరచూ తలనొప్పితో వచ్చే రోగికి తొలుత సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌లు చేయడం ద్వారా బ్రెయిన్ ట్యూమర్‌ను వైద్యులు గుర్తిస్తున్నారు. ప్రస్తుతం సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌ల సౌకర్యం జిల్లాలో పలు ప్రాంతాల్లో విస్తరించడంతో వ్యాధిని తొలి లేదా రెండో దశలోనే గుర్తించి అంతే వేగంగా చికిత్స మొదలు పెట్టడంతో రికవరీ శాతం పెరుగుతోంది. నాలుగు దశల్లో ఆయా దశలను బట్టే వైద్యులు సేవలు అందిస్తున్నారు. కొంతమంది రోగులకు వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స చేస్తున్నారు. కొందరికి మందులు ఇస్తూ క్రమేపీ ట్యూమర్‌ను తగ్గిస్తారు. మరి కొందరికి శస్త్రచికిత్స ద్వారా ట్యూమర్‌ను తొలగిస్తారు. రేడియేషన్ థెరపీ, కిమో థెరపీ వంటి చికిత్సల ద్వారా వ్యాధిని నయం చేసేందుకు వైద్య ప్రక్రియలు ఉపయోగిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన రోగులకు ముందు మాట నత్తి రావడం, మూతి కొద్దిగా వంకర పోవడం, కాలు, చెయ్యి కొద్దిగా లాగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మాట నత్తిగా వస్తున్న దశలోనే రోగులు సంబంధిత వైద్య నిపుణులను తక్షణమే సంప్రదిస్తే అత్యవసర వైద్యం అందిస్తే తొందరగా కోలుకునే పరిస్థితి ఉంటుంది.

తలనొప్పితో మొదలై..

సాధారణంగా తలనొప్పి అప్పుడప్పుడు వస్తుంది. అయితే పదే పదే వస్తే మెదడుకు సంబంధించి సమస్యలు ఉత్పన్నమైనట్లు గుర్తించవచ్చు. తర్వాత తల తిరగడం, వాంతులు వంటి లక్షణాలు బయటపడతాయి. ముఖ్యంగా ఆ వ్యాధి నాలుగు దశల్లో వృద్ధి చెందుతుంది. మొదటి దశలో తలనొప్పి, వాంతులు, తల తిరగడం, రెండో దశలో తీవ్రమైన తలనొప్పి, అకారణంగా, అమాంతంగా వాంతులు అవడం జరుగుతోంది. మూడో దశలో మెదడులోని ట్యూమర్ ఇతర అవయవాలకు వ్యాప్తి చెందుతుంది. తర్వాత ఊపిరితిత్తులు, వెన్నెపూసలకు క్రమేపీ విస్తరిస్తుంది. నాలుగో దశలో ట్యూమర్ కణాలు రక్తంలో కలసి శరీరమంతా వ్యాప్తి చెందుతుంది. ఈ నాలుగు దశల తర్వాత వ్యాధి తీవ్రత దాల్చి రోగి మరింత క్షీణించేలా చేస్తుంది.

తక్షణమే వైద్యం అందాలి



బ్రెయిన్ ట్యూమర్, బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు బయట పడిన వెంటనే గుర్తించి వైద్యం పొందితే ఆ రోగి తొందరగా రికవరీ అయ్యే అవకాశం ఉంటుంది. తలనొప్పి తీవ్రంగా వస్తున్నా, మాట్లాడినప్పుడు తేడా కనిపించినా న్యూరో విభాగం వైద్యులను సంప్రదించాలి. సకాలంలో వ్యాధిని గుర్తించి అంతే వేగంగా వైద్యం పొందితే ఆ రోగి చాలా వరకూ కోలుకుంటాడు. ఈ తరహా రోగులు వైద్యం అందాక పూర్తిగా కోలుకుని యథావిధిగా తమ పనులు చేసుకునే పరిస్థితిని గత రెండేళ్ల నుంచి అనేకం చూస్తున్నాం.

– డాక్టర్ లింగోలు చందు, న్యూరో సర్జన్, కాకినాడ

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.